
వీక్షణం

ఆర్థిక, సామాజిక మాస పత్రిక

ఫిబ్రవరి 2006 55 రూ. 10

- మిగులు భూములా? మిగులు మనుషులా?
- సంక్షోభంలో భారతీయ జనతా పార్టీ
- నల్లగొండ యురేనియం - ప్రజా విచారణ పూర్వాపరాలు
- ప్రపంచబ్యాంకు - ఆంధ్రప్రదేశ్ : కొత్త సీసాలో పాత సారా
- ప్రపంచీకరణ : రెండు భారతదేశాలు
- లాటిన్ అమెరికా రాజకీయ చిత్రపటంపై ఫోకస్

ఫిబ్రవరి రెండవ వారంలో విడుదల అవుతోంది



ప్రపంచ బ్యాంక్ వంటి అంతర్జాతీయ ద్రవ్య సంస్థలు పేద దేశాల అవసరాలు పెంచి, కొత్త అవసరాలు సృష్టించి ఆ అవసరాలు తీర్చుకునేందుకు ఇబ్బడిముబ్బడిగా అప్పులు ఇచ్చే కుట్ర, బహుళ జాతి కంపెనీల ప్రయోజనాలు నెరవేర్చేందుకు ఉద్దేశించిన ఓ అంతర్జాతీయ కుట్ర ఇప్పుడు బట్టబయలైంది. 'ఎకనామిక్ హిట్ మాన్' అనే ఆర్థిక దళారీలను నియమించి, అభివృద్ధి చెందుతున్న దేశాల ప్రభుత్వాధినేతలను ప్రలోభపెట్టి, ఆ దేశాలను అమెరికన్ సామ్రాజ్య వాదానికి బంట్లుగా మార్చేసిన ఈ కుట్ర గుట్టు విప్పారు జాన్ పెర్కిన్స్ - స్వయంగా ఎకనామిక్ హిట్ మాన్‌గా పనిచేసి ఇప్పుడు చేతికంటిన సామాన్యుల రక్తాన్ని పశ్చాత్తాపంతో కడుక్కోవాలనుకుంటున్న పెర్కిన్స్ అంతరంగ కథనమే ఈ సంచలనాత్మకమైన పుస్తకం.

వెల రూ.50/-

వివరాలకు-ప్రతులకు :

వీక్షణం ప్రచురణలు

3-6-394, మైత్రీ రెసిడెన్సీ, స్ట్రీట్ నెం. 3, హిమాయత్‌నగర్,
హైదరాబాద్-500 029. ఫోన్-ఫ్యాక్స్: 040-5584 3495

అన్ని ప్రముఖ పుస్తకాల షాపుల్లోనూ దొరుకుతుంది

సలహా మండలి:
ప్రొ॥ ఆర్.వి.ఆర్.చంద్రశేఖరరావు
ప్రొ॥ వకుళాభరణం రామకృష్ణ
ప్రొ॥ చక్రధరరావు
కాత్యాయని
బి.సాంబశివరాజు

గౌరవ సంపాదకులు:
ఎ.బి.కె. ప్రసాద్
ప్రధాన సంపాదకులు:
వి. హనుమంతరావు
వర్కింగ్ ఎడిటర్:
ఎన్. వేణుగోపాల్

వీక్షణం
ఆర్థిక, సామాజిక మాసపత్రిక
సమతా పబ్లికేషన్స్, సెంటర్ ఫర్ డాక్యుమెంటేషన్, రీసెర్చ్ అండ్ కమ్యూనికేషన్ ప్రచురణ

వార్షిక చందా: రు.120   విడి ప్రతి : రు. 10

55 ఫిబ్రవరి 2006

సంపాదకీయం

ప్రజల కోసమే పత్రికా స్వాతంత్ర్యం

పత్రికాస్వాతంత్ర్యం అంటే పత్రికా యజమానుల స్వాతంత్ర్యమా, పాత్రికేయుల స్వాతంత్ర్యమా అని చాలకాలంగా చర్చ జరుగుతోంది. తాము విధించిన హద్దుల లోపలనే ఆ స్వాతంత్ర్యం ఉండాలని కూడ పాలకులు ఎప్పటినుంచో శాసిస్తున్నారు. ఈ వాదవివాదాలలో పడి మౌలిక అంశం ఒకటి మరుగున పడిపోతోంది: పత్రికాస్వాతంత్ర్యం ప్రధానంగా ప్రజలకు సంబంధించినది. తమకు, తమ జీవితాలకు, తమ భవిష్యత్తుకు ఏమి జరగబోతున్నదో, ఆ పరిణామాలకు దారితీసే ఘటనల పూర్వాపరాలేమిటో సమాచారం, విశ్లేషణ తెలుసుకునే హక్కు ప్రజలకు ఉంది. ఆ హక్కు అనుభవించడానికి మార్గం సుగమం చేసేదే పత్రికాస్వాతంత్ర్యం. పాలకులకయినా, పత్రికా యజమానులకయినా, పాత్రికేయులకయినా ఆ మేరకు మాత్రమే అందులో ప్రమేయం ఉంటుంది.

ఇటీవల రాష్ట్రంలో పత్రికారంగానికీ పాలకులకూ మధ్య, ముఖ్యంగా రెండు దినపత్రికల పేరు ప్రస్తావించి ముఖ్యమంత్రి విమర్శలు చేయడం ప్రారంభించాక, ఘర్షణ పెరిగిపోతూ ఉంది. ఆంధ్రజ్యోతి దినపత్రికపై రాష్ట్రప్రభుత్వం పదికోట్ల రూపాయల నష్టపరిహారం కోరుతూ కేసువేయడంతో ఈ ఘర్షణ మరింత తీవ్రరూపం తీసుకుంది. పత్రికలెప్పుడూ ప్రతిపక్ష వైఖరి తీసుకుంటాయనే ప్రజాస్వామిక సూత్రాన్ని అనుసరించి, ప్రతిపక్షపాత్ర వహించి ఎప్పుడూ ప్రశ్నలు గుప్పిస్తుండే పత్రికలపై పాలకులు సానుకూలంగా స్పందించడం హుందాగా ఉంటుంది. ఆ విమర్శలను తమ పాలనలో సవరించుకోదగిన లోపాలకు సూచికలుగా చూడడం బాగుంటుంది. మరోవైపు, పత్రికాస్వేచ్ఛను యజమానుల రాజకీయ, ఆర్థిక ప్రయోజనాల కొరకు బలిపెట్టగూడదని, నిజంగా ప్రజాపక్ష విమర్శలను మాత్రమే ప్రభుత్వం ముందు పెట్టాలని పత్రికలు గుర్తించవలసి ఉంటుంది. రాష్ట్రంలో అటు ప్రభుత్వమూ, ఇటు కొన్ని పత్రికలూ కూడ ఈ సంయమనాన్ని కోల్పోయి ప్రవర్తిస్తుండడం దురదృష్టకరం. ఈ దురదృష్టకర సందర్భం మరీ ఎక్కువకాలం కొనసాగితే వెర్రితలలు వేసి తీరడం సహజమే.

జనవరి మొదటివారంలో మహబూబ్‌నగర్‌లో మార్క్సిస్టుపార్టీ రాష్ట్రకార్యదర్శి బివి రాఘవులు రాష్ట్రప్రభుత్వ అవినీతిపై చేసిన వ్యాఖ్యను ప్రచురించినందుకు గాను ప్రభుత్వం అటు రాఘవులు పైన, ఇటు ఆంధ్రజ్యోతి దినపత్రికపైన నష్టపరిహారం కేసులు నమోదు చేసింది. ఒక బహిరంగ ఉపన్యాసాన్ని రిపోర్టు చేసినందుకు ఒక పత్రికపై చర్య తీసుకోవాలని చూడడం కేవలం ఆ పత్రిక గొంతు నొక్కడం మాత్రమే కాదు, ఆ సమాచారం అందవలసిన ప్రజల మౌలిక హక్కును కాలరాయడం కూడ. ఈ నష్టపరిహారం కేసును ఏదో ఒక పత్రిక యాజమాన్యంపై కక్షగా మాత్రమే అర్థం చేసుకుంటే ఈ వ్యవహారంలో ఇమిడి ఉన్న లోతయిన విషయాలను అర్థం చేసుకోలేం. ఇది ప్రజలమీద దాడి. ప్రజలకు అందే సమాచారం మీద దాడి. ఆ సమాచారం చేరవేసే పత్రికల మీద దాడి. ఆ పత్రిక పాలకులకన్న భిన్న రాజకీయాభిప్రాయాలు గలది కావడం యాదృచ్ఛికం మాత్రమే. ❑

లోపలి పేజీల్లో...

సహాయ సంపాదకులు: కొణతం దిలీప్
డి.వి.రామకృష్ణారావు
సర్క్యులేషన్ మేనేజర్ : వై.రామచంద్రం
కంపోజింగ్ : ఎస్.కిషోర్‌కుమార్
లే ఔట్ : పి.అనల

వీక్షణం
ఆర్థిక, సామాజిక మాస పత్రిక
మైత్రి రెసిడెన్సీ, 3-6-394, స్ట్రీట్ నెం. 3, హిమాయత్‌నగర్,
హైదరాబాద్ - 500 029. ఫాక్స్, ఫోన్ : 040 - 55843495
ప్రింటర్స్ : చరితా ఇంప్రెషన్స్, అజామాబాద్, హైదరాబాద్.

ఉత్తరాలు:

పత్రికలోని వ్యాసాలు, విశ్లేషణలు బాగుంటున్నాయి. అన్ని రంగాల మేధావులు వివిధ కోణాల్లో తమ వ్యాసాలు మీ పత్రికకు అందిస్తున్నందుకు వారికి కృతజ్ఞతలు చెప్పాలి ముందుగా. 2006 జనవరి నెల సంచికలో 'హాంగ్‌కాంగ్‌లో ఒరిగిందేమిటి'? వ్యాసం సంక్షిప్తంగానైనా విషయాన్ని సూటిగా తెలియజేసారు. ఇలాంటి వ్యాసాలతో పత్రిక ఎప్పుడూ రావాలని కోరుతున్నా. ఈ పత్రిక విజ్ఞాన నిధిలాంటిదనడంలో సందేహం లేదు.

- దత్తి సుధాకరరావు
పెదపెంకి

మీరు ప్రచురిస్తున్న 'వీక్షణం' పత్రికకు దశాబ్ది చందా వ్యక్తిగత అభిమానంతో పంపుతున్నాను. ఇటువంటి పత్రికను ఇటీవల ఎక్కడా చూడలేదు. వీలయితే దీనిని 'సెమినార్' ఇంగ్లీషు పత్రికలాగ ఒకే విషయంపై మేధావుల చర్చకు వీలు పడే విధంగా ప్రచురిస్తే బాగుంటుంది.

- బి.సి. బాల తిమ్మారెడ్డి
బనగానపల్లి

పత్రిక కంటెంట్ చాలా రిచ్‌గా, ఉపయోగకరంగా ఉంది. అభినందనలు.

- హెచ్చార్కె
హైదరాబాద్

వీక్షణం కృషికి అభినందనలు. పత్రిక ఇంకా ఇంకా ఎదగాలని కాంక్షిస్తూ...

- ఎ. శంకర్
నిజామాబాద్

వీక్షణం లాంటి పత్రిక అవసరం చాలా ఉంది. వైవిధ్యంతో కూడిన వ్యాసాలు వస్తున్నాయి.

- సి.రాంమోహన్
హైదరాబాద్

'వీక్షణం'లో అచ్చువుతున్న రచనలలో వ్యక్తమైన అభిప్రాయాలన్నిటితో సంపాదకులకు ఏకీభావం ఉండనవసరం లేదు. 'వీక్షణం'ను నిజమైన ప్రజాపక్ష సామాజిక, ఆర్థిక విశ్లేషణా వేదికగా తీర్చిదిద్దడంలో అన్నిరకాల అభిప్రాయాలకు, భిన్నాభిప్రాయాల ఛాయలకు స్థానం కల్పించాలని సంపాదక వర్గం భావిస్తోంది.

సంక్షోభంలో భారతీయ జనతాపార్టీ

ప్రొ.వకుళాభరణం రామకృష్ణ

గడచిన సంవత్సరం (2005) భారతీయ జనతా పార్టీ భవిష్యత్‌నే ప్రశ్నార్థకంగా నిలిపింది. తీవ్ర అంతర్గత సంక్షోభాన్ని భా.జ.పా ఎదుర్కొంటోంది. అద్వానీ అధ్యక్ష పదవికి విధి లేక రాజీనామా చేయడం; పార్టీలో, నిప్పులు చెరిగే వుపన్యాసకురాలిగా పేరొందిన, రామజన్మభూమి ఉద్యమంలో ప్రముఖ పాత్ర వహించిన 'తీవ్రవాది' ఉమాభారతిని పార్టీ నుండి బర్తరఫ్ చేయడం; వాజపేయి క్రియాశీలక రాజకీయాల నుండి తప్పుకొంటున్నాని ప్రకటించడం ఈ సంక్షోభంలో మనకు పైకి కనపడే కొన్ని ముఖ్యాంశాలు మాత్రమే! అంతర్గతంగా, పరిశీలకుల దృష్టికొచ్చిన మరికొన్ని అంశాలు కూడా ఆలోచించదగ్గవిగా ఉన్నాయి. అద్వానీ రాజీనామా వెనుక, ఆర్.యస్.యస్ ప్రమేయం బలంగా ఉందని అందరికీ తెలిసిన బహిరంగ రహస్యం. ఎందుకంటే, అద్వానీ పాకిస్థాన్ పర్యటనకు ముందే, సంఘ్ చాలక్ సుదర్శన్, వృద్ధ నాయకత్వం (అద్వానీ, వాజపేయిలు) తప్పుకోవాలని బహిరంగంగానే, ప్రముఖ టీ.వీ ఛానల్లో మాట్లాడుతూ చెప్పాడు. అలా అనలేదని యెంత సమర్థించుకోడాన్కి, అటు స్వయం సేవకులు, ఇటు భా.జ.పా ప్రయత్నించినా, తుదకు పర్యవసానం అదేనన్న విషయం మర్చి పోగూడదు. ఇక, అద్వానీ రాజీనామా తర్వాత, అధ్యక్షుడెవరన్న అంశంపై, భా.జ.పాలో, ద్వితీయశ్రేణి నాయకత్వంలో విభేదాలు బహిరంగంగానే చర్చకొచ్చాయి. వాజపేయి మద్దతుదారులు, అద్వానీకి వత్తాసు పలికే వారు, స్వయం సేవక సంఘం అనుకూలురుగా, గ్రూపులుగా విడిపోయాయి. తుదకు, హిందీ ప్రాంతానికి చెందిన రాజ్‌నాథ్‌సింగ్‌ను అధ్యక్షుడిగా ఎన్నుకోవడం జరిగింది. ఉత్తరప్రదేశ్‌కు చెందిన (మాజీ ముఖ్యమంత్రి) రాజనాథ్‌సింగ్ గూర్చి ఉత్తరాది రాష్ట్రాల ప్రజలకు మాత్రమే తెలుసు. దక్షిణాది రాష్ట్రాలు భా.జ.పాకు అంత ముఖ్యమైనవి కూడా కావు. ఈ రాష్ట్రాల్లో వారికున్న పలుకుబడీ నామమాత్రమే.

ఎందుకీ సంక్షోభం వచ్చింది? ఆకస్మికంగానా, లేక కొన్నాళ్లుగా యిది పార్టీలో నివురుగప్పిన నిప్పులా రాజుకుంటూ వుందా? ఇవి ఆలోచించాల్సిన అంశాలు. 2005 డిసెంబర్‌లో భా.జ.పా ముంబాయిలో రజతోత్సవాలు జరుపుకుంది. అదే ముంబాయిలో పాతికేళ్ల క్రితం భా.జ.పా జన్మించింది. ద్వంద సభ్యత్వ సమస్యపై జనతా పార్టీ ప్రయోగం నుండి విడిపోయి, సొంత కుంపటి పెట్టుకొన్నప్పుడు, వాజపేయి తన ఉపన్యాసంలో, "చీకటిని పారదోలి, సూర్యుడు ఉదయిస్తాడు. కమలం పూర్తిగా వికసిస్తుంది. భవిష్యత్తుపై గట్టి విశ్వాసంతో నేనీ మాటలు చెపుతున్నాను", అని చెప్పాడు. కమలం వికసించిన మాట నిజమే! మొన్న రజతోత్సవాల్లో తుది ఉపన్యాసం చేస్తూ అద్వానీ కూడ అదే అనడం గమనార్హం. పాతికేండ్లలో భా.జ.పా చరిత్ర సృష్టించిందనడం, పార్లమెంటులో యిద్దరు సభ్యులున్న పార్టీని, కేంద్రంలో ఆరు సంవత్సరాలు అవిచ్ఛిన్నంగా అధికారం చలాయించిన పార్టీగా ప్రజలు అభిమానించడానికి నిదర్శనం.

సంక్షోభానికి నాంది 2004లో జరిగిన పార్లమెంట్ ఎన్నికలు. భా.జ.పా అధికారాన్ని కోల్పోయింది. అంతగా అభిమానించి, అందలం ఎక్కించిన ప్రజలు ఎందుకు ఎన్నికల్లో ఓడించారు? ఇది అర్థం చేసుకొంటే, పార్టీలో నెలకొన్న సంక్షోభానికి ఆచూకీ లభిస్తుంది. ఓటమి తర్వాత బాధ్యతాయుత ప్రతిపక్షంగా మెలగాలి. అంతర్మథనం ఆ దిశలో జరగాలి. హుందాగా, నిగ్రహంతో, ప్రజల తీర్పును మన్నించాలి. వాకౌట్‌లతో, అనేకానేక జిమ్మిక్కులతో కాలం వృధా చేయకుండా, పార్లమెంటును ప్రజావేదికగా మలచుకొని ప్రభుత్వ విధానాలను ఎండగట్టాలి కానీ, అలా చేయలేదు. 'భారత్ వెలిగి పోతోంది' అన్న శుష్క నినాదంతో, వాస్తవ పరిస్థితులకు బహుదూరంగా, తాను సృష్టించుకొన్న మాయామేయ జగత్తులో వుండిపోయింది. ఇక్కడే భా.జ.పా భావజాల సంక్షోభానికి గురయింది. రామజన్మభూమి - బాబ్రీ మసీదు సమస్యను ప్రజల ముందుంచి, మతవైషమ్యాలు రెచ్చగొట్టి, ప్రజల మద్దతును పొందిన తర్వాత భా.జ.పా విధానాలు ప్రజల సమస్యల దిశగా మారివుండాలి. రామజన్మభూమి సమస్య, వారి హిందుత్వ ఎజెండాలో ప్రధానమైంది ఇది సాంస్కృతిక పరమైంది. ఇందులో ప్రజల మౌలిక అవసరాల, ఆర్థిక పరిస్థితుల ప్రస్తావన లేదు. హిందుత్వను ఒక జాతీయ సాంస్కృతిక ఉద్యమంగా మలిచి, హిందువులంతా ఒకటేనన్న 'జాతి గుర్తింపు'ను నెలకొల్పాలని, యిది దేశంలో వున్న మెజార్టీ ప్రజలకు సంబంధించినదనీ, మైనారిటీలు మెజార్టీ మనోభావాలకనుగుణంగా సర్దుకుపోవాలని వీరు వాక్రుచ్చారు. కానీ, 1990 దశకం నుండి దేశంలో కాంగ్రెసు పార్టీ ప్రారంభించిన నయా ఉదారవాద ఆర్థిక విధానాలు దేశ ప్రజల్లో ఎవరికి, ఏ వర్గాలకు, ఏ మేరకు ఆర్థికంగా సాయపడ్డాయో పట్టించుకోలేదు. స్వదేశీ ఆర్థిక విధానాల్ని పక్కకు నెట్టి, కాంగ్రెస్ పార్టీ కంటె యింకా బలంగా ఆర్థిక సంస్కరణలను అమలు పర్చింది కేంద్రంలోని ఎన్.డి.ఎ ప్రభుత్వం. ఆర్థిక వ్యత్యాసాలు పెరిగి, ఉపాధి కోల్పోయి, కొత్తగా ఉపాధి అవకాశాలు లేక, వ్యవసాయ రంగం పూర్తిగా దెబ్బతిని, ఆత్మహత్యలు పెరిగిన నేపథ్యంలో, 'హిందుత్వ' ప్రజలకు దూరమైంది. 'సడక్, పానీ, బిజిలీ' అనే నినాదం ప్రజల ముందుకొచ్చి నిలిచింది. ఈ పరిస్థితుల్లో, ప్రజలు ప్రత్యామ్నాయం గూర్చి ఆలోచించారు. ఆ విధంగా ఓటు చేశారు. అధికారంలోకి వస్తే, కాంగ్రెస్ (ప్రస్తుత యుపిఎ ప్రభుత్వం), ప్రజలకవసరమైన విధానాలు అమలు పరుస్తారన్న ఆశతో లేదా ఎన్.డి.ఎ పాలనకు గండికొట్టి, గుణపాఠం నేర్పుదామన్న వుద్దేశంతోనే యిది జరిగింది. యుపిఎ ప్రభుత్వం కానీ, రాష్ట్రాల్లో అధికారానికొచ్చిన కాంగ్రెస్

ప్రభుత్వాలు (ఆంధ్రప్రదేశ్, ఢిల్లీ, జమ్మూ-కాశ్మీర్ మొదలైనవి) ప్రజానుకూల విధానాలు అమలు పరిస్తే వాటికి భవిష్యత్తు వుంటుందన్నది గమనించాల్సి వుంది.

పై వివరణ, భా.జ.పాలోని మౌలిక ఆర్థిక విధానాల వైఫల్యాన్ని తెలియచేస్తుంది. ఇక ప్రస్తుతం అది ఎదుర్కొంటున్న యితరత్రా సమస్యల గూర్చి చర్చిద్దాం. ఎందుకంటే, ఆ సమస్యలేవో మనం తెలుసుకుంటే దాని భవిష్యత్ యేమిటో తెలుసుకోడానికి వీలు కలుగుతుంది. కొత్తగా ఎన్నికయిన అధ్యక్షుడు రాజ్‌నాథ్‌సింగ్ తన ఉపన్యాసంలో పూర్వం భా.జ.పా రూపొందించుకొన్న ఎజెండాను తు.చ. తప్పకుండా పాటిస్తుందని చెప్పాడు. ఏమిటది? త్రిసూత్ర ప్రణాళిక - కామన్ సివిల్ కోడ్, కాశ్మీర్‌కు ప్రత్యేక స్వయం ప్రతిపత్తి రద్దు, రామ మందిరం నిర్మాణం. గత ఎజెండాను తిరగదోడడం ఎందుకు? అంటే, ఆరు సంవత్సరాల అధికారంలో భా.జ.పా సంకీర్ణ రాజకీయాల నీతికి కట్టుబడి పనిచేయడమే వీటిని అమలు చేయకపోవడానికి కారణమని సంఘ పరివార్ గట్టినమ్మకం. సంకీర్ణ రాజకీయాల్లో, ఈ సమస్యల ప్రాధాన్యతలకు రెండో పీట. కాగా అన్ని పార్టీలను సర్దుకుపోవాల్సిన అవసరానికే మొదటి ప్రాధాన్యత. భా.జ.పా అనుసరించిన ఎత్తుగడల్లోని రహస్యం ఇక్కడ ఉంది. హిందూత్వాను ప్రధానాశయంగా చేసుకొంటే, జాతీయ శక్తిగా, అన్ని ప్రాంతాల, ప్రజల, మతాలకు చేరువకావడం దుర్లభం. ముఖ్యంగా బహుళ సంస్కృతికి నిలయమైన భారతదేశంలో. అందుకని సంఘ పరివార్ భావజాలాన్ని అధిగమించి పోవాల్సిన అవసరం ఉందని అద్వానీ తదితరులు చేసిన ఆలోచనలు (జిన్నాలో లౌకిక తత్వాన్ని చూడడం, పాకిస్థాన్ యేర్పడ్డాక, ఆ దేశపు విధానాల్లో మార్పును అర్థం చేసుకోవాలనడం) బెడిసికొట్టాయని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఆర్.యస్.యస్‌కూ యిది గడ్డు సమస్యే! సాంస్కృతిక సంస్థగా చెప్పుకొంటున్న ఆర్.యస్.యస్‌కు భా.జ.పా ఒక రాజకీయ ముసుగు. తానుగా రాజకీయ శక్తిగా ఎదిగి తన భావజాలాన్ని అమలు పర్చలేదు కాబట్టి, ఏమైనా భా.జ.పా ద్వారానే అది జరిగి తీరాలి. పైగా భా.జ.పాకు కావల్సిన భావజాలం, అంగ, అర్థ బలాలు సమకూర్చేది ఆర్.యస్.యస్ అన్నది స్పష్టం. అందుకే, మౌలిక భావజాలంలో రాజీ వుండగూడదు. అది పల్చబడగూడదు. కాబట్టే, తన వ్యాఖ్యలపై (పాకిస్థాన్‌లో) చర్చ జరగాలనిఅద్వానీ ఎంత పట్టుబట్టినా, సంఘ పరివార్‌లో ఏ ఒక్కరూ ఆయన అభ్యర్థనను మన్నించలేదు. మతపర రాజకీయాల వల్లే భా.జ.పా తన ఉనికిని కోల్పోతున్నదనే భావం ఒక వైపు వుండగా, మళ్లీ ఆ విధానాల పట్లే మొగ్గు చూపడం భా.జ.పాలో నెలకొన్న తీవ్ర భావజాల సంక్షోభాన్ని తెలియచేస్తోంది. పైగా 'హిందూత్వ'ను గూర్చి పార్టీలోనే విభేదాలున్నాయి. కొందరు హిందూత్వను, అచిరకాలంగా, అవిచ్ఛిన్నంగా భారతదేశంలో వస్తున్న ఒక సాంస్కృతికాంశంగా, భారతీయులు గర్వించదగిన మహోన్నత వారసత్వ సంపదగా భావిస్తుండగా, మరికొందరు దీన్ని, ప్రత్యర్థులను బెదరగొట్టి, నిర్వీర్యం చేసే క్రియాశీలక, దురాక్రమణ పూరిత, మెజార్టీ మత భావజాలంగా పరిగణిస్తున్నారు. ఆర్థిక విధానాల్లో దానికీ, కాంగ్రెస్‌కు తేడా దాదాపు లేదు. నిజానికి, కొంత వరకైనా స్వదేశీ ఆర్థిక విధానాలు, ప్రజల ప్రయోజనాలు, నేడున్న యుపిఎ ప్రభుత్వం (వామపక్షాల వత్తిడి వల్ల) పట్టించుకొంటోంది. ఇక, భా.జ.పాకు మిగిలిన ఎజెండా ఏమిటి? కానీ, హిందూత్వను తిరిగి ముగ్గులోకి తెస్తే, పూర్వపు ప్రజాభీష్టాన్నీ, మద్దతును తిరిగి పొందగలుగుతుందా అన్నదీ సందేహమే. ఎందుకంటే, ముందే చెప్పుకొన్నట్టు, ఇవ్వాళ ప్రజల మనోగతం వేరుగావుంది అది ఏ పార్టీ అయినా, ప్రజల మౌలిక సమస్యలు తీర్చకపోతే, పుట్టగతులుండవని, ఆంధ్రప్రదేశ్, మధ్యప్రదేశ్, కర్నాటకల్లో రెండేళ్ల క్రితం జరిగిన ఎన్నికలు స్పష్టం చేశాయి.

భా.జ.పా భవిష్యత్తు ఏమిటి? దాన్ని దేశ రాజకీయ పటం నుండి తొలగించే సమయం ఆసన్నమైందా? అంటే, కాదనే సమాధానం చెప్పుకోవాల్సి వుంటుంది. భవిష్యత్తు లేదని చెప్పేవాదనలు వొప్పించే విధంగావున్నా యిది తొందరపాటు అభిప్రాయమనే మా ఉద్దేశం. జాతీయ స్థాయి ఉన్న వాజపేయి, అద్వానీలు నాయకత్వం నుండి తప్పుకోడం నిశ్చయంగా పెద్ద నష్టమే! కానీ, వారు పూర్తిగా రాజకీయాలకు, నాయకత్వానికి దూరమైనారని చెప్పడం కష్టమే. పూర్వంలో వాజపేయి యిలాంటి ప్రకటనలు ఒకటి, రెండుసార్లు చేసి వున్నాడు. అద్వానీ చేసిన యిటీవలి ప్రకటనలు, ఆర్.యస్.యస్‌ను బుజ్జగించి, మెప్పు పొందేదిగా వున్నాయి. ఇటీవల బయల్పడ్డ అవినీతి, అభ్యంతరకర ప్రవర్తనలకు చెందిన వుదంతాలు పార్టీ ప్రతిష్టను బాగా దెబ్బతీశాయి. ఇతర పార్టీల కంటె భిన్నమైందని, నీతికి, విలువలకు, క్రమశిక్షణకు నమూనాగా చెప్పుకొంటూ వస్తున్న భా.జ.పాలో యీ ధోరణులు, ప్రజల దృష్టిలో పార్టీని నవ్వుల పాల్జేశాయి. క్రమశిక్షణా రాహిత్యం పేరుతో, ఒక మాజీ ముఖ్యమంత్రినే గెంటి వేసే ఘటన, సిద్ధాంతాల ప్రాతిపదికగా కాక, వ్యక్తిగత, అంతర్గత గ్రూపు రాజకీయాల వల్ల జరిగిందని, ఒక వర్గం వాదిస్తూ ఉంది పార్లమెంటు సభ్యులు డబ్బు తీసుకొని ప్రశ్నలడిగిన నీతిమాలిన సమస్యతో, ఆ సభ్యులను పార్లమెంటు సభ్యత్వం నుండి తొలగించినప్పుడు, అద్వానీ చేసిన వ్యాఖ్యలు, వాకౌట్, పార్టీ దివాలాకోరు తనాన్ని మరోసారి బట్టబయలు చేసింది. అంతే కాదు. అద్వానీ, వాజపేయిల ప్రాబల్యాన్ని తగ్గించడాన్ని, వ్యక్తిపూజను నిరోధించే మిషతో పదవీ వ్యామోహపరులైన రెండోతరం నాయకత్వం చేసిన కుట్ర అంతా యింతా కాదు.

ఇవ్వాళ భా.జ.పా అనేక దారుల కూడలిలో నిలబడి ఉంది. స్వయం విధ్వంసక కార్యక్రమంలో మునిగి తేలుతూ ఉంది. ఎప్పటికప్పుడు యేదో ఒక కొత్త కుంభకోణం వెలుగు చూస్తూనే ఉంది. అయినా, భా.జ.పాకున్న అత్యంత బలోపేతమైన ఎజెండా హిందూత్వ. దాన్ని అనుసరించినంత కాలం, ప్రజల అభిమానాన్ని దాని ద్వారా పొందగలిగినంత కాలం, దాని భవిష్యత్తు గూర్చి జాగరూకతలో ఉండాల్సిన అవసరం ఉంది. ❑

భూసంస్కరణలు : మిగులుభూములా? మిగులు మనుషులా?

డా.ముదునూరి భారతి

ప్రభుత్వానికి మావోయిస్టులకు మధ్య 2004 అక్టోబర్ నెలలో జరిగిన చర్చల ఫలితంగా మిగులు భూముల పంపిణీ అనే అంశం మళ్లీ చాలా బలంగా ముందుకు వచ్చింది. ప్రభుత్వం దీన్ని ఒక ప్రతిష్ఠాత్మకమైన పథకంగా తీసుకుని ఈ కార్యక్రమం కోసం తన రెవెన్యూ యంత్రాంగాన్ని యాక్టివేట్ చేసి, రాష్ట్రంలో ఒక్కొక్క జిల్లాలో ఎంత మిగులు భూమి ఉన్నది అనే గణాంకాల పట్టికను తయారు చేయమని ఆదేశమిచ్చింది. పర్యవసానంగా వారు తక్షణ కర్తవ్యంగా ఒక లక్షకు మించి ఎకరాలను గుర్తించటం కూడా జరిగిపోయింది. ఈ మిగులు భూములను, ముందుగానే నిర్ణయించుకున్న తేదీకి, అంటే జనవరి 26న రిపబ్లిక్ దినోత్సవం నాడు, పంపిణీ చేయటానికి కొంతమంది లబ్ధిదారులను ఎంపిక చేయటం, ఆ రోజే భూమికి సంబంధించిన పట్టా, దానితో పాటే పాసుబుక్కు ఇచ్చే ప్రయత్నాలు కూడా ప్రభుత్వం ముమ్మరంగా చేసింది. ఇంకొక పక్క మావోయిస్టులు కూడా తమవంతుగా మిగులు భూములను అంచనా వేసారు. ఒక కథనం ప్రకారం రాష్ట్రంలో అన్ని జిల్లాలలో కలిపి ఒక కోటి నలభై లక్షల ఎకరాల మిగులు భూములు ఉన్నాయనీ, ఒక్క కరీంనగర్ జిల్లాలోనే 5 లక్షల హెక్టార్ల మిగులు భూములు ఉన్నాయని చెప్పడం జరిగింది. మిగులు భూములు ప్రభుత్వం దృష్టిలో లక్ష ఎకరాలు మాత్రమే ప్రస్తుతానికి లెక్కకు వస్తే, మావోయిస్టులకు ఎన్నో రెట్లు ఎక్కువగా మిగులు భూములు అంచనాకు వచ్చాయి. ప్రభుత్వమే భూములను పంచే కార్యక్రమం చేపట్టడం మూలాన, ప్రభుత్వానికి మావోయిస్టులకు మిగులు భూముల అంచనాలో ఉండే తేడాల కారణంగా, దీన్ని ఆసక్తితో తిలకిస్తున్న ప్రజలు అయోమయంలో పడిపోయారు. మిగులు భూముల అంకెలలో తేడాలు ఎందుకు వస్తున్నాయి? ఇవి వారివారి దృక్పథాలలో ఉండే తేడాల మూలాన వచ్చాయా? లేక మిగులు భూమిని గురించిన అవగాహనకు సంబంధించినదా? ఈ ప్రశ్నలకు సమాధానం వెతికే ప్రయత్నమే ఈ వ్యాసం ఉద్దేశ్యం.

స్వాతంత్ర్యానంతరం మొదటి పంచవర్ష ప్రణాళికలో భూసంస్కరణలు చోటు చేసుకోవడం, ప్రభుత్వం దీనికి సంబంధించి అనేక చట్టాలు ప్రవేశపెట్టడం, వాటి అమలుకు రెవెన్యూ అధికారులను బాధ్యులను చెయ్యడం జరిగింది. జమీందారీ రద్దు చట్టం, ఇనాం రద్దు చట్టం, మధ్య దళారీల రద్దు, కౌలుదారీ సంస్కరణలు దానిలో భూగరిష్ట పరిమితి చట్టం లాంటి అనేక చట్టాలు దీనిలో భాగమయ్యాయి. ఇక్కడ భూసంస్కరణ లక్ష్యం సామాజిక సంబంధాలను సమూలంగా మార్చి గ్రామాలను అభివృద్ధి చెయ్యటంగా ఉండేది. ఈ సందర్భంలో భూపంపిణీ గురించి ఎవరికి అనుకూలమైన లెక్కలు వారు చెబుతూనే ఉన్నారు. గతంలో మన రాష్ట్రంలో కాంగ్రెస్‌పాలనలో 43 లక్షల ఎకరాలు పంపిణీ జరిగిందని వారి అంచనా. ఇవన్నీ కూడా ఏకపక్షంగా ప్రభుత్వం తన ప్రణాళికల ద్వారా చేపట్టిన కార్యక్రమాలు. కొన్ని సంవత్సరాలు గడిచేసరికి అందరూ ఒప్పుకునేదేమిటంటే గత 50 సంవత్సరాలుగా ప్రభుత్వం చేపట్టిన భూసంస్కరణలు అమలులో అనుకున్న ఫలితాలు సాధించలేక విఫలమయ్యాయనీ, దీనికి కారణాలుగా చట్టంలో లొసుగులే కాకుండా పాలనా యంత్రాంగంలోని అధికారుల నిర్లక్ష్యం, అలసత్వం, నిరాసక్తత, చొరవ చూపకపోవటంగా గుర్తించడం జరిగింది. నూతన ఆర్థిక సంస్కరణల నేపథ్యంలో భూసమస్య మరుగున పడిపోయినట్లు కన్పించింది. కాంగ్రెస్ పార్టీ గత ఎన్నికలలో గెలుపొందటం, హామీమేరకు మావోయిస్టు పార్టీతో చర్చలు జరపడం కారణంగా ఆంధ్రప్రదేశ్‌లో ఒక ఉత్కంఠ వాతావరణం నెలకొంది. రాజ్యాంగబద్ధంగా పాలన చేసే ప్రభుత్వం ఒకవైపు, రాజ్యాంగపరంగా సమస్యలకు సమాధానం దొరకదని నమ్మే మావోయిస్టులు మరొకవైపు, ఏకపక్షంగా కాకుండా ఇరుపక్షాలు కూర్చుని జరిపిన చర్చల ఫలితంగా భూసమస్య మరోసారి బలంగా ముందుకు వచ్చింది. దీనికి ప్రభుత్వం సానుకూలంగా స్పందించటం, మొదటి దఫాలో లక్ష ఎకరాల వరకు మిగులు భూములను సేకరించటం, లబ్ధిదారులను ఎంపిక చేసుకోవటం, జనవరి 26 పంపిణీ తేదీగా ఖరారు చేసి భూములు పంచటం లాంటి కార్యక్రమాలు వేగంగా జరిగిపోయాయి. ఈ కార్యక్రమానికి కొనసాగింపుగా రాష్ట్రంలో రెండవ దఫాలో సుమారుగా 1.68 లక్షల ఎకరాల మిగులు భూములను ప్రభుత్వం ఆగస్టు 15న పంపిణీ చేయడంతో పాటు 397 కోట్ల రూపాయలు అభివృద్ధి ప్యాకేజిగా ఒక నిధిని కూడా ఏర్పరచడం జరిగింది. కాని మావోయిస్టుల అంచనా ప్రకారం సుమారు 1.4 కోట్ల ఎకరాల మిగులు భూమి లెక్కకు వచ్చింది. ఈ తేడాకి కారణాలు రెండు విభిన్న దృక్పథాలు కలిగి ఉండే పార్టీలకు భూసమస్య మీద ఉండే అవగాహన, పరిష్కార మార్గాలు, మిగులు భూముల మీద ఉండే అంచనాలు కూడా వేరుగా ఉండడమే. ప్రభుత్వపరంగా భూసమస్యను అవగాహన చేసుకునే చట్రం ఒకటి ఉంటే మావోయిస్టులు దీన్ని అర్థం చేసుకునే ప్రత్యామ్నాయ చట్రం మరొకటి. వీటి మధ్యన జరిగే సంఘర్షణ మూలాన సమాజానికి భూసమస్య మీద ఒక అవగాహన దొరకగలదు.

'మిగులుభూమి' అనే మాటకి అర్థాన్ని భాషాపరంగా చూసినపుడు మిగిలిపోయిన భూమి అని ఒక అర్థం చెప్పుకుంటే, మిగులు పండించగల భూమి అని కూడా మరొక అర్థం చెప్పుకోవచ్చును. మిగులు భూములు అంటే పంటలు పండించకుండా వదిలివేసిన భూములు, వృత్తిపరంగా ఉండవచ్చును

లేదా సమాజపరంగా ఉండి సమష్టికి చెందవచ్చును. దీనికి ఆధారం రెవెన్యూ శాఖ తయారు చేసే ఆస్తి హక్కుల వివరాలు చెప్పే రికార్డులు. ఒక గ్రామంలో ఎన్ని ఎకరాల సాగుభూమి ఉంది? మిగులు భూమి ఎంత ఉంది? సాగు భూముల మీద అక్కడి వ్యక్తులకు ఎటువంటి ఆస్తిహక్కు (అనుభవించే హక్కు, ఇష్టానుసారం వాడుకునే హక్కు, అమ్ముకునే హక్కు) ఉంది? : సాగునీటి వసతిని బట్టి ఇది మెట్ట భూమా? లేక మాగాణి భూమా? భూసారం ఎటువంటిది? ఇక్కడ ఎటువంటి పంటలు పండుతాయి? అనే వివరాలను క్రోడీకరించి భూమి మీద వచ్చే ఆదాయాన్ని అంచనా వేసి, దీని ఆధారంగా రైతు కట్టవలసిన శిస్తుని నిర్ణయించటం, దానిని వసూలు చేసి ప్రభుత్వానికి ఆదాయం రూపంలో చెల్లించటం జరుగుతుంది. శిస్తు ఎక్కువగా వసూలు చేయగలిగిన ప్రాంతాలలో సర్వే, పునరావాసం శ్రద్ధగా చేసి, గ్రామం మొత్తానికి ఉండే భూములు, ఒక్కొక్క కుటుంబానికి చెందే సాగుపొలాల హద్దులు గుర్తించటం జరుగుతుంది. వ్యక్తికి చెందకుండా మిగిలిపోయిన భూములు సమాజ పద్దులో సమష్టి ఆస్తిగా జమ అయిపోతాయి. ఇవి చెరువులు, దేవాలయ భూములు, గోచర భూములు, స్మశానాలు, అడవులు, నదులు, నిస్సారమైన గుట్టలు లాంటివన్నీ ప్రజలందరికీ ఉమ్మడిగా ఉపయోగపడే స్థలాలు. సమాజపరంగా ఉన్న ఈ భూములు చాలా వరకు భూస్వాముల స్వాధీనంలోనే ఉండిపోతాయి. మిగులు భూములకి ఇంకొక ఉదాహరణ వ్యక్తిపరంగా భూమి ఉండి కూడా వ్యక్తికి ఎదురయ్యే కొన్ని అడ్డంకులు (ఆర్థిక పరమైన కారణాలు కావచ్చును, స్పష్టంగా నిర్వచింపబడని ఆస్తిహక్కుల కారణం కావచ్చును) మూలాన బీడుగా వదిలివేసిన భూములుగా గుర్తించవచ్చును. అంతేకాకుండా ఒక కుటుంబానికి తమ అవసరాలకు మించి భూమి ఉన్నట్లయితే దీన్ని కూడా మిగులు భూమి అనవచ్చును. భూగరిష్ట పరిమితి ఇలా ఏర్పడిందే. భూమి ఇలా మిగులు భూమిగా ఉండిపోవటంతో ఒక వనరుగా నిరుపయోగమైపోయింది. అలా కాకుండా ఈ భూములనుపయోగించి ప్రస్తుతం పంటలు పండించటం లేదు కాని ఇక ముందు పండించగలం అని చూస్తే మిగులు భూమికి అర్థం మారిపోతుంది. భూమి అనే వనరు నిరుపయోగంగా ఉండిపోవటానికి, పంటలు పండించక పోవటానికి కొన్ని అడ్డంకులు - సాంకేతికపరమైనవి, ఆర్థికపరమైనవి, రాజకీయపరమైనవి - ఉండవచ్చును. ఈ అడ్డంకులు గుర్తించి వాటిని తొలగించితే, అంటే దానికి కావలసిన మార్పులు తేగలిగితే ప్రస్తుతం మిగిలిపోయిన భూములుగా కనిపించినవి కూడా మిగులు పండించగల భూములుగా మారి వాటిని సాగుచేయడం ద్వారా అధిక ఉత్పత్తి సాధ్యమౌతుంది. ఇక్కడ భూమిని ప్రధాన వనరుగా గుర్తించి, నిరుపయోగమైన భూమిని సాగు భూమిగా మార్చే క్రమంలో సమాజానికి అధికోత్పత్తి సాధ్యమౌతుంది. సాంకేతిక జ్ఞానంతో మార్పుల ద్వారా ఈ క్రమం సాధ్యమని చెప్పటానికి ఉదాహరణగా చిత్తూరు జిల్లాలోని కుప్పం మండలంలో ఉన్న చల్దిగానిపల్లెలో ప్రవేశపెడుతున్న కార్పొరేటు వ్యవసాయాన్ని చూడవచ్చును. కుప్పం అనగానే వర్షాభావ ప్రదేశమనీ, రాళ్లు, గుట్టలతో అక్కడి నేల పంటలు పండించటానికి అనుకూలంగా లేదనీ, 80% పైన వ్యవసాయ కూలీలు, చిన్న రైతులు ఉండే గ్రామమని ఒక అభిప్రాయం బలంగా ఉండేది. చంద్రబాబు నియోజక వర్గమైన కుప్పంలో, నూతన ఆర్థిక విధానాల నేపథ్యంలో కార్పొరేటు వ్యవసాయానికి రంగం సిద్ధమైంది. ఇజ్రాయల్ దేశంలోని ఎడారి వ్యవసాయ పద్ధతులలోని నైపుణ్యానికి సంబంధించిన సమాచారం తెలిసిన బి.హెచ్.సి అనే కంపెనీ ద్వారా వాటిని ఇక్కడ ప్రవేశపెట్టే క్రమంలో, ప్రభుత్వ మధ్యవర్తిత్వంలో, ఇప్పటి వరకు సరిగా పంటలు పండని 200 ఎకరాల భూమిని రైతుల దగ్గర నుండి లీజుకి తీసుకుని, అధిక విలువలు కలిగిన ఎగుమతి ప్రాధాన్య పంటలు (గెర్కిన్, బేబీకార్న్, స్ట్రాబెరీ లాంటివి) ప్రవేశపెట్టి బీడు భూములను సాగుభూములుగా మార్చివేసారు. ఇక్కడ సాంకేతిక పరిజ్ఞానంలో మార్పులు తేవటం ద్వారా ఇంతవరకూ వ్యర్థంగా మిగిలిపోయిన భూములను, మిగులు పండించగల భూములుగా మార్చివేసారు. 'మిగులు భూముల'లో అంకెలలో తేడాలు ఇక్కడ బాగా గమనించవచ్చును. గ్రామంలో మిగులు భూములను గుర్తించటానికి మూలం ఆ గ్రామంలో ఉండే రెవెన్యూ రికార్డులలో ఉండే ఆస్తి మీద యాజమాన్యపు హక్కు వివరాలు కాబట్టి దీనిని రెవెన్యూ దృక్పథం అనవచ్చును. ఈ దృక్పథంలో పంటలు పండించటానికి 'భూమి' ముఖ్యమైన వనరుగా గుర్తింపబడుతుంది.

అధిక ఉత్పత్తిని పొందగలిగే మరొక పద్ధతి దానిని సాధించగలిగే మనుషుల దగ్గరకు వెళ్లటం. ఈ రెండవ దృక్పథంలో పంటలు పండించగల జ్ఞానం, నైపుణ్యం ఉన్న 'మనిషి' ముఖ్యమైన వనరుగా గుర్తించి వారి నైపుణ్యాన్ని వాడుకునే పరిస్థితులు కల్పించటం, తద్వారా అధిక ఉత్పత్తిని సాధించటం జరుగుతుంది. దీనిని ప్రజల దృక్పథం అనవచ్చును. సమాజం తనకుండే వనరులను సమర్థవంతంగా వాడుకునే పద్ధతిలో ఈ రెండు ప్రత్యామ్నాయ పద్ధతులలో ఒకటి 'భూమి' ముఖ్యమైన వనరుగా గుర్తిస్తే రెండవ దానిలో 'మనిషి' ముఖ్యమైన వనరుగా గుర్తించటం. అంతేకాక, మిగులు భూమి అంటే మిగిలిపోయిన భూమా? లేక మిగులు పండించగల భూమా? అనే అంశం మీద ఉండే అవగాహనలో తేడాల వల్ల కూడా మిగులు భూముల అంకెలలో తేడాలు రావచ్చును.

ప్రస్తుతం ప్రభుత్వం చేపట్టిన భూపంపిణీ కార్యక్రమాన్ని పరిశీలించితే, రెవెన్యూ అధికార యంత్రాంగం సహాయంతో మిగులు భూములను గుర్తించి, వాటిని సేకరించి, లబ్ధిదారులకు పంచటం అనే ప్రక్రియగా చూడవచ్చును. ఇలా చెబితే ఇది చాలా సులభతరమైన ప్రక్రియగా కనిపించినా అమలులో ఇది బహు క్లిష్టమైనది. ముఖ్యంగా రెండు అంశాలలో సందిగ్ధత కనిపిస్తుంది. మొదటిది రెవెన్యూ రికార్డుల ప్రకారం ప్రభుత్వానికి కొన్ని భూములు మిగిలిపోయిన భూమిలా కనిపించినా ప్రజలకు ఇవి మిగులు పండించగల భూమిలా కనిపించిన కారణంగా భూ ఆక్రమణలకు దారి తీస్తుంది. ఈ భూ ఆక్రమణలు ముఖ్యంగా ఆస్తి మీద ఉండే హక్కులు స్పష్టంగా నిర్వచించబడని కారణంగా జరుగవచ్చును. ఇటువంటి భూములనే జనవరి 26వ తేదీన ప్రభుత్వం లబ్ధిదారులకు పంచి వాటికి పట్టాలు కూడా ఇచ్చింది. భూమి మీద ఉన్న అస్పష్టమైన

హక్కులను స్పష్టంగా నిర్వచించే ప్రయత్నంగా ఈ భూపంపిణీ కార్యక్రమాన్ని చూడవచ్చును. రెండవ అంశం 'లబ్ధిదారులు'గా పిలువబడే పేద ప్రజల ఎంపిక. వీరు సమాజపు అభివృద్ధిలో భాగం కాకుండా దారిద్ర్య రేఖకు దిగువన ఉండిపోయిన 'మిగులు ప్రజలు'. 'వెలుగు' సంస్థ వారి సర్వే ప్రకారం పేదల సంఖ్య 79 లక్షలైతే, నిరుపేదలు 25 లక్షల మంది (ఈ మధ్యనే ప్రభుత్వం తెల్లకార్డులు పొందటానికి వార్షిక ఆదాయ పరిమితిని పెంచడంతో ఈ సంఖ్య ఇంకా పెరగవచ్చును). భూ పంపిణీ కార్యక్రమంలో ఒక్కొక్క కుటుంబానికి ఐదు ఎకరాలు మెట్ట లేక రెండున్నర ఎకరాల మాగాణి ఇవ్వాలని నిర్ణయించినా, దానికి అవసరమైన మిగులు భూములు అందుబాటులో లేనందున, ప్రభుత్వం మొదటి దఫాలో సేకరించిన 1.26 లక్షల ఎకరాలు భూమిని 80,612 మంది లబ్ధిదారులకు రిపబ్లిక్ దినోత్సవం నాడు పంచే ప్రయత్నం చేసింది. ఒక్కొక్క కుటుంబానికి ఇవ్వాలనుకున్న భూమి తూర్పుగోదావరి జిల్లాలో 8 సెంట్ల నుండి 2 ఎకరాలు ఉంటే, ప్రకాశం జిల్లాలో మెట్ట 5 ఎకరాలు, మాగాణి 2.5 ఎకరాలు ప్రణాళికలో ఉంది. రాష్ట్రంలో ఉన్న మొత్తం పేద ప్రజలను ప్రస్తుతం ప్రభుత్వం గుర్తించిన లబ్ధిదారులతో పోల్చి చూస్తే, పేద ప్రజలలో 100 కుటుంబాలలో ఒక కుటుంబాన్ని, లేక నిరుపేద ప్రజలలో 100 కుటుంబాలలో మూడు కుటుంబాలను లబ్ధిదారులుగా ఎంచుకున్నట్లు అర్థమవుతుంది.

ఈ ప్రక్రియని పరిశీలించితే 'మిగులు భూముల' నుండి 'మిగులు ప్రజలకు' అంటే లబ్ధిదారులను చేరుకునే ప్రయాణంగా చూడవచ్చు. ఈ ఎంపికలో అవకతవకలు జరుగకుండా, నిష్పక్షపాతంగా ఉండేందుకు నియోజక వర్గంలోని వివిధ పార్టీల ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు, గ్రామ ప్రజల సహాయంతో చేయాలనే ప్రతిపాదన కూడా ఉంది.

ఈ భూ పంపిణీ కార్యక్రమంలో కొన్ని విపరీత పర్యవసనాలు కూడా ఎదురవ్వచ్చు. మొదటిది లక్షల సంఖ్యలో ఉండే మిగులు ప్రజల నుండి కొన్ని వేల మందిని మాత్రమే లబ్ధిదారులుగా ఎంచుకునే రేషనింగ్ పద్ధతిలో పర్యవసనాలు కొంత విషమంగా ఉండవచ్చును. భూ పంపిణీ కార్యక్రమం అధికారంలో ఉన్న రాజకీయ పార్టీ అమలు చేసే ఒక ప్రతిష్టాత్మకమైన పథకం అవటం మూలాన ఇది ఆ పార్టీ రాజకీయ ప్రయోజనం తీర్చే సాధనంగా మారే అవకాశం ఉంది. అంతే కాకుండా లబ్ధిదారుల ఎంపిక వివిధ రాజకీయ పార్టీల ప్రజాప్రతినిధుల ఆధ్వర్యంలో జరుగుతుండటంతో ప్రతి రాజకీయ పార్టీ కూడా తన ఓట్ బ్యాంక్ పెంచుకునే ప్రయత్నం, దాని వెన్నంటి ఉండే రాజకీయాలు కూడా చోటు చేసుకుంటాయి. రెండవది, లబ్ధిదారులను ఎంచుకునే ఇటువంటి రేషనింగ్ పద్ధతిలో ఎవరు ఎక్కువ డబ్బు లంచంగా ఇస్తారో వారికే పట్టా దొరుకుతుంది అనే వదంతి కూడా ప్రచారంలోకి వచ్చింది. ఇప్పటికే పత్రికలలో ఉదహరించినట్లు కృష్ణా జిల్లాలో రూ. 10,000, తెలంగాణ, రాయలసీమ ప్రాంతాలలో రూ. 5,000 చొప్పున ముందస్తుగా చెల్లించిన వారికే భూమి హక్కునిచ్చే పట్టా దొరుకుతుందనే వార్త కూడా ఉంది. మూడవది, సముద్రంలో నీటి బొట్టులా ఉండే ఈ ఎంపిక పద్ధతిలో ప్రతి ఒక్కరూ మిగతా వారిని మినహాయించి తననే లబ్ధిదారుగా ఎంచుకోవాలనే పోటీ తత్వం పెరిగి పోయి నేను వేరు - మిగతా వాళ్లు వేరు అనే భావం ఏర్పడి ఏకాకిగా ఉండే వ్యక్తిగా మారిపోయే ప్రమాదం ఉంది. అంతకు ముందు తామంతా ఒకే రకమైన పేద ప్రజలనీ, తమ సమస్యలన్నీ ఒకే రకంగా ఉంటాయని ఉండే సంఘీభావం, సమష్టితనం దెబ్బతినే పరిస్థితి ఏర్పడి ఎవరికి వారే యమునా తీరే, ఎవరి కష్టాలు వారివే మిగతా వారికి సంబంధం ఉండదు అనే భావం రూపు దిద్దుకోవటంతో సమాజం వ్యక్తివాద ధోరణులకు లోనవచ్చును. ఈ వ్యక్తివాదమయ్యే క్రమం రాజకీయాల ఆధారంగా జరుగవచ్చును, లేక కుల ప్రాతిపదిక, వర్గ ప్రాతిపదిక ఇలా ఎన్నో రకాలుగా జరిగే అవకాశం రావచ్చును. ఇటువంటి రేషనింగ్ పద్ధతిలో సమాజం విడగొట్టబడటమే కాకుండా, లబ్ధిదారులకు ఎంతో కొంత భూమి ఇచ్చినా కూడా, అప్పటికే దారిద్ర్య రేఖ కింద ఉండటంతో పంటలు పండించటానికి కావలసిన మిగతా వనరుల లోటు వలన, భూమి తిరిగి అన్యాక్రాంతమయ్యే ప్రమాదం ఉంది. అంతే కాకుండా లబ్ధిదారులను లాభం పొందే వారుగా సమాజం చూడటంలో వీరు ఇంకా లాభాల కోసం ఎదురు చూడటం, దానితో పాటే లాభాలు ఇచ్చేవారి దయాదాక్షిణ్యాల మీద ఆధారపడే గుణం కూడా అబ్బుతుంది. ఇంక లబ్ధిదారులు కాకుండా మిగిలిపోయిన వారు భవిష్యత్తులో తాము కూడా లబ్ధిదారులుగా అవకపోతామా అని ఆశ, కాని తక్షణం తమ సమస్యకి సమాధానం దొరకకపోవడంతో నిరాశకు లోనవడం జరుగుతుంది.

క్షుణ్ణంగా చూస్తే, లబ్ధిదారుల ఎంపికలో ఉండే రేషనింగ్ మూలాన పరోక్షంగా ఓటు బ్యాంకు రాజకీయాలు చోటు చేసుకోవటం, లంచగొండితనం పెరిగిపోవటం, సమాజం విభజింపబడి వ్యక్తివాదంలో కూరుకుపోవడం, తరతమ వైషమ్యాలు పెరిగిపోవటం, లబ్ధి పంచే వారి అధికారాలు పెరగటం, ఇంకొకరి దయాదాక్షిణ్యాల మీద ఆధారపడే గుణం అబ్బటం లాంటి మార్పులుగా ఉంటాయి. భూ పంపిణీ క్రమాన్ని మనం మిగులు భూముల నుండి మిగులు మనుషులను చేరే ప్రయాణంగా చూస్తే, ఈ పర్యవసనాలు కారణంగా భూ సమస్యకి ఒక సమాధానం దొరకకపోవడంతో అది తిరిగి తిరిగి మళ్లీ మొదటికి చేరుకోవటం, చర్విత చర్వణంగా 'భూమి ఎక్కడ ఉంది?' అనే ప్రశ్న మళ్లీ ముందుకు రావటం, భూసంస్కరణలలో భాగంగా ఎన్నో చట్టాలు, ఎన్నో పథకాలు, ఎన్నో కార్యక్రమాలు చేపట్టినా కూడా అది అమలులో వైఫల్యం అయిందని, అధికారుల అనాసక్తత వగైరా కారణాలు తిరిగి ముందుకు వచ్చే అవకాశం ఉంది.

ఇలాంటి కార్యక్రమంలో మరొక విపరీత ధోరణి అంతర్లీనంగా కుటుంబం మీద కూడా ఉంటుంది. మిగులు భూములకు పట్టాలు ఇవ్వడం ద్వారా ఒక కుటుంబానికి భూమి మీద హక్కు దొరుకుతుంది. ఈ క్రమంలో కుటుంబం అంటే లబ్ధిదారు, లబ్ధిదారు అంటే కుటుంబ యజమాని ఇలా అన్నీ ఒకటైపోతాయి. ఈ దృక్పథంలో కుటుంబం అంటే ఒకే రకమైన ఆలోచన కల వ్యక్తుల సముదాయమనీ, కుటుంబ యజమాని ద్వారా

అవి వ్యక్తమవుతాయని, అందుచేత యజమాని అన్నా, కుటుంబమన్నా ఇంకా లబ్ధిదారు అన్నా ఒకటే భావన దీనికి పునాది. ప్రస్తుత పరిస్థితులలో కుటుంబ యజమానిగా పురుషుడు వ్యవహరించే సమాజంలో పురుషుడు లబ్ధిదారుగా, లబ్ధిదారు కుటుంబం - యజమాని - పురుషుడు అనేవి పర్యాయ పదాలుగా మారిపోతాయి. అలా కాకుండా నిజ జీవితంలో కుటుంబం విభిన్న ఆలోచనలు కల స్త్రీ పురుషుల కలయిక వలన ఏర్పడినా, సమాజం పురుషుడిని యజమానిగా గుర్తించటం, దానితో పురుషుడు లబ్ధిదారుగా మారటం వలన తనదైన వ్యక్తిత్వం కల స్త్రీ సమాజంలో తన స్థానాన్ని పోగొట్టుకొంటుంది. మామూలుగా నిర్వాసితులకు ఇచ్చే పునరావాస, పునర్నిర్మాణ ప్యాకేజీలలో జరిగే లోపం ఇక్కడ కూడా చోటు చేసుకుంటుంది. ఇక్కడ స్త్రీకి అన్యాయం జరగడంతో పాటు పురుషునికి అధికారం పెరగడం కూడా జరుగుతుంది. అందుచేత లబ్ధిదారు అంటే లబ్ధి పొందే పురుషుడు కాదు, లబ్ధి పొందేది కుటుంబమనీ, కుటుంబంలో స్త్రీ, పురుషులిద్దరికీ సమష్టి పట్టా (కుటుంబం అనే యూనిట్‌ని నిర్వచించటంలో అనేక సాధక భాదకాలున్నా కూడా) ఇవ్వవలసిన అవసరం ఉంది. ఈ సమస్యని ప్రభుత్వం కొంత వరకు గుర్తించి స్త్రీలకు కూడా పట్టాలు ఇచ్చే ప్రయత్నం మొదలు పెట్టింది.

ప్రత్యామ్నాయ పద్ధతిలో, మిగులు భూముల నుండి మిగులు ప్రజలకు చేరటం కాకుండా, మిగులు ప్రజల నుండి మిగులు భూములకు చేరే ప్రయాణం చేస్తే ఆసక్తికరమైన విషయాలు కనిపించవచ్చును. మిగులు ప్రజలు అంటే సమాజపు ఉత్పత్తిలో భాగమైనా కూడా సమాజపు అభివృద్ధిలో భాగం కాలేక సమాజానికి భారమైన మనుషులు. వీరినే ఇంకొక రకంగా చెప్పాలంటే దారిద్ర్య రేఖ దిగువన ఉండే పేద, నిరుపేద ప్రజలు, సామాజిక అంచుల వెలుపల ఉండే వాళ్లు అని కూడా అంటారు. షెడ్యూల్డ్ కులాలు, తెగలు, వ్యవసాయ కూలీలు, చిన్నకారు రైతులు, అసంఘటిత కార్మికులు, స్త్రీలు లాంటి వాళ్లంతా ఈ కోవలోకే వస్తారు. తమ జీవనానికి ఒక ఉపాధి లేని నిరుద్యోగులు కూడా మిగులు ప్రజలలో జత అవుతారు. ఇటువంటి మిగులు ప్రజలను సమాజపు అంచులలో మిగిలిపోయిన ప్రజలుగా చూడకుండా, పని చేయగలిగే శక్తి, చేయటానికి అవసరమయ్యే జ్ఞానం, నైపుణ్యం ఉండి కూడా వాటిని ఆచరణలో పెట్టలేక మిగిలిపోయిన వారు. ఆలోచనలు కలిగిన మనుషులు, సమాజం వీరి జ్ఞానాన్ని ఉపయోగించుకోగలిగిన పరిస్థితులు కల్పించగలిగితే వీరు మిగులు పండించగల మనుషులుగా కన్పిస్తారు. ఈ దృక్పథంతో చూస్తే వీరంతా భూమిని పొందే లబ్ధిదారులుగా కాకుండా, ఉత్పత్తికి అవసరమైన జ్ఞానం, నైపుణ్యం మాకు ఉన్నాయి కాబట్టి మాకు భూమి కావాలి అని డిమాండ్ చేసే హక్కుదారులుగా మారిపోతారు. ఈ మిగులు మనుష్యులకు భూమి ఇవ్వడమంటే వీరు తమని తాము అభివృద్ధి చేసుకునే క్రమంలో సమాజ అభివృద్ధిలో భాగం అయ్యే అవకాశం లభిస్తుంది. మిగులు మనుషులు అందరూ, రేషనింగ్ పద్ధతిలో ఏ కొద్ది మందో కాకుండా, హక్కుదారలవటం మూలాన, లబ్ధిదారుల ఎంపిక పద్ధతిలో ఉత్పన్నమయ్యే రాజకీయ పక్షపాతం, లంచగొండితనం వంటి అవాంఛిత పర్యవసనాలకు ఆస్కారం తక్కువగా ఉంటుంది. వీరిని కుల, వర్గ ప్రాతిపాదికల మీద విడదీయక అందరినీ హక్కుదారులుగా చూడటంతో ఏకాకి తనం రాకుండా సమష్టిభావం బలపడుతుంది. భూమిని తమ హక్కుగా పొందటంతో తమకు అవసరమైన వాటికి అధికారుల మీద కాక తమ సమష్టి శక్తిమీద ఆధారపడటంతో తమ మీద, తమ శక్తి మీద గౌరవంతో పాటు వారికి ఆత్మస్థైర్యం కూడా కలుగవచ్చును.

ఇదంతా వినడానికి బాగానే ఉందికాని దారిద్ర్యరేఖకు, దిగువన ఉండే 79 లక్షల మందికి ఇవ్వగల భూమి ఎక్కడ ఉంది? అనే మౌలికమైన ప్రశ్న మళ్లీ ముందుకు వస్తుంది. ఇక్కడ ఒక్కొక్కరికి ఇవ్వగలిగిన భూమి 5 ఎకరాలా లేక 2 ఎకరాలా అనే ప్రశ్నతో కాక ఇచ్చిన భూమి 30 సెంట్లు అయినా ఉమ్మడిగా, కలిసికట్టుగా పండించే అవకాశాలు కల్పించగలిగితే అప్పుడు తయారయ్యే చిత్రపటానికి రూపురేఖలు ఆసక్తికరంగా ఉంటాయి. శ్రమ శక్తి మీద గౌరవం, ఆత్మ విశ్వాసం, సమష్టిభావం లాంటివి భావనలుగానే ఉండిపోక సమాజంలో నిజంగానే సాధ్యం అని చూపించటానికి శ్రీకాకుళంలోని బొంతల కోడూరు గ్రామంలో ఎస్.సి. కాలని ఒక నిదర్శనం.

ఈ గ్రామంలో విడిగా ఉండే ఎస్.సి. కాలనీలో నివసించే 23 కుటుంబాలకు ఒక ఎకరా మెట్ట భూమి (ఇది ప్రస్తుతం వీరి ఆధీనంలో లేదు), 33 సెంట్ల పల్లపు భూమి ఇచ్చారు. ఈ పల్లపు భూములన్నీ ఏక ఖండంగా ఉండటంతో ఉమ్మడిగా వ్యవసాయం చేసుకునే అవకాశం దొరికింది. వీరికి నాగావళి నది నుండి ఎత్తిపోతల పథకం ద్వారా నీటి సదుపాయం, సాగుభూముల పక్కనే ప్రభుత్వ సహాయంతో గృహవసతి, రోడ్లు, స్కూలు, ప్రతి కుటుంబానికి ఒక ఆవు లాంటి సదుపాయాలు ఉన్నాయి. ఒక వైపు పంటలు ఉమ్మడిగా పండించుకోవడం, మరొక వైపు ఆవుల పెంపకం, పాలను విశాఖ డైరీకి అమ్ముకుని బ్యాంకు ఇచ్చిన అప్పులు తీర్చివేయటం లాంటివి గమనించినప్పుడు ఈ కాలనీ మిగతా గ్రామాల కన్నా భిన్నంగా కనబడుతుంది. సమాజపు అంచులలో మిగిలిపోయిన మనుషులుగా చులకనగా చూడబడే వీరి సమష్టి జీవనంలో నిబిడమై ఉన్న శక్తి, మారిన వారి ఆలోచనలు, తమ అభివృద్ధికి తామే బాధ్యులమనే ఆత్మవిశ్వాసం మనకు ఒక కొత్త సమాజాన్ని బీజరూపంలో చూపిస్తాయి. ఈ మార్పులలో అస్పష్టత ఉండవచ్చును. వాటి మీద అవగాహన అసంపూర్తిగా ఉండవచ్చును. అయినా కూడా వారి సమష్టి ఆలోచన వారికిచ్చిన ఆత్మవిశ్వాసానికి, శక్తికి ఈ కాలనీ ఒక ప్రతీకగా నిలుస్తుంది.

భూసంస్కరణలలో భాగంగా భూ పంపిణీ కార్యక్రమాన్ని ఎంచుకుని మిగులు భూములను ముందు గుర్తించి, మిగులు మనుషులలో లబ్ధిదారులను చేరే ప్రయత్నంలో స్వతఃసిద్ధంగా భాగమయ్యే కొన్ని అవాంఛిత పర్యవసనాలు ఉండటం వలన ఈ కార్యక్రమం మిగతా ప్రభుత్వ కార్యక్రమాలు లాగానే అమలులో విఫలమైందని, దానికి కారణాలు వెతుక్కోవటం జరిగే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. భూ సమస్యకి సమాధానం దొరకక భేతాళుడి ప్రశ్నలాగా మళ్లీ ముందుకు వస్తూనే ఉంటుంది. ప్రత్యామ్నాయంగా

కొత్తసీసాలో పాత సారా

వి. హనుమంతరావు

ఇటీవల కేంద్ర ఆర్థికమంత్రి చిదంబరం హైదరాబాద్‌లో మాట్లాడుతూ కార్పొరేట్ సంస్థల మొండి బాకీలు తగ్గిపోయాయని, ఇంకా తగ్గించటం తన లక్ష్యమని చెప్పుకున్నారు. ఐతే ఆయన చెప్పని విషయం ఒకటుంది. ఇలా తగ్గడానికి కారణం బాకీలు చెల్లించటం వల్ల కాదు. సుమారు 50 వేల కోట్ల బాకీలను రద్దు చేయడమే. 'ప్రపంచబ్యాంకు వద్ద డబ్బుంది. ఎవరో ఒకరికి ఇవ్వాలి. అందుకే ఇస్తుంది.' అని ముఖ్యమంత్రి బ్యాంకు వద్దకు రుణం కోసం వెళ్లడాన్ని సమర్థించుకున్నారు. అంతటితో ఆగకుండా బ్యాంకు పెట్టే షరతులకు 'సూచన'లనే కొత్త పేరు పెట్టారు. ఎడమ చెయ్యికి, పుర్ర చెయ్యికి తేడా లేదు. పేరు మార్పే. ప్రపంచబ్యాంకుకు ముఖ్యమంత్రి చేసిన ప్రాంప్టింగ్ బాగా నచ్చింది. అబ్బే, మేమేమీ షరతులు విధించలేదు. సూచనలు చేసామంతే అని బ్యాంకు ప్రతినిధివర్గం తన షరతులను సమర్థించుకొంటోంది. ముఖ్యమంత్రి దారిలోకి వచ్చాడని సంతోషంగా 'మీకు కావాల్సిన రుణాన్ని ఇస్తాం' అని భరోసా ఇచ్చారు కూడా. ముఖ్యమంత్రి అక్కడితో ఆగకుండా 'అయితే రావాల్సిన ఆదాయం విషయంలో జాగ్రత్త తీసుకోవాలని, ఖర్చు తగ్గించుకోవాలని బ్యాంకు చెపుతోంది' అంటూ బ్యాంకు విధానాన్ని వెనకేసుకుని వచ్చారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా వున్నప్పుడు కూడా బ్యాంక్ ఇదే చెప్పింది. అదే పని ఒకరు చేస్తే తప్పు, మరొకరు చేస్తే రైటా? షరతులు లేవంటారేమిటి? మొన్ననే శాసనసభ సమావేశం జరగకముందు 'ఆర్థిక బాధ్యత, బడ్జెట్ నిర్వహణ' బిల్లును ఆర్డినెన్స్ ద్వారా ప్రవేశపెట్టాల్సిన అత్యవసరం ఏమొచ్చింది? శాసనసభ సమావేశం జరిగేటంత వరకు ఆగవచ్చు కదా? ప్రపంచబ్యాంకు పీకలమీద కూర్చొని ముఖ్యమంత్రి చేత సంతకం పెట్టించుకుంది. మన పట్టణాలను సంస్కరించడానికి కావాల్సిన నిధులిస్తామని, అయితే రెంట్ కంట్రోల్ చట్టాన్ని రద్దు చేయాలని బ్యాంకు షరతు విధించిందా? లేదా? సూచన అనే పేరు మార్చినంత మాత్రాన షరతు కాకుండా పోతుందా? రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన జలయజ్ఞానికి అవసరమైన నిధులను రుణంగా ఇవ్వటానికి సంసిద్ధతను తెలియజేస్తూనే ప్రపంచబ్యాంకు ప్రతి చుక్క నీటిని కూడా లెక్కించి వాటి నుంచి నీటి తీరువాను వసూలు చేయాలని, అందుకవసరమైన మీటర్లను ఏర్పాటు చేయాలని అనటం ముందస్తు షరతు విధించటం కాదా?

సబ్సిడీలను తెగ్గోసి రైతుల మీద భారం పెంచే షరతును ప్రపంచబ్యాంకు విధించగా, ఆ మేరకు గత ప్రభుత్వం చర్యలు తీసుకొంది. గత ప్రభుత్వంచేసిన రుణాలు చెల్లించకుండా ఎగ్గొట్టడం సవ్యం కాదని ఆర్థికమంత్రి రోశయ్య ఒక వైఖరి తీసుకున్నారు. అయితే సబ్సిడీ తగ్గింపు నిర్ణయాన్ని తిరగదోడి రైతులకు మేలు చేయవచ్చు కదా! ఎందుకు చేయడం లేదు? ప్రపంచబ్యాంకు పెట్టిన షరతు అంగీకరించడం వల్లనే కదా! మరి షరతులు లేవంటారేమిటి? ప్రపంచబ్యాంకు నుంచి రుణం తీసుకోనని చెప్పలేదే అని అంటున్నారు ముఖ్యమంత్రి. తాను వ్యతిరేకించింది షరతులను మాత్రమేనని అంటున్నారాయన. మరి పైన ఉదహరించినవన్నీ షరతులు కావా?

దారిద్ర్యం:

ఒక పక్క దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న వారి సంఖ్య నూటికి 11 మంది మాత్రమేనని కేంద్ర ప్రభుత్వం లెక్కలు చూపిస్తారు. దారిద్ర్యం అంత తక్కువగానే ఉండి ఉంటే పేదరికం తగ్గింపుకు ప్రపంచబ్యాంకు నుంచి రుణం తెచ్చుకొని, 'వెలుగు పథకం' పేరుతో

మిగులు మనుషులైన హక్కుదారులను గుర్తించి వీరికి భూములు ఇచ్చే ప్రయత్నం ఉపయోగకరంగా ఉండవచ్చును. అందుచేత మిగులు భూములు ఎక్కడ ఉన్నాయని తరుచుగా వినిపించే ప్రశ్నతో ఆగిపోకుండా, భూమి మీద ఉండే యాజమాన్యపు హక్కులలో మార్పులు, సాంకేతిక మార్పులతో పాటు ఉమ్మడి వ్యవసాయం పరిష్కారంగా చూపవచ్చు. అంతే కాకుండా కుటుంబంలో పురుషుడితో కలిపి స్త్రీకి కూడా సమష్టి పట్టా ఇవ్వడం, దానితో పాటు ఇతర సదుపాయాలు కల్పించటంతో స్త్రీకి ఆర్థిక స్తోమతతోపాటు సమాజంలో గౌరవనీయ స్థానం లభిస్తుంది.

ఇంకొక విషయం భూపంపిణీలో ప్రముఖ పాత్ర మిగులు అనే భావన మీద ఉండే అవగాహన. మిగులుని మిగిలిపోయినదిగా చూస్తామా? లేక మిగులు సృష్టించగలదిగా చూస్తామా? అనే దాని మీద స్పష్టమైన అవగాహన ఉన్నపుడే భూసంస్కరణలు అమలులో విజయవంతమయ్యే అవకాశం ఉంటుంది. ❑

మళ్లీ సరికొత్త థకాలను అమలు పరచాల్సిన అవసరమేమొచ్చింది? ఆ పథకం అమలు జరుగుతుండగానే 'వెలుగు' పథకాన్ని పట్టణాల్లో చేపట్టడానికి మళ్లీ రుణం తేవాల్సిన అవసరం ఎందుకు వచ్చింది? ఎంకి పెళ్లి సుబ్బి చావుకు వచ్చిందన్నట్లు ప్రపంచబ్యాంకు నుంచి రుణం తీసుకొనే నిర్ణయాన్ని సమర్థించటానికి రోశయ్య నానా అవస్థలు పడుతున్నారు. ఒకసారి న్యాయమైన షరతులనే అంగీకరిస్తామంటారు. 'మరోసారి అబ్బే రుణాలేవీ తీసుకోలేదు. అలాంటప్పుడు షరతులను అంగీకరించడం అనే ప్రశ్నే ఉదయించదంటారు.' ఇంకోసారి 'ప్రపంచ బ్యాంకు నుంచి రుణాలు తీసుకోవాల్సి వస్తే రాష్ట్రం షరతుల మేరకే తీసుకుంటామంటారు. చంద్రబాబు అవలం బించిన విధానాన్నే ఈ ప్రభుత్వమూ అనుసరిస్తుందన్న సత్యాన్ని మరుగుపరచడానికి ఇద్దరూ ఎంత అవస్థపడుతున్నారో ఇది తెలియచేస్తుంది.

షరతులతో అప్పు తీసుకున్న వారే 'అబ్బే షరతులేమీ లేవే' అని అంటూంటే ఆ బ్యాంకు అధ్యక్షుడు వుల్ఫోవిజ్ ఎంతో సంతోషించి ఉండాలి. సద్దాం హుస్సేన్ మారణాయుధాలను గుట్టలు గుట్టలుగా దాచాడని పచ్చి అబద్ధాలు ఆడిన గుండెలు తీసిన బంటు ఈ వుల్ఫోవిజ్. షరతులు అంగీకరించి కూడా లేదని పెద్ద అబద్ధమాడింది మన ప్రభుత్వం. అందుకే ప్రపంచబ్యాంకు పచ్చజెండా ఊపింది. అడిగిన రుణ సహాయానికి ఓకే అన్నాడు. రకరకాల పథకాల కోసం రూ. 7500 కోట్లు రుణ సహాయం అడిగితే ఇంతేనా అన్నట్లు ప్రవర్తించాడు. చంద్రబాబు ప్రపంచబ్యాంకుతో 90వ దశాబ్దం ఉత్తరార్థ కాలంలో రుణం తీసుకొన్నప్పుడు రుణం తీసుకోనిదే అభివృద్ధి సాధించలేమని దాపరికం లేకుండా చెప్పారు. షరతులు లేకుండా రుణం ఎవరు ఇస్తారు అని రుణం తీసుకోవటాన్ని సమర్థించుకున్నారు. ఇంత తక్కువ వడ్డీకి రుణం ఎవరిస్తారని, అందుకే అప్పు చేస్తున్నానని చెప్పుకున్నారు. నేటి నాయకులూ అదే పని చేస్తున్నారు. ప్రపంచబ్యాంకుతో చంద్రబాబు మొదట ఒప్పందం చేసుకొన్నప్పుడు భారీ ప్రాజెక్టులు నిర్మించుకోవాలంటే రైతుల వద్దనుంచే వసూలు చేసి కట్టుకోవాల్సి ఉంటుందని బ్యాంకు తెగేసి చెప్పింది. అందుకనే కాబోలు అప్పటి ముఖ్యమంత్రి నీటిపారుదల పథకాల మీద శ్రద్ధ పెట్టలేదు. కాని నేడు ఆ ప్రపంచబ్యాంకే ఆ పథకాలకు రుణం ఇస్తానని అంటోంది. ఎందుచేత? బ్యాంకుకు బుద్ధొచ్చిందా? అదేమీ లేదు. 46 వేల కోట్ల ఖర్చుతో ప్రాజెక్టులను ఐదు ఏళ్లలో నిర్మిస్తానని ప్రజలకు ప్రస్తుత ముఖ్యమంత్రి పెద్ద వాగ్దానం చేసి అందుకు కావాల్సిన నిధుల కోసం గిలగిలలాడడం చూసి, ఇదే సరైన సమయమని బ్యాంకు గ్రహించి వల విసిరింది. అందుకనే కొత్తగా బ్యాంకు అధ్యక్షపీఠం ఎక్కిన ఉల్ఫోవిజ్ కొద్ది వారాల్లోనే పరుగెత్తుకొని వచ్చాడు. ప్రపంచబ్యాంకుకు, ప్రైవేటీకరణకు విడదీయరాని బంధం. ఆంధ్రప్రదేశ్‌ను ఒక ప్రయోగశాలగా తీసుకుంది. ప్రముఖ బ్రిటిష్ కాలమిస్ట్ జార్జిమోనిబోయిట్ మాట్లాడుతూ భారతదేశాన్ని మళ్లీ ఒక కాలనీగా మార్చటానికి, ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరించి బ్రిటిష్ కంపెనీలకు ఆ సంస్థలను ఆహారంగా వేయాలని, ఈ ప్రయత్నాన్ని డిఎఫ్ఐడి సంస్థ ద్వారా కొనసాగిస్తుందని ఆరోపించారు. ఈ సంస్థ అప్పు ఇవ్వదు, నేరుగా డబ్బు ఉచితంగానే నిర్దేశిత పథకాలకు ఇస్తుంది. ఉచితమనే ఎరవేసి, మన దేశాన్ని వలలోకి లాక్కుంటుంది. గత కొద్ది సంవత్సరాల్లో అనేక పంచదార ఫ్యాక్టరీలను ఇతర పరిశ్రమలను ప్రైవేటీకరించేలా చేసింది ఈ సంస్థే. అందుకు బోలెడంత డబ్బు పోసి విదేశీ సలహాదారులను నియమించింది. ఇది సంస్కరణలను ప్రవేశపెట్టడమే. బ్రిటన్‌లో కూడా మంచినీటి సరఫరాను, రైల్వే మార్గాలను ప్రైవేటీకరించి ముఖం వాచి పోయేటంత ఎదురుదెబ్బ తిందని బ్రిటన్ అనుభవాన్ని ఉటంకించారు.

ఈ ప్రపంచబ్యాంకు మనదేశంలోకి చొరబడడానికి కేంద్రం అన్ని రకాల సౌకర్యాలు కల్పించింది. ఉదాహరణకు ప్రపంచబ్యాంకు విషయాలను రాజ్యాంగ కోణంలో నుంచి అధ్యయనం చేసిన పీమ్ సంస్థ అధ్యక్షుడు పి.వి.ఆర్. భాస్కర్‌రావు ప్రకారం ప్రపంచబ్యాంకు నుంచి నేరుగా రుణం తీసుకొనే హక్కు రాజ్యాగం 292 అధికరణ ప్రకారం రాష్ట్ర ప్రభుత్వానికి లేదు. కేంద్ర ప్రభుత్వానికే ఆ హక్కు ఉంది. ఆ ఒప్పందం మీద కేంద్రం సంతకం చేసినా, దానిని అమలు పరుస్తానని రాష్ట్ర ప్రభుత్వం సంతకం చేసినా కూడా రాజ్యాంగ విరుద్ధమే. అయినా ప్రపంచబ్యాంకు నేరుగా ఒక రాష్ట్రంతో సంబంధం పెట్టుకోవడం, సంప్రదింపులు జరుపుతుంటే కేంద్రం ఎలా అంగీకరించింది? బ్యాంకు ఇచ్చే రుణం కేంద్రం ద్వారానే వస్తుంది. కాబట్టి కేంద్రానికి ఎటువంటి షరతులనైనా రాష్ట్ర ప్రభుత్వం మీద విధించే అధికారం ఉంది. కాని ప్రపంచబ్యాంకు రాష్ట్ర ప్రభుత్వంతో చర్చల సందర్భంలో షరతులన్నీ విధించి ఒప్పిస్తుంటే కేంద్రం గుడ్లప్పగించి చూడటమేమిటి? అయితే ఇప్పుడా అడ్డంకిని కేంద్ర ప్రభుత్వం తొలగించింది. చంద్రబాబు ప్రభుత్వం ఈ స్వతంత్రం కావాలనే కోరారు. 12వ ఫైనాన్స్ కమీషన్ చంద్రబాబు కోర్కెను తీర్చిందా అన్నట్లు రాష్ట్ర ప్రభుత్వాలు నేరుగా మార్కెట్ నుంచి అప్పులు చేయవచ్చు, తీర్చే బాధ్యత కూడా రాష్ట్రాలదే అని చేసిన సిఫార్సును కేంద్రం అంగీకరించింది. ఇక ముఖ్యమంత్రి నేరుగా రుణం తెచ్చుకోవచ్చు.

తాము సూచనలు మాత్రమే చేస్తామని, పరిపాలనా వ్యవహారాల్లో జోక్యం చేసుకోవటం లేదనటం ప్రపంచబ్యాంకు అబద్ధాల ఫ్యాక్టరీలో తయారయిన మరో అబద్ధం. భాస్కర్‌రావు గారి మాటల్లోనే వినండి. 'ప్రపంచబ్యాంకు ఆదేశాలకు తలవంచి గత ప్రభుత్వం ఏర్పరిచిన సుపరిపాలనా కేంద్రం చాలా వంకలతో కూడినది. దీనికి బ్రిటిష్ ప్రభుత్వం తరపున డిఎఫ్ఐడి నుంచి ఆర్థిక సహాయమే కాక వారి కన్సల్టెంట్‌లు కూడా ఉంటారు. వారికి వేలవేలకు జీతాలు ఇచ్చి బడ్జెట్ తయారీ, ఆడిటింగ్, ఆర్థిక లావాదేవీల జవాబుదారీ వంటి విషయాలలో దారి చూపించే బాధ్యతను అప్పగించింది గత ప్రభుత్వం. ఈ బాధ్యతలన్నీ ప్రపంచబ్యాంకుకు అనుగుణంగానే జరగాలి. అంటే రాష్ట్ర ఆర్థిక విధానాల్లో తేవాల్సిన మార్పులు బ్యాంకు ఆదేశాల ప్రకారమే జరుగుతాయి. రాష్ట్ర బడ్జెట్ కూడా బ్యాంకు నిర్దేశించినట్లే రూపొందించాలి'. ఇది మన పరిపాలనా విషయాల్లో జోక్యం చేసుకోవటం కాదా? అని ముఖ్యమంత్రిని ప్రశ్నిస్తున్నా. మరో

ఉదాహరణ: గత ఆరేడేళ్లుగా కాల్వల ద్వారా ప్రభుత్వం సరఫరా చేసే సాగునీటిపై యూజర్ ఛార్జీలు వసూలు చేయాలని, అందుకోసం జలనియంత్రణ సంస్థ నొకదానిని ఏర్పాటు చేయాలని బ్యాంకు చెవినిల్లు కట్టుకొని పోరుతున్నా, నీటి వినియోగదారుల సంఘాలని ఏర్పాటు చేయటం దాటి అప్పటి ప్రభుత్వం అంతకు మించి పోలేదు. ఈ ప్రభుత్వం నాగార్జునసాగర్ ఆయకట్టు ఆధునీకరణకు మూడు వేల కోట్ల రూపాయల రుణం ఇవ్వాలని చేసిన కోర్కెను అవకాశంగా తీసుకొని, తాను ప్రతిపాదించిన జలనియంత్రణ సంస్థ ఏర్పాటు చేస్తానని ముఖ్యమంత్రి చేత ఒట్టేయించుకొని రుణానికి క్లియరెన్స్ ఇచ్చింది. ఈ నెలలో ప్రపంచబ్యాంకు ఒప్పందంతో ప్రభుత్వం చర్చలు జరిపింది. రాష్ట్రంలో ఉన్న చిన్న, మధ్య, భారీ ప్రాజెక్టులు, చెరువులు అన్నీ ఈ సంఘం అధీనంలోకి తేవాలని; నీటి తీరువా, యూజర్ ఛార్జీల వసూలు ఈ సంస్థ ఆధ్వర్యంలో ఉండాలని, ఆ విధంగా కొంత మేరకైనా ప్రాజెక్టుల నిర్మాణ ఖర్చులు రాబట్టాలని; ఎలాంటి పంటలు, ఎలాంటి నేలలో వేయాలనేటటువంటి అంశాలపై అజమాయిషీని కూడా ఈ సంస్థకు అప్పగించాలని బ్యాంకు చేసిన సూచనలను ప్రభుత్వం పరిశీలిస్తుందని వార్త. అంటే మొత్తం నీటి పారుదల శాఖ బరువు బాధ్యతలన్నీ బ్యాంకు పర్యవేక్షణలో పనిచేస్తే ఈ సంస్థ చేతుల్లోకి వెళ్లిపోతాయన్నమాట. ఇపుడు రైతులు తమ కష్టాలను, కోర్కెలను ప్రభుత్వానికి చెప్పుకోవటానికి, చేయించుకోవడానికి అవకాశం ఉంది. ఈ సంస్థ ఏర్పడితే రైతుల హక్కులు అంతే సంగతులు. రెండో పక్క పంట భూమిని సొంతం చేసుకొనడానికి బహుళజాతి సంస్థలు, కార్పొరేట్‌లు పావులు కదుపుతున్నాయి. అది జరిగినపుడు ఇటు భూమి, అటు నీరు రెండింటి మీద అజమాయిషీ బ్యాంకుదే; ప్రభుత్వానిది కాదు.

ఎన్నికల ముందు బ్యాంకు ఆదేశిత విధానాలను అనుసరిస్తున్న చంద్రబాబు మీద గుడ్లు ఉరిమిన రాజశేఖరరెడ్డి అధికారంలోకి వచ్చిన వెంటనే దేశంలో బ్యాంకు ప్రతినిధిని ఢిల్లీ వెళ్లినపుడు కలిసివచ్చారు. ఉచిత విద్యుచ్ఛక్తి నిర్ణయంపై బ్యాంకు ప్రతినిధి అధికారికంగానే అసంతృప్తిని వ్యక్తం చేసినప్పుడు, ఆ విషయాన్ని పత్రికా ప్రతినిధులు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకుని రాగా 'మా ప్రాధాన్యతలు మాకూ ఉన్నాయి' అని పెడసరంగనే జవాబిచ్చారు. బ్యాంకు తన విధానాలను సమీక్షించుకోవాల్సి వస్తుందని బెదిరిస్తే, సమీక్షించి ఏం చేస్తారని ముఖ్యమంత్రి ఎదురు ప్రశ్న వేసారు.' రాష్ట్రానికి నిధులు సమకూర్చే పని నుండి బ్యాంకు వైదొలిగితే రాష్ట్రానికి ఎంత నష్టమో బ్యాంకుకు కూడా అంతే నష్టమని చురక అంటించారు. ప్రపంచబ్యాంకు అప్పు కోసం ప్రజలకు ఇబ్బంది కల్గించే షరతులను అంగీకరించబోనని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. అయితే అదే సమయంలో బ్యాంకు ప్రతినిధి వస్తే అతనితో రహస్యంగా కలుసుకున్నారు. ఉచిత విద్యుత్ నిర్ణయం అమలు పరిస్తే రాష్ట్రాలకిచ్చే రుణాల గురించి పునఃపరిశీలిస్తామని బెదిరించిన బ్యాంకు కూడా కాస్త వెనక్కు తగ్గి ఉచిత విద్యుత్ విషయంలో ప్రభుత్వ వైఖరి ఎలా ఉన్నా మిగతా పథకాలకు రుణాలు కొనసాగుతాయని ప్రకటించాల్సి వచ్చింది. ఇలా వెనక్కు తగ్గడానికి కారణం ఏది ఏమైనా రాష్ట్రంలో సంస్కరణలు కొనసాగుతాయని ముఖ్యమంత్రి హామీ ఇవ్వడమేనని అప్పట్లో పత్రికల్లో వార్తలొచ్చాయి. మామూలుగా సమాజంలో ఇద్దరు వ్యక్తులు విభేదిస్తే రాజీకి వచ్చే ప్రసక్తి లేదని భీష్మించుకునేవారు. కాని చర్చల్లో బెట్టు సడలించి రాజీ చేసుకున్నట్టే ఇటు ముఖ్యమంత్రి అటు బ్యాంకు ప్రతినిధి కాస్త కారంకారంగానే విసుర్లు విసురుకున్నా, తర్వాత ఇద్దరూ వాస్తవ పరిస్థితులతో రాజీపడ్డారు.

నిజస్వరూపం:

నవమారు నూరు దేశాల మీద ఆర్థిక పెత్తనం చెలాయిస్తూన్న, రెండు చేతుల్తో వడ్డీ వ్యాపారం చేసి దోచుకుంటున్న ప్రపంచ బ్యాంకును తేలిగ్గా కొట్టి పారవేసేటంత అమాయకులేమీ కాదు మన ముఖ్యమంత్రి. ప్రతిపక్ష నాయకునిగా వున్నప్పుడు ప్రపంచబ్యాంకు కుట్రలు గురించి పత్రికల్లో వచ్చిన వ్యాసాలు బాగానే అవుపోసన పట్టారు. ఆయనకు అన్నీ తెలుసు. అయినా ఇలా మాట్లాడుతున్నారంటే, ఆ అమాయకత్వం అంతా ఒక నటన. బ్యాంకు నుంచి చంద్రబాబును మించి రుణం తీసుకోవటంలో తాను తప్పు చేస్తున్నానన్న విషయం ఆయనకు తెలుసు ఆ తప్పిదాన్ని కప్పి పుచ్చుకోవడానికే ఇలా అమాయకత్వాన్ని ఎన్‌టిఆర్ కన్నా బాగానే నటిస్తున్నారు. అమెరికన్ సామ్రాజ్యవాదుల దోపిడీ విధానాలకు ప్రపంచబ్యాంకు అనధికార ప్రతినిధిగా పనిచేసి ప్రపంచాన్నంతటిని తానే పరిపాలించాలనే అమెరికా లక్ష్యాన్ని ఆచరణలో సాధించేందుకు పని చేస్తుంది ప్రపంచబ్యాంకు. ఉదాహరణకు ఈ బ్యాంకుకు ప్రధాన ఆర్థిక సలహాదారునిగా 33 సంవత్సరాలు పనిచేసిన డా. ఆల్బర్ట్ వాటర్‌స్టన్ బ్యాంకు నిజస్వరూపాన్ని ఇలా వెల్లడించారు. 'ఆ రోజుల్లో ప్రపంచ బ్యాంకులో పనిచేస్తున్న మేము తలబిరుసుగా వ్యవహరిస్తూండేవాళ్లం. వర్ధమాన దేశాల్లో పెక్కు దేశాలు చాలా చిన్నవి కాగా, మేమో వాషింగ్టన్ నుంచి ఊడిపడ్డవాళ్లం. అప్పట్లో మా ఉద్దేశ్యం వాషింగ్టన్ (అమెరికా) అంటే ప్రపంచ నాగరికతకే కేంద్రం అని, మేం కుబేరులమనే ఆలోచనలతో మేము మహా తెలివిగల వాళ్లమనుకొనే వాళ్లం. అన్నింటికన్నా ఘోరం, మేము పనిచేసిన వర్ధమాన దేశాల్లోని ప్రజలు మేం ఏం చెబితే అది నమ్మి కూర్చొన్నారు. లేదా మారు మాట్లాడకుండా మౌనం పాటించేవారు ఎందుకని? వారికి తమ మీద తమకే విశ్వాసం లేదు. అటువంటి వారిపై అధికారాన్ని ఎవరు వదలుకొంటారు?' మరొక ప్రపంచబ్యాంకు సలహాదారుడు డా.డేవిసన్‌బుధూ వర్ధమాన దేశాల్లో బ్యాంకు అమలు జరిపిన ప్రజా వ్యతిరేక 'సంస్కరణల' ఫలితంగా బ్యాంకు అధికారులుగా తమ చేతులు ప్రజల దారిద్ర్యాన్ని పెంచటం ద్వారా అక్షరాస్యతకు, ఆహారభద్రతకు వారిని దూరం చేయటం ద్వారా రక్తసిక్తమై పోయామని, పాప పంకిలమైన ఈ చేతుల్ని కడగడానికి ప్రపంచంలోని సబ్బులన్నింటినీ తెచ్చినా' ఆ పాపపు మరకలు తొలగిపోవని రాశాడు. మరో అధికారి స్టిగ్లిజ్ అమెరికా ప్రపంచీకరణ ద్వారా తలపెట్టిన ప్రపంచదేశాల ఆర్థిక వ్యవస్థల 'ప్రైవేటీకరణ' పథకాన్ని లంచగొండీకరణగా అభివర్ణించారు. ప్రపంచబ్యాంకు దుష్టబుద్ధిని నిరూపించడానికి ఇవి కొన్ని ఉదాహరణలు మాత్రమే.

ప్రపంచబ్యాంకు దేశాన్నే అప్పుల్లో ముంచేసింది, మన రాష్ట్రం ఒక లెక్కా? ఇప్పటికే కేంద్రానికి 124 బిలియన్ డాలర్ల రుణాన్ని తన విధానాలను కేంద్రం నెత్తిన రుద్దింది. ఇప్పుడు రాష్ట్రాల పీకలు నొక్కితే, అవి కూడా కాళ్ల బేరానికి వస్తాయి. రాష్ట్రాలు ఎంత ఎక్కువగా ఆర్థిక దుస్థితిలో ఉంటే ప్రపంచబ్యాంకుకు అంత సంతోషం. ఎందుచేతనంటే అలా సంక్షోభంలో పడితే, అప్పు కోసం తన వద్దకు వస్తాయి. మరింతగా పెత్తనం చెలాయించవచ్చనేది ప్రపంచబ్యాంకు కుట్రపూరిత ఆలోచన. మన ముఖ్యమంత్రి రాష్ట్ర శక్తికి మించిన వాగ్దానాలు చేసి, వాటిని అమలులోకి తీసుకొని రావడానికి నిధుల కొరతలో గిలగిలలాడుతుంటే, ఉచిత విద్యుత్ సంగతి తర్వాత చూసుకోవచ్చు ముందు ముఖ్యమంత్రిని వలలోకి లాగాలనే ఆలోచనతోనే ఇంకా ఇంకా అప్పు ఇస్తాం అంటూ బ్యాంకు తన సంసిద్ధతను చూపుతోంది. అదికాక ముఖ్యమంత్రి ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న ఉచిత విద్యుత్, యూజర్ ఛార్జీలు విధిగా వసూలు చేయాలనే తమ విధానానికి వ్యతిరేకమైనదని గ్రహిస్తూనే ప్రపంచబ్యాంకు దురాలోచన చేసింది. ఈ విషయంలో తెగేదాకా లాగితే, పుటుక్కున తెగుతుంది. తామిచ్చిన రుణం తిరిగి రాబట్టుకోవడానికి నానా అవస్థలు పడాలి అని భావించి ఉచిత విద్యుత్ సమస్యకు వెనుక బెంచీల్లో కూర్చోబెట్టింది. సమయం వచ్చినప్పుడు ఉచిత విద్యుత్ పథకానికి తూట్లు పొడవచ్చునని ప్రపంచబ్యాంకు భావించింది. ఇపుడు ఆ సమయం రానే వచ్చింది. ఆహార ధాన్యాలు రెండో పంటలో పండిస్తే ఉచిత విద్యుత్ లభించదని ప్రభుత్వం చేసిన ఉచిత విద్యుత్ ప్రకటనకు పెట్టిన మొదటి కన్నం. ప్రపంచబ్యాంకు ప్రతినిధులు రాష్ట్రంలో పర్యటిస్తూ ప్రభుత్వంతో చర్చలు జరుపుతున్న సమయంలోనే ఈ నిర్ణయం వెలువడడం గమనార్హం. వ్యవసాయానికి ఉచిత విద్యుత్ లభించదనేది చాలా చిన్న విషయం. మొత్తం వ్యవసాయానికి ఎసరు పెట్టే కార్యక్రమాన్ని ప్రపంచ ప్రపంచబ్యాంకు చేవట్టి అంచెలంచెలుగా అమలు వరిచేలా చేస్తోంది. వ్యవసాయరంగంలో సంక్షోభం గురించి ప్రపంచబ్యాంకుకు సంబంధించినంత వరకూ నేనిక్కడి ప్రస్తావించదలచుకొన్నా.

అమెరికా, తదితర అభివృద్ధి చెందిన దేశాలలో పండించే పంటకు మార్కెట్ కావాలి. ప్రపంచ దేశాల వైపు దృష్టి సారించింది. వాళ్లకు మనదేశం కనిపించింది. కాని మనదేశం సస్యవిప్లవం ప్రారంభించినప్పటి నుంచి స్వయం సమృద్ధి వైపు పయనిస్తోంది. ఇటీవల తిండి గింజలు ఎగుమతి చేస్తోంది కూడా. అలాంటి దేశానికి తిండి గింజలు ఎగుమతి చేయడం ఎలా? ఆలోచించింది. అసలు వ్యవసాయాన్ని పడుకోబెట్టేస్తే? ఆహారధాన్యాల కొరత ఏర్పడుతుంది. అప్పుడు స్వేచ్ఛగా మన దేశానికి ఎగుమతి చేయవచ్చు. 104 కోట్ల ప్రజలు ఉన్న మనదేశం ఓ పెద్ద మార్కెట్. ఈ ఆలోచన అమలు పరచటానికి పావులు కదపటం ప్రారంభించింది. 1991లో ప్రవేశపెట్టిన సంస్కరణలో భాగంగా వ్యవసాయానికి మన దేశ బడ్జెట్‌లలో పెట్టుబడులు పెరగకుండా తగ్గిస్తూ వచ్చేలా మనదేశ పాలకులను మెడలు వంచి ఒప్పించింది. దేశంలో ఆర్థిక శాస్త్రవేత్తలు నెత్తిన నోరు పెట్టుకొని కేటాయింపులు పెంచండి, పెంచకపోతే చిక్కుల్లో పడుతాం అని హెచ్చరిస్తూ వచ్చినా పెడచెవిన పెడుతూ వచ్చింది. ఉత్పత్తి, ఉత్పాదకత తగ్గింది. స్థూల జాతీయాదాయంలో వ్యవసాయం వాటా తగ్గిపోతూ వచ్చింది. వ్యవసాయం సంక్షోభంలో పడితే దేశం మొత్తం ఆర్థిక పరిస్థితి తలకిందులవుతుంది. ప్రపంచబ్యాంకుకు కావాల్సింది సరిగ్గా అలాంటి పరిస్థితే. ఎందుచేతనంటే దేశం, రాష్ట్రం మళ్లా, అప్పుల కోసం తన వద్దకే వస్తుంది. తిండి గింజల కోసం తనవైపు చూడాల్సి వస్తుంది. తమకు కావాల్సిన మార్కెట్ లభిస్తుంది. ఈ వ్యూహంలో భాగంగానే రైతులకు ప్రభుత్వం ఇస్తున్న సబ్సిడీలను తగ్గించమని వత్తిడి తీసుకొని వచ్చి సాధించింది. దీనితో రైతు వ్యవసాయ ఖర్చు పెరిగింది. వ్యవసాయానికి బ్యాంకులు అప్పులు సరిగ్గా ఇవ్వకుండా బ్యాంకింగ్ రంగ సంస్కరణలు ప్రవేశపెట్టేలా చేసింది. ఆ సంస్కరణల నివేదిక ప్రకారం బ్యాంకులిచ్చే మొత్తం రుణంలో వ్యవసాయానికి 10% మాత్రమే రుణసౌకర్యం కల్పించాలని సిఫారసు చేసింది. ప్రభుత్వ నిర్ణయం 18% ఇవ్వాలనే నిర్ణయం మార్చుకోబోమని అంటూనే ఆచరణలో 10 శాతానికి తగ్గించింది. దీనితో రైతు మరో మార్గం లేక వడ్డీ వ్యాపారస్తుని వద్దకు వెళ్లటంతో ఖర్చులు మరింత పెరిగాయి. అప్పు చెల్లించలేక ఆత్మహత్యలకు పాల్పడ్డాడు. బతికి ఉంటే బలుసాకు తినివచ్చుననుకొని పట్టణాలకు వలస పోవటం ప్రారంభించారు. సరిగ్గా ఈ అదను చూసుకొని ప్రపంచబ్యాంకు ఇంకో అస్త్రాన్ని సంధించింది. 'ఎకరం, అరెకరం, రెండెకరాలు సాగుచేస్తూ మీరిలా ఎన్నాళ్లు బతుకుతారు? ధాన్యం కన్నా ఎక్కువ ఆదాయం వచ్చే వ్యాపార వంటలు, పళ్లు, పూవులు లాంటివి పండించండి. మేము మీకు అప్పిస్తాం, విత్తనాలు ఇస్తాం, ఎలా పండించాలో చెప్తాం. పండించిన తర్వాత మీ పంట మేమే కొనుక్కుంటాం.' అంటూ రైతాంగానికి బహుళజాతి సంస్థలు, కార్పొరేట్ సంస్థల ద్వారా ఆశ చూపారు. ఒక బంగారు భవిష్యత్తును వారి ముందు ఆవిష్కరించారు. దీపాన్ని చూసి రెక్కల పురుగులు ఎలా ఆకర్షించబడతాయో అలాగే ఈ భవిష్యత్తును కూడా ఊహించుకొని రైతులు ఆ వలలో చిక్కితే అంతే సంగతులు. ఎలాగంటారా? ఆ సంస్థలు ప్రవేశపెట్టే ఆధునిక వ్యవసాయ పద్ధతులు హెచ్చుగా రసాయనిక ఎరువుల మీద ఆధారపడి ఉంటాయి. రెండో మూడో సంవత్సరాలు పంట బాగా వస్తుంది. ఆ తర్వాత ఉత్పత్తి తగ్గుతూ వస్తుంది. క్వాలిటీ పడిపోతుంది. పండించి తీసుకొని వెళ్లిన పంటను కొనడానికి నిరాకరిస్తారు. భూసారం తగ్గిపోతుంది. రైతు ఏమౌతాడు? నెత్తిన చెంగేసుకొని పట్టణాలకు వలసపోతాడు. చిన్న, సన్నకారు రైతుల భూములను కొనేసే పద్ధతి ప్రవేశపెట్టి కార్పొరేట్ సంస్థలు వ్యవసాయ రంగాన్నే కబళిస్తాయి. ఎగుమతులకు వీలయ్యే పంటలు పండించి, ప్రాసెస్ చేసి, డబ్బాల్లో సీల్ చేసి ఎగుమతి చేసి లాభాలు పోగేసుకుంటారు. ఆధునిక వ్యవసాయ పద్ధతులు ప్రవేశపెట్టాలంటే గ్రామాలకు మంచి రోడ్లు ఉండాలి. మంచి వైద్య సౌకర్యాలుండాలి. చదివే శక్తి ఉండాలి. ప్రపంచబ్యాంకుది చాలా దూరదృష్టి. అందుకనే రాష్ట్రానికి మొదటిసారి రుణం ఇచ్చినపుడు, ఆ రుణాన్ని విద్య, వైద్య రహదారి సౌకర్యాలను మెరుగుపరిచే షరతుల మీదే ఇచ్చింది. పట్టణాలలో, నగరాలలో ఇప్పటికే

ప్రపంచబ్యాంకు మధ్యతరగతి ప్రజలను ఆకర్షించింది. ఇపుడు గ్రామ సీమలను కూడా ఆ వలలోకి లాగుతుంది. మన రాష్ట్ర మంత్రులు బ్యాంకు పథకాలను అమలుపరిచే పెద్ద గుమస్తాలు అవుతారు. సరిగ్గా చదువుసంధ్యలు లేని చిన్న, సన్నకారు రైతులకు ఈ కుట్రల గురించి తెలియజేయాలి. వారిలో చైతన్యాన్ని కలిగించాలి.

రుణభారం:

ప్రపంచబ్యాంకు రుణాలిస్తున్నది వడ్డీ డబ్బుల కోసమే. ప్రపంచబ్యాంకు వద్ద డబ్బు ఆకాశాన్నుంచేమీ ఊడిపడలేదు. అమెరికాలో డబ్బు మూలుగుతోంది. అయితే అక్కడ వడ్డీ సుమారు రెండు శాతమే. అందుచేత తమ డబ్బును ప్రపంచబ్యాంకుకు ఇచ్చి, కాస్త ఎక్కువ వడ్డీ వచ్చే మార్గం చూపమని కోరారు. ఆ నిధులను ప్రపంచబ్యాంకు వడ్డీకి తిప్పుతుంది. ఈ రుణాలతో రాష్ట్రాలు క్రుంగిపోతున్నాయి. మామూలుగా రాష్ట్రాలకు మార్కెట్లో రుణాలు తీసుకొనే అధికారం ఉంది (కేంద్రం అనుమతితో). వివిధ పథకాల అమలుకు కేంద్రం రుణాలిస్తుంది. రాష్ట్ర ప్రభుత్వాలు తమ అధికార పరిధిలో ఉన్న ప్రభుత్వరంగ సంస్థల ద్వారా అప్పులు చేస్తుంది. ఇవన్నీ చాలవన్నట్లు ఇతర దేశాల నుంచి, ప్రపంచబ్యాంకు నుంచి రుణాలు తెచ్చుకుంటుంది. ఇవన్నీ వడ్డీ భారాన్ని పెంచుతున్నాయి. ప్రతీ సంవత్సరం అసలు వాయిదాలతో పాటు వడ్డీ చెల్లిస్తుండాలి. ఇటీవలి సంవత్సరాల గణాంకాల ప్రకారం మన రాష్ట్రం నూరు రూపాయలు రుణం చేస్తే పై చెల్లింపులు పోను చేతికి వచ్చేది కొన్ని సంవత్సరాల్లో 7 రూపాయలు మాత్రమే. అభివృద్ధి కార్యక్రమాల కోసమే అప్పు చేస్తున్నామని ప్రభుత్వం అంటుంది. 7 రూపాయలతో ఏమి అభివృద్ధి సాధిస్తుందో మీకు చెప్పాల్సిన పని లేదు. రిజర్వుబ్యాంకు నివేదిక ప్రకారం, అన్ని రాష్ట్రాలు ఇదే పరిస్థితిలో ఉన్నాయి. ఎప్పుడూ రెవెన్యూ లోటు బడ్జెట్‌లే. 1990-91లో, అంటే సంస్కరణలను ప్రవేశపెట్టిన సంవత్సరంలో అన్ని రాష్ట్రాల రెవెన్యూ పద్దు కింద లోటు రు.5,300 కోట్లు మాత్రమే కాగా, 2003-04 నాటికి 12 రెట్లు పెరిగి రు. 61,236 కోట్లకు పెరిగింది. ప్రపంచబ్యాంకు సంస్కరణలను ఆమోదించిన 1990-91 ముందు రాష్ట్రాలు రెవెన్యూ పద్దు కింద మిగుళ్లు చూపాయి. 1990-91లో ప్రపంచబ్యాంకు దేశంలో అడుగుపెట్టింది; లోటును అప్పులతో పూడుస్తున్నారు. అందువల్ల అటు కేంద్రం, ఇటు రాష్ట్రాలు 1990-91/2003-04 మధ్య కాలంలో అంతర్గత రుణం, విదేశీ రుణం కలిపి ఐదు రెట్లు పెరిగింది. అప్పు పెరిగితే వడ్డీ పెరుగుతుంది. మన రాష్ట్రం ప్రతిరోజుకు రు. 20 కోట్లు పైగానే వడ్డీ చెల్లిస్తుంది. ఈ అప్పులు చాలావన్నట్లు ప్రస్తుత ప్రభుత్వం మరో రు. 1600 కోట్ల సంస్థాగత రుణం, రు. 1200 కోట్ల పట్టణాభివృద్ధి రుణం, నాగార్జునసాగర్ ఆధునీకరణకు రు. 3000 కోట్ల రుణం కావాలని ప్రపంచబ్యాంకుకు అప్లికేషన్ పెట్టుకుంది. ఇది చంద్రబాబు ఎనిమిదేళ్లలో బ్యాంకు నుంచి తెచ్చిన రుణం కన్నా ఎక్కువే. ఆర్థికమంత్రి ఈ విమర్శకు జవాబిస్తూ చంద్రబాబు తెచ్చిన రుణం అనుత్పాదక వ్యయం అయితే, తాము ఉత్పాదకతకు తోడ్పడే రుణం అని సమర్థించుకున్నారు. ఇది వాస్తవమా? ఉదాహరణకు మున్సిపాలిటీలకు బ్యాంకు ఇచ్చే రు. 1200 కోట్ల రుణం పట్టణాల్లో, నగరాల్లో మంచి నీరు, రహదారుల్లాంటి మౌలిక సౌకర్యాల కోసం ఖర్చు కానుంది. ఇవి ఉత్పాదకతకు నేరుగా ఎలా తోడ్పడతాయి? అప్పు తిరిగి చెల్లించటానికి మౌలిక సౌకర్యాల నుంచి ఆదాయం ఎలా వస్తుంది? అయినా ప్రపంచబ్యాంకు ఎందుకు అప్పు ఇస్తుంది? నేను ఇదివరకే చెప్పినట్లు, బహుళజాతి సంస్థలు పెద్ద ఎత్తున వ్యవసాయరంగంలో ప్రవేశించటానికి పథకాలు తయారు చేస్తున్నాయి. వ్యవసాయ ఉత్పత్తులను ప్రాసెస్ చేసే ఫ్యాక్టరీలను ఆ గ్రామీణ ప్రాంతాల్లోనే నెలకొల్పాలి. వాళ్ల ఫ్యాక్టరీల్లో కొంచెమైనా చదివే శక్తి గలవారు కావాలి. అందుకోసం వాళ్లకు మంచి రహదారులు, విద్యా అవకాశాలు కావాలి. అందుకోసం అప్పు ఇస్తున్నారు తప్ప మనలను ఉద్ధరించడానికి కాదు. ప్రపంచబ్యాంకు తర్వాత రాష్ట్రానికి ఎక్కువ రుణం ఇచ్చేది కేంద్ర ప్రభుత్వం. రాష్ట్రాలతో నిధుల లావాదేవీల్లో వడ్డీ వ్యాపారిలా ప్రవర్తిస్తుందనేది రాష్ట్రాలు చేస్తున్న ఫిర్యాదు. ఉదాహరణకు 1990-91 నుంచి 2003-04 వరకు కేంద్రం తాను తెచ్చే ప్రతి నూరు రూపాయల మీద సగటున 8 రూపాయలు వడ్డీ చెల్లిస్తుంటే రాష్ట్రాల నుంచి 13 రూపాయలు వసూలు చేస్తోంది. రాను రాను కేంద్రం ఇచ్చిన రుణం ప్రతి సంవత్సరం పెరుగుతున్న వడ్డీతో సహా తిరిగి చెల్లించిన రుణం సుమారుగా రెట్టింపు అయిన పరిస్థితి ఉంది. ఉదాహరణకు ఈ క్రింది పట్టిక చూడండి.

కేంద్రం రుణాలు, చెల్లింపులు (కోట్ల రూపాయలు)

సంవత్సరం	కేంద్రం రుణాలు, అడ్వాన్సులు	కేంద్రానికి చెల్లించిన రుణాలు, వడ్డీ
1990-91	13974	9175
1991-92	13069	10257
1992-93	13310	12208
1993-94	14410	14391
1994-95	19252	14047
1995-96	19600	17855
1996-97	23782	21389
1997-98	30771	24608
1998-99	40342	30177
1999-2000	21589	34619
2000-01	18966	37969
2001-02	24660	43128

ప్రపంచీకరణ - రెండు భారతదేశాలు

సి.రాంమనోహర్‌రెడ్డి

(డిసెంబర్ 24, 2005న హైదరాబాద్‌లో ఎకనమిక్ అండ్ పొలిటికల్ వీక్లీ సంపాదకులు చేసిన ఆలంఖుంద్ మీర్ స్మారకోపన్యాసపు పాఠం)

భారతీయ ఆర్థిక వ్యవస్థ గురించి నన్ను ఇబ్బంది పెడుతున్న కొన్ని విషయాల గురించి చర్చించడమే ఈ వ్యాస ఉద్దేశ్యం. ఈ విషయాలు ఏ అధ్యయన ఫలితాలూ కావు, బాగా లోతుగా ఆలోచించినవీ కావు. ఇవి కేవలం భారతీయ ఆర్థిక వ్యవస్థ గురించి నాకున్న కొన్ని చింతలు, మన చుట్టూ జరుగుతున్న దాన్ని అర్థం చేసుకునే ప్రయత్నాలు మాత్రమే. ఆర్థిక వ్యవస్థ గురించి చాలా చర్చ జరుగుతూనే ఉన్నా, మనకి సమగ్ర చిత్రాన్ని అందించే నిశితమైన అవగాహన అందులో అంతగా కనిపించదు.

దాదాపు 20 ఏళ్ల క్రితం అమర్త్యసేన్ 'న్యూయార్క్ రివ్యూ ఆఫ్ బుక్స్'కి ఒక వ్యాసం రాసారు. దాని పేరు 'భారతదేశం ఎలా ఉంది?'. స్వాతంత్ర్యానంతరపు మూడు దశాబ్దాల్లో భారతదేశం ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాల్లో సాధించిన ప్రగతిని ఆ వ్యాసం బేరీజు వేసింది. మన దేశపు ఆర్థిక వ్యవస్థ నిర్వహణ గురించి నాకదే ప్రశ్న ఉంది. ఈ వ్యాసంలో నేను లేవనెత్తే ప్రశ్నలు సేన్ 20 ఏళ్ల క్రిందట అడిగిన ప్రశ్నలలాంటివే. ఈ ప్రశ్నలకి నేనీ వ్యాసంలో సమాధానాలు చెప్పలేకపోవచ్చు కాని, కనీసం ఒక ప్రతిపాదననైనా మీ ముందు ఉంచగలనని ఆశిస్తున్నాను. నా ప్రశ్నలివి - మన దేశం ఏ మేరకు ప్రగతిని సాధించింది? నేడు ఆర్థిక వ్యవస్థలో కనిపిస్తున్న చురుకుదనం, ఆగస్టు 15, 1947 నాడు మనం చేసుకున్న ప్రమాణాలను ఎట్టకేలకు సాధించే స్థితికి మనలని తీసుకువెళ్తోందా'?

ఆర్థిక రంగంలో చాలా పెద్ద ఎత్తున మార్పులు సంభవిస్తున్నాయని, వాటి పర్యవసానాల గురించి మనకింకా పూర్తి అవగాహన లేదనేది నా ప్రతిపాదన. గత నాలుగైదు సంవత్సరాలలో సంభవించిన, సంభవిస్తున్న మార్పులు స్వాతంత్ర్యానంతరం భారత దేశంలో సంభవించిన అతి కీలకమైన రెండు ప్రక్రియలంత ముఖ్యమైనవని నేననుకుంటున్నాను. 1956 తరువాత ఆర్థిక వ్యవస్థ మిశ్రమ, ప్రణాళికా బద్ధమైనదిగా మారడం మొదటి ప్రక్రియ, 1969/1970 లో ఇందిరా గాంధీ 'గరీబీ హటావో' లో భాగంగా ఆర్థిక వ్యవస్థ మార్కెట్ సోషలిజం అవతారం ఎత్తడం రెండవ ప్రక్రియ. ప్రస్తుతం జరుగుతున్న మార్పులు మూడవ ప్రక్రియకి సంబంధించినవి. అందులో రెండు పరస్పర సంబంధమైన క్రమాలు చోటు చేసుకున్నాయి. మొదటిది - భారత ఆర్థిక వ్యవస్థ ప్రపంచ ఆర్థిక వ్యవస్థతో ముడివడడం, రెండవది - వివిధ భాగాల మధ్య, ప్రాంతాల మధ్య, సామాజిక కూటముల మధ్య ఉన్న సంబంధాలలో పగుళ్లు

ఈ పట్టిక మనకు తెలియజేసేదేమంటే సంస్కరణలు ప్రవేశపెట్టినపుడు కేంద్రానికి చెల్లింపులు పోను రాష్ట్రానికి చేరిన నికర రుణం రు. 4800 కోట్లు కాగా 2001-02 నాటికి రాష్ట్రాలే కేంద్రానికి అదనంగా రు. 18,468 కోట్లు చెల్లించటం చూస్తే మన గ్రామాల్లో పేదలు భూ కామందుల వద్ద రుణాలు తీర్చేస్తున్నా ఇంకా జీవితమంతా రుణగ్రస్తుడయిన విషయం గుర్తుకు వస్తుంది. రాష్ట్రాలు పడే ఈ ఇబ్బందులన్నింటికి ప్రపంచబ్యాంకు విధానాలే కారణం.

రిటైల్ వ్యాపారం:

అమెరికాకు, బహుళజాతి సంస్థలకు, ప్రపంచబ్యాంకు, ఐ.ఎం.ఎఫ్, డబ్ల్యూటిఓ లకు మధ్య హద్దు గోడలు లేవు. వీరందరి లక్ష్యం ఒక్కటే. భారతదేశం ఆర్థిక స్వతంత్రాన్ని హరించటం, ఆర్థిక వ్యవస్థను తమ చెప్పుచేతల్లోకి తీసుకోవటం, 104 కోట్ల ప్రజల మార్కెట్ మీద పట్టు సాధించటం, పేదల ప్రాణాలను హరించటం, సరళీకరణ, ప్రైవేటీకరణ, ప్రపంచీకరణ అనే త్రికోణపు ఉచ్చులో భారతదేశాన్ని బంధీ చేయటం. ఇందులో భాగంగా వారి దృష్టి రిటైల్ వ్యాపారం మీద పడింది. వాల్‌మార్ట్ అనే బహుళజాతి రిటైల్ మార్కెటింగ్ సంస్థ పలు దేశాల్లో మన సూపర్ మార్కెట్ల కంటే 100 రెట్లు పెద్దవైన దుకాణాలు (వీటిని ఇంగ్లీష్‌లో మాల్స్ అంటారు) తెరిచి స్థానిక చిల్లర దుకాణాలను పడుకోబెట్టిన సంస్థ. ఈ సంస్థ కన్ను భారతదేశం మీద పడింది. భారత ప్రభుత్వంతో బేరాలు ఆడుతోంది. ఆ కంపెనీ అధికారులు అమెరికా నుంచి అరడజను సార్లు వచ్చి వెళ్లారు. ఈ సంస్థ తన విశ్వరూపాన్ని ప్రదర్శించబోతుంది. ఈ సంస్థ వస్తే, అది గ్రామీణ ప్రాంతాలకు కూడా విస్తరిస్తే మన చిల్లర దుకాణాలన్నీ మటాష్. మన రాష్ట్రానికే పరిమితమై చూసుకుంటే 1998లో రాష్ట్ర అర్థ గణాంక శాఖ ప్రకటించిన గణాంకాల ప్రకారం రాష్ట్రంలో 29 లక్షల దుకాణాలున్నాయి. 75 లక్షల మంది ఈ దుకాణాల మీద ఆధారపడి బతుకుతున్నారు. ఇప్పటికే పట్టణాల్లో రిటైల్ దుకాణాల వ్యాపారాలను ఫుడ్‌వరల్డ్, జెయింట్, లైఫ్‌స్టయిల్, స్పెన్సర్ లాంటి సూపర్ మార్కెట్లు దెబ్బతీయటం ప్రారంభించాయి. వీటిలో చింతపండు నుంచి కంప్యూటర్‌ల వరకూ అన్ని అమ్ముతారు. వాల్‌మార్ట్ లాంటి సంస్థ వస్తే ఈ భారీ మార్కెట్లు ఏమవుతాయో గాని స్వయం సహాయంగా నడుపుకుంటున్న చిల్లర దుకాణాల నడుములు విరగ్గొడుతాయి. ❑

కనిపించడం. ఈ మూడవ ప్రక్రియకి సంబంధించిన మార్పులు మొదటి రెండింటికి సంబంధించిన వాటికంటే చాలా ముఖ్యమైనవని నేననుకొంటాను. ఈ మార్పులు మనకి తెలిసిన భారతదేశపు ఉనికినే ప్రశ్నిస్తాయని, అందుకని మనం ఎటువైపు వెళ్తున్నామనే విషయం గురించి మనమందరం తీవ్రంగా ఆలోచించాల్సిన అవసరముందని నా అభిప్రాయం.

కొన్ని నెలల కిందట నేను హైదరాబాద్‌లో, అంతర్జాతీయంగా ఖ్యాతి వహించిన సామాజిక శాస్త్రవేత్త జోన్ మార్టినెజ్ అలియర్‌ని కలిసినప్పుడు, ఆయన మాటల సందర్భంలో 'భారతదేశం ఇప్పుడు చాలా ఆత్మవిశ్వాసం కల దేశం' అన్నారు. ఆ రోజు మాట్లాడిన మిగతా అన్ని విషయాల కన్నా ఆయన అన్న ఆ ఒక్క వాక్యం నన్ను చాలా ఆలోచించేలా చేసింది, నాలోని సామాజిక శాస్త్రవేత్తని విస్మయ పరచింది. ఎందుకంటే, భారతీయ ఆర్థిక వ్యవస్థ కాని, సమాజం కాని భవిష్యత్తు గురించి ఆత్మవిశ్వాసంతో ఉన్నట్టు నాకు అనిపించలేదు. నా అవగాహనలో లోపం ఏదైనా ఉందా లేక మార్టినెజ్ అలియర్ కొన్ని కోణాలనే చూస్తున్నారా? మనం మహత్తరమైన పరిణామాల అంచున నిలబడ్డామా? ప్రపంచంలోని పత్రికలన్నీ అలాగే అంటున్నాయి. కొన్ని నిర్దిష్టమైన ప్రశ్నలనడిగి మన చుట్టూ జరుగుతున్న దాన్ని అర్థం చేసుకోవాలన్నదే నా ఉద్దేశ్యం. ముందు, నేనడగబోయే ప్రశ్నల హద్దుల్ని నిర్వచిస్తాను. నేను ఆర్థిక వ్యవస్థ 'మార్పు' గురించి మాట్లాడుతున్నప్పుడు చాలా చిన్న పరిధి మాత్రమే తీసుకుంటున్నాను - పెరుగుతున్న ఆదాయాలు, పోషకాహారం, మెరుగైన ఆరోగ్యం, సరిపడినన్ని ఇళ్లు, మంచి విద్య. వీటి కోసం మనం ఏ చేస్తున్నాం? అత్యధిక భారతీయుల కనీస అవసరాలు తీరడానికి సరిపడేంతగా సగటు ఆదాయాలు పెరగడానికి ఏం చేస్తున్నాం? ఆర్థిక వ్యవస్థలో పెద్ద ఎత్తున మార్పులు జరుగుతున్నాయని నేనెందుకనుకుంటున్నానో ఆ వాదనలు ఇప్పుడు మీముందు ఉంచుతాను.

అన్నింటికంటే ముందుగా చెప్పుకోవలసిన విషయమేమిటంటే, మొత్తం మీద తీసుకుంటే, భారత ఆర్థిక వ్యవస్థ చాలా వేగంగా పెరుగుతోంది. ఆర్థిక సంస్కరణలు మొదలు పెట్టిన తర్వాత పదిహేను ఏళ్లుగా, జిడిపి సగటు వృద్ధి రేటు పెరుగుతూ వచ్చిందనేది నిర్వివాదాంశం. ఈ మార్పు 80ల నుంచి వచ్చిందనుకొంటే, 80ల ముందరి మూడు దశాబ్దాలలో జిడిపి వార్షిక వృద్ధిరేటు 3.5 శాతం కాగా, 80ల తర్వాతి 25 సంవత్సరాలలో అది దాదాపు రెండింతలై 5.5 శాతానికి చేరుకుంది.

రెండవ విషయమేమిటంటే, వ్యవసాయం జిడిపిలో 25 శాతం ఉన్నా, అన్నింటికన్నా పెద్ద భాగం సేవారంగానిదే. ఈ సేవారంగంలో అన్ని రకాల పనులు వస్తాయి - ఇంటికి సంబంధించినవి, సాఫ్ట్‌వేర్, హోటళ్లు, రవాణా, బ్యాంకులు, వర్తకం, టెలికమ్యూనికేషన్ మొదలైనవి. జిడిపిలో సేవారంగం శాతం 50కి మించి ఉంది. అందుకే వ్యవసాయం దెబ్బ తిన్నా సేవారంగం బాగానే ఉంటే మన దేశం జిడిపి పెద్దగా దెబ్బతినదు. వ్యవసాయం జిడిపిలో 25 శాతమే ఉన్నా, ఉపాధి కల్పించడంలో మాత్రం 65 శాతం పైనే ఉంటుంది. వ్యవసాయం దెబ్బతింటే జిడిపి పెరుగుదల రేటు దెబ్బతినకపోయినా, వ్యవసాయాధారిత ప్రజల ఉపాధి అవకాశాలు, ఆదాయాలు, ఆదాయ భద్రత అన్నీ దెబ్బతింటాయి.

ఇక మూడవ విషయం - గత రెండు దశాబ్దాల్లో, ముఖ్యంగా గత దశాబ్దంలో భారతదేశం అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న దేశాల్లో ఉంది. 1990ల నుంచి అభివృద్ధిని చూస్తే, చైనా తరువాత భారతదేశమే రెండవ స్థానంలో ఉంది, అంతే కాక మిగతా అభివృద్ధి చెందుతున్న దేశాలకన్నా స్థిరమైన అభివృద్ధి సాధించింది. నాలుగవ విషయం - భారత, చైనాల మధ్య పోలిక. మొత్తం మీద అభివృద్ధి రేటు తీసుకుంటే భారతదేశం చైనా తర్వాతే ఉండవచ్చు కాని, జిడిపి వృద్ధిరేటు, పెట్టుబడుల రేటు, అంతర్జాతీయ పెట్టుబడిని ఆకర్షించడం వంటి వాటిలో చైనా కన్నా చాలా వెనకబడి ఉంది. చివరగా చెప్పుకోవలసిన దేమిటంటే, గత 25 ఏళ్లలో, ముఖ్యంగా గత దశాబ్దంలో, భారతీయ అభివృద్ధిని మొత్తంగా చూస్తే, ఆ వృద్ధి రేటు చాలా ఎక్కువగా ఉంది. గత మూడేళ్లలో ఆర్థిక వ్యవస్థ పెరుగుదల రేట్లు 8.2 శాతం, 6.9 శాతం, ఈ సంవత్సరం 7 శాతం (అంచనా).

మొత్తం మీద చూసుకుంటే, ఆర్థిక వ్యవస్థ బాగానే ఉంది కాని, దాని అర్థం ఏమిటి? ఎట్టకేలకు దారిద్ర్యంలో మగ్గుతున్న మిలియన్ల మందికి దానిలోంచి బయటపడే మార్గం చూపించగలదా? ఈ 15-20 ఏళ్లుగా పెరిగిన ఆర్థిక పరిస్థితి నుంచి ఎవరు లాభపడ్డారు? ఇక్కడే మనం ఇంతదాకా చెప్పుకున్న 'మొత్తాన్ని' విడదీసి చూడాలి. ఇప్పుడు జరుగుతున్న అభివృద్ధి అత్యధిక భారతీయుల జీవితాల్లో పెద్దగా మార్పు తీసుకు వస్తుందని నేననుకోవడం లేదు. లక్షల మందికి అభివృద్ధి ఫలాలు అందలేదు కాని, మధ్య తరగతి భారతీయులు చాలా మందే ఈ అభివృద్ధి నుంచి లాభమూ పొందారు, అభివృద్ధి క్రమానికి దోహద పడ్డారు కూడా. స్వాతంత్ర్యం అనంతరం మొదటిసారిగా వివిధ ఆర్థిక, సామాజిక సమూహాలకి తమ జీవితాలని మెరుగుపరచుకొనే అవకాశం లభించింది. ఐతే, ఈ ఆర్థిక పరమైన మార్పు ఎటువంటిది? దీన్ని ఇలాగే కొనసాగించగలమా? అది అందరికీ వర్తిస్తుందా? ఇంకా, ఇంకా ఎక్కువ ప్రజానీకాన్ని కలుపుకొనే దిశగా దాన్ని విస్తరింపజేయగలమా? ఇలాంటి ప్రశ్నలకి సమాధానాలు చెప్పడంలోనే సమస్యలు మొదలౌతాయి.

జరుగుతున్న మార్పుల విస్తృతిని అర్థం చేసుకోవడానికి ఒక మంచి ఉదాహరణ సాఫ్ట్‌వేర్, బిపీఓ రంగం. ఆర్థికపరంగా ఈ రంగం తెచ్చిన మార్పుల విస్తృతిని, వాటి పరిమితుల్ని అర్థం చేసుకోవడం చాలా ముఖ్యం. ఈ పరిశ్రమ ఇప్పుడు దాదాపు ఒక మిలియను యువతీ, యువకులకు ఉద్యోగాలనిస్తోంది. అందులో, బీపీఓ లోనే 3,42,000 మంది ఉన్నారు. 2001-02లో కేవలం 34,000 ఉండేవారు. ఈ పరిశ్రమలో ఉద్యోగాలు ఏటా 30 శాతం పైనే పెరుగుతున్నాయి. 2005లోనే పెద్ద కంపెనీలన్నీ కలిసి కొత్తగా ఇంకో 50,000 ఉద్యోగాలు కల్పిస్తున్నట్టు ప్రకటించాయి. త్వరలోనే ఈ పరిశ్రమలో దాదాపు మూడు మిలియన్లు పని చేస్తారని, 2010 కి మానవ వనరుల కొరత వస్తుందని అంచనా. ఈ పరిశ్రమలో పనిచేసే యువతీ, యువకులు 'ప్రపంచీకరణ' చెందిన భారతదేశపు ప్రతీకలు.

వాళ్లు బాగా సంపాదిస్తారు, ఖర్చు పెడతారు, రాజకీయాల సిద్ధాంతాలకి దూరంగా ఉంటారు. వాళ్లు చేస్తున్న పనిని విమర్శనాత్మక దృష్టితో చూసేటప్పుడు రెండు విషయాలు గుర్తుంచుకోవాలి - ఒకటి, 20 ఏళ్ల క్రిందట వాళ్లకి ఎలాంటి ఉద్యోగావకాశాలు వచ్చేవి - ఆర్ట్స్ విద్యార్థి ఐతే బ్యాంకు క్లర్కో, ఆఫీసరో, ఇంజనీరైతే ప్రభుత్వరంగ సంస్థలో ఏదో ఒక ఉద్యోగం. దీనితో పోల్చి చూస్తే, ఇవ్వాళ దొరుకుతున్న ఉద్యోగాలు జీతాల రీత్యా, పెరుగుదల అవకాశాల రీత్యా చాలా మెరుగైనవి. ఇక రెండవ విషయం, ఐ.టి. రంగంలో పనిచేయడానికి మధ్య తరగతి, దిగువ మధ్య తరగతి ప్రజలకు ఇదివరకు ఉన్నన్ని అడ్డంకులు ఇప్పుడు లేవు. దీనితో, వాళ్లకి పైకెదిగే అవకాశాలు వచ్చాయి. ప్రధాన నగరాలకే కాక, చిన్న నగరాలకి, పట్టణాలకి చెందిన యువతకి కూడా ఈ రంగంలో ఉద్యోగావకాశాలు ఉన్నాయి.

ఐ.టి., బీ.పీ.ఓ రంగాలు 'నరళీకరణ' చెందిన భారతదేశానికి బలమైన ప్రతీకలు. ఇవే కాకుండా, బాగా పెరుగుతున్న ఇతర రంగాలు ఇవి - టెలికాం, వినోద పరిశ్రమ, మీడియా, ఐ.టి. పరిశ్రమ భారత ఆర్థిక రంగంలో చాలా మార్పులు తెచ్చినా ఒక విషయం గుర్తుంచుకోవాలి. ఈ పరిశ్రమ ప్రతి ఏటా 30 శాతం పైనే పెరుగుతున్నా కల్పించే ఉద్యోగాలు మాత్రం (ఒక మిలియను) వ్యవసాయేతర రంగాల్లో పనిచేస్తున్న 140 మిలియన్లలో ఒక శాతం కన్నా తక్కువే. దీనికి ఇంకో రెండు మిలియన్ల పరోక్ష ఉద్యోగాలని కలిపినా ఈ పరిశ్రమ ద్వారా కలిగే ఉద్యోగాలు వ్యవసాయేతర ఉద్యోగాల్లో 3 శాతం మించవు. అందుకే ఈ రంగం ఎంత వృద్ధి చెందినా నిరుద్యోగ సమస్యకి పరిష్కారం కాలేదు. ఇదే విషయం ఇతర పెరుగుతున్న రంగాల గురించి కూడా చెప్పవచ్చు. అవన్నీ పెరుగుతున్నాయి, ఆర్థికాభివృద్ధికి దోహదపడుతున్నాయి, మన నగరాల రూపురేఖలని మార్చివేస్తున్నాయి కాని, అన్నీ కలిసి కూడా మనదేశ ఆర్థిక లేమికి, వెనుకబాటు తనానికి పరిష్కారం కాలేవు.

ఇప్పుడు అభివృద్ధి పెరుగుదలకున్న పరిమితులని గురించి చర్చిస్తాను. భారతదేశంలో 1990ల నుండి జరిగిన అభివృద్ధి క్రమం యొక్క ముఖ్య లక్షణాలు ఇవి:

1) జిడిపిలో పెరుగుదల కొన్ని సేవారంగాల, కొన్ని పరిశ్రమల పెరుగుదల మూలంగా జరిగింది, అదే సమయంలో వ్యవసాయంలో పెరుగుదల పడిపోయింది.

2) వ్యవసాయ రంగంలో అభివృద్ధి కుంటుపడినందున, వ్యవసాయం మీద ఆధారపడ్డ 67 శాతం ప్రజానీకానికి మొత్తం అభివృద్ధి ఫలాలేవీ దక్కలేదు. రైతుల ఆత్మహత్యలు, వ్యవసాయ కూలిరేట్లు పెద్దగా పెరగకపోవడం ఇందులో భాగమే.

3) సేవారంగంలో బాగా వృద్ధి చెందినవి వర్తకం, హోటళ్లు, రవాణా, టెలికాం, ఐ.టి. పరిశ్రమల్లో బాగా వృద్ధి చెందినవి కార్లు, వినియోగ వస్తువులు, ఎగుమతులకి సంబంధించిన పరిశ్రమలు. ఈ రంగాల్లో పనిచేసే వారు బాగానే లాభపడ్డారు కాని శ్రమించే జనాభా మొత్తం తీసుకుంటే వీళ్లు చాలా తక్కువ శాతమే ఉంటారు.

4) అభివృద్ధి చెందిన రంగాలన్నీ నగర ప్రాంతాలకి చెందినవి కనుక నగరాలు, పట్టణాలు అభివృద్ధిని చూసాయి. వ్యవసాయంలో అభివృద్ధి అంతగా లేదు కనుక గ్రామీణ ప్రాంతాల వెనుకబడినతనం అలాగే ఉండిపోయింది.

5) 1990ల నుండి జరిగిన అభివృద్ధి క్రమంలో కొన్ని కొట్టొచ్చినట్టు కనిపించే అసమానతలు ఇవి: ఏ) దక్షిణ, పశ్చిమ ప్రాంతాలు, హర్యానా, ఢిల్లీ, ఢిల్లీ చుట్టుపక్కల ప్రదేశాలు మాత్రమే అభివృద్ధి నుండి లాభం పొందాయి. మధ్య, తూర్పు ప్రాంతాలు పెద్దగా అభివృద్ధి చెందలేదు. బి) పెద్ద నగరాలు, పట్టణాలు పెరుగుతున్న సేవారంగాల కారణంగా బాగా వృద్ధి చెందాయి కాని, చిన్న పట్టణాలు, పల్లెటూళ్లు వెనకబడిపోయాయి. సి) ఈ అసమానతలు వివిధ రంగాల అభివృద్ధిలో కూడా కనపడతాయి - కొన్ని సేవారంగాలు, కొన్ని పరిశ్రమలు అభివృద్ధి చెందాయి కాని వ్యవసాయ రంగం, చిన్న తరహా పరిశ్రమలు, ఇంజనీరింగ్ పరిశ్రమలు దెబ్బతిన్నాయి. డి) వీటన్నిటి పర్యవసానంగా కొత్తరకం లేక గ్లోబలైజ్డ్ పరిశ్రమలు, హైటెక్ పరిశ్రమల్లో పనిచేసేవారు లాభపడ్డారు కాని, పాత, చిన్న తరహా పరిశ్రమల్లో పని చేసేవారు నష్టపోయారు. ఈ అసమానతల పర్యవసానం ఏమిటంటే గత 50 ఏళ్ల కన్నా ఇప్పుడు సమాజంలో చీలికలు పెద్దవైపోయాయి.

6) భారతదేశం గత దశాబ్దంలో వేగంగా పెరుగుతున్న దేశాల్లో ఒకటి కావచ్చు కాని దేశంలో ఉన్న దారిద్ర్యం మీద, లేమి మీద దీని ప్రభావమేమీ లేదు. తిండి, నీడ, ఆరోగ్యం, చదువు, పారిశుధ్యం మొదలైన రంగాల్లో మన ముందున్న సవాళ్లు ఎంత పెద్దవంటే వాటిని ఎదుర్కొనడం ఒక తరం కాలంలో అయ్యే పనికాదు, ఎంత గొప్ప అభివృద్ధి ఉన్నా కూడా. కాని, పరిస్థితిలో ఎంతో కొంత మెరుగుదల ఉండి తీరాలి. ఐతే, ప్రభుత్వ లెక్కల ప్రకారం కూడా పెద్దగా మెరుగుదల లేదు. ప్రభుత్వ లెక్కల ప్రకారం పేదరికం తగ్గింది కాని ఆ తరుగుదల రేటు 1970లు, 80ల కన్నా ఎక్కువగా ఏమీ లేదు. ఆరోగ్య పరంగా చూస్తే - తల్లీ బిడ్డల సంక్షేమంలో ఇదివరకటి మీద మెరుగుదల రేటు తగ్గింది. 1980లలో అక్షరాస్యత బాగా పెరిగింది కాని ప్రాథమిక విద్యని పూర్తి చేసే రేటుకి పెరగలేదు. 1990లలో నిరుద్యోగం పెరిగింది. ఏ రకంగా చూసినా అత్యధిక పౌరుల జీవితాల్లో నాణ్యత ఆర్థిక అభివృద్ధికి తగ్గట్టుగా పెరగలేదు. అభివృద్ధి ఫలాలు అందరికీ సమంగా అందలేదు.

వ్యత్యాసాలనేవి భారతదేశానికి కొత్త కాదు. ఎప్పుడు కూడా రెండు భారతాలు ఉన్నాయి. ఆర్థిక, సామాజిక అసమానతలు ఎప్పుడూ మన సమాజంలో అంతర్భాగంగా ఉన్నాయి. ఐతే, నా ముఖ్యవాదన ఏమిటంటే ఈ ప్రాంతాల మధ్య, వివిధ రంగాలు, ప్రదేశాల మధ్య ఆర్థిక పరమైన అసమానతలలో గుణాత్మకమైన మార్పు వచ్చింది. ఈ 'ప్రపంచీకరణ' చెందిన భారతదేశంలో ఉన్న అసమానతలలోని కొత్త విషయమేమిటంటే, దేశంలోని రెండు భారతదేశాల మధ్య పూర్తిగా సంబంధం లేకుండా పోయింది. ఇది గతం కన్నా చాలా వేరు. ఇదివరకు రెండు భారతాలు ఒకే దేశంలో ఉండేవి. కాని ఇప్పుడలా కాదు. ఇవ్వాళ ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్న చిన్న భాగం ప్రపంచ ఆర్థికరంగంతో, సమాజంతో సంబంధం కలిగి ఉంది. ఆదాయాలు, అనుభవాలు అన్నీ బయటి ప్రపంచంతోనే ముడిపడి ఉన్నాయి. ఆర్థికంగా, ఇతరపరంగా

వెనకబడిన పెద్దభాగం మాత్రం భారతదేశంలోనే ఉంది.

ఈ ప్రపంచీకరించబడిన భారతదేశం అంటే ప్రపంచ మీడియాకి చాలా ప్రీతి. కాని, ఈ భారతం ఎంత పెద్దది? మామూలుగా పది శాతం అని అంటారు. ఐదో, పదో ఇంకా ఎక్కువ శాతమో, అదీ దాని పరిమాణం - అంటే 55 మిలియన్లో (5 శాతం) లేక 155 మిలియన్లో (15 శాతం) - పెద్ద సంఖ్యే కాని చాలా చిన్న సంఖ్య - (దేశం మొత్తం జనాభాతో పోల్చి చూస్తే). వీళ్ల ఆదాయాలు ఇదివరకెప్పుడూ లేనంత వేగంగా పెరుగుతున్నాయి. వాళ్ల పరిమాణం కూడా పెరుగుతోంది.

భారతదేశం గత దశాబ్దంగా చూస్తున్న అభివృద్ధి ద్వీపం లాంటిది, ప్రపంచ ఆర్థిక వ్యవస్థతో ఆ ద్వీపాలకే సంబంధాలున్నది. ఈ ద్వీపాలు స్వయం సమృద్ధిని సాధించినవి కనుక, ఆరోగ్యం, చదువు, ఇళ్లు, స్కూళ్లు లాంటి వసతులు కల్పించడంలో ప్రభుత్వం తన బాధ్యత నెరవేర్చాలని గట్టిగా అడిగేవారు లేకుండాపోతారు. అందుకే గత 10-15 ఏళ్లలో అన్ని రకాల ప్రభుత్వ సంస్థలలో అందించే సేవలు బాగా దిగజారిపోయాయి.

రెండు భారతాల మధ్య ఉన్న దూరం వింతైన విధానాలలో వ్యక్తమవుతుంది. మే 2004 ఎన్నికలలో ఎన్‌డిఏ ప్రభుత్వం ఓడిపోవడానికి ఒక ముఖ్యకారణం అభివృద్ధికి దూరంగా మిగిలిపోయిన ప్రజల ఆగ్రహం. ఎన్నికల ఫలితాలని సరిగ్గా ఊహించలేకపోయిన ఆంగ్ల పత్రికలు, ఇతర ఆంగ్ల మీడియా, ఆ ఫలితాలకి అసలు కారణాలని చూడడానికి కూడా నిరాకరించాయి. మొదట వోటర్ల అసంతృప్తిని అంచనా కట్టలేకపోవడం, ఆపైన దేశంలో అత్యధికులు తమకి అందకుండా పోయిన ఆర్థికాభివృద్ధి గురించి కోపంగా ఉన్నారనేది ఒప్పుకోకపోవడం - ఇదీ దేశంలో ఉన్న రెండు దృక్కోణాల ఉదాహరణ.

ఈ మధ్య కాలంలో మనం చూస్తున్నది ఒకే దేశంలో రెండు విభిన్న భాగాల ఆవిర్భావమని ఇప్పటి దాకా చెప్పుకొన్నాం. మరి భవిష్యత్తులో ఏం జరగబోతోంది? ప్రపంచ వ్యాప్తంగానో, ఆసియా ప్రాంతంలోనో ఏదో ఆటంకం వస్తే తప్ప, భారత ఆర్థిక వ్యవస్థ ఏటా 6 నుంచి 8 శాతం వరకు పెరుగుతుంది. 'ప్రపంచీకరణ' చెందిన భారతీయులు పరిమాణంలో పెరుగుతారు. కాని, ఈ అభివృద్ధి ప్రభావం మిగతా వారి మీద పెద్దగా ఉండదు. ఈ అభివృద్ధి క్రమం ఇలానే అసమానతలతో కొనసాగితే ఎంత కాలం కొనసాగగలదు? అభివృద్ధి ఫలాలు అందనివారు ఎంతకాలం సహనంతో నిరీక్షిస్తారు? 2004లో ఆగ్రహంతో ఓట్లు వేసినట్టు మళ్లీ 2009లో చెయ్యవచ్చు. కాని, ఎలక్షన్లలో మారుతున్న ప్రభుత్వాలు ఏవీ తమ విధానాలని, ప్రాధాన్యతలని మార్చుకోకపోతే దేశ ప్రజలు ఎంతకాలం మెదలకుండా ఉంటారు? పెరుగుతున్న ఆర్థిక అసమానతల ప్రభావాన్ని తక్కువగా అంచనా వెయ్యకూడదు. వాటి మూలంగా ప్రజల్లో పెరుగుతున్న ఆగ్రహం రకరకాల రూపాలు తీసుకోవచ్చు - సమూహాల మధ్య హింస, మత కలహాలు, భాషా కలహాలు, తిరుగుబాట్లు.

2004 ఎన్నికల ఫలితాలు మనందరికీ మేల్కొలుపు లాంటివి. అవి యుపిఏ ప్రభుత్వానికి ఆర్థిక విధానాన్ని మార్చే అవకాశాన్నిచ్చాయి. కాని, ఈ ప్రభుత్వం తన అశక్తత వల్లనో, లేక అయిష్టత వల్లనో ఏ మార్పులూ చెయ్యలేదు. నేను ఇంతకు ముందు జోన్ మార్టినెజ్ అలియర్ గురించి ప్రస్తావించాను, నా ఉద్దేశ్యంలో ఆయన తప్పుగా అర్థం చేసుకున్నారు. భారతదేశంలోని ఒక చిన్న భాగం మాత్రమే ఆత్మవిశ్వాసంతో ఉంది, అధిక భాగం ఎవరూ పట్టించుకోని పరిస్థితిలో ఉంది. ❑

(ఇంగ్లీషు నుంచి అనువాదం: పి.అరవింద)

వచ్చే సంచికలో ....

- ✶ భారతదేశంలో మానవ వనరుల నిర్వహణ - నేపథ్యం
  - ప్రొ. జి. శ్రీనివాసరెడ్డి, డా. టి. సత్యనారాయణ
- ✶ హారీ మాగ్డాఫ్ - సామ్రాజ్యవాద విశ్లేషణలో మైలురాయి
  - ఎన్. వేణుగోపాల్
- ✶ ప్రపంచీకరణ - తెలంగాణలో వ్యవసాయ సంక్షోభం (పరిశోధనా ఫలాలు - పిహెచ్‌డి థీసిస్)
  - వకుళాభరణం వంశీచరణ్
- ✶ భారత జాతీయ కాంగ్రెస్ ప్లీనరీ సాధించిందేమిటి?
  - రాజవరం పార్థసారథి

గ్రామీణులకు సంబంధం లేని గ్రామీణాభివృద్ధి చర్చలు

కె.రమాకాంత్

జనవరి 3-7, 2006 న హైదరాబాద్‌లో 93వ సైన్స్ కాంగ్రెస్ జరిగింది. ఈసారి కాంగ్రెస్‌కు థీమ్ సమగ్ర గ్రామీణాభివృద్ధి - శాస్త్ర సాంకేతిక రంగాలు. అంటే గ్రామీణ ప్రాంతాల్లో సమగ్రాభివృద్ధిని సాధించడానికి సైన్స్, టెక్నాలజీ ఎలా ఉపయోగపడతాయి, ఎలా ఉపయోగపడాలి అన్న అంశాలను చర్చించడం ఉద్దేశం. కానీ మొదటి నుంచి చివర వరకు అశాస్త్రీయమైన, మొక్కుబడి వ్యవహారంగానే జరిగింది. ఎందుకంటే, గ్రామీణాభివృద్ధికి ఏం కావాలో గ్రామాల్లో ఉండేవారికి, ఇంకా చెప్పాలంటే రైతులకు, తెలుస్తుంది. కనీసం వాళ్ల సమస్యలేంటో చెప్పగలిగేది వాళ్లే. కాని అలాంటి వారెవరూ సైన్స్ కాంగ్రెస్ ఆవరణ (వ్యవసాయ విశ్వవిద్యాలయం)లో ఎవరూ కనిపించలేదు. కనిపించే అవకాశం లేదు. ఎందుకంటే ఇంతటి ఉత్కృష్టమైన చర్చల్లో పాల్గొనడానికి వాళ్లకి పాస్‌లు లేవు. ఒక వేళ ఔత్సాహిక రైతులెవరైనా వచ్చినా వాళ్లకి అక్కడేం జరుగుతుందో అర్థం కాదు.

ఇక్కడ ఒక ఉదాహరణ చెప్పాలి. మహబూబ్‌నగర్ జిల్లా నుంచి ఒక యువ పత్తిరైతు వెతుక్కుంటూ భారత పత్తి పరిశోధన కేంద్రం నిర్వహించే స్టాల్ దగ్గరకొచ్చాడు. తన పొలంలో వేసిన బిటి పంటకు చేసిన జబ్బుకువాళ్ల దగ్గర మందేమైనా తెలుసుకోవడానికి. కానీ సమాధానం దొరకలేదు. ఎందుకంటే అతడేమడుగుతున్నాడో ఎక్కడి నుంచో వచ్చిన శాస్త్రవేత్తలకు అర్థం కాదు.

ఐదు రోజుల పాటు జరిగిన కాంగ్రెస్‌లో ప్రధానంగా నాలుగు భాగాలున్నాయి. ఒకటి బహిరంగ వేదికలు, వివిధ అంశాలమీద శాస్త్రవేత్తలు సమర్పించే పత్రాల మీద చర్చలు, రెండు ఎగ్జిబిషన్‌లు : ఒకటి జనరల్ సైన్స్ ఎగ్జిబిషన్ అయితే, రెండోది పిల్లలది.

ఈసారి కాంగ్రెస్‌లో ఐదో అంశం కూడా ఉంది. రైతుల కోసం వర్చువల్ కాంగ్రెస్. దాంట్లో రాష్ట్రపతి అబ్దుల్ కలామ్ ఐదు రాష్ట్రాల్లోని అంటే రాజస్థాన్, ఒరిస్సా, మహారాష్ట్ర, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ రైతులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నడిపిన ఒక రెండు గంటల ప్రహసనం. గ్రామీణాభివృద్ధి థీమ్‌గా జరుగుతున్న కాంగ్రెస్ కదా, రైతుల ప్రాతినిధ్యం యిలా ఉందన్న మాట. ఆయా రాష్ట్రాల్లో ప్రభుత్వాధికారులు ఎంపిక చేసిన రైతులు, స్వయం సహాయక సంస్థల సభ్యులు ఒకచోట కూచుని వేసిన (ముందుగా తయారు చేసిన ప్రశ్నలు. ఎంత ముందుగా అంటే ఆ ప్రశ్నల కాపీలు రాష్ట్రపతి గారి ఫైల్లో ఎప్పుడో చేరాయి) ప్రశ్నలకు ఇక్కడి నుంచి సమాధానాలు! మహబూబ్‌నగర్ నుంచి వచ్చిన ప్రశ్నకు రాష్ట్రపతిగారు ముఖ్యమంత్రి చేత సమాధానం చెప్పించారు. అదేంటంటే యింకో మూడేళ్లలో ఎనిమిది లక్షల ఎకరాలకు ఆ జిల్లాలో నీళ్లొస్తాయట. పోఖ్రాన్ (బుద్ధుడు నవ్వాడు పేరుతో మన దేశం అణుపరీక్షలు జరిపిన ప్రదేశం) రైతులకు ఎడారి వాతావరణం, పంటలు తప్పుకునే మార్గం గురించి ప్రశ్న అడిగితే, చిరునవ్వు నవ్వి రాష్ట్రపతి గారేమన్నారంటే, 'నాకది ఎడారి కాదు. నాకది అందమైన ప్రదేశం.' (అందమైనదెందుకయిందంటే అది మనం అణు బాంబు పేల్చగలమని నిరూపించిందని ఆ నవ్వుకు అర్థం). ఇక వర్షాభావ ప్రాంతంలోని రైతులందరికీ రాష్ట్రపతి యిచ్చిన సలహా ఏంటంటే 'కానుగ చెట్లు పెంచండి కరువును జయించండి' అని. నీటి పారుదల గురించి ప్రభుత్వాలను అడగక్కర్లేదు. కానుగ చెట్లు పెంచి వాళ్లెవరికి అమ్మాలి. కొనే కంపెనీలు సిద్ధంగా ఉన్నాయా?

ఈ మాటలు చూడండి. ప్రజాస్వామ్యం, స్వేచ్ఛ డబ్బున్న వాళ్లకే ఉత్పత్తిలో అవకాశం కల్పించింది. అవకాశాలను అందుకోవడంలో, ఫలితాలను అనుభవించడంలో, జ్ఞానాన్ని వినియోగించడంలో వాళ్లకి అవకాశం ఉంది. అసమాన అభివృద్ధి వల్ల గ్రామీణ ప్రాంతాల వారికి ఈ ప్రక్రియలో చోటు లేకుండా పోయింది. చాలా కొద్ది మంది గుప్పిట్లో జ్ఞానం ఉంది. ఈ ప్రక్రియ నుండి బహిష్కృతలైన వారు గ్రామీణ ప్రాంతాల్లో నివసిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పేదరికం ఘోరంగా ఉంది. కేవలం ఏమీ లేక పోవడమే కాదు. ఈ ఏమీలేని వారి సంగతి పట్టని వాళ్ల సంఖ్య చాల ఎక్కువగా ఉంది. ఎంత ఎక్కువ అంటే తలతిరిగేంత.

ఈ మాటలన్నది ఏదో మార్క్సిస్టు మేధావో, నక్సలైట్ పార్టీ నాయకుడో అనుకుంటున్నారా? కాదు కాదు, అలా మాట్లాడింది మన శాస్త్రసాంకేతిక శాఖ మంత్రి కపిల్ సిబాల్. సైన్స్ కాంగ్రెస్‌లో ప్రారంభోపన్యాసం చేస్తూ ఆయన మనం ఆశ్చర్య పోయే విషయాలు చాలా చెప్పాడు.

'గ్రామీణ ప్రాంతాల్లోని మన సోదరులను ప్రభావితం చేస్తోన్న మరొక అంశం ప్రపంచీకరణ. దేశాల సరిహద్దుల్ని చెరిపి వేసి తమ స్వార్థ ప్రయోజనాలను సాధించుకునే ప్రయత్నమే అది.'

ఇక సైన్స్ కాంగ్రెస్ అధ్యక్షుడు యిచ్చిన సుదీర్ఘ (విసుగు పుట్టించిన) అధ్యక్షోపన్యాసం వైరుధ్యాల పుట్ట. 'నేనొక నిరాశాపడ్డ, కుంగిపోయిన విద్యావేత్తను. కానీ నేనొక గొప్ప ఆశావాదిని...' '1974కే మనం ఆహారం విషయంలో స్వయం సమృద్ధిని సాధించేం, జనాభా మూడు రెట్లు (స్వాతంత్ర్యం వచ్చిన దగ్గర నుంచి) పెరిగితే ఆహారోత్పత్తి నాలుగు రెట్లు పెంచగలిగాం. ప్రజలందరికీ ఆహారమందించగలిగాం. ఇదొక అద్భుతమైన విజయం.' కొన్ని పేరాల తర్వాత ఏమంటాడంటే, 'రైతులు, విద్యార్థులు విశ్వాసాన్ని కోల్పోతున్నారు. ఫలితంగా ఆత్మహత్యలు. కూడు, గూడు, గుడ్డ, వైద్య సౌకర్యాలు అందుబాటులో లేకుండా ఉన్న, అప్పుల్లో మునిగి

ఉన్న రైతులను ఆదుకోడానికి కొత్త సమాధానాలు వెతకాలి.'

సైన్స్ కాంగ్రెస్‌ను ప్రారంభించిన ప్రధానమంత్రి మన్‌మోహన్‌సింగ్ రెండో హరిత విప్లవానికి పాటుపడాల్సిందిగా పిలుపునిచ్చారు. అసలు మొదటి హరిత విప్లవం తెచ్చిన దుష్ఫలితాల గురించి ఒప్పుకోకుండానే రెండో హరిత విప్లవానికి పిలుపునివ్వడం గమనించదగ్గ విషయం. అయితే అధికారికంగా ఒప్పుకోకుండా, 'మొదటి హరిత విప్లవం మీద రెండు ప్రధానమైన విమర్శలున్నాయి. ఒకటి, మెట్ట ప్రాంత వ్యవసాయానికి ఉపయోగపడలేదని, రెండు, పెద్ద కమతాలకు, పెద్ద రైతులకు మాత్రమే ఉపయోగపడింద'ని ఆయన అన్నారు. ఈ విమర్శలకు ప్రభుత్వ సమాధానమేమిటో చెప్పకుండానే, 'కేవలం పెద్ద రైతులకు మాత్రమే ఉపయోగపడిందనడం అన్ని సార్లూ నిజం కాదు' అని విమర్శలకు సమాధానం చెప్పే ప్రయత్నం చేసారు.

మొదటిది పేద, చిన్న రైతులకు ఉపయోగపడలేదన్నది రుజువైంది కాబట్టి రెండోది మెట్ట ప్రాంత రైతులకు ఉపయోగవడాలని పిలుపు. అది కూడా ఆహారధాన్యాల కోసం కాదు. వాణిజ్య పంటలు, ఉద్యాన పంటల మీద దృష్టి పెట్టాలట. అందుకు అనువైన పరికరాలు, సాంకేతిక పరిజ్ఞానం పెంచే దిశగా పరిశోధనలు జరగాలని ఆయన శాస్త్రవేత్తలకు సలహా కూడా యిచ్చారు. కానీ వ్యవసాయ విజ్ఞానం పరిశోధనలకు, విద్యకు, ప్రభుత్వం పెట్టే ఖర్చెంతో తెలుసా? భారతదేశంలో వందేళ్ల వ్యవసాయ విద్య' అన్న అంశంపై మాట్లాడిన ఇగ్నో (ఇందిరాగాంధీ నేషనల్ ఓపెన్ యూనివర్సిటీ) ప్రొఫెసర్ ఏమన్నారంటే, జిడిపిలో ప్రతి వంద రూపాయల్లో కేవలం పది పైసలు మాత్రమే. దీంట్లోనే ఉద్యోగుల జీతాలు, సమావేశాలు, విదేశీ ప్రయాణాలు - అన్నీ. మిగిలిన ఒకటో రెండో పైసలలో పరిశోధన!

కొసమెరుపేమిటంటే, సైన్స్ కాంగ్రెస్ ప్రధానవేదిక మీద స్పాన్సర్ల పేర్లున్నాయి. అవి మోన్‌శాంటో, నూజివీడు సీడ్స్, రాశి సీడ్స్, బిటి కంపెనీలు చేస్తున్న అన్యాయపు ప్రచారాల మీద, బిటి టెక్నాలజీ విష ప్రభావం మీద శాస్త్రజ్ఞులు, పర్యావరణ కార్యకర్తలు చేస్తున్న విమర్శలకు బహుశ ఇది అధికారికమైన జవాబేమో?

❑

పరిశోధనా ఫలాలు సమాజానికి అందజేయండి !

సామాజిక, ఆర్థిక, రాజకీయ అంశాలలో మీరు ఎంతో పరిశోధన చేసి ఉంటారు. అధ్యాపకులుగా మీ విద్యార్థులకు ఎన్నో పరిశోధనలలో ప్రత్యక్ష పరోక్ష సహకారాలు అందిస్తూ ఉంటారు. అయితే సమాజానికి ఎంతో ఉపయోగపడాల్సిన పరిశోధనా పత్రాలు ఏ సెమినార్‌లోనో ప్రస్తావించి వదిలేస్తే సరిపోదు. మీ పరిశోధనా ఫలాలు తెలుగు సమాజంలో నలుగురికీ చేరాలి. కొత్త ఆలోచనలకు ప్రేరణ కావాలి, కొత్త మార్గాలను ఆవిష్కరించాలి. అందుకు మీకు వేదికగా నిలిచేందుకు వీక్షణం ముందుకు వస్తోంది.

తెలుగులో పాపులర్ పత్రికలే కానీ సీరియస్ పత్రికలు లేవన్న అభిప్రాయాన్ని పటాపంచలు చేస్తూ విజయవంతంగా మూడేళ్ళ ప్రస్థానం సాగించి, 50 సంచికలు పూర్తి చేసుకుంది వీక్షణం.

ఎటువంటి డబ్బు మూటల దన్ను లేకుండా గుప్పెడు పాత్రికేయులు, సామాజిక శాస్త్రవేత్తలు కలిసి నడుపుతున్న ఈ పత్రికకు ఎందరో మేధావులు, అధ్యాపకులు, ఆలోచనాపరులు చందాదారులుగా ఉన్నారు. తెలుగు సమాజం గర్వించదగ్గ పాత్రికేయులు, సామాజిక శాస్త్రవేత్తలు, ఉద్యమకారులు, నిపుణులు అనేకుల రచనలు వీక్షణం ప్రచురిస్తోంది.

రండి, ఈ బృహత్‌కార్యంలో మీరూ పాలుపంచుకోండి. మీరు చేసిన పరిశోధనా ఫలితాలను వీక్షణంలో ప్రకటించండి. అది ఏ సామాజిక, ఆర్థిక, రాజకీయ అంశం అయినా ఫర్వాలేదు. తెలుగు ప్రజలకు ఆ అంశం ఆసక్తిగొల్పేదీ, ఉపయోగకరమైనదీ అని మీరు భావిస్తే చాలు. మీరే కాదు పి.హెచ్.డి చేసిన, చేస్తున్న మీ విద్యార్థులు కూడా తమ పరిశోధనా పత్రాలను (ఒక వ్యాసరూపంలో) పంపవచ్చు. రచనతో పాటు దానికి సంబంధించిన చిత్రాలు, గణాంకాలు కూడా జతపరిస్తే మరీ మంచిది.

ఎంతో శ్రమించి మీరు చేస్తున్న పరిశోధనలు నలుగురికీ ఉపయోగపడేలా చేయండి.

వీక్షణం మీ రచనల కోసం ఎదురుచూస్తుంది !

మీదే ఆలస్యం !!

రచనలు పంపాల్సిన చిరునామా :

ఎడిటర్, వీక్షణం, సెంటర్ ఫర్ డాక్యుమెంటేషన్, రీసెర్చ్ అండ్ కమ్యూనికేషన్

స్ట్రీట్ నెం. 3, హిమాయత్‌నగర్, హైదరాబాద్ - 500 029. ఫోన్ : 040 - 55843495

ప్రజాస్వామ్యంలో ప్రజల అభిప్రాయానికి విలువెంత?

సజయ, సత్యలక్ష్మి

నల్లగొండ జిల్లా, పెదఅడిశెర్లపల్లి మండలంలోని పెదగట్టు, నంబాపూర్... ఈ రెండు గిరిజన తండా గ్రామాలు మనదేశంలో అట్టడుగు స్థాయిలో ఉన్న లక్షలాది గ్రామాల్లాంటివే. పేదరికం, నిరక్షరాస్యత, కనీస సౌకర్యాలైన తాగునీరు, సాగునీరు, ఆసుపత్రి, బడి, రవాణా వంటివి లేకపోవటం సర్వసాధారణం. ఇవి ప్రత్యేకంగా ఈ గ్రామాలకు మాత్రమే ఉన్న సమస్యలేమీ కాదు. కానీ, ఈ రోజు ఈ గ్రామాలు జాతీయ స్థాయిలో కీలకమైన చర్చలకు కేంద్ర స్థానమయ్యాయి. భారతదేశ అణుసాంకేతిక పరిజ్ఞానానికి మూలాధారం అయిన అతి ముఖ్యమైన మూలకం 'యురేనియం' నిక్షేపాలు ఆ గ్రామాల్లో ఉండటమే ఇందుకు కారణం.

గత పది సంవత్సరాలకు పైగా భారత అణుఇంధన శాఖ అనుబంధ సంస్థ అటామిక్ మినరల్ డివిజన్ యురేనియం నిల్వల కోసం దేశం మొత్తం మీద చేస్తున్న అన్వేషణలో భాగంగా నల్లగొండ జిల్లాలోని పెదగట్టు, నంబాపూర్ గ్రామాల్లో ఈ నిక్షేపాలు ఉన్నట్లు కనుగొంది. ఈ రెండు గ్రామాలు నాగార్జునసాగర్‌కి ఆనుకుని 2 కి.మీ. అతి సమీపంలో ఉన్నాయి.

ఇక్కడ కోటి పన్నెండు లక్షల టన్నుల యురేనియం నిక్షేపాలు ఉన్నాయని, వాటిని తవ్వి తీయటానికి 1316 ఎకరాల భూమి అవసరమవుతుందని యుసిఐఎల్ (యురేనియం కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్) 2003లో ప్రకటించింది. అందులో 1058 ఎకరాల భూమి ఎల్లాపూర్ రిజర్వ్ ఫారెస్ట్‌లో (రాజీవ్‌గాంధి పులుల అభయారణ్యం) ఉంది. మిగిలిన భూమి ఆ చుట్టు పక్కల గ్రామస్థుల నుంచి తీసుకోనున్నట్లు, 20 సంవత్సరాల పాటు గనుల తవ్వకం ఉంటుందని, రోజుకి 1250 టన్నుల చొప్పున ముడి నిక్షేపం వెలికి తీయటానికి గాను, నెలకి 22 1/2 టన్నుల పేలుడు పదార్థాలు ఉపయోగించాలని యుసిఐఎల్ ప్రతిపాదిస్తోంది. ఈ 1250 టన్నుల ముడి నిక్షేపం నుంచి 686 కిలోల శుద్ధి చేసిన యురేనియం తీస్తారు. దీనిని ఎల్లోకేక్ అంటారు. దీనికోసం రోజుకి ఇరవై రెండు లక్షల యాభై వేల లీటర్ల (22,50,000) నీరు అవసరమవుతుంది. ఇంకా అనేక ఆర్థిక, సాంకేతిక అంశాలు దీనిలో ఇమిడి ఉన్నాయి.

అణుధార్మిక వ్యర్థాలను వెదజల్లే ఈ యురేనియం ప్రాజెక్టు నాగార్జునసాగర్ జలాలకు తీసుకురాబోయే తీవ్ర ప్రమాదాలను, ప్రజారోగ్య సమస్యలను దృష్టిలో పెట్టుకుని స్థానిక జిల్లా ప్రజలు, చుట్టు పక్కల కృష్ణా, గుంటూరు, ప్రకాశం, ఖమ్మం జిల్లా వాసులు, దేశంలో వివిధ ప్రాంతాల్లో ఉన్న పర్యావరణ వేత్తలు, ప్రజాసంఘాలు ముక్తకంఠంతో ఈ ప్రతిపాదిత యురేనియం గనుల తవ్వకాన్ని, శుద్ధికర్మాగారాన్ని వ్యతిరేకించాయి. 2003లో శుద్ధి కర్మాగారాన్ని పెదఅడిశెర్లపల్లి మండలంలోని మల్లాపురం-దుగ్యాల గ్రామాల మధ్య నిర్మించాలని ప్రతిపాదించిన యుసిఐఎల్ దీని కోసం 795 ఎకరాల భూమి అవసరమని, ఇందులో 632 ఎకరాలు గ్రామస్థులదని, మిగిలినది ప్రభుత్వ భూమని ప్రకటించారు. కొండమీద ఉన్న పెదగట్టు గ్రామంలోనూ, పెదఅడిశెర్లపల్లి మండల కేంద్రంలోనూ 2003, ఆగస్ట్ 19న ఒకే రోజు జరిగిన రెండు పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ సభల్లో ప్రజలు, పర్యావరణ వేత్తలు పెద్ద ఎత్తున ఈ ప్రాజెక్టు నిర్మాణాన్ని వ్యతిరేకించారు. అయితే ప్రభుత్వం గనుల ప్రతిపాదనను అలాగే ఉంచుతూ, శుద్ధి కర్మాగారం స్థలాన్ని శేరిపల్లికి మార్చుతూ రెండేళ్ల తర్వాత 2005, మార్చి 3న మరో పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ చేసింది. ఇందులో కూడా పెద్ద ఎత్తున ప్రజావ్యతిరేకత ఎదురయింది. గత మూడు సంవత్సరాల్లో ఈ విషయమై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ కాలుష్య నియంత్రణా మండలి నిర్వహించిన మూడు ప్రజాభిప్రాయసేకరణ సభల్లో పెద్ద ఎత్తున ప్రజల నిరసన, వ్యతిరేకత ఎదురైనప్పటికీ, లేవనెత్తిన సందేహాలకు, ప్రశ్నలకు, ఇంకా అనేకానేక సాంకేతిక సమస్యలకు సమాధానం చెప్పకుండా అప్రజాస్వామిక పద్ధతిలో ఈ ప్రాజెక్టుని ఎలాగైనా ముందుకు తీసుక రావాలని ప్రభుత్వం ప్రయత్నిస్తోంది.

నాగార్జునసాగర్ ఆయకట్టు కింద నివసిస్తున్న రెండు కోట్ల ప్రజల భావాలని తోసిరాజని కేంద్ర మంత్రిత్వ అటవీ శాఖ 'యురేనియం కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (యుసిఐఎల్)'కి అనుమతినివ్వడం ప్రజాస్వామ్యవాదులందర్నీ విస్మయపరిచింది. ప్రజలు లేవనెత్తిన ఏ ప్రశ్నలకూ సమాధానం చెప్పకుండా అప్రజాస్వామిక పద్ధతిలో పర్యావరణ మంత్రిత్వశాఖ అనుమతి మంజూరు చేయటం ప్రజాస్వామ్య వ్యవస్థకే ఒక చెంపపెట్టు. ఈ విషయాన్ని చర్చిస్తూ ప్రతిపాదిత యురేనియం గనుల ప్రాంతమైన పెదగట్టు, లంబాపూర్ నుంచీ ప్రతిపాదిత శుద్ధి కర్మాగార ప్రాంతం శేరిపల్లి (దేవరకొండ మండలం) వరకూ, అంటే దాదాపు వంద కిలోమీటర్లు చుట్టు పక్కల గ్రామాల్లో మరింత బలంగా వ్యతిరేకతను తెలియజేయటానికి ఇటీవల స్థానిక ప్రజాసంఘాల ఆధ్వర్యంలో పాదయాత్ర జరిగింది.

జనవరి 3 నుంచి 7వ తారీఖు వరకు ఈ పాదయాత్ర సాగింది. అనేక మంది ప్రజలు, గ్రామ, మండల, శాసనసభ ప్రతినిధులు, ప్రజాసంఘాలు, శాస్త్రవేత్తలు, రాజకీయవేత్తలు, వందలాది కార్యకర్తలు పాల్గొన్న ఈ పాదయాత్ర ఐదు రోజుల పాటు ఎంతో ఉత్సాహంగా కొనసాగింది. యురేనియం గనుల దుష్ప్రభావాన్ని వివరించేందుకు దేశ, విదేశాల నుంచి ఎంతో మంది వచ్చారు.

గాంధేయవాది, న్యూక్లియర్ ఫిజిసిస్ట్ అయిన డా. సురేంద్ర గడేకర్ (సంపూర్ణ క్రాంతి విద్యాలయ, వేద్చి - గుజరాత్), రాజన్ నాయుడు (మానవ హక్కుల కార్యకర్త, లండన్) మీరా (సోషల్ వర్క్ విద్యార్థిని, లండన్), కేసరి (కొలంబియా యూనివర్సిటి విద్యార్థిని, న్యూయార్క్), డా. శ్రీ కుమార్ (కెమిస్ట్రీ ప్రొఫెసర్, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, సూరత్‌కల్), డా. విష్ణు కామత్ (కెమిస్ట్రీ ప్రొఫెసర్, సెంట్రల్ కాలేజ్, బెంగుళూరు), కె. విమల (విజిటింగ్ ఫాకల్టీ, కల్చరల్ స్టడీస్, యూనివర్సిటీ ఆఫ్ షికాగో), వై. రామకృష్ణ (ఎలక్ట్రికల్ ఇంజనీర్, సిటిజన్స్ ఫర్ ఆల్టర్‌నేటివ్ టు న్యూక్లియర్ ఎనర్జీ (కేన్) బెంగుళూరు), శుక్లాసేన్ (కొయలిషన్ ఫర్ న్యూక్లియర్ డిసార్మమెంట్ అండ్ పీస్, ముంబై), నీల (రిటైర్డ్ టీచర్, యాక్టివిస్ట్, గ్వాలియర్), శైలజ కల్లె (సేంద్రీయ వ్యవసాయ పరిశోధకురాలు, జహీరాబాద్), గుమ్మడి నర్సయ్య (యెల్లెందు శాసనసభ నియోజక వర్గ సభ్యులు), డా. ఎం. చెన్న బసవయ్య (రీడర్, పొలిటికల్ సైన్స్, ఉస్మానియా యూనివర్సిటీ), డా. కె. బాలగోపాల్ (అడ్వొకేట్, మానవ హక్కుల వేదిక, హైదరాబాద్), పశ్య పద్మ (ప్రధాన కార్యదర్శి, ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య), వి. ఉషారాణి (సన్నిహిత స్త్రీల సంఘం, హైదరాబాద్), కె. అనూరాధ (అమల్ వేదిక, సఫాయి కర్మచారి ఆందోళనా వేదిక, న్యూఢిల్లీ), అంబిక (థియేటర్ యాక్టివిస్ట్), సరస్వతి కవుల (డాక్యుమెంటరీ ఫిల్మ్ మేకర్, హైదరాబాద్), వేనేపల్లి పాండురంగారావు (సర్పంచ్, ఆలగడప గ్రామం, నల్గొండ జిల్లా) మొదలైన వారితో పాటు నల్గొండ జిల్లాలోని ప్రజాసంఘాల నాయకులు, కార్యకర్తలు ఎంతో మంది పాల్గొన్నారు. పెదగట్టు కొండమీద నుంచి ప్రారంభమైన పాదయాత్ర దాదాపు 4 కిలోమీటర్ల దిగువనున్న లంబాపూర్ చేరుకుని అక్కడి నుంచి పర్వేదుల, చలకుర్తి, కుంకుడు చెట్టు తండా, జానారెడ్డికాలని, అల్వాల్ అడ్డరోడ్డు, శ్రీరాంపూర్, హాలియా, అనుమల, లింగంపల్లి, పెదవూర, అంగడిపేట, పెదఅడిశెర్ల పల్లి, కొండమల్లేపల్లి, దేవరకొండ, ముదిగొండ, శేరిపల్లి వరకూ చుట్టు పక్కల ఉన్న అనేక గిరిజన తండాలను కలుపుకుంటూ, సాంస్కృతిక ప్రదర్శనలతో, బహిరంగ సభలు, రచ్చబండ సమావేశాలు, గ్రామసభలు జరుపుకుంటూ 5 రోజుల పాటు సాగింది. గ్రామాలు, మండలాలు, పట్టణాల్లోని పాఠశాలలు, కళాశాలల్లో సమావేశాలు నిర్వహించి యురేనియం గనుల వల్ల ఏర్పడబోయే అణుధార్మిక దుష్ఫలితాలను వివరిస్తూ సంతకాల సేకరణ చేశాం. చివరి రోజు శేరిపల్లిలో జరిగిన బహిరంగ సభతో పాదయాత్ర ముగిసింది. ఈ బహిరంగ సభకు దేవరకొండ మండల ప్రజాపరిషత్ సభ్యురాలు పల్లా సులోచన అధ్యక్షత వహించారు. మునుగోడు శాసనసభ సభ్యులు టి. వెంకటరెడ్డితో పాటు అనేక ప్రజాసంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ పాదయాత్రలో మాకెదురైన ప్రశ్నల్ని మీ ముందు పెట్టే ప్రయత్నం చేస్తున్నాం.

'మేం వద్దంటే ప్రభుత్వం 'ఊరుకుంటుందా?' మిలట్రీని తీసుకొచ్చి మొదలు పెడ్తరంట గదా?' 'మరి మేం వద్దనే గట్టిగా చెబుతున్నాం. అయినా ఎట్లవస్తది, మా అభిప్రాయానికేం విలువ లేదా?' 'మల్లాపురం దుగ్యాల నుంచి శుద్ధి కార్మాగారాన్ని శేరిపల్లి

పర్యావరణ ప్రజా విచారణ

నిర్మించే ప్రాజెక్టులన్నిటికీ పర్యావరణ అనుమతికై ప్రజావిచారణలు అవసరమని 1997లో నిర్ణయించారు. పర్యావరణంపై ప్రభావాన్ని నిర్ధారించే (ఇఐఎ) నోటిఫికేషన్ 1994 ఉంది. అభివృద్ధి పథకాలుగా వచ్చే ప్రాజెక్టులపై తమ గొంతు వినిపించగలిగే ఏకైక చట్టబద్ధ మార్గం ప్రజలకిదొక్కటే. ప్రాజెక్టు నిర్ణయాల్లో ప్రజల భాగస్వామ్యానికి కూడ ప్రజా విచారణ అవకాశం కల్పిస్తుంది. వచ్చే ప్రాజెక్ట్‌పై తమ ఆందోళనలను, భయాలను తెలిపే అవకాశాన్ని ఈ ప్రజా విచారణ వేదిక కల్పిస్తుంది.

ఏదైనా ఒక ప్రాంతంలో ప్రాజెక్టు తలపెట్టినప్పుడు కచ్చితంగా పర్యావరణ ప్రజా విచారణకు వేదిక కల్పించాల్సిన బాధ్యత రాష్ట్ర కాలుష్య నియంత్రణా మండలిదే.

ప్రజా విచారణ అవసరమైన ప్రాజెక్టులు విశాల ప్రాతిపదికలు

25 హెక్టార్లకు మించిన భూగర్భ తవ్వకాలు; ఓడరేవులు, విమానాశ్రయాలు; హైవేలు; పెట్రో, రసాయన పరిశ్రమలు - పైపు లైన్‌లు; నదీలోయ ప్రాజెక్టులు; థర్మల్ విద్యుత్ కర్మాగారాలు; అణు ప్రాజెక్టులు; రసాయన, ఖనిజ, ఔషధ పరిశ్రమలు.

ప్రజా విచారణకు ముందస్తు సమాచారం

ప్రాజెక్టు చేపట్ట బోయే ప్రాంతంలోని ప్రజలకు కనీసం రెండు ప్రముఖ దినపత్రికల ద్వారా ప్రాజెక్టు గురించి వివరంగా తెలియజేయాలి; ఆ రెండు దినపత్రికలలో ఒకటి కచ్చితంగా స్థానిక భాషలో ఉండాలి; ప్రజా విచారణ సమావేశం గురించి కనీసం నెల రోజుల ముందే తెలియజేయాలి.

ప్రజా విచారణకు వేదిక

ప్రాజెక్టు నిర్మాణం చేపట్టబోయే ప్రాంతంలో బాధిత వర్గాలకు దగ్గరగా, బ్లాకు స్థాయి కార్యాలయంలో ఏర్పాటు చేయాలి.

పత్రాలు అందుబాటులో ఉండాలి

ప్రాజెక్టును పునఃసమీక్షించుకునేందుకు వీలుగా పౌరులకు అధికారమిస్తూ పత్రాలను వారికందుబాటులో ఉంచాలి. ఒకటి, ప్రాజెక్టుకు సంబంధించిన కార్యనిర్వాహక సారాంశం (స్థానిక భాషలో, ఇంగ్లీషులో). రెండు, పర్యావరణం ప్రభావాన్ని నిర్ధారించే (ఇఐఎ) నివేదిక పత్రం.

పై పత్రాలు ఉంచాల్సిన కార్యాలయాలు

జిల్లా కలెక్టర్ కార్యాలయం; జిల్లా పారిశ్రామిక కేంద్రం; జిల్లా పరిషత్, మునిసిపల్ కార్పొరేషన్, స్థానిక సంస్థల అధికార కార్యాలయాలు; రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి కేంద్ర, ప్రాంతీయ కార్యాలయాలు; రాష్ట్ర ప్రభుత్వ పర్యావరణ సంబంధ కార్యాలయాలు.

ఎందుకు మార్చిన్రు, నష్టమేమీ లేకపోతే అక్కడే ఉండొచ్చు కదా?' 'ఇక్కడి కొచ్చి ప్రాజెక్టుకు వ్యతిరేకంగా చెబుతున్న మిమ్మల్నెంత నమ్మాలి? కనీసం కనిపించను కూడా లేకుండా, ఏ వివరాలూ అందించని ప్రభుత్వ అధికారులను ఎంత నమ్మాలి?' 'నిన్నటి దాకా ఏమీ పట్టనట్టు చోద్యం చూసిన రకరకాల రాజకీయ పార్టీలను ఎలా అర్థం చేసుకోవాలి?'

'ప్రమాదం ఉందని మీరు చెబుతున్నారు? కానీ అంత ప్రమాదం ఉండదంట గదా? ఒకవేళ నిజంగా ప్రమాదం వస్తే మా భద్రత ఎవరి బాధ్యత? మీరు చెప్పే అణుధార్మికత కంటికి కనిపించదంటున్నారు? మరి దాన్ని ఎలా తెలుసుకుంటాం? మా భూమి లాగేసుకుంటే మా పరిస్థితేమిటి? మేమెట్లా బతకాలి?'

ముఖ్యంగా పైన చెప్పిన ప్రశ్నలతో తమ అయోమయాన్ని, సందిగ్ధతను, ఆగ్రహాన్ని మాతో పంచుకున్న పెదగట్టు, నంబాపూర్ గ్రామ యువకులు ఆధునిక ప్రజాస్వామ్యాన్ని, ప్రజాస్వామ్యయుత పద్ధతులు, విధానాలను, తంతులను ప్రశ్నిస్తున్నారు? వారడిగే ప్రశ్నలకు సమాధానం ఎవరి నుంచి రావాలి? ప్రభుత్వం ఎందుకని చెప్పటం లేదు? ఏ సమాచారం లేకుండా, ఎటువంటి ప్రజా అవగాహనను పెంచే ప్రయత్నం చేయకుండా ప్రపంచ వ్యాప్తంగా ఎంతో వివాదానికి గురవుతున్న యురేనియం తవ్వకాలను జరపటానికి ప్రజాభిప్రాయ సేకరణ పేరుతో అత్యధిక పేదరికం, నిరక్షరాస్యత, ప్రపంచానికి దూరంగా ఏ రవాణా సదుపాయమూ కనీస సౌకర్యాలు లేకుండా బతుకుతున్న జనాలకు అనుమతి కోరే నెపంతో స్వల్ప ప్రయోజనాలను ఎరవేయటం హాస్యాస్పదంగా లేదా!? దేశ విదేశాల్లో ఎంతెంతో చదువుకున్న విజ్ఞాన శాస్త్రవేత్తలు, మేధావులకే అంతుపట్టని అణుశాస్త్ర విషయాలను ఏ సమాచారమూ లేకుండానే ఈ ప్రజలు ఆలోచించి, నిర్దిష్టమైన అభిప్రాయాలను వెలిబుచ్చాలనుకోవటం ఏ రకమైన ప్రజాస్వామికం?

ఇక్కడ సంక్షిప్తంగానైనా సరే యురేనియం గురించి కొంత చెప్పుకోవటం అవసరం. సహజ సిద్ధంగా భూమి లోపల దొరికే అనేక ఖనిజాల్లాగే ఇది కూడా ఒక ఖనిజం. అయితే దీనికి అదనంగా అత్యంత ప్రమాదభరితమైన అణుధార్మికత శక్తి ఉంటుంది. భూమిలో ఉన్నంతకాలం ఏ ప్రమాదమూ ఉండదు. ఒకసారి దీన్ని తవ్వి బయటకు తీస్తే, దీనివల్ల కలిగే అణుధార్మిక శక్తి (రేడియేషన్) కొన్ని వేల సంవత్సరాల పాటు ఉంటుంది. ఈ రేడియేషన్ ప్రభావం వల్ల మనుషులు, నీరు, గాలి, పర్యావరణం, జంతుజాలం సమస్తమూ తీవ్ర దుష్ప్రభావాలకు గురవుతాయి. అణువిస్ఫోటనం జరుగుతూ అల్ఫా, బీటా, గామా కిరణాల రూపంలో అణుపదార్థాలు బయటకు వస్తూనే ఉంటాయి. దీన్ని రేడియో ఆక్టివ్‌డికే అంటారు. యురేనియం అణువులు ఈ విధంగా విస్ఫోటనం చెందుతూ కొంత పదార్థం ప్రొటాక్టినియంగా, అది మళ్లా విస్ఫోటనం చెంది థోరియంగా, థోరియం రేడియంగా మారుతుంది. అలా భూమిలో సహజ సిద్ధంగా ఉన్న యురేనియం నుంచి దాదాపు 12 అణుధార్మికత గల పదార్థాలు వస్తాయి. చివరికి వచ్చేది సీసం. ఇది స్థిరమైన లోహం. దీనికి అణుధార్మికత ఉండదు. అంతమాత్రం చేత ప్రమాద రహితమేమీ కాదు. అయితే ఈ ప్రక్రియ అంతా ఏదో ఒక రోజులోనో, అరపూటలోనో పూర్తయ్యే విషయం కాదు. ఉదాహరణకి రెండు గ్రాముల యురేనియం (దీనిని యు-238 అంటారు) ఒక గ్రాముగా మారటానికి పట్టే సమయం 450,00,00,000 సంవత్సరాలు అంటే ఎన్ని సంవత్సరాలో ఆలోచించండి. మిగిలిన గ్రాము పదార్థం అరగ్రాముగా మారటానికి కూడా అంతే సమయం పడుతుంది. అయితే యురేనియం అణుధార్మికతకీ మనకీ సంబంధమేమిటనే ప్రశ్న సహజంగానే ఎదురవుతుంది. యురేనియం అణువులు ఒకసారి విచ్ఛిత్తి జరగటం మొదలు పెట్టాక, సెకనుకి పదివేల మైళ్ల వేగంతో రెండు ప్రోటాన్లు + రెండు న్యూట్రాన్లతో కూడిన ఆల్ఫా పార్టికల్‌ని, కాంతి వేగంతో కూడిన ఎలక్ట్రాన్‌లైన బీటా పార్టికల్‌ని, శక్తిని నిరంతరం అలా వదులుతూనే వుంటాయి. యురేనియంకి ఉన్న ఈ ప్రత్యేక స్వభావాన్ని 'ఫిషనబిలిటీ' అంటారు. ఈ 'ఫిషనబిలిటీ'కి ఉన్న శక్తే అణుబాంబు తయారీకి కీలకం. నియంత్రించలేని అణు విస్ఫోటన శక్తికి రెండో ప్రపంచయుద్ధంలో బలైపోయిన నిదర్శనాలుగా మన కళ్ల ముందు జపాన్ దేశంలోని హిరోషిమా, నాగసాకి పట్టణాలు, మృత్యువాత పడిన వేలాది మంది ప్రజలు. ఇది జరిగి యాభై సంవత్సరాలపైనే అయినప్పటికీ, ఆ అణుధార్మిక దుష్ఫలితాలను మోస్తున్న వాళ్లు ఎందరో!?

భూమిలో నుంచి యురేనియంను బయటికి తీసినప్పుడు ముడిపదార్థంగా ఉన్న దాన్ని పొడి చేసి అందులో నుంచి యురేనియంని వేరు చేస్తారు. యుసిఐఎల్ రోజుకి 1250 టన్నుల ముడి నిక్షేపాన్ని వెలికితీస్తే అందులోంచి 680 కిలోల శుద్ధి యురేనియాన్ని వేరు చేస్తే మిగిలినదంతా వ్యర్థ పదార్థమే. అయితే అసలు ప్రమాదమంతా వీటి నుంచే. ఈ వ్యర్థ పదార్థంలో కూడా అణుధార్మిక శక్తి ఉంటుంది. వీటిని దాచటానికే ముందు మల్లాపూర్-దుగ్యాలలో టెయిలింగ్స్ నిర్మించ తలపెట్టి, ఆ తర్వాత శేరిపల్లికి మార్చారు. మిగిలిన ఈ వ్యర్థాలలో కూడా, అణుధార్మిక శక్తి మార్పులకు లోనవుతూ శిథిలమవుతున్నాగానీ దాని 'అణుధార్మిక అర్థజీవితం' (హాఫ్‌లైఫ్) 80 వేల సంవత్సరాల వరకూ ఉంటుంది. భూమి ఉపరితలం మీదే ఎన్ని టెయిలింగ్స్‌కట్టినా గానీ పిండిలాంటి ఈ పొడి వ్యర్థ పదార్థాలు గాలి వల్ల సుదూర ప్రాంతాలకు కొట్టుకు వెళతాయి. వర్షం వల్ల నీటి ప్రవాహాలలో కలుస్తాయి. తద్వారా మరింత ప్రమాదానికి కారణమవుతాయి. ఈ వ్యర్థాల నించి నిత్యం రేడాన్ గ్యాస్ విడుదల అవటం వల్ల, ఇది గాలి కన్నా 8 రెట్లు బరువుగా ఉండటం వల్ల భూమికి చాలా తక్కువ ఎత్తులోనే గాలిలో ఉండి చిన్న చిరుగాలికి కూడా వేల మైళ్ల దూరం ప్రయాణించగలదు. పర్యావరణాన్ని మొత్తాన్ని ప్రమాదపుటంచుల్లోకి నెట్టే ఈ అంశం వెనుక నున్న శాస్త్ర సాంకేతిక అంశాలను ప్రజలకు అర్థమయ్యే రీతిలో చెప్పాలని ప్రభుత్వమూ, కంపెనీ అధికారులు అనుకోవటం లేదు.

యురేనియం అణుధార్మిక శక్తి గల అనేక రూపాలుగా రూపాంతరం చెంది మన చుట్టూ ఉన్న వాతావరణంలోకి ప్రవేశిస్తుంది. నీటి ద్వారా, గాలి ద్వారా, తిండి ద్వారా మానవ, జంతు శరీరాల్లోకి చేరి శరీర జన్యు వ్యవస్థను దెబ్బతీసి కాన్సర్ లాంటి

ప్రాణాంతక వ్యాధులకు గురి చేస్తాయి. జన్యు వ్యవస్థలో అసాధారణ మార్పులు చోటు చేసుకోవటం వల్ల శరీర నిర్మాణంలో శారీరక, మానసిక వైకల్యాలు సంభవిస్తున్నాయని ప్రపంచ వ్యాపితంగా యురేనియం గనులు, అణు రియాక్టర్లు ఉన్న ప్రాంతాలలో జరిగిన పరిశోధనలు తెలియజేస్తున్నాయి. మన దేశంలోని జార్ఖండ్ రాష్ట్రంలోని జాదూగూడలో ఇదే యుసిఐఎల్ చేపట్టిన యురేనియం గనుల దుష్ప్రభావాలకు అక్కడి ఆదివాసీ ప్రజలు తమ జీవితాలను, భవిష్యత్ తరాల జీవితాలనూ పణంగా పెట్టాల్సి వచ్చిందనేది మన కళ్ల ముందున్న వాస్తవం. జీవిత కాలం తగ్గటం, గర్భస్థ శిశువుల్లో మార్పులు, తరచూ గర్భస్రావాలు, పుట్టిన పిల్లలు అతి చిన్న వయసులోనే చనిపోవటం, స్త్రీ పురుషులిరువురిలోనూ జననాంగ వ్యవస్థలో క్యాన్సర్‌లు, చర్మవ్యాధులు, జన్యులోపాలు, వంధ్యత్వం, అంగవైకల్యం లాంటి ఆరోగ్య సమస్యలు చాలా తీవ్రంగా ఉన్నాయని అక్కడ పరిశోధన చేసిన డా. సంఘ మిత్ర దేశాయి, డా. సురేంద్ర గడేకర్ స్పష్టం చేశారు.

సామాన్య ప్రజలకు అర్థం కాని విషయాలను, వారికర్థం కాని భాషలో, శాస్త్ర సాంకేతిక చిక్కుముడులతో తయారు చేసిన రిపోర్టులను నిష్పక్షపాతంగా, స్వతంత్ర ప్రతిపత్తి గల సంస్థలతో గానీ, వ్యక్తులతో గానీ అధ్యయనం చేయించి, ఆ రిపోర్టులను కూడా ఈ రిపోర్టుతో పాటు ప్రజలకు అందుబాటులో ఉంచటం గానీ, ప్రత్యామ్నాయాన్ని సూచించటం గానీ, ప్రమాద హేతువులను గుర్తించటం గానీ, ఆయా సందర్భాలలో ప్రమాదపుటంచుల్లో ఉన్న ప్రజలు తీసుకోవలసిన చర్యలు గానీ, ప్రాజెక్టు ప్రాంతంలో సంభవించే ఇతర కష్టనష్టాలు, ఇత్యాదులు వేటిని కూడా పరిగణనలోకి తీసుకోకుండా ప్రజాభిప్రాయ సేకరణకు పూర్వమే, అక్కడి ప్రజలకు వీటన్నింటి గురించి సరైన అవగాహనను కల్పించాల్సిన కనీస బాధ్యత ఎవరిది? ప్రభుత్వానిది గాదా?

ఈ పరిస్థితుల్లో అంటే అవగాహన లేని సమస్యపై తీర్పుని చెప్పాల్సి రావటం ఇవ్వాళ వాళ్లు ఎదుర్కొంటున్న మొదటి సమస్య. ఈ తరుణంలో మాలాంటి వాళ్లు వెళ్లి ప్రాజెక్టుకు సంబంధించిన వివరాలను, తద్వారా కలిగే కష్టనష్టాలను వారికర్థమయ్యే భాషలో చెప్పాలని చేసే ప్రయత్నం కూడా ఇంకొక కొత్త సమస్యను లేవనెత్తుతోంది. కుక్క పని గాడిదెందుకు చేస్తోందో అన్న చందంగా పరిస్థితి తయారవుతోంది. దీనిని విడమరిచి చెబితే, ప్రజల రక్షణ, ప్రజారోగ్యం, ప్రజల కనీస సౌకర్యాలు చూడవలసిన బాధ్యత ప్రభుత్వానిది. ఇవేవీ లేకపోవటం ఒక దౌర్భాగ్యమైతే, ఆ దౌర్భాగ్యమే ఒక శాపంగా మారి మర్యాదగా ప్రాజెక్టుకి ఒప్పుకుంటారా - ఒప్పుకోరా అని మెడ మీద కత్తి పెట్టి ప్రభుత్వం ప్రకటించటం, ఒప్పుకోక పోయినా మిలటరీ సహాయంతోనయినా సరే ప్రాజెక్టును ఏర్పాటు చేసి తీరతామనే భయోత్పాత సంకేతాలు పదే పదే వస్తూ ఉండటం అనేది, ఈ ప్రజాస్వామ్యం పైనా, ఈ ప్రభుత్వాలపైనా ఎలాంటి నమ్మకాన్ని కగలజేస్తుంది? ప్రజాసంక్షేమం, ప్రజాస్వామ్య రక్షణ తమ బాధ్యతగా ప్రమాణం చేసిన ప్రభుత్వం చేస్తున్నదేమిటి?

'మాకే గనుక రోడ్లు, ఆస్పత్రి, బడి, తాగునీరు, సాగునీరు ఇత్యాది వసతులే ఉండి ఉంటే, యురేనియం ప్రాజెక్టు పేరుతో ఈ సౌకర్యాలను ఎరవేసి మా అభిప్రాయాన్ని లొంగదీసుకునే పరిస్థితే ఉండేది కాదు కదా? ప్రాజెక్టుకు ఒప్పుకుంటేనే మేము ఈ కనీస సౌకర్యాలకు అర్హులమా? లేకపోతే మాకు అడిగే అర్హత లేదా? ఇదే రకమైన ప్రజాస్వామ్యం? దీన్ని ఎలా అర్థం చేసుకోవాలో, ముందు నుయ్యి, వెనుక గొయ్యి లాంటి పరిస్థితి మాది. ఎవరికైనా అర్థమవుతుందా?' అని గనుల ప్రతిపాదిత గ్రామాలలోని యువకులు, స్త్రీలు నిలదీస్తున్నారు.

ఈ అభిప్రాయాన్ని వినాల్సిన ప్రభుత్వం వారి దగ్గరకు ఏ విధంగానూ వెళ్లదు. పైగా నూతన సంవత్సర కానుకగా కేంద్ర అటవీ మంత్రిత్వశాఖ ఒక వైపు వేల ఎకరాల అటవీభూమిని యూసిఐఎల్‌కు అప్పగిస్తూ నిర్ణయం చేసింది. ఇంకో వైపు అడవిని పరిరక్షించమని, మొక్కలు నాటటం ద్వారా పర్యావరణ పచ్చదనాన్ని పెంచాలని, వివిధ స్కీముల పేరు మీద వేలకోట్ల ప్రజాధనాన్ని ఖర్చు చేస్తూ జిత్తులమారి తనాన్ని ప్రదర్శిస్తోంది? ఇదే నాగార్జునసాగర్ పరిసరాల్లో ఒక చిన్న సిమెంట్ ఫ్యాక్టరీకి కూడా అనుమతి నివ్వని ఈ ప్రభుత్వ నిబంధనలు, అత్యంత ప్రమాదకరమైన అణుధార్మిక వ్యర్థాలను వెదజల్లే యురేనియం గనుల తవ్వకానికి ఎలా సడలిపోతున్నాయి? ప్రభుత్వం తలచుకుంటే ఏమైనా చెయ్యగలదా? ఏదైనా ఆపగలదా? ఎందుకు మొదలు పెట్టేది, ఎందుకు ఆపేది ప్రజలకు సంబంధం లేని వ్యవహారమా? ప్రజల భాగస్వామ్యం ఉండాల్సిన ప్రజాస్వామ్యం అంటే ఇదేనా? ప్రజాస్వామ్యంలో ప్రజల భాగస్వామ్యం ఎక్కడ నుంచి మొదలవ్వాలి? ఏ రకంగా మొదలవ్వాలి?

అభివృద్ధి పేరుతో ఏదైనా భారీ ప్రాజెక్టులు నిర్మించ తలపెట్టినపుడు అది ప్రభుత్వమైనా లేదా ప్రైవేటు సంస్థలైనా సరే తప్పనిసరిగా పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ జరిపి ప్రజల అభిప్రాయాలను, అభ్యంతరాలను తప్పనిసరిగా పరిగణనలోకి తీసుకోవాలి. 1997 నుంచి చట్టప్రకారం ఈ ఆదేశం అమలులోకి వచ్చింది. చట్ట ప్రకారం ప్రజలు దీనిలో పాల్గొనటానికి తమ అభిప్రాయాలను స్పష్టంగా చెప్పటానికి అవకాశం ఉన్న వేదిక ఈ పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ. అలాంటి మూడు పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణల్లో ఏకతాటిన గొంతెత్తి నిరసించినా గానీ ఆ అభిప్రాయానికి ప్రభుత్వం విలువ నివ్వకపోవటం నిజంగా సిగ్గుచేటైన విషయం.

రాష్ట్రానికే గర్వకారణమైన నాగార్జునసాగర్ జలాశయానికి 50 సంవత్సరాలు నిండి స్వర్ణోత్సవాలు భారీ ఎత్తున జరుపుకుంటున్నారు. ఈ తరుణంలో, దాని కోసం రాళ్లెత్తిన కూలీల దగ్గరి నుంచీ, ఇంజనీర్లు, కాంట్రాక్టర్లు, రూపకర్తల నుంచి అప్పటి ప్రధానమంత్రి ఇటువంటి ప్రాజెక్టులను ఆధునిక దేవాలయాలు అన్న దాన్ని స్మరించుకుంటూ ఒకవైపు తరిస్తున్నాం. ఇంకొక పక్క ఈ జలాశయం ముంపుకి గురైన గ్రామాల ప్రజలు/నిర్వాసితులు - ముఖ్యంగా ఈ పెదకట్టు, నంబాపూర్ గ్రామస్థులు కనుచూపు మేరలో అతిపెద్ద ఈ జలాశయాన్ని చూస్తూ తాగటానికి గానీ,

(మిగతా 46 వ పేజీలో)

శాసనమండలి పునరుద్ధరణ

జి.లక్ష్మణ్

ఎట్టకేలకు శాసనమండలి పునరుద్ధరణ గురించి శాసనసభ చేసిన తీర్మానాన్ని పార్లమెంట్ ఉభయసభలు ఆమోదించడంతో మన రాష్ట్రంలో శాసన మండలి రావడం ఖాయమైంది. దీంతో ఎగువసభ, దిగువసభ అని రెండు సభలు గల ద్విసభా విధానం మళ్లీ మన రాష్ట్రంలో అమలులోకి రానుంది. ప్రపంచ దేశాలలో అన్ని చోట్ల ఎగువసభ సమాజంలోని వైవిధ్యతకు ప్రాతినిధ్యం కల్పించడానికి ఉద్దేశించింది. ఏకసభా పద్ధతి కంటే ద్విసభా పద్ధతిలో ప్రజాభిప్రాయ వ్యక్తీకరణకు ఎక్కువ అవకాశాలుంటాయి. అందుచే చాలా ప్రపంచదేశాలు కాలమాన పరిస్థితులను బట్టి చిన్నదేశాలు కొన్ని ఏకసభా పద్ధతిని రూపొందించుకున్నాయి. పెద్ద దేశాలు మాత్రం సమాఖ్యలుగా ఏర్పడి వాటి అవసరాలను తీర్చుకునే నిమిత్తం ద్విసభా పద్ధతిని ఏర్పాటు చేసుకున్నాయి. ఈ విధంగా సమాఖ్య వ్యవస్థలో ఎగువసభ అనివార్యం అయింది. జాతి, తెగ, మతం, భాష, ప్రాంతం మొదలైన అంశాలలో వైవిధ్యం గల రాజ్యాలలో కే ఒక్క సర్వసమగ్ర ప్రాతినిధ్యం గల శాసనసభను ఏర్పాటు చేస్తే ఆ ప్రాతినిధ్యం లోపభూయిష్టమవుతుంది. దిగువసభతో పాటు ఎగువసభను ఏర్పాటు చేసుకుంటే ప్రాతినిధ్య లోపాలు చాలా వరకు చక్కదిద్దబడతాయి అని భావించి తమ దేశాలలో ఎగువ సభలను ఏర్పాటు చేసుకున్నారు. తొలుత మన దేశంలో రాష్ట్రాల పునర్విభజనకు పూర్వం పెద్ద రాష్ట్రాలుగా ఉన్నటువంటి బొంబాయి, బీహారు, బెంగాలు, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, పంజాబ్, అస్సాం రాష్ట్రాలలోని ప్రజల మధ్య జాతి, తెగ, మతం, భాష, ప్రాంతం మొదలైన అంశాలలో వైవిధ్యాలు అధికంగా నెలకొని ఉండటం మూలంగా ఆయా రాష్ట్రాలలో 1935 భారత చట్టాన్ని అనుసరించి ఎగువసభలను ఏర్పాటు చేయటం జరిగింది. భాషా ప్రాతిపదికన రాష్ట్రాల పునర్విభజన జరిగిన పిదప తమ రాష్ట్రాలలో ఎగువసభ అక్కరలేదని తొలుత ఒరిస్సా, అస్సాం, మధ్యప్రదేశ్ అసెంబ్లీలు తీర్మానించాయి. ఆ పిదప కొంత కాలానికి 1969 ఆగస్టులో పశ్చిమ బెంగాలు, 1970 జనవరిలో పంజాబ్‌లు తీర్మానించాయి. 1953కు పూర్వం మద్రాసు రాష్ట్రంలో తమిళం, తెలుగు, మలయాళం భాషలు మాట్లాడే మూడు ప్రాంతాల ప్రజలు ఉండేవారు. ఈ మూడు ప్రాంతాల ప్రజల మధ్య ఆచార వ్యవహారాలలోనే గాక తెగ, భాష, ప్రాంతం మొదలగు అంశాలలో వైవిధ్యాలు అధికంగా ఉండేవి. దీన్ని దృష్టిలో ఉంచుకొని పూర్వం మద్రాసు రాష్ట్రానికి ఎగువసభను ఏర్పాటు చేయటం జరిగింది. 1 అక్టోబరు 1953న ఆంధ్ర, రాయలసీమ ప్రాంతాలు మద్రాసు నుండి వేరుపడి ఆంధ్ర రాష్ట్రంగా అవతరించినాయి. ఆ విధంగా నూతనంగా ఏర్పడిన ఆంధ్ర రాష్ట్రానికి ఎగువసభ లేదు. కావాలని కూడా ఆ రాష్ట్రం ఎప్పుడూ కోరుకోలేదు. 1953 నుండి 1956 వరకు కొనసాగిన ఆంధ్ర రాష్ట్రానికి ఏకసభాయుక్తమైన శాసనసభ మాత్రమే ఉండేది. అదే విధంగా 1948 నుండి 1956 వరకు కొనసాగిన హైదరాబాదు రాష్ట్రానికి కూడా ఏకసభాయుక్తమైన శాసనసభ మాత్రమే ఉండేది. మద్రాసు రాష్ట్రంలో ఉన్నప్పుడు శాసనమండలి సభ్యులుగా కొనసాగిన ఆంధ్ర, రాయలసీమ ప్రాంతాల నాయకులు 1 అక్టోబరు 1953లో ఏర్పడిన ఆంధ్ర రాష్ట్రానికి శాసనమండలి లేకపోవడంతో రాజకీయ నిరుద్యోగులుగా మారారు. ఈ రాజకీయ నిరుద్యోగులకు ఒక పురావాస కేంద్రం అవసరమయింది. దానిని దృష్టిలో ఉంచుకొని 5 ఏప్రిల్ 1956న ఆంధ్ర శాసనసభలో 'తెలుగు భాష మాట్లాడే ప్రాంతాలన్నింటిని కలిపి ఒకే రాష్ట్రంగా ఏర్పాటు చేయాలని, ఆ రాష్ట్రం పేరు ఆంధ్రప్రదేశ్ అని ఉండాలని, ఆ సమైక్య రాష్ట్రానికి ఎగువసభను కూడా ఏర్పాటు చేయాలని' ఏకగ్రీవంగా తీర్మానం చేయడం జరిగింది. భాషా ప్రాతిపదికన రాష్ట్రాల పునర్విభజన జరిగి 1 నవంబర్ 1956న ఆంధ్ర, రాయలసీమ, తెలంగాణ ప్రాంతాలతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడ్డది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడిన నెల రోజులకే 1956 డిసెంబర్ 5న రాజ్యాంగంలోని 169వ నిబంధనను అనుసరించి రాష్ట్రానికి విధాన పరిషత్తు ఏర్పాటు చేయాలని పార్లమెంటును కోరుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనసభ తన తొలి సమావేశాల్లోనే ఒక తీర్మానాన్ని ఆమోదించింది. పార్లమెంటు ఆమోదం పొందటంతో 1 జూలై 1959న విధాన పరిషత్తు ఏర్పాటై మన రాష్ట్రంలో ద్విసభాయుక్త శాసన నిర్మాణ పద్ధతి అమలులోకి వచ్చింది. 1983లో తెలుగుదేశం పార్టీ అధికారానికి వచ్చిన వెంటనే విధాన పరిషత్తును రద్దు చేయాలని చేసిన శాసనసభ తీర్మానం పార్లమెంటు ఆమోదం పొంది 1 జూన్ 1985న మన రాష్ట్రంలో ఎగువసభ రద్దయింది. 1989లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత శాసనమండలిని పునరుద్ధరించాలని చేసిన శాసనసభ తీర్మానానికి పార్లమెంటు ఆమోదం లభించలేదు. అయితే మళ్లీ 2004లో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఎగువసభను పునరుద్ధరించాలని చేసిన శాసనసభ తీర్మానానికి పార్లమెంటు ఉభయ సభల ఆమోదం లభించడంతో కొత్త సంవత్సరంలో మన రాష్ట్రానికి ద్విసభాయుక్తమైన శాసన నిర్మాణ సంస్థ రానున్నది. భాషా ప్రాతిపదికన రాష్ట్రాల పునర్విభజన జరిగిన తరువాత చాలా రాష్ట్రాలు తమకు ఉన్న ఎగువసభలు అక్కరలేదని తీర్మానించాయి. ఒకసారి రద్దు అయిన తరువాత తిరిగి ఎగువసభ కావాలని కోరుకున్న రాష్ట్రం మాత్రం ఆంధ్రప్రదేశ్ ఒక్కటే. ఈనాడు మనదేశంలో ఎగువసభలు ఉన్న రాష్ట్రాలు కేవలం ఐదు మాత్రమే. అవి బీహారు, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, కర్నాటక, జమ్మూ కాశ్మీర్ మిగతా రాష్ట్రాలన్నింటా ఏకసభాయుక్తమైన శాసనసభా పద్ధతే అమల్లోవుంది. 1959 నుండి 1985 వరకు మన రాష్ట్రంలో కొనసాగిన ఎగువసభలోని నియోజకవర్గాల వర్గీకరణ ఆంధ్ర ప్రాంతం నాయకులకు అనుకూలంగా ఉంది. వాటిని పునర్వ్యవస్థీకరించని పక్షంలో

క్ర.సం.	జిల్లాల పేర్లు	మండలం	ఎన్నుకొనే సభ్యుల సంఖ్య
1.	శ్రీకాకుళం విశాఖపట్నం	ఉత్తర సర్కారు	నాలుగు
2.	విజయనగరం తూర్పు గోదావరి	మధ్య సర్కారు	నాలుగు
3.	పశ్చిమ గోదావరి కృష్ణ, గుంటూరు	దక్షిణ సర్కారు	ఆరు
4.	ప్రకాశం, నెల్లూరు చిత్తూరు, కడప అనంతపురం	రాయలసీమ	ఆరు
5.	కర్నూలు హైదరాబాద్ మెదక్, నల్గొండ ఖమ్మం, రంగారెడ్డి	దక్షిణ తెలంగాణ	ఆరు
6.	మహబూబ్‌నగర్ నిజామాబాద్ ఆదిలాబాద్ కరీంనగర్, వరంగల్	ఉత్తర తెలంగాణ	ఐదు
		6 మండలాలు	31 సీట్లు

తెలంగాణకు న్యాయం జరిగే అవకాశం లేదు.

విధాన పరిషత్తు నిర్మాణం రాజ్యాంగ నిబంధన 171 ప్రకారం రాష్ట్ర విధానసభ సభ్యుల మొత్తం సంఖ్యకు 1/3వ వంతు సభ్యులతో ఏర్పాటవుతుంది. దీనిని అనుసరించే మన విధాన పరిషత్తు సభ్యుల సంఖ్య 90గా నిర్ణయించడమయింది. ఈ 90 మంది సభ్యులలో 31 మందిని శాసనసభ, మరో 31 మందిని స్థానిక సంస్థల నియోజక వర్గాలు, 8 మందిని పట్టభద్రుల నియోజక వర్గాలు మరో ఎనిమిది మందిని ఉపాధ్యాయ నియోజక వర్గాల నుంచి ఎన్నుకోవడం జరుగుతుంది. మిగిలిన 12 మందిని రాష్ట్ర గవర్నర్ సాహిత్యం, కళలు, శాస్త్రవిజ్ఞానం, సాంఘికసేవ మొదలైన రంగాల్లో నిష్ణాతులైన వారిని నామనిర్దేశ పద్ధతిలో నియమిస్తారు.

రాష్ట్ర విధానసభలో మొత్తం సభ్యుల సంఖ్య 294. అందులో తెలంగాణ వారు 107 : ఆంధ్ర, రాయలసీమ ప్రాంతాల వారు 187. విధానసభ సభ్యులు ఎన్నుకునే 31 కౌన్సిల్ సీట్లను ప్రాంతాల వారీగా పంచితే తెలంగాణకు దక్కవలసిన సీట్లు 12, ఆంధ్ర, రాయలసీమ ప్రాంతాలకు దక్కవలసిన సీట్లు 19. కానీ ఏనాడు కూడా తెలంగాణ ప్రాంతం వారికి గతంలో 8 సీట్లకు మించి దక్కలేదు. రాష్ట్రంలోని ఆంధ్ర, తెలంగాణ, రాయలసీమ ప్రాంతాల మధ్య ఈ 31 సీట్ల పంపకం అనేది ప్రాంతాల వారీగా ఆయా ప్రాంతాల శాసన సభ్యుల సంఖ్యను బట్టి ఎంపిక చేస్తే వివిధ ప్రాంతాల మధ్య సమతుల్యత పాటించినట్లవుతుంది. ఈ విధంగా జరగక పోతే తెలంగాణకు నష్టం వాటిల్లే ప్రమాదముంది. రాష్ట్రంలోని తెలంగాణ, రాయలసీమ, ఆంధ్ర ప్రాంతాల శాసన సభ్యుల సంఖ్యను బట్టి గానీ లేదా ఆయా ప్రాంతాల జనాభాను గానీ లేదా ఓటర్ల సంఖ్యను బట్టిగానీ ఈ 31 సీట్ల పంపకం అనేది చేపట్టాలి. అప్పుడే ఈ మూడు ప్రాంతాలకు సముచిత ప్రాతినిథ్యం లభిస్తుంది.

గతంలో స్థానిక సంస్థల నియోజకవర్గాల నుండి విధాన పరిషత్తుకు సభ్యులను ఎన్నుకోవడం కోసం రాష్ట్రంలోని మొత్తం స్థానిక సంస్థలను ఆరు మండలాలుగా విభజించడం జరిగింది. ఆయా మండలాల నుంచి ఎంత మంది సభ్యులను ఎన్నుకోవాలో కూడా నిర్ధారించడం జరిగింది.

క్ర.సం.	మండలం	పట్టభద్రులు	ఉపాధ్యాయులు
1.	సర్కారు (ఆంధ్ర) జిల్లాలతో కూడిన మండలం	3	4
2.	రాయలసీమ జిల్లాలతో కూడిన మండలం	2	2
3.	తెలంగాణ జిల్లాలతో కూడిన మండలం	3	[illegible]
		8	8

1959-85 సంవత్సరాల మధ్య కాలంలో అమలులో ఉన్న ఈ స్థానిక సంస్థల వర్గీకరణ విధానమే తిరిగి నేడు పునరుద్ధరించబడే కౌన్సిల్‌లో కూడా ఉంటే తెలంగాణకు నష్టం వాటిల్లుతుంది. రాష్ట్ర రాజధానితో కలిపి ఆరు జిల్లాలతో కూడిన రాయలసీమ మండలానికి కూడా ఆరు స్థానాలు ఉండటం ఎంతవరకు శాస్త్రీయం? అదే విధంగా నాలుగు జిల్లాలతో కూడిన దక్షిణ సర్కారు మండలానికి కూడా ఆరు స్థానాలు ఉండటం ఎంతవరకు సమంజసం? ప్రాంతాల వారీగా రాష్ట్రంలోని ఆంధ్ర, రాయలసీమ, తెలంగాణలలో ఉన్న స్థానిక సంస్థల సంఖ్యను బట్టి స్థానిక సంస్థల సభ్యులతో ఎన్నుకునే ఈ 31 కౌన్సిల్ సీట్లను విభజించి ప్రాంతాల వారీగా కేటాయించాలి. అప్పుడే రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల మధ్య సమతుల్యత పాటించినట్లవుతుంది. ఆంధ్ర, రాయలసీమలకు 20 సీట్లు ఉండటం తెలంగాణకు కేవలం 11 సీట్లు ఉండటం అశాస్త్రీయ విభజన కాదా!

గతంలో పట్టభద్రులు, ఉపాధ్యాయ నియోజకవర్గాల నుండి కౌన్సిల్‌కు సభ్యులను ఎన్నుకునే నిమిత్తం రాష్ట్రం మొత్తాన్ని మూడు మండలాలుగా విభజించడం జరిగింది. ఆయా మండలాల నుండి ఎంత మంది సభ్యులను ఎన్నుకోవాలో కూడా నిర్ధారించడం జరిగింది.

గతంలో అమలులో ఉన్న ఈ విభజన లోపభూయిష్టంగా ఉంది. 1959-85 మధ్య కాలంలో కొనసాగిన ఈ విభజన విధానమే తిరిగి నేడు పునరుద్ధరించబడే కౌన్సిల్‌లో కూడా ఉంటే తెలంగాణకు నష్టం వాటిల్లుతుంది. నాలుగు జిల్లాలతో కూడిన రాయలసీమ మండలానికి రెండు ఉపాధ్యాయ నియోజకవర్గాలు ఉంటే రాష్ట్ర రాజధానితో కలిపి పది జిల్లాలున్న తెలంగాణకు మండలానికి కేవలం రెండు నియోజక వర్గాలు మాత్రమే ఉండటం ఎంతవరకు సమంజసం? ఉపాధ్యాయుల, పట్టభద్రుల నియోజకవర్గాల విభజన రాష్ట్రంలోని తెలంగాణ, ఆంధ్ర, రాయలసీమ ప్రాంతాలలో ఉన్న

ఉపాధ్యాయుల, పట్టభద్రుల సంఖ్యనుబట్టి ప్రాంతాల వారీగా నిర్ధారించాలి. అప్పుడే ప్రాంతాల మధ్య సమతుల్యత పాటించినట్లవుతుంది. 1959-85 మధ్యకాలంలో కొనసాగిన మన కౌన్సిల్ ఉపాధ్యాయ నియోజకవర్గాల విభజన.

రాజ్యాంగంలోని 171వ నిబంధన 3 సి ప్రకారం ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులకు ఉపాధ్యాయ నియోజకవర్గంలో ఓటుహక్కు ఉండదు. దీనికి సంబంధించిన రాజ్యాంగ సవరణ జరపలేదు. కాబట్టి దాదాపు లక్షన్నర మంది ఉపాధ్యాయులకు ఓటు హక్కు ఉండదు. ఇక ఉపాధ్యాయ నియోజకవర్గం నుండి పోటీ చేయడానికి ఉపాధ్యాయుడై ఉండాలనే నిబంధన గతంలో లేదు. ఉపాధ్యాయ నియోజకవర్గం నుండి పోటీ చేసి గెలుపొందింది. దీనిని సవరించాల్సిన అవసరముంది.

ఇక గవర్నరు నామనిర్దేశ పద్ధతిలో నియమితమయ్యే 12 మంది నిష్ణాతుల విషయంలో ఏనాడు సరైన నిర్ణయాలు జరిగిన దాఖలాలు గతంలో లేవు. ప్రస్తుతం పునరుద్ధరించబడుతున్న కౌన్సిల్‌కు రాజ్యాంగం నిర్దేశించిన విధంగా నామనిర్దేశ పద్ధతిలో ఈ 12 మంది నియామకం జరుగుతుందనే భరోసా కూడా లేదు. ఈ నియామకాలు ప్రతిసారి గతంలో వివాదాలకు దారితీసినాయి. తెలంగాణలో ఎంతోమంది ప్రముఖులు ఉన్నా గవర్నరు ద్వారా శాసనమండలిలో సభ్యత్వం పొందలేకపోయారు. రాజకీయేతర రంగాలలో నిష్ణాతులైన వారితో నింపాల్సిన ఈ స్థానాలలో గతంలో నింపబడ్డది. రాజకీయాలలో నిష్ణాతులైన వారితోనే.

షెడ్యూల్డ్ కులాలు, తెగల వారికిఅసెంబ్లీ, లోకసభలలో ప్రాతినిధ్యం కల్పించే నిమిత్తం వారికి రాజ్యాంగబద్ధమైన రిజర్వేషన్లు ఉన్నాయి. కౌన్సిల్‌కు అలాంటి రిజర్వేషన్లు లేకపోవడం మూలంగా వారికి అందులో ఎప్పుడూ కూడా సరైన ప్రాతినిధ్యమే లభించలేదు.

క్ర.సం.	జిల్లాలు	ఉపాధ్యాయ నియోజక వర్గాలు
1.	శ్రీకాకుళం, విజయనగరం విశాఖపట్నం	1
2.	తూర్పు గోదావరి పశ్చిమ గోదావరి	1
3.	కృష్ణా	1
4.	గుంటూరు , ప్రకాశం ప్రకాశం	1
5.	నెల్లూరు, చిత్తూరు	1
6.	కడప, కర్నూలు అనంతపురం	1
7.	ఖమ్మం , వరంగల్ , నల్గొండ కరీంనగర్ , ఆదిలాబాద్	1
8.	హైదరాబాద్ రంగారెడ్డి , మెదక్ నిజామాబాద్ మహబూబ్‌నగర్	1
	మొత్తం	8

గతంలో 1959-85 మధ్యకాలంలో కొనసాగిన కౌన్సిల్‌లోని సభ్యులు అత్యధికంగా ఆర్థికంగా, సామాజికంగా ఉన్నత వర్గాల నుండి వచ్చిన వారే. ఏ రాజకీయ పార్టీ కూడా తమ అభ్యర్థుల ఎంపికలో సామాజిక న్యాయ సూత్రాన్ని పాటించలేదు. ఇక శాసనమండలి అధికారాలను పరిశీలిస్తే అసలు అది అవసరమా అని ఎవరికైనా సందేహం కలుగక మానదు. విధానసభ సభ్యులకు రాజ్యసభ సభ్యులను గానీ, రాష్ట్రపతిని గానీ ఎన్నుకునేందుకు ఓటు హక్కు ఉంటుంది. కానీ విధానపరిషత్తు సభ్యులకు ఉండదు. శాసనమండలి ప్రభుత్వానికి వ్యతిరేకంగా అవిశ్వాస తీర్మానాన్ని ఏకగ్రీవంగా ఆమోదించినా ప్రభుత్వంపై దాని ప్రభావం ఉండదు. ఈ సభ ఎంత బలహీనమైందంటే తనకు ఇష్టం కాని బిల్లులను చట్టం కాకుండా విధానపరిషత్తు అడ్డుకోజాలదు. కేవలం జాప్యం చేయగలదు. సాధారణ బిల్లులను పరిశీలన అనే నెపంతో నాలుగు నెలలు, ఆర్థిక బిల్లులను 14 రోజుల వరకు చట్టం కాకుండా జాప్యం చేయవచ్చు. బిల్లులకు విధానపరిషత్తు ప్రతిపాదించే సవరణలకు కేవలం సలహాపూర్వకమైన విలువ మాత్రమే ఉంటుంది. అందుకే ఎగువసభ నిరర్థకమని బి.యస్. రావు, హెచ్.వి. కామత్, కె. సంతానం, జయప్రకాశ్ నారాయణ్ లాంటివారు అభిప్రాయపడ్డారు. సప్రూ కమిటీ సహితం ఇది నిరర్థకమని అభిప్రాయపడింది. గత 25 సంవత్సరాల రాజకీయ చరిత్రను పరిశీలిస్తే మన రాష్ట్రంలో అనేక ఉద్యమాలు కొత్త సామాజిక శక్తులను రాజకీయ వేదికపైకి తీసుకువచ్చాయి. ముఖ్యంగా తెలంగాణ వంటి ప్రాంతీయ గుర్తింపు పోరాటాలు, దళిత ఉద్యమాలు, స్త్రీవాద ఉద్యమాలు, వెనుకబడిన కులాల పోరాటాలు రాజకీయ ప్రాతినిధ్యం కోరుతున్నాయి. అయితే రాజ్యాంగం సూచించే కౌన్సిల్ నిర్మాణం స్థానిక సంస్థలకు, పట్టభద్రులకు, ఉపాధ్యాయులకు మాత్రమే ప్రాతినిధ్యం కల్పిస్తుంది. మారుతున్న సామాజిక వైవిధ్యతలకు ఇది ఏ మేరకు స్థానం కల్పిస్తున్నది అన్నది ప్రశ్న. ప్రపంచ దేశాలలో అన్ని చోటా ఎగువసభ సమాజంలోని వైవిధ్యతకు ప్రాతినిధ్యం కల్పించడానికి ఉద్దేశించింది. అందుకు కౌన్సిల్ పునరుద్ధరణ చారిత్రక అవగాహన ఆధారంగా జరగాల్సి ఉంటుంది. అందుకు అనుకూలంగా రాజ్యాంగాన్ని సవరించి ఈ శక్తులకు ప్రాతినిధ్యం కల్పించాలి. వీరితోపాటు కార్మికవర్గం, రైతువర్గాలకు స్థానం కల్పించాలి. దాంతోపాటు కౌన్సిల్ 90 స్థానాలను ఆంధ్ర, రాయలసీమ, తెలంగాణ ప్రాంతాలలో ఉన్న జనాభాను ప్రాతిపదికగా తీసుకొని విభజించాలి. అప్పుడే రాష్ట్రంలోని మూడు ప్రాంతాల మధ్య సమతుల్యత పాటించి వైవిధ్యతకు స్థానం కల్పించినట్లవుతుంది. తద్వారా ప్రజాస్వామ్యం బలపడుతుంది. ❑

అవకాశాలు లేని యువత - తప్పుదోవ పట్టిస్తున్న విధానాలు

డా. అందె సత్యం

మన దేశంలో 15 నుండి 45 సంవత్సరాల మధ్య వయస్కులు సుమారు 40 కోట్ల మంది వున్నారు. వీరందరు పనిచేయడానికి, ఉద్యోగం చేయడానికి శక్తి యుక్తులు ఉన్నవారే. చదువులేని వారికి పనిదొరకడం, చదువుకున్న వారికి ఉద్యోగం దొరకడం గగన కుసుమంగా మారింది. అన్ని విధాల చదువుకొన్న 40 కోట్ల మంది యువతీ యువకులు కాల్ లెటర్ కొరకు ఎదురుచూస్తున్నవారే. ప్రతి సంవత్సరం 50 నుండి 60 లక్షల మంది ఉద్యోగాల కొరకు ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్‌లో పేర్లు నమోదు చేసుకొంటున్నారు. కాని దేశం మొత్తంలో అవకాశాలు దొరుకుతున్నవారు నాలుగు లక్షల మంది లోపే. బతికేందుకు ఆదాయం వచ్చే ఆస్తులున్న వారు చాలా తక్కువ మంది వున్నారు. కనీస అవసరాలు తీరడానికి ఏదో ఒక పనికై ఎదురుచూస్తున్నారు. అవకాశాలు లేనివారు ఒక పక్క ఉండగా ఉద్యోగం, ఉపాధి కొరకు ఎదురు చూసి వయస్సు దాటుతున్నవారు ప్రతి సంవత్సరం 75 లక్షల మంది ఉంటున్నారు. ఉద్యోగం కోసం ఎదురు చూసేవారి సంఖ్య ప్రతి రోజు 20 వేల మందిగా పెరుగుతోంది. దేశ ఆర్థిక వ్యవస్థ పనితీరు మంచిగుందని అనుకున్నా ఆ పెరుగుదల ఉద్యోగికి సంబంధం లేకుండా ఉంది. 1980వ దశకంలో కన్నా 90వ దశకంలో ఆర్థిక వ్యవస్థ పనితీరు బాగుందని అంచనా వేశారు. కాని ఈ అభివృద్ధి నిరుద్యోగం సృష్టించేది, గమ్యంలేనిది, అసమానతలు పెంచేదిగా వుంది. అభివృద్ధి మెరుగైంది అనుకున్నా ఉద్యోగిత విషయంపై కనికరం లేనిదిగా వుంది. మొత్తంగా ఉద్యోగితా వ్యాకోచత్వం 0.1 శాతం తగ్గింది. 1992-97, 1983-91 మధ్య ఉపాధి పెరుగుదల రేటు 1.6 శాతం తగ్గింది. 1990-98 మధ్య 1 శాతం తగ్గింది. ఇది 1998లో రుణాత్మకంగా ఉంది.

కేంద్రంలో ఏ రాజకీయ పార్టీ అధికారంలోకి వచ్చినా సృష్టించే ఉద్యోగాలు కోటిపైనే అంటున్నాయి. ఆచరణలో సాధించినది శూన్యం. ఆచరణలో పెట్టుబడి వ్యూహం అనుసరిస్తూ మాటల్లో ఉపాధి వ్యూహం అనుసరించడమే కారణం. 1991 తరువాత ఎల్.పి.జి. వ్యూహం అనుసరించడం ప్రారంభమైన తరువాత ప్రభుత్వ రంగం ప్రాధాన్యత కోల్పోయింది వాస్తవం. ప్రభుత్వ పెట్టుబడులు మరింత తగ్గాయి. ప్రపంచ బ్యాంకుతో కుదుర్చుకొన్న ఒప్పందాల్లో భాగంగా లాభాల్లేని పరిశ్రమల మూత విఆర్ఎస్, గోల్డెన్ హాండ్ షేక్ తదితర పథకాల ద్వారా ప్రతి సంవత్సరం 1.9 శాతం ఉద్యోగాలను తగ్గించే కార్యక్రమం కొనసాగుతోంది. విదేశీ పెట్టుబడుల ద్వారా ఉద్యోగ సృష్టి జరుగుతోందని సరళీకరణ తరువాత భారత పాలనా కర్తలు ఆశపడ్డారు. విదేశీ పెట్టుబడులలో ఉద్యోగాలు సృష్టించే ప్రత్యక్ష పెట్టుబడులు తక్కువ. ఉన్న పరిశ్రమలనే స్వాధీనం చేసుకొనే పెట్టుబడుల వలన అదనపు ఉద్యోగిత సృష్టించబడదు.విదేశీ - స్వదేశీ ఒప్పందాల కర్తలకు శ్రమ సాంద్రతలో ఉన్న నమ్మకం కన్నా పెట్టుబడి సాంద్రతలోనే నమ్మకం ఎక్కువ. ఒక వైపు పెట్టుబడి ప్రవాహంలో సాంప్రదాయ వృత్తులన్నీ కొట్టుకొని పోయి, స్వయం ఉపాధి కోల్పోయి మార్కెట్‌లో నిస్సహాయ స్థితిలో ఉన్నారు. మరొకవైపు నూతన టెక్నాలజీ నిరుద్యోగాన్ని పెంచుతోంది.

వ్యవసాయరంగంలో సైతం అదనపు ఉపాధి అవకాశాలు దొరకకపోగా పని దినాలు పడిపోయాయి. గ్రామీణ రంగంలో ఉపాధి కల్పనకు రూపొందించిన పథకాలు రోజ్‌గార్ యోజన, ఐ.ఆర్.డి.పి. ట్రైసెమ్, సిట్రా, డ్వాక్రా, జె.ఆర్.వై., ఇ.ఏ.ఎస్. మొదలైనవన్నీ నిరంతర ప్రాతిపదికన ఉపాధి కల్పించలేకపోయాయి. ఈ పథకాలన్నీ సగభాగం రాజకీయ నాయకుల, అధికారుల జేబులు నింపగా మిగతా సగభాగం న్యాయం చేకూర్చలేక పోయాయి. నేడు కొత్తగా గ్రామీణ ఉపాధి హామీ పథకం పార్లమెంట్ ఆమోదించింది. దాని ఫలితం ఎలా ఉంటుందో చూడాలి. పని హక్కు ప్రాథమిక హక్కుల్లో చేరిస్తే ప్రయోజనం ఎంత ఉంటుందో చర్చ జరగాలి.

ప్రముఖ ఆర్థికవేత్త అమ్లన్ దత్తా మాటల్లో నిరుద్యోగులైన వారు ఊరికే కూర్చోరు. పక్కదారులు పట్టి నేర మార్గాలు తొక్కే ప్రమాదం ఉంది. వారు విధ్వంసకరమైన సిద్ధాంతాల వైపు ఆకర్షితులయ్యే అవకాశం ఉంది. ఒకప్పుడు పంజాబ్‌లో మత తత్వంతో మొదలైన భింద్రన్‌వాలే ఉగ్రవాదం రెండు దశాబ్దాల కాలం కొనసాగడానికి నూతన వ్యవసాయ వ్యూహంలో పనికోల్పోయి నిస్సహాయతకు గురైన గ్రామీణ యువకులే కారణమని సాంఘిక వేత్తలు అన్నారు.

సహజంగానే 15 నుండి 25 సంవత్సరాల మధ్య కుటుంబ భారం పడకపోవడం వలన ఆదర్శాలతో జీవించడానికి ప్రయత్నం చేస్తారు. గతంలో స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్న వారందరూ ఇదే వయస్సులో ఆకర్షితులైన వారే. నేడు సినిమాలు, టెలివిజన్ ప్రభావం వలన కృత్రిమ హీరోయిజంను అనుకరిస్తున్నారు. హారర్ సీరియల్స్ ప్రభావం, సెక్స్ ఎపిసోడ్స్, యువత మీద నెగెటివ్ ప్రభావం కలుగజేస్తున్నాయి. విదేశీ, స్వదేశీ ఛానల్స్ ద్వారా పశ్చిమ సంస్కృతి త్వరితంగా ప్రవేశిస్తోంది. యువత ఈ సంస్కృతిని త్వరితంగా అనుసరించడంతో విదేశీ సరుకులకు తేలికగా మార్కెట్ లభిస్తోంది. స్వాతంత్ర్య దినోత్సవాలలో, నిర్మాణాత్మకమైన సదస్సులలో కనబడని యువత వెన్చర్స్ మ్యూజికల్ నైట్స్, సైబర్ క్లబ్బులలో కనబడుతున్నారు.

ప్రపంచీకరణ తరువాత వచ్చిన సంస్కృతి ప్రభావం

ప్రభుత్వం - నక్సల్స్ - చర్చలు

| బత్తుల పున్నయ్య |

'నక్సల్స్‌తో చర్చలు జరపండి. సామాజిక ఆర్థిక రంగ పరిధుల్లో మానవతా దృక్పథంతో వారి సమస్యలను పరిష్కరించాలి. నక్సల్ సమస్య గిరిజనాభివృద్ధితో ముడిపడివుంది. (ఇంతవరకు జరుగలేదని అర్థం) గిరిజన ప్రాంతంలో నిర్ణీత సమయంలో భూమి రికార్డులను తయారు చేసే కార్యక్రమాన్ని పూర్తి చేయాలి. గిరిజన ప్రాంతంలో ఆరోగ్యం, పౌష్టికాహారం సమస్యలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నవి. వాటిపై దృష్టి సారించి పరిష్కరించాలి. ప్రజల సమస్యలను పరిష్కరించాల్సిన ప్రభుత్వమే... ప్రజలకు సమస్యగా మారుతోంది.'

చండీఘడ్‌లో కాంగ్రెస్ సి.యం.లనుద్దేశించి శ్రీమతి సోనియాగాంధీ అన్నారు. (వార్త 8 అక్టోబర్ 2005)

మంచి సమయంలో కలిసివచ్చిన ఆలోచన (చర్చలు) వెయ్యి సైన్యాల కంటె బలమైంది. - వోల్టేర్

గత ప్రభుత్వం నక్సలైటు అంశంపై ప్రజాతీర్పుకై శాసనసభ గడువుకు ముందే ఎన్నికలు కోరగా నక్సల్స్‌తో బేషరతు చర్చలు జరుపుతామనే ముఖ్యమైన నినాదంతో అధికారం చేపట్టి అన్న ప్రకారం అక్టోబర్ 2004లో డా॥ రాజశేఖరరెడ్డి ప్రభుత్వం చర్చలు జరిపింది. ఆ చర్చల్లో మావోయిస్టులు, తోడుగా జనశక్తి నాయకులు పాల్గొని ఒక అనూహ్యమైన పండుగ వాతావరణానికి కారకులయ్యారు. నాటి ప్రశాంతతకు ప్రజల్లో మాటలకందని ఆనందపరవశం. యిరు వర్గాల (నక్సల్స్, ప్రభుత్వం)పై ప్రశంసపరంపరలు, నాటి రోజుల్లో మీడియా పాత్ర నభూతో నభవిష్యత్. అక్టోబర్‌లో మొదటి దఫా చర్చలు ముగిశాయి. ప్రజలు శాంతి పవనాలను ఆస్వాదించారు. గతాన్ని పీడకలగా మరిచిపోయారు.

డిజిపి సుకుమార పదవీ విరమణ తరువాత సేన్ ఆ పదవిని చేపట్టారు. కారణాలు ఏమైనా, ఎవరైనా మరల అక్టోబర్ 2004 ముందున్న భయానక వాతావరణం మొదలైంది. శాంతి పవనాల స్థానంలో భయంకర వడగాల్పులు మొదలయ్యాయి. శాంతి చర్చలకు పునాదులు వేసిన పౌరస్పందన సభ్యులు, మేధావులు అవాక్కులయ్యారు.

ఇహ ఒక పక్క నక్సలైట్లను మట్టుబెట్టే కార్యక్రమంలో భాగంగా బూటకపు ఎన్‌కౌంటర్లు, విష ప్రయోగాలు, కోవర్టు కాండలు లాంటి దమనకాండ చివరకు రియాజ్‌తో సహా, విజయ్, గిరి, గౌతంలను 30 జూన్ 2005న హైదరాబాద్‌లో పట్టుకొని, మీడియా వారు హోంమంత్రితో సహా జనానికి తెలిపినా తెల్లవారుజామున కరీంనగర్ బదనకల్ గ్రామ శివార్లో ఎన్‌కౌంటర్. మారణకాండ పోలీసు శాఖ ప్రధాన కర్తవ్యంగా వుంది. నక్సల్స్ ఏరివేత క్రమంలో 'అనుమానం వస్తే కాల్చేయండి, పట్టుబడితే దూరంగా తీసుకెళ్లి ఎన్‌కౌంటర్ చేయండి' అనే ఆజ్ఞను కొత్తగూడెం సి.ఐ. తోటి సబ్‌ఇన్‌స్పెక్టర్‌ను అనుమానంతో ఎలాంటి హెచ్చరికలు చేయకుండా కాల్చి చంపి క్రమశిక్షణ గలలో రికార్డు సృష్టించాడు.

ఇన్‌ఫార్మర్‌ల నెపంతోను, కోవర్టులను, ఏండ్ల క్రిందట జరిగిన వేంపెంట దళితుల సజీవ దహనకాండకు జవాబుగా మూకుమ్మడి హత్యలు, 15 ఆగస్టు 2005న పానెల్ స్పీకర్ నర్సిరెడ్డితో సహా పది మందిని కాల్చి చంపిన మారణకాండ దిగ్భ్రాంతిని కలుగజేసింది.

ఇలా నిరాటంకంగా నేటి వరకు ఈ హింస, ప్రతిహింస ఇరువర్గాల చంపుడు కార్యక్రమాల మధ్య సామాన్య జనం హతాశులవుతున్నారు.

అన్నలు ఆయుధాలు విడిస్తేనే రెండోసారి చర్చలు అని ముఖ్యమంత్రి ఎన్నికల నినాదాల్లో ప్రధానమైన బేషరతు చర్చల వాగ్దానాల్ని భగ్నం చేస్తూ తరచుగా ప్రకటనలిస్తున్నారు. ఇహ శాంతి చర్చల బదులు ప్రజలు కంటిమీద కునుకు లేకుండా కునారిల్లుతున్నారు.

మావోయిస్టులు ప్రజలపై ప్రభుత్వ దమనకాండను బేరీజు వేసుకోకుండా చంపుడు కార్యక్రమాన్ని సాగిస్తున్నారు. దానికి ప్రతిగా పోలీసు జులుం, ఎన్‌కౌంటర్లతో ఆయా ప్రాంత ప్రజలు భయకంపితులవుతున్న అవాంఛనీయ పరిస్థితికి ప్రకాశం జిల్లా ఒక ఉదాహరణ. గత మే 2004లో ఒంగోలు ఎస్.పి.పై జరిగిన దాడికి ప్రతిగా వందలాది మంది దళిత బహుజనులను, యువతను అరెస్టులు, వేధింపులకు గురి చేస్తోంది ప్రభుత్వం. పరిస్థితి ఎంత దారుణంగా వుందంటే బాధితులకు సానుభూతి చెప్పటానికి కూడ

యువతులపై కూడా ఉంది. అందాల పోటీలు భారతీయ సంస్కృతిని నాశనం చేస్తున్నాయని మితవాదులు వాపోతున్నారు. యువతులను మార్కెట్ సరుకుగా మారుస్తున్నాయని అతివాదులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అందాల పోటీలు నిర్వహించి, యువతులలో అందాల ఆరాటం పెంచి బహుళజాతి సంస్థలు కాస్మెటిక్స్ మార్కెట్‌ను పెంచుతున్నాయి.

యువత పాత్ర లేనిదే దేశ భవిష్యత్ నిర్మాణాన్ని పటిష్టం చేసుకోవడం సాధ్యం కాదు. దారి తప్పితే విధ్వంసం మిగులుతుంది. భవిష్యత్తు ప్రశ్నార్థకం అవుతుంది. ❑

పౌరహక్కుల, దళిత బహుజన సంఘాలు భయపడుతున్నాయి. కొందరు ఎన్‌కౌంటరయ్యారు. వారి శవ దహనానికి రావటానికి బంధువులు కూడా భయపడుతున్నారు.

అయితే ఈ ప్రాంత దళిత బహుజనులు తమ గుండెల్లో దాచుకొన్న శ్రీమతి ఇందిరమ్మ నామస్మరణతో కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి స్థానిక శాసనసభ్యుని, పార్లమెంటు సభ్యుని గెలిపించారు. ఈ మధ్య సెప్టెంబర్ 2004లో ఈ రచయిత ఒంగోలు నల్లమల అడవుల సమీప గ్రామంలో సామాన్య ప్రజలను కలిసినప్పుడు 'అయ్యా! ఇందిరమ్మ రాజ్యం వస్తుందని - కనీసం ప్రశాంతంగా బతకొచ్చని రాజశేఖరరెడ్డి మీద నమ్మకంతో ఓటు వేస్తే ఇప్పుడు పైకి కనపడని భయంకర బతుకులీడుస్తున్నాం - మాకేమి వద్దయ్యా -- పోలీసుల చెరనుండి విముక్తి చేస్తే చాలయ్యా! - అంతే!' అని వాపోతున్నారు. నల్లమల అడవి ప్రాంత గిరిజనులు సమీప అడవుల్లోకి పోయి జిగురు, బంక, కట్టెలు తెచ్చి అమ్ముకొని తమ కుటుంబాలను గడుపుతున్న క్రమంలో నేడు పోలీసులు అడవిలోకి పోనివ్వనందున కనీస సంపాదన లేక ఆకలికి తట్టుకోలేక స్థానికంగా దొరికే బంకమన్నునే పప్పుగా వాడుకొని పొట్ట నింపుకొనే దారుణ పరిస్థితి హృదయ విదారకమయింది.

నక్సలైట్లు అమలు జరిపే చంపుడు కార్యక్రమం వల్ల సామాన్య ప్రజలు గురౌతున్న దారుణ పరిస్థితులను, నాయకులు గుర్తెరిగి ప్రవర్తించాలి. ఎవరు చేసినా ప్రజలు చంపుడును సహించరని యిరువర్గాలు గమనించాలి. ఈ విధమైన పోలీసు-మావోయిస్టుల చెలగాటం వల్ల దళిత బహుజనులు దమనకాండకు గురౌతున్నారు.

''తాడిత పీడిత వర్గాలకు అండగా, బడుగు బలహీన వర్గాలకు సామాజిక ఆర్థిక న్యాయం కోసం ఉద్యమిస్తున్న మేము హింస చేయటం లేదు. కేవలం ఆత్మ రక్షణ కొరకే ఆయుధాలు ధరిస్తున్నాం. ప్రజాస్వామ్య ముసుగులో అధికారం చలాయిస్తున్న ధనిక అగ్రకుల పాలక వర్గాలు, మాఫియా గ్యాంగులు మాపై దుష్ప్రచారం చేస్తున్నారు. మొదటిసారి చర్చల్లో వేలాదిమంది ప్రజలు వారి దృష్టిలోకి తెచ్చిన ప్రజా సమస్యలు పరిష్కరిస్తే అనుకూలంగా ఉండే ధోరణిలో మాట్లాడుతున్నారు. అదీకాక ఈ బూర్జువా ఎన్నికల ద్వారా వచ్చే ప్రజాస్వామ్యంలో మాకు నమ్మకం లేదు. అందుకే ఎన్నికలను బహిష్కరిస్తున్నాం'' అంటున్నారు నక్సలైట్లు. ఇక్కడ ఒక పరోక్ష వాస్తవం వుంది. బూర్జువా ఎన్నికల ద్వారా అధికారానికి వచ్చిన ప్రభుత్వంతో చర్చలు జరిపిన వారికి పరోక్షంగా ఈ వ్యవస్థకు అనుకూలత ఉన్నట్లే భావించాలి. ఈ వాస్తవాన్ని ప్రభుత్వం గమనించి ఎన్నికల నాటి వాగ్దానాన్ని (బేషరతు చర్చలు) అమలు జరపాలి. అయితే నక్సలైట్లు గమనించాల్సిన విషయంలో ముఖ్యమైంది వర్గ స్వభావం కూడా లేక పోలేదు. అందువల్ల మన సమాజాన్ని కుల-వర్గ-కుల సమాజంగా విశ్లేషించాలి. మొదట దేశంలో మహాత్మాజ్యోతిరావ్‌పూలే, ఆయన స్ఫూర్తితో డా॥ బి.ఆర్. అంబేద్కర్, ఈ సమాజానికి బలైన, బలవుతున్న ఎస్సీ, ఎస్టీలు, తోటి (సహ) బిసీలు తదితర పీడిత వర్గాల వారి విముక్తి కొరకు ఉద్యమాలు నడిపి తమవంతు కర్తవ్యాన్ని నెరవేర్చారు. అంబేద్కర్ బడుగు బలహీన వర్గాలైన ఎస్సీ, ఎస్టీ, బిసిల సామాజిక ఆర్థిక న్యాయం కోసం కులాన్ని, వర్గాన్ని మేళవించి దళితబహుజన కార్మిక కర్షకులతో ఇండిపెండెంట్ లేబర్ పార్టీని (1930) స్థాపించి, ఆనాటి కమ్యూనిస్టు నాయకులు శ్రీపాద డాంగే లాంటి వారితో జతగలిపి తాడిత పీడిత వర్గాల విముక్తికై అద్భుత ఫలితాలను సాధించారు. నాటి (1930-40) బొంబాయి ప్రావిన్స్-కౌన్సిల్‌లో ప్రతిపక్ష నాయకుడుగా కార్మిక కర్షకుల దళిత బహుజనుల కొరకు అనేక చట్టాలు చేయటానికి కృషి చేశారు. కాబట్టి మన సమాజంలో దళిత బహుజనులు కులభావంతోనూ, అలానే వర్గ భావంతోనూ, తాడిత పీడిత వర్గకుల శ్రామికులు, పూలే వారసులు వారే. అంబేద్కరిస్టులు వారే. సోషలిస్టులు, మార్క్స్, కమ్యూనిస్టులు వారే, వారే దళిత బహుజనులు.

కార్మికులందరికి (వర్గ) కార్మిక దృక్పథం వుండదు. విప్లవోద్యమాల్లో హిందూ అగ్రకుల తత్వ ధోరణులు తలెత్తుతాయి. దానిని సరైన సిద్ధాంత విధానాలతో పరిష్కరించుకోవాలి. కుల సమస్య విలక్షణమైంది. వ్యవసాయ విప్లవం-కులనిర్మూలన జోడించి ఏక కాలంలో పోరాటం చేయాలి. కులం నిశ్చలమైంది. పునాదిలో మార్పులు వచ్చినా - సామాజిక స్థితిలో కట్టుబాట్లలో మార్పులు చోటు చేసుకోవటం లేదని అన్నారు జనశక్తి చర్చల ప్రతినిధి అమర్ (విజయవిహారం, మార్చి 2005) కాబట్టి కుల స్వభావం ప్రధానమైందనేది వాస్తవం. భారతదేశంలో వర్గం, కులం, ఆయా పరిస్థితుల్లో సామాజిక-ఆర్థిక రంగాలను శాసిస్తూ రాజ్యాధికారానికి పునాది కాబట్టి దేశంలో అంబేద్కర్, పూలే సామాజిక ఆర్థిక సిద్ధాంతాలను, వర్గ దృక్పథం గల వామ పక్షభావాలను సమ్మేళన చేసి పీడిత బడుగు బలహీన వర్గాలకు రాజ్యాధికారం చేకూర్చే క్రమంలో బహుజన వామశక్తి అనే సంస్థను జాతీయ స్థాయిలో ప్రారంభించటం (2003) జరిగింది. వామపక్ష వర్గ దృక్పథంలో ఉద్యమిస్తున్న సమస్త ఉద్యమ నాయకులు మావోయిస్టులతో సహా బహుజన వామశక్తికి అండగా ఉండి తాడిత పీడిత వర్గాలకు రాజ్యాధికారం చేకూర్చాలి. ఆలా కాని పక్షంలో నేడున్న బూర్జువా ప్రజాస్వామ్య వ్యవస్థ ఇంకా పటిష్టమవుతుంది.

భారతదేశ సామాజిక పరిస్థితులననుసరించి కావలసిన ప్రజాస్వామ్యం సమాజంలోని అన్ని కులాలు ఆయా కులాల జనాభా నిష్పత్తిలో రాజ్యాధికారం చేపట్టటమే నిజమైన ప్రజాస్వామ్యం. ఈ వాస్తవాన్ని మావోయిస్టు, జనశక్తి నాయకులతో పాటు కమ్యూనిస్టులందరు గమనించాలి. భారతదేశంలో ప్రత్యేక సామాజిక పరిస్థితులను బట్టి అన్ని కులాల జనాభా ప్రకారం - పంచాయతీ నుండి పార్లమెంటు వరకు దళిత బహుజనులు - అధికారం చేజిక్కించుకోవటమే నిజమైన ప్రజల ప్రజాస్వామ్యం.

ప్రజాస్వామ్యంలో పోలీసు, సైన్యం, అనుమతి పొందిన కొన్ని రక్షణ వ్యవస్థలోని వారు మాత్రమే ఆయుధాలు కలిగి వుండాలి. అంచేత నక్సల్స్ ఆయుధాలు విడిచి పెడితేనే చర్చలు అని షరతు పెట్టి ప్రభుత్వం ఎన్నికల వాగ్దానమైన 'బేషరతు చర్చలు'ను బేఖాతరు చేయటం అయింది. అమెరికా రాజ్యాంగంలో ప్రభుత్వం ప్రజలకు రక్షణ కలుగచేయలేదు కాబట్టి పౌరుడు తన రక్షణ కొరకు ఆయుధాలు కలిగుండవచ్చు. అయితే మన రాజ్యాంగం ప్రకారం ప్రభుత్వం ప్రజల రక్షణకు పూచీ యిస్తుంది కాబట్టి ఈ షరతు అని

ప్రకటిస్తుంది. ప్రజలకు ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ, బిసి తదితర తాడిత పీడిత వర్గాలకు ఎటువంటి రక్షణ కలుగజేస్తుందో ప్రజలకు తెలుసు. ఇది పెద్ద చర్చనీయాంశం. కారంచేడు, చుండూరు, నీరుకొండ హత్యలు దీనికి సాక్ష్యాలు.

ప్రపంచంలోని అనేక మంది మేధావులు ప్రజాస్వామ్యానికి ఇచ్చిన నిర్వచనాలు ఏవి గూడా నేటి ప్రజాస్వామ్య పరిధిలో లేవు. అబ్రహం లింకన్ నిర్వచనం ప్రజల కొరకు, ప్రజల చేత పరిపాలింపబడుతున్న ప్రజల యొక్క ప్రభుత్వమే ప్రజాస్వామ్యం. అయితే నేడు రాష్ట్రంలోనూ, దేశంలోను ప్రజల (ఓట్ల)ను కొనుక్కొని ప్రజలకు దూరమైన ప్రభువు పాలన అయింది. మొత్తంగా ఏ పార్టీలోనైనా (సిపిఐ, సిపియంలు స్వల్పంగా మినహాయింపు) ధనిక భూస్వామ్య అగ్రకులాలదే రాజ్యాం-ఉదాహరణకు నెల్లూరు జిల్లాలో ఎమ్మెల్యేలు పదకొండి మందికి గాను (ఎస్సీలు పోను) ఎనిమిది మంది ఒకే కులం వారు. ఆ జిల్లానుంచే ఇతర జిల్లాలో చొరబడి ఐదుగురు అదే కులం వారు ఎం.పీలు. అలానే మహబూబ్‌నగర్ జిల్లాలో 11 మందికి గాను 9 మంది ఒకే కులం వారు. రాష్ట్రం మొత్తంలో అదే హవా. ధనిక భూస్వామ్య అగ్రకుల ప్రజాస్వామ్యం అసలు ప్రజల ప్రజాస్వామ్యమే కాదు. అందుకే మాజీ అమెరికా రాయబారి గాల్ బ్రెత్ 'భారతదేశంలో ప్రజాస్వామ్య ప్రభుత్వం లేదు. ఉన్నదల్లా పనిచేస్తున్న అరాచక ప్రభుత్వం' అన్నాడు, అలాగే ఇప్పుడు మనం పాటిస్తుంది ప్రజాస్వామ్యం అని నేను విశ్వసించను. ఇది పెట్టుబడిదారీ వాదానికి ముసుగు మాత్రమే. అని మాజీ ఎన్నికల కమీషనర్ లింగ్డో అభిప్రాయపడ్డారు. రాజ్యాంగంలో 320, 322 ఆర్టికల్స్ ప్రకారం పార్లమెంటు (లోక్‌సభలో మాత్రమే), రాష్ట్ర శాసన సభల్లో రిజర్వేషన్‌ల ప్రకారం ఎస్సీ, ఎస్టీ, ఎం.పీలు, ఎంఎల్.ఎలు ఉన్నారు. అయితే అవి ఎస్సీ, ఎస్టీలకు గాక ధనిక భూస్వామ్య అగ్రకుల పాలక రాజకీయ పార్టీ అధినేతలకు రిజర్వ్ అయినట్లు లెక్క. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులను తమకు లోబడి ఉండే తమకు అనుకూలమైన వారికి టిక్కెట్లిచ్చి ఎం.పి., ఎం.ఎల్.ఎ.లుగా గెలిపించుకొంటున్న అగ్రకుల రాజకీయ పాలేరీయం తెలిసిందే. అందుచేత వారికి ప్రజా సమస్యలపై స్పందించే స్వేచ్ఛ లేదు. అందుకే జాషువా ''చేతులెత్తమనిన చేతులెత్తువారు ఆవులించమనిన ఆవులించువారి'' అని ఎం.పీలపై, ఎం.ఎల్.ఎలపై వ్యంగ్య పద్యం రాశారు. ఇదే ప్రజాస్వామ్యమని ఏలినవారు ప్రకటించటం దౌర్భాగ్యం. పూర్వం రోమ్‌లో 50 శాతం ప్రభువులు, 50 శాతం బానిసలున్న ప్రజాస్వామ్యంలో యిరువర్గాలకు ఓటు హక్కున్నా, బానిసలకు పరిపాలనలో పాలు పంచుకొనే హక్కుగాని, తమ సమస్యలను చర్చకు తెచ్చే హక్కుల్లేవు. అన్ని హక్కులు రోమ్ ప్రభువులవే. దీనినే అథేనియన్ ప్రజాస్వామ్యం అంటారు. కాబట్టి ఏ రాజకీయ పార్టీ ఏ రూపంలో అధికారానికి వచ్చినా దళిత బహుజనులకు అథేనియన్ ప్రజాస్వామ్యం లాంటిదే. కాని ప్రజల ప్రజాస్వామ్యం కాదు.

రాష్ట్రానికి నక్సల్ సమస్య కొత్తగా ఇప్పుడే రాలేదు. 1967-68 నుండి వుంది. శ్రీమతి ఇందిరాగాంధీ తరఫున మన రాష్ట్రంలో 1982లో ప్రణాళికా సంఘం సభ్యుడుగా డా॥ మన్‌మోహన్‌సింగ్ పర్యటించి 'ఆంధ్రప్రదేశ్‌లో సంపన్న భూస్వామ్య వర్గాల దోపిడీకి, దౌర్జన్యాలకు దళిత బహుజనులు, దళితులు గిరిజనులు పీడితవర్గాలు గురౌతున్నారు. ఆ దోపిడీ దౌర్జన్యాలను అరికట్టడమే నక్సల్ సమస్యకు పరిష్కారం' అని నివేదికను సమర్పించారు. ఇదే అంశంపై నక్సలైట్ల ఏరివేత రాక్షస కార్యక్రమంలో భాగంగా నిజామాబాద్‌లో పరీక్ష హాలు నుండి (ఎస్.ఎస్.సి. 1985) దళిత బహుజన విద్యార్థులను పట్టుకెళ్లి కాల్చి చంపిన పోలీసుల దుర్మార్గానికి స్పందిస్తూ నాటి ఎస్సీ, ఎస్టీ, ఎమ్.ఎల్.ఎలకు మంత్రులకు ఈ రచయిత బహిరంగ లేఖ రాయటం జరిగింది. అలానే భౌగోళిక దక్షిణ దేశాల సౌత్ కమిషన్‌కు సెక్రటరీ జనరల్‌గా మన్మోహన్ సింగ్ 1990లో తన నివేదికలో దక్షిణ దేశాలు ఇండియా, పాకిస్తాన్, బంగ్లాదేశ్, బర్మా, ఆఫ్రికా దేశాలలో ప్రజల మధ్య ఆర్థిక అసమానతలు అనూహ్యంగా పెరిగాయి. సమాజాల్లో దొరలు-బానిసలు, యజమానులు- సేవకులు, పీడకులు-పీడితులు యిలా స్వేచ్ఛ, సమభావం లేకుండా మానవత్వం కరువైంది. ఈ దుస్థితులను అరికట్టడానికి, ఆయాదేశాల్లో సామాజిక ఆర్థిక న్యాయం కలిగించాలి. ప్రాథమిక హక్కులు, పౌర హక్కులతో మానవీయత పరిమళింపజేయాలని తెలియజేసారు. 1991 ఆగస్టు 3న ఢిల్లీలో జరిగిన ముఖ్యమంత్రుల సమావేశంలో గూడా ఇదే వాస్తవం చర్చనీయాంశం అయింది. 1993 ఫిబ్రవరి 18న నల్లగొండలో డా॥ కేశవరావు (నేటి పిసిసి అధ్యక్షులు) 'జాతీయ సవాళ్లు-యువకుల పాత్ర' సెమినార్‌లో నక్సలైటు ఉద్యమాన్ని పొగుడుతూ నేడు మంచిని ఆచరణగా చూపమని అడిగిన వారిని నక్సలైట్లు అంటున్నారని అన్నారు. నక్సలైట్ల హింస-ప్రతిహింస చంపుడు కార్యక్రమాన్ని ఎవరూ హర్షించరు కాని నక్సల్ సమస్య శాంతి భద్రత సమస్య కాదని అది సామాజిక ఆర్థిక సమస్య అని ప్రభుత్వం ఒప్పుకుంటూనే సమస్యను పోలీసుల కప్పగించి చట్టం తన పని తను చేసుకుపోతుందనే పడికట్టు ప్రకటనతో చేతులు దులుపుకోవటం పలాయన వాదం.

నాటినుండి నేటి వరకు నడుస్తూ నడిపిస్తున్న నక్సలైటు ఉద్యమం ఆశించిన ఫలితాలు పొందలేకుండా వుంది. ఇది నిలువు ఈత అయింది. వీరి నాయకుల తెలివితేటలను, విజ్ఞానాన్ని తక్కువ అంచనా వేయటం కాదు కాని వారు గమనించవలసిన అంశాలు 1. నేపాల్‌లో దాదాపు 80 శాతం గ్రామీణ ప్రాంతంలో తమ పరిపాలన సాగిస్తూ పటిష్టంగా మావోయిస్ట్ పార్టీ ఉద్యమిస్తోంది. మావోయిస్టులు క్రమంగా తమ పంథాను ప్రజాస్వామ్య ప్రభుత్వ స్థాపన దిశలో తమ దిశను మార్చుకున్నారు. రాజుగారి నియంత ఫాసిస్టు చర్యలకు వ్యతిరేకంగా ప్రజాస్వామ్య ప్రక్రియ ప్రతిష్ఠించటానికి ఏడు డిమాండ్లతో 12 పార్టీల ఫోరంకు మద్దతు పలికారు. అంతేకాక 3 డిసెంబర్ 2005తో ముగుస్తున్న కాల్పుల విరమణను మరో నెల వరకు పొడిగించారు. నేపాల్ మావోయిస్టులు కొద్ది మార్పులతో దేశంలో ప్రజాస్వామ్య ప్రక్రియ లకు సంసిద్ధతను ప్రకటించారు. ఈ సత్యాన్ని మన మావోయిస్టులు గమనించాలి. 2. ఈ దేశ సమాజం కుల-వర్గ సమాజం. అన్ని రంగాలను కులం ప్రభావితం చేస్తుంది. 3. స్వాతంత్ర్యానంతరం జరుగుతున్న ఎన్నికలు తద్వారా రాజ్యాధికారం అసెంబ్లీ, పార్లమెంటు - ఈ తంతుకు అలవాటు పడటమే గాక

అంతకు మినహా వేరే పాలనా విధానం లేదని ప్రజల నమ్మకం. అందుచేతనే నక్సల్స్ ప్రభావిత ప్రాంతాల్లో గెరిల్లా జోన్‌తో సహా ప్రజలు ఎన్నికల్లో పాల్గొంటూ ఉన్నారు. సిరిసిల్ల, కరీంనగర్ మావోయిస్టు కోటల్లో బిజెపి వారు ఎంపీలు, ఎం.ఎల్.ఎ. లుగా ఎన్నికయిన వాస్తవాన్ని గమనించాలి. 3. బహుజన వామశక్తి: దళిత-బహుజనుల, కార్మిక-కర్షకుల ఉద్యమాన్ని పటిష్టం చేయాలి. 4. భారతదేశానికి సంబంధించినంత వరకు సమస్త కులాల జనాభా నిష్పత్తి ప్రాతిపదికన ఏర్పడేదే ప్రజల ప్రజాస్వామ్యం. దీనికై పాటుపడాలి.

ప్రభుత్వం వారు గమనించాల్సిన విషయాలు: 1.ఇందిరమ్మ రాజ్యం అంటే తాడిత పీడిత దళిత బహుజనుల రాజ్యమే. దళిత బహుజనులకు శాంతి ప్రసాదిస్తూ సామాజిక ఆర్థిక రంగాల్లో (విద్య, ఉపాధి) న్యాయం కలుగజేయాలి. అన్ని రంగాలలో అగచాట్లుపడుతున్న వారికి కనీసం ప్రశాంతతను కలుగజేయాలి. చర్చల విషయానికొచ్చేనరికి నక్సల్స్ తమ ఉద్యమాన్ని కొనసాగించటానికి, ప్రభుత్వం వారు తమ ప్రభుత్వాన్ని కాపాడుకొనటానికే కాని ప్రజల సమస్యల పరిష్కారం పట్టటం లేదనే అభిప్రాయం ప్రజల్లో ఉందని యిరు వర్గాలు గమనించాలి.

ప్రముఖ కాంగ్రెస్‌వాది వెంకటస్వామి "చంపవద్దు-చంపకండి. తిరిగి వెంటనే చర్చలు జరపండి" అని ప్రభుత్వానికి ఒక హెచ్చరికలాంటి సలహా ఇచ్చారు. ఏ రకమైన షరతులతో నిమిత్తం లేకుండా కేవలం ప్రజల కొరకే చర్చలు జరపాలనే అర్థం ధ్వనించింది. కాబట్టి నక్సల్స్ 1. ముందు చంపుడు కార్యక్రమాన్ని వెంటనే ఆపాలి. ప్రజల్లో ప్రశాంత వాతావరణం కలుగజేసే ప్రయత్నం చేయాలి. 2. ప్రభుత్వం వెంటనే కూంబింగ్, ఎన్‌కౌంటర్‌ల కార్యక్రమాన్ని ఆపాలి. 3. ఇరువర్గాలు ఆయుధ అంశాన్ని చర్చల్లో ఒక అంశంగా తీసుకోవాలి. ప్రభుత్వం మావోయిస్టుల అంశాన్ని కొట్టిపారేయకూడదు. వారు ఎన్నికల్లో నమ్మకంలేదని ప్రకటించి, ఆ ఎన్నికల వల్ల అధికారాన్ని చేపట్టిన ప్రభుత్వంతో (అక్టోబర్ 2004) చర్చలకు రావటం ఒక చారిత్రాత్మక ఘట్టం. ఇది ముందు ముందు ప్రజల ప్రజాస్వామ్య స్రవంతిలో పాలుపంచుకొనే ముందస్తు చర్య అని భావించాలి. నేపాల్‌లో మావోయిస్టులు రాజుతో చర్చలకు సిద్ధమయ్యారు.

ప్రజల కొరకు ప్రభుత్వం ఉండాలి కాని ప్రభుత్వం కొరకు ప్రజలుండరు. అలానే ప్రజల కొరకు ఉద్యమాలు (రాజకీయ పార్టీలు) ఉండాలి కాని ఉద్యమాల (రాజకీయ పార్టీల) కొరకు ప్రజలుండకూడదు. ఇరువురు గమనించాలి. కాబట్టి శాంతి ప్రక్రియలో భాగంగా చర్చల ద్వారా సమస్య పరిష్కారంలో ఇరువర్గాలు భాగస్తులు కావాలి. అంతేగాని సమస్యలో భాగస్తులు కాకూడదు.

❑

రచయితలకు సూచన

ఏ పత్రికయినా తాను అచ్చువేసే రచనలు తనకే ప్రత్యేకంగా ఉండాలని కోరుకుంటుంది. 'వీక్షణం' కూడ అంతే. ఇటీవల కొందరు రచయితలు తమ రచనలను ఒకేసారి అనేక పత్రికలకు పరిశీలన కోసం పంపుతున్నారు. 'వీక్షణం' పరిశీలనలో ఉన్న రచనలు, రాబోయే సంచికలలో అచ్చుకోసం ఎంపిక చేసి పెట్టుకున్న రచనలు ఇతర దినపత్రికలలోనో, వార పత్రికలలోనో వెలువడడం మా దృష్టికి వస్తోంది. ఇతర పత్రికలకు పంపిన రచనలను 'వీక్షణం'కు పంపించగూడదని రచయితలకు విజ్ఞప్తి చేస్తున్నాము.

- సంపాదకులు

చందాదారులకు విజ్ఞప్తి!

ఇటీవల కొంతమంది చందాదారులకు వీక్షణం సక్రమంగా అందడం లేదని ఫిర్యాదు చేస్తున్నారు. వీక్షణం ప్రతినెల 29వ తేదీన మరుసటి నెల సంచిక పోస్ట్ అవుతుంది. అంటే ఏ నెల సంచిక ఆ నెల మొదటి వారానికల్లా పాఠకులకు చేరుతుంది. ఏ కారణం చేతనైనా మీకు వీక్షణం మొదటివారం లోపు అందనట్లయితే, వెంటనే ఆ విషయం మాకు తెలపగలరు.

- సర్క్యులేషన్ మేనేజర్

వీక్షణం చందదారులుగా చేరండి!
వీక్షణం ను మిత్రులకు పరిచయం చేయండి!

తెలుగు నాట విలక్షణమైన ఆర్థిక, సామాజిక పత్రిక 'వీక్షణం'ను మూడు సంవత్సరాలకు పైగా ఆదరించి పోషిస్తున్న మిత్రులందరికీ 'వీక్షణం' సంపాదకవర్గం వినమ్రంగా ధన్యవాదాలు తెలుపుతోంది. అయితే తెలుగుసీమలో రాజకీయ, ఆర్థిక, సామాజిక అంశాల విశ్లేషణ కోసం ప్రజలలో, పాఠకులలో, ఆలోచనా పరులలో వ్యక్తమవుతున్న తహతహకూ, ఆ ఆసక్తిని తీర్చడంలో 'వీక్షణం' చేస్తున్న కృషికీ మధ్య చాలా అంతరం ఉంది. ఆ అంతరం పూడాలంటే 'వీక్షణం'కు పాఠకుల నుంచే ఇతోధిక సహకారం అందాలి. 'వీక్షణం' చందాదారుల సంఖ్య కనీసం మూడురెట్లు పెరిగితే గాని, 'వీక్షణం' తన ముందు పెట్టుకున్న కర్తవ్యాలను తీర్చడం సాధ్యం కాదు. అంటే 'వీక్షణం' పాఠకులలో ప్రతి ఒక్కరూ తమ చందాలను క్రమం తప్పకుండా పునరుద్ధరించుకోవడంతో పాటు, కనీసం మరొక ముగ్గురు మిత్రులకు '**వీక్షణం**'ను పరిచయం చేసి చందాలు కట్టించాలి.

'వీక్షణం చందాదారులుగా చేరండి!

మీ మిత్రులను 'వీక్షణం' చందాదారులుగా చేర్పండి!

ఇది **వీక్షణం**కు సాయం కాదు, తెలుగు సమాజం తన గురించి తాను తెలుసుకోవడానికి చేసే అన్వేషణకు సాయం!

ఆంధ్రప్రదేశ్‌లో ప్రాంతీయ అసమానతలు

డా. యిమ్మానేని సత్యసుందరం

అభివృద్ధి ఫలాలు అన్ని ప్రాంతాలకు, అన్ని వర్గాల ప్రజలకు అందాలని అందరూ ఒప్పుకుంటారు. అయితే ఈ ఆశయం కాగితం మీదనే వుంది. ప్రతి దేశంలోనూ ప్రాంతీయ అసమానతలు వున్నాయి. భారతదేశం లాంటి అతిపెద్ద దేశాలలో ఈ సమస్య తీవ్రరూపం దాల్చింది. కొన్ని రాష్ట్రాలలో వెనుకబడిన ప్రాంతాలు ప్రత్యేక రాష్ట్రాలుగా ఏర్పడుటకు ఆందోళన చేస్తున్నాయి. అయితే, ప్రత్యేక రాష్ట్రాలు వెనుకబడిన తనానికి పరిష్కారం మాత్రం కాదు.

అసలు ప్రాంతీయ అసమానతలు ఎలా ఏర్పడతాయి? సహజ సంపదల వ్యత్యాసం వలన కొంతవరకు ఇవి ఏర్పడవచ్చు. అయితే, ఈ సమస్యకు ప్రధాన కారణం ప్రైవేటు పెట్టుబడులు. అన్ని సౌకర్యాలు (ముఖ్యంగా రవాణా సౌకర్యం) ఉన్న ప్రాంతాల లోనే ప్రైవేటు వ్యక్తి పెట్టుబడి పెడతాడు. అవస్థాపన కల్పించే బాధ్యత మాత్రం ప్రభుత్వానిది. ఈ పరిస్థితులలో కొన్ని ప్రాంతాలే అభివృద్ధిచెంది, మిగతా ప్రాంతాలు వెనకబడే వుంటాయి. రానురాను వీటి మధ్య అభివృద్ధి వ్యత్యాసాలు పెరుగుతూ వస్తాయి.

మనదేశంలో ప్రాంతీయ వ్యత్యాసాలు ఎక్కువగానే వున్నాయి. 2001-02లో పంజాబ్ తలసరి ఆదాయం రూ. 25,248, ఒరిస్సా తలసరి ఆదాయం రూ. 10,021, బీహార్ ఆదాయం రూ. 5445 మాత్రమే.

ఆంధ్రప్రదేశ్ మూడు ప్రాంతాలుగా ఉంది. అవి కోస్తా ఆంధ్ర, రాయలసీమ, తెలంగాణ. మొత్తం జిల్లాలు 23. తెలంగాణలో 10, కోస్తా ఆంధ్రలో 9, రాయలసీమలో 4.

2001లో ఆంధ్రప్రదేశ్ జనాభా 75.7 మిలియన్లు. తెలంగాణలో 30.7 మిలియన్లు (40.56 శాతం), కోస్తా ఆంధ్రలో 31.6 మిలియన్లు (41.74 శాతం), రాయలసీమలో 13.4 మిలియన్లు (17.70 శాతం) వున్నారు.

రాష్ట్ర విస్తీర్ణం 2,75,000 చ.కిలో మీటర్లు. తెలంగాణ విస్తీర్ణం 1,14,800 చ.కి. (41.75 శాతం), కోస్తా ఆంధ్ర విస్తీర్ణం 92,800 చ.కి. (33.75 శాతం), రాయలసీమ విస్తీర్ణం 67,000 చ.కి (24.50 శాతం).

రాష్ట్ర సగటు అభివృద్ధి సూచిక (1995 నుండి 2000 కాలంలో) 100 అనుకుంటే ఉత్తర తెలంగాణ సూచిక 91, దక్షిణ కోస్తా సూచిక 106, హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాలకు 122 గా వుంది. అయితే, గత కాలంలో దక్షిణ కోస్తా సూచిక తగ్గింది. రాయలసీమ సూచిక తగ్గింది. తెలంగాణ సూచిక పెరిగింది. రాష్ట్రంలో ప్రాంతీయ వ్యత్యాసాలు ఎలా వున్నాయో పరిశీలిద్దాం.

అక్షరాస్యత:

అక్షరాస్యత విషయంలో రాష్ట్రం వెనకబడివుంది. 2001 లెక్కల ప్రకారం 61.1 శాతం మాత్రమే. పురుషులలో 70.9, స్త్రీలలో 51.2. ఇక ప్రాంతాల పరిస్థితి చూస్తే కోస్తా ఆంధ్రలో పురుషులలో 70.9 శాతం, స్త్రీలలో 54.1 శాతం. మొత్తం మీద 62.5 శాతం. రాయలసీమలో పురుషులలో 72.9 శాతం, స్త్రీలలో 48.1 శాతం. మొత్తం మీద 60.7 శాతం. తెలంగాణలో మొత్తం మీద 58 శాతం. పురుషులలో 69 శాతం. స్త్రీలలో 47 శాతం.

ఒకటి మాత్రం నిజం. అన్ని ప్రాంతాలలో స్త్రీలలో అక్షరాస్యత బాగా పెరిగింది. దీనికి ముఖ్యకారణం మహిళా సాధికారిత ఉద్యమం. 1971లో స్త్రీలలో అక్షరాస్యత రాష్ట్రంలో 15.8 శాతం మాత్రమే. కోస్తా ఆంధ్రలో 19.5 శాతం, రాయలసీమలో 13.1 శాతం, తెలంగాణలో 10.7 శాతం.

వ్యవసాయం:

ఆంధ్రప్రదేశ్ ప్రధానంగా వ్యవసాయక రాష్ట్రం. వ్యవసాయ విషయంలో దక్షిణ కోస్తా ఆంధ్ర మంచి ప్రగతిని సాధించింది. రాయలసీమ, దక్షిణ తెలంగాణ బాగా వెనకబడివున్నాయి. రాష్ట్రంలో సాగుభూమిలో 37.6 శాతానికి నీటిపారుదల వసతులున్నాయి. అయితే, ఈ శాతం కోస్తా ఆంధ్రలో 52.8, తెలంగాణలో 34.7, రాయలసీమలో 21.1 మాత్రమే.

కొన్ని జిల్లాలలో వ్యవసాయ ఉత్పాదకత బాగా తక్కువ. ఉదాహరణకు, ఆదిలాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాలలో హెక్టారుకు ఆదాయం రూ. 5,000 మాత్రమే. తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, కృష్ణ, గుంటూరు, నెల్లూరు, చిత్తూరు జిల్లాలలో ఈ ఆదాయం రూ. 12,500కు మించివుంది. వ్యవసాయ ఆధునీకరణ వలన కోస్తా జిల్లాలు బాగా లాభం పొందాయి. అయితే, నీటి పారుదల సౌకర్యాల ద్వారా తెలంగాణలోని నిజామాబాద్, కరీంనగర్ జిల్లాలు కూడా వ్యవసాయరంగంలో మంచి ప్రగతిని సాధించాయి. ఈ జిల్లాలలో ప్రస్తుతం హెక్టారుకి ఆదాయం రూ. 10,000 - రూ. 12,500 మధ్య వుంది.

పారిశ్రామికీకరణ:

ఆంధ్రప్రదేశ్‌లో ప్రతి లక్ష జనాభాకు సగటున 4226 ఫ్యాక్టరీలు వున్నాయి. ఈ సంఖ్య తెలంగాణలో 4927; కోస్తా ఆంధ్రలో 4511; రాయలసీమలో 2822. ఇంత మాత్రాన తెలంగాణ బాగా అభివృద్ధి చెందినదని అనుకోరాదు. ఎందుకంటే, పారిశ్రామికంగా బాగా అభివృద్ధి చెందిన హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాలు తెలంగాణలో వున్నాయి.

అవస్థాపన:

అభివృద్ధికి సూచిక అవస్థాపన లభ్యత. ఆర్థికాభివృద్ధికి కావలసిన సౌకర్యాలు అన్ని ప్రాంతాలలో ఒకే విధంగా లేవు. మొత్తం మీద ఆంధ్రప్రదేశ్ పారిశ్రామికంగా వెనకబడివుంది.

ఆంధ్రప్రదేశ్‌లో ప్రతి లక్ష జనాభాకు 246 కి.మీ. రోడ్డు విస్తీర్ణత వుంది. అయితే ఇది కోస్తా ఆంధ్రలో 210 కి.మీ.; రాయలసీమలో 283 కి.మీ.; తెలంగాణలో 242 కి.మీ. అయితే, జనసాంద్రత రాయలసీమలో తక్కువ. వెయ్యి చదరపు కిలోమీటర్లకు రోడ్ల విస్తరణ చూస్తే ఫలితాలు వేరుగా వున్నాయి. ఇది కోస్తా ఆంధ్రలో 717.68 కి.మీ.; రాయలసీమలో 567.30 కి.మీ.; తెలంగాణలో 654.56 కి.మీ.

కాంక్రీట్ రోడ్ల పరిస్థితి చూస్తే లక్ష జనాభాకు రాష్ట్రంలో రోడ్ల విస్తీర్ణత 1.12 కి. మీ. ఇది కోస్తా ఆంధ్రలో అత్యధికం 1.37 కి.మీ. రాయలసీమలో 1.09 కి.మీ. తెలంగాణలో 0.89 కి.మీ.

విద్యుచ్ఛక్తి వినియోగం కూడా అభివృద్ధికి సూచికే. అన్ని రంగాలను లెక్కలోనికి తీసుకుంటే విద్యుచ్ఛక్తి తలసరి వినియోగం 2002-03లో 520 యూనిట్లు. తెలంగాణలో అత్యధికం 646.27 యూనిట్లు. రాయలసీమలో 442.24 యూనిట్లు. కోస్తా ఆంధ్రలో 320.65 యూనిట్లు. పారిశ్రామిక రంగం మాత్రమే తీసుకుంటే తలసరి విద్యుత్ వినియోగం రాష్ట్రంలో 28.61 యూనిట్లు. తెలంగాణలో 32.04 యూనిట్లు, కోస్తా ఆంధ్రలో 29.29 యూనిట్లు, రాయలసీమలో 20.11 యూనిట్లు.

వ్యవసాయ రంగం మాత్రమే తీసుకుంటే తలసరి విద్యుచ్ఛక్తి వినియోగం రాష్ట్రంలో 184.01 యూనిట్లు. తెలంగాణలో 286.66 యూనిట్లు; కోస్తా ఆంధ్రలో 76.31 యూనిట్లు; రాయలసీమలో 236.18 యూనిట్లు. ఈ తేడాలకు కారణం కోస్తా ఆంధ్రలో వ్యవసాయానికి కాలువల ద్వారా నీటి పారుదల ఉంది. తెలంగాణ, రాయలసీమలలో వ్యవసాయం బావులు, గొట్టపు బావులపై ఎక్కువగా ఆధారపడుతుంది.

ఇక బ్యాంకింగ్ సౌకర్యాలకు వస్తే మార్చి 31, 2004లో కోస్తా ఆంధ్రలో ప్రతి 14,000 జనాభాకి ఒక బ్యాంక్ శాఖ వుంది. రాయలసీమ, తెలంగాణలో ఈ జనాభా 16,000. కోస్తా ఆంధ్రలో వెయ్యి చ.కి.మీ.కు 25 శాఖలు, తెలంగాణలో18 శాఖలు, రాయలసీమలో 13 శాఖలు వున్నాయి. బ్యాంకింగ్ సౌకర్యాలలో రాయలసీమ వెనకబడి వుంది. రాష్ట్రంలో పరపతి - డిపాజిట్ నిష్పత్తి 62.6. కోస్తా ఆంధ్రలో ఇది 65.3, తెలంగాణలో 62.7, రాయలసీమలో 47.7.

ప్రాంతంలోనే వ్యత్యాసాలు:

ప్రాంతాల మధ్య వ్యత్యాసాలే కాకుండా ఒకే ప్రాంతంలో జిల్లాల మధ్య వ్యత్యాసాలు వున్నాయి. 2001లో మానవ అభివృద్ధి సూచిక హైదరాబాద్ జిల్లాకు 0.704, రంగారెడ్డి జిల్లాకు 0.545, మెదక్ జిల్లాకు 0.613, వరంగల్ జిల్లాకు 0.357. ఇక కోస్తా ఆంధ్రలో గుంటూరుజిల్లాకు 0.563, విజయనగరంజిల్లాకు 0.068, శ్రీకాకుళంజిల్లాకు 0.340. అనంతపురంజిల్లాకు 0.236గా వున్నాయి.

కొన్ని జిల్లాలు మంచి ప్రగతిని సాధించాయి. కృష్ణా జిల్లా మానవ అభివృద్ధి సూచిక 1981లో 0.440 వుంటే 2001లో 0.618గా వుంది. నెల్లూరు జిల్లా సూచిక 0.300 నుండి 0.537కి పెరిగింది. మహబూబ్‌నగర్ జిల్లా సూచిక 0.137 నుండి 0.206కి పెరిగింది. కరీంనగర్ జిల్లా సూచిక 0.292 నుండి 0.461కి పెరిగింది.

మానవ అభివృద్ధి సూచిక విషయంలో కొన్ని జిల్లాలు తగ్గు ముఖం చూపాయి. ఉదాహరణకు, హైదరాబాద్‌కు 1981లో ఈ సూచిక 0.888, 2001 నాటికి ఇది 0.704కు తగ్గింది. అయితే ర్యాంక్ మారలేదు. మొదటి స్థానంలోనే వుంది. రంగారెడ్డి జిల్లా సూచిక 0.616 నుండి 0.545కు తగ్గింది. ర్యాంక్ ద్వితీయ స్థానం నుండి ఏడవ స్థానానికి తగ్గింది.

ప్రత్యేక తెలంగాణ?

చిన్న రాష్ట్రాలు ఎక్కువ ప్రగతిని సాధిస్తాయన్న గ్యారంటీ లేదు. తెలంగాణ వెనుకబడిన ప్రాంతం అన్నది వాస్తవం. అయితే, ఆ ఒక్క ప్రాతిపదికపై ప్రత్యేక రాష్ట్రం కోరటం అసమంజసం. రాయలసీమ కూడా అన్ని విధాల వెనకబడే వుంది. అది కూడా వేరే రాష్ట్రంగా ఏర్పడితే, రాష్ట్రం మూడు ముక్కలు అవుతది గదా. అలా వెనుకబడిన ప్రాంతాలన్నీ రాష్ట్రాలయితే దేశంలో రాష్ట్రాల సంఖ్య వంద దాటవచ్చు.

తెలంగాణ రాష్ట్రం ఏర్పడాలంటే అక్కడ ప్రజలు ప్రత్యేక రాష్ట్రాన్ని గట్టిగా కోరుకోవాలి. ప్రత్యేక రాష్ట్రం వల్ల తమ ప్రాంతం బాగా అభివృద్ధి చెందగలదన్న నమ్మకం అక్కడ ప్రజలలో ఉండాలి. అటువంటిది ఇప్పుడేమీ కనబడటం లేదు. అంతేకాదు, ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమ నాయకుల పరిస్థితి ఏమిటి? వారు ఇతర నాయకులకంటే భిన్నంగా వున్నారా? లేకుంటే, ప్రత్యేక రాష్ట్రం వల్ల ప్రయోజనమేమిటి? వీటన్నిటినీ తెలంగాణ ప్రజలు పరిశీలిస్తున్నారు. పరిశీలించాలి కూడా.

ఏం చేయాలి

మన రాష్ట్రంలో అన్ని ప్రాంతాలలోనూ వెనుకబడిన జిల్లాలు వున్నాయి. అందువలన మనం ప్రాంతాల వారీగా అభివృద్ధి గురించి ఆలోచన మాని, జిల్లా వారీగా అభివృద్ధి సాధించుటకు ప్రయత్నించాలి. వెనుకబడిన జిల్లాలకు ప్రత్యేక ప్రోత్సాహకాలు కల్పించాలి. వాటి పని తీరును సమీక్ష చేస్తూ ఉండాలి. రాష్ట్రం అవస్థాపన విషయంలో బాగా వెనకబడి ఉంది. వెనుకబడిన జిల్లాల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలి. వెనుకబడిన ప్రాంతాలు అభివృద్ధి నిరోధకాలని మరువరాదు. ❑

తెలుగు ప్రజలకు నిరంతర దుర్వార్తలు

ఇతిహాస్

ఎంతో కాలంగా రాయాలనుకుంటున్న ఈ వ్యాసానికి ఇటీవలే టీవీ9 లో ప్రసారమైన ఓ వార్తా కథనం తక్షణ ప్రేరణ.

ఆ కథనం ఇలా మొదలైంది.

'ప్రియురాలికి భార్య నగ్న ఫోటోలు పంపించిన ఓ ప్రబుద్ధుడి ఉదంతం'. దాంట్లో సారాంశం ఇలా ఉంది. తల్లితండ్రులు లేని ఓ యువతిని మిలిటరీలో పనిచేసే యువకునికిచ్చి పెళ్లి చేశారు ఆమె అక్కా, బావలు. పెళ్లయినప్పటి నుంచీ ఆ అమ్మాయిని అదనపు కట్నం తెమ్మని వేధించడం మొదలెట్టాడు అతగాడు. అతని వేధింపుల పర్యవసానంగా ఆ యువతికి గర్భస్రావం కూడా అయ్యింది. ఇటీవల ఈ వేధింపులు మరీ శ్రుతిమించాయి. సన్నిహితంగా ఉన్నప్పుడు సెల్‌ఫోన్ కెమెరాతో తీసిన భార్య నగ్న ఫోటోలను తన పాత ప్రియురాలికి పంపించడం వంటి విపరీత చర్యలు కూడా ఆ దుర్మార్గుడు మొదలుపెట్టాడు. ఇవన్నీ భరించలేని ఆ అభాగ్యురాలు పుట్టింటికి వచ్చి ఆత్మహత్య చేసుకుంది.

ఆ వార్తను అప్పటి దాకా వింటున్న (చూస్తున్న) నేను ఉలిక్కిపడ్డాను. అసలు ఈ మొత్తం కథనంలో వార్త ఏది? ఆ అమ్మాయి అకాల మరణమా లేక ప్రియురాలికి ప్రియుడు పంపిన భార్య నగ్న ఫోటోలా? ఇది కొసమెరుపు కోసం ఆ వార్తా రచయిత చేసిన తెలివి తక్కువ ప్రయత్నమా లేక తెలుగు సమాజాన్ని ఉద్ధరించడమే పనిగా పెట్టుకున్న నిరంతర వార్తాస్రవంతి మురికి మనస్తత్వానికి మచ్చుతునకనా?

ప్రేక్షకులకు వినోదాన్ని, విజ్ఞానాన్ని అందించేందుకు మొదలైన టెలివిజన్ నిజంగా మనిషి జీవితంలో ఎన్నో విప్లవాత్మకమైన మార్పులు తెచ్చింది. ఎడ్యుకేషన్ (విద్య-విజ్ఞానం) ఎంటర్‌టైన్‌మెంట్ (వినోదం) రెండింటినీ కలిపి ఎడ్యుటైన్‌మెంట్‌గా మార్చి ప్రేక్షకులను ఆకట్టుకున్నది టెలివిజన్. మన దేశంలో దూరదర్శన్ ఏకచ్ఛత్రాధిపత్యం కొనసాగినన్నాళ్లూ ఈ విజ్ఞాన, వినోద కార్యక్రమాల మధ్య చాలా స్పష్ట విభజన రేఖ ఉండేది.

సరళీకృత ఆర్థిక విధానాల పుణ్యమా అని వెల్లువలా దూసుకు వచ్చిన ప్రైవేటు, విదేశీ ఛానెళ్లు ప్రేక్షకుడికి ఎంచుకునేందుకు ఎన్నో అవకాశాలు ఇచ్చాయి. ఇప్పుడు ప్రేక్షకుడికి సినిమా పాటలకు ఒక ఛానెల్, ఆటలకు ఒక ఛానెల్, జంతు ప్రపంచం గురించి ఒక ఛానెల్, అలాగే వార్తలకు ప్రత్యేక ఛానెళ్లు లభ్యమవుతున్నాయి.

టీవీ9 వచ్చేంత వరకూ తెలుగులో 24 గంటల వార్తా ఛానెళ్లు లేవనే చెప్పాలి. ఈటీవీ2 ఉన్నా అది వార్తలతో పాటు అనేకానేక కిచిడీ కార్యక్రమాలు ప్రసారం చేసేది. వచ్చీ రాగానే అనేక మంది అభిమానులను సంపాదించుకుంది టీవీ9. వార్తల కవరేజిలో, వార్తలు సమర్పించడంలో కొత్త పుంతలు తొక్కడం వల్లనే ఈ ఆదరణ లభించిందనేది నిర్వివాదాంశం.

టీవీ9 తరువాత తేజ న్యూస్ కూడా మరో 24 గంటల వార్తా ఛానెల్‌గా మొదలు పెట్టబడింది. ఇప్పుడు వార్తలు అందించడానికి మూడు తెలుగు వార్తా ఛానెళ్లు - టీవీ9, ఈ టీవీ2, తేజ న్యూస్, మరో ఆరు తెలుగు ఛానెళ్లు - ఈ టీవీ, మా టీవీ, తేజ టీవీ, విస్సా టీవీ, జీ తెలుగు, దూరదర్శన్ పోటీపడుతున్నాయి. తెలుగు ప్రేక్షకుడు ఇప్పుడు బటన్ నొక్కితే చాలు ప్రపంచంలో ఏ మూలన ఏం జరిగినా తెలుసుకోగలుగుతున్నాడు. అయితే ఛానెళ్ల మధ్య గల ఈ విపరీతమైన పోటీ అనేక విపరీత పోకడలకు దారి తీస్తోంది. ఒకప్పుడు తెలుగునాట ఎంతో ఆసక్తిని రేపిన ఈ వార్తా ఛానెళ్లు ఇప్పుడు 'అమ్మో ఆ ఛానెలా, నేను చూడటం మానేశాను' అని జనాలు చెప్పుకోవడం పరిపాటయ్యింది.

హింసను, నేరాలను, విచ్చలవిడితనాన్నే ప్రధాన వార్తలుగా తెలుగు మీడియా మార్చి చాలా ఏళ్లయింది. అయితే ఇప్పుడు జరుగుతున్నది మరింత ప్రమాదకర పరిణామం. ఇవ్వాళ తెలుగు వార్తా ఛానెళ్లు ఒక అడుగు ముందుకు వేసి హింస, నేరాలు, విచ్చలవిడితనాన్నే వినోదంగా మారుస్తున్నాయి. వార్తలను వినోదంగా మార్చే ఈ దుర్మార్గమైన ఎత్తుగడ ఆయా ఛానెళ్లకు కాసులను కురిపించవచ్చేమో గానీ సమాజాన్ని మాత్రం అధోగతి పాల్జేస్తుంది.

ప్రింట్ మీడియాలో నేరాలకు సంబంధించిన కథనాలను కొంచెం కల్పనా చాతుర్యంతో కథల లాగా చెప్పడం చాలా ఏళ్లుగా వస్తున్నదే. ఇదే కాన్సెప్ట్‌ను టెలివిజన్ తెరపై రియాలిటీ షో గా మార్చిన 'నేరాలు ఘోరాలు' అనే కార్యక్రమం తెలుగు టెలివిజన్ పతనంలో మొదటి మెట్టు. బాధ్యతాయుతమైన కార్యక్రమాలు రూపొందించవలసిన ఈనాడు గ్రూప్ నుండి ఇటువంటి దిగజారుడు కార్యక్రమం రావటం ప్రబలుతున్న వ్యాపార ధోరణులకు నిదర్శనం. మనిషిని మనిషి ఎన్ని కుట్రలు చేసి చంపగలడో, ఆ చంపడం అనేది సదరు హంతకులకు ఎంత పైశాచిక ఆనందం కలుగజేస్తుందో 'నేరాలు ఘోరాలు' ఒక చక్కని ఉదాహరణ. ఇప్పుడు నేరాలు ఎలా జరుగుతాయో, కుట్రలు ఎలా పన్నుతారో, విపులంగా చెప్పబడుతోంది తెలుగు తెరపై. మనుషుల కుత్తుకలు నరకడం కోడి తలకాయ కోసినంత సులభం అని ట్రెయినింగ్ మాన్యుయల్స్ తయారు చేసి చూపిస్తోంది ఘనత వహించిన ఈనాడు గ్రూప్ ఛానెల్. రాత్రి భోజనానికి కూర్చునే వేళ మన డైనింగ్ టేబుల్‌పై తెగిన తలలు, మాడి మసైన కళేబరాలు, పొంగే వేడి వేడి రక్తం వడ్డిస్తోంది మనం పాతికేళ్లుగా అల్లారు ముద్దుగా పెంచుకున్న మీడియా హౌస్!

ఆవు చేలో మేస్తే దూడ గట్టున మేస్తుందా అని ఈటీవీ2 తొక్కుతున్న కొత్త పుంతలు టీవీ9 మరింత మెరుగ్గా చూపించడం

మొదలుపెట్టింది. క్రైమ్‌వాచ్ అనే కార్యక్రమం కొరకు టీవీ9 ఇటీవల తెలంగాణ శకుంతలగా పేరు తెచ్చుకున్న ఒక నటీమణిని వినియోగిస్తోంది. రోజూ జరిగే భయంకర నేరాలను గుదిగుచ్చి వాటిని 'ఆకర్షణీయమైన, వినోదభరితమైన' మాటల్లో వర్ణించి సదరు ఘోరాలను చూపించడం రోజూ రాత్రి 11 గంటలకు టీవీ9లో నిరాఘాటంగా సాగిపోతోంది. "కోడి కాలుకు బాగా మషాళా రుద్ది దాన్ని నూనెలో వేయించుకు తింటే మస్తుగుంటది" అనే టోన్‌లో సదరు నటీమణి "ఆ సాలే గాడు అప్పుడు రాజయ్య మెడకాయను కసక్కున నరికిండు. రక్తం బుసబుస పొంగింది" అని హావభావ సమేతంగా చెబ్తుంటే అది విని తల తిరిగి పోవడం ఖాయం.

సంచలన సంఘటనలు కవర్ చేసే స్థాయి నుండి అటువంటి సంఘటనలు జరిగే పరిస్థితులు కల్పించడం, అప్పుడు వాటిని చిత్రీకరించి తమ ఛానెల్‌లో చూపించడం తెలుగు ఛానెళ్లు అవలంభిస్తోన్న మరో విపరీత ధోరణి. పోయినేడాది గాంధీ ఆసుపత్రిలో తమ స్నేహితునికి సరిగా వైద్యసాయం అందక మరణిస్తే కోపోద్రిక్తులైన ఓ ఇంజనీరింగ్ కాలేజీ విద్యార్థులు ఆసుపత్రిపైకి దండెత్తి వచ్చారు. ఆ రోజు అక్కడున్న ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులే ఆ విద్యార్థులకు ఏ అద్దం పగలగొట్టాలో స్వయంగా దగ్గరుండి సూచనలు ఇచ్చారని ఆరోపణలు వచ్చాయి.

నెల్లూరు కలెక్టరేట్‌కు పురుగుమందు డబ్బాతో వచ్చిన ఓ రైతును చూసిన టీవీ9, మాటీవీ ఛానెల్ విలేఖరులు ఆ రైతును కాపాడవలసింది పోయి కెమెరాలు ఎక్కుపెట్టి అతను ఆ విషం తాగి నురగలు గక్కుకుని ఆసుపత్రిలో చనిపోయేదాకా చిత్రీకరించి అఖిలాంధ్ర ప్రేక్షకులకు 'ఆత్మహత్య చేసుకోవడం ఎలా' అనే పాఠం వలె చూపించారు. ఇదీ మన మీడియా మిత్రులకు ఉన్న సామాజిక స్పృహ. కళ్లెదురుగా నిలువెత్తు మనిషి నిండు ప్రాణాలు తీసుకోవడానికి ప్రయత్నిస్తుంటే దాంట్లో సెన్సేషనల్ వాల్యూని చూసిన వారిని ఏమనాలి? మనిషి ప్రాణం కన్నా వ్యాపార ప్రయోజనమే మిన్న అని మరీ ఇంత మొరటుగా చాటాలా? మనం అసలు మనుషులమేనా? ఆ రైతు ఆత్మహత్యను 'ప్రత్యక్ష ప్రసారం' చేసినందుకు టీవీ9 కు రాష్ట్ర హైకోర్టు మొట్టికాయలు వేసింది.

రహస్య కెమెరాలు, ఇంటర్నెట్ వ్యవహారాలు, సెల్ ఫోన్ ఎం.ఎం.ఎస్‌లు ఇప్పుడు తెలుగు వార్తా ఛానెళ్లకు మంచి సరుకైపోయాయి. రోజూ ఏ రహస్య కెమెరాలోనో చిక్కిన అభాగ్యుల నగ్న చిత్రాలు ప్రసారం చేయడం. 'మెరుగైన సమాజం' కొరకే తాము ఇదంతా చేస్తున్నామని చిలక పలుకులు పలకడం ఇప్పుడు ఫ్యాషనైపోయింది.

ఓ వర్ధమాన సినీతార స్నానం చేస్తుండగా తీసిన చిత్రాన్ని ఒకే రోజు అనేకమార్లు ప్రసారం చేసి తన రేటింగ్‌ను పెంచుకునే ప్రయత్నం చేస్తుందో ఛానెల్. రహస్య కెమెరాతో చిత్రీకరించిన లైంగిక కార్యకలాపాలను దొరికిందే తడవుగా చూపించేసి ప్రేక్షకులను అలరించే ప్రయత్నం చేస్తుంది మరో ఛానెల్.

వార్తలను రూపు మార్చి, జరగని వాటిని జరిగినట్టు చూపించి, జరగకూడని వాటిని జరిగేలా చేసి తెలుగు వార్తా ఛానెళ్లు ఆడుతున్న ఈ వ్యాపార నాటకానికి ముగింపు పలకాల్సింది ప్రేక్షకులే. మీడియాకు వ్యాపార ప్రయోజనాలు అసలే ఉండకూడదని చెప్పడం లేదు. కానీ సామాజిక బాధ్యత మరచి, మానవత్వ విలువలు గాలికొదిలేసి, కేవలం నాలుగు కాసుల కోసం సమాజాన్ని ఇటువంటి విపరీత పోకడలతో కలుషితం చేయడం మాత్రం అనైతికం.

❑

ఆదివాసీల జీవించే హక్కును చిదిమేసిన టాటా ఉక్కు

డి.వి. రామకృష్ణారావు

రణరంగం కానిచోటు భూ
స్థలమంతా వెతికిన దొరకదు
గతమంతా తడిసె రక్తమున
కాకుంటే కన్నీళ్లతో...

అన్న శ్రీశ్రీ మాటలు ఎంతటి అక్షర సత్యాలో మనకు మన చుట్టూ జరుగుతున్న నేటి పరిణామాల్లో అర్థమవుతుంది. దేశవ్యాప్తంగా పాలక వర్గాలు అభివృద్ధి పేరుతో అమలు చేస్తున్న అభివృద్ధి నమూనాలు, వాటి క్రింద నలిగిపోతున్న సామాన్య ప్రజానీకం మన కళ్లముందు కనిపిస్తారు. అయితే ఆ రణరంగం పాలకులకూ, ప్రజలకూ మధ్య ఉండడమే అసలు వైరుధ్యం. సామ్రాజ్యవాద పెట్టుబడికి, ప్రజల ఆకాంక్షలకూ మధ్య ఉండడమే నేటి మన పరిస్థితి. మొన్న గుడ్‌గాంవ్ కార్మికులు, నిన్న పాట్నాలో ఉపాధ్యాయులు, ప్రకాశం జిల్లా ఉపాధ్యాయులు, ఇవ్వాళ కళింగనగర్ ఆదివాసీలు...

స్థలం, కాలాల తేడా మాత్రమే... అవే లాఠీలు అవే తూటాలు. జనం ప్రాణాలు గాలిలో కలుస్తున్నాయి. ఒకే అణిచివేత అంతస్సూత్రం, ఒకే గొలుసులో పూసల్లా ఘటనల పరంపర మనం దేశవ్యాప్తంగా చూడవచ్చు. పోలవరం నీళ్లు, నల్గొండ యురేనియం, నర్మదా డ్యాం, కళింగనగర్ ఉక్కు ఇలా పాలకులు తెస్తున్న ప్రాజెక్టులు పాలకులకు వరాలు, పాలితులకు శాపాలుగా పరిణమిస్తున్నాయి.

30 జిల్లాలు, 51,352 గ్రామాలు, నాలుగు కోట్లకు పైగా జనాభా, సువర్ణరేఖ, మహానది, బైతరణి, బురబలంగ్, బ్రాహ్మణి, రుషికుల్య, వంశధార నదులు, 450 కి.మీ తీరప్రాంతం, అపారమైన ఖనిజ సంపదలను (డొలమైట్, క్రోమైట్, లైమ్‌స్టోన్, నాణ్యత కలిగిన ఉక్కు ఖనిజం, బొగ్గు, మాంగనీసు) కలిగి ఉన్న రాష్ట్రం ఒరిస్సా. ఉక్కు పరిశ్రమకు పుట్టినిల్లు. పేపరు మిల్లులు, ఎరువులు సిమెంట్, గాజు రకరకాల పరిశ్రమలున్నాయి. రూర్కెలా ఉక్కు కర్మాగారం మనకు తెలిసిందే. ఇన్ని ఉన్నా ఒరిస్సా ప్రజలు విద్యలోను, జీవన ప్రమాణాల్లోను, ఆధునిక సౌకర్యాలలోను అన్నింటా వెనకబడి ఉన్నారు. కనీసం ఇళ్లకు విద్యుత్ సౌకర్యం లేనివారు 66% మంది ఉన్నారు (1998-1999). వచ్చిన ప్రాజెక్టులూ, పరిశ్రమలూ ఎక్కడో ఉన్నవారి జేబులు నింపడానికి తప్ప స్థానిక ప్రజలకు ఒరిగిన మేలు శూన్యం. క్రీ.పూ. 260లో జరిగిన అశోకుని కళింగయుద్ధ రక్తపాతాన్ని చవి చూసిన నేల కూడా ఇదే.

కొత్త సంవత్సరం కళింగనగర్ పారిశ్రామిక కాంప్లెక్స్ ప్రాంత ఆదివాసీలకు తెచ్చిన వెలుగులు ఏమీలేవు. పాలకుల అభివృద్ధి పేరుతో అనుమతించిన టాటాల ఉక్కపరిశ్రమను ఉద్దేశ్యపూర్వకంగా ఆదివాసీలకు చెందిన నాలుగు గ్రామ పంచాయితీలు గోబర్‌ఘాట్, నువాగాంవ్, ఛాందియా, చంపకోయిలలోనే అనుమతించారు. ఈ నాలుగు గ్రామాలూ జాజ్‌పూర్ జిల్లాలో ఉన్నాయి. రాష్ట్ర రాజధాని భువనేశ్వర్‌కు (వంద కిలోమీటర్లు) అతి దగ్గరలో ఉన్నాయి.

మే, 2004లోనే మహారాష్ట్ర సిమ్‌లెక్ కంపెనీ ఈ ప్రాంతంలో భూమి పూజ చేసినపుడు అక్కడి ఆదివాసీలు తమ నిరసన తెలిపారు. నిరసన ప్రదర్శనలో గాయపడ్డవారు బయటకు వచ్చి వైద్యం చేయించుకోలేక కొంత మంది ప్రాణాలు విడిచారు. వారి నాయకుల్లో ఒకరు అక్టోబర్ 2004 నుంచి జైల్లోనే ఉన్నారు.

2 జనవరి, 2006 ఉదయం 11 గంటలకు 5గురు సభ్యుల తవ్వకాలు జరిపే బృందమొకటి 25 బెటాలియన్‌ల (750 మంది) పోలీసులతో కలిసి చంపకోయిల గ్రామం వ్యవసాయ భూముల్లోకి చొచ్చుకొచ్చారు. వందల సంఖ్యలో చుట్టుప్రక్కల గ్రామ ప్రజలు అక్కడ చేపడుతున్న నిర్మాణాన్ని అడ్డుకోవడానికి పోగయ్యారు. వారిలో 4-5 గురు మాత్రమే మాట్లాడడానికి ముందుకెళ్లారు. మిగిలిన వారంతా దూరంగా నిలుచున్నారు. ఒక తీగ నుంచి సంభవించిన విస్ఫోటనతో వారిలో కొంతమంది కింద పడ్డారు. మిగిలిన వారికి ఏమీ అర్థం కాక వెంటనే వారికి సహాయపడడానికి పరిగెత్తారు. అదే సమయంలో పోలీసులు రబ్బర్ బుల్లెట్లు, బాష్ప వాయువు ప్రయోగంతో పాటు కాల్పులు జరిపారు. జరిపిన కాల్పులు కూడా ఉద్దేశపూర్వకంగా అక్కడ ఉన్నవారిని భయభ్రాంతులను చేయడానికి, బెదిరించడానికి కాక చంపడానికే కాల్పులు జరిపారు. వారిని పరామర్శించడానికి పోయిన నిజనిర్ధారణ కమిటీ వారికి కూడా వాళ్లు ఈ విషయాన్నే చెప్పారు. గడువు అయిపోయిన (1995, 1998) బాష్ప వాయు గుండ్లను వాడారు. ఈ విషాద, రాజ్య నిర్దేశిత సంఘటనలో రంగలాల్ ముండుయా, జంగ జరికా, సుదమ్ బర్లా, రామ్ గాగ్‌రౌ, అతి జముడ, బనప్రద్ర, దియొగి త్రియా, లండూ జరికా, రామచంద్ర జముడ, ముక్త బంకిర, గోవింద్ దాగురి (విద్యార్థి), భాగబన్ సోయ్ మొత్తం పన్నెండు మంది ఆదివాసీలు చనిపోయారు. వారిలో ముగ్గురు స్త్రీలు, ఒక విద్యార్థి కూడా ఉన్నారు. పోలీసు కాల్పులకు ప్రతిగా ఆదివాసీల తిరుగుబాటులో ఒక పోలీసు కూడా చనిపోవడం జరిగింది.

వాళ్లు ఏమి అడుగుతున్నారు?

తప్పుడు రికార్డులతో పారిశ్రామిక అవసరాల కోసం ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, ఒరిస్సా వారు భూసేకరణ చేపట్టారు. 1920లో ఒకసారి ఈ ప్రాంతంలో నిర్వాసితులకు పునరావాసం చూపెట్టారు. ఇప్పుడు కూడా ఆదివాసీల నుంచి భూమిని కారు చౌకగా అంటే ఎకరానికి రూ. 37,000 మాత్రమే చెల్లించి, అదే భూమిని టాటాలకు ఎకరానికి రూ. 3.5 లక్షల చొప్పున అమ్మేశారు. చాలా ముఖ్యమైన భూమి విషయంలోనే ఆదివాసీలకు ఏపాటి న్యాయం జరిగిందో చూడవచ్చు. కంపెనీ కోట్లల్లో లాభాలు

చేసుకుంటే ఆదివాసీలకు ఎటువంటి పునరావాసం అందుతోందో అర్థం చేసుకోవచ్చు. పునరావాసం అంటే పేరుకు చిన్న స్థలం, ఒక ప్లాస్టిక్ టార్పాలిన్, ఒక ఐదువేల రూపాయలు. దీనినే కార్పొరేట్ కంపెనీలు, వారి పత్రికలు సరిపడ పునరావాసం అందించారని ప్రచారం చేస్తున్నాయి.

చరిత్రలోకి పోయి చూస్తే పారిశ్రామికీకరణకు ప్రజలు ఎప్పుడూ అడ్డు చెప్పలేదు. కాని గత అనుభవంతో తమ నేలను, ఉండే ఇంటిని ఎట్టి పరిస్థితిలో విడవ కూడదని గ్రహించారు. నిలాచల్ ఇస్పాత్ కంపెనీతో వారి గత అనుభవాన్ని చూస్తే అప్పుడు 634 కుటుంబాలు తమ నేలను, ఇంటిని కోల్పోయారు. వారు పునరావాసం కింద ఒక్కొక్క కుటుంబం పొందింది ఇంటికై 10 డెసిమీ స్థలం మాత్రమే. పునర్నిర్మాణానికి అయ్యే ఖర్చు ఏమీ ఇవ్వలేదు. ఇంటికొకరికి ఉద్యోగాలిస్తామని చెప్పారు. కానీ కేవలం 180 మందికి అదీ కాంట్రాక్టు పద్ధతిన ఉద్యోగాలివ్వడం జరిగింది. నిస్సిగ్గుగా తరువాత ఇంక మేం ఉద్యోగాలివ్వలేం అని ప్రకటించారు. పునరావాసం కింద ఇచ్చిన ఇళ్లకు కూడా ఎటువంటి పట్టాలు, కాగితాలు లేవు. అంతకు ముందు నేలను, వ్యవసాయాన్ని నమ్ముకుని బతిగిన వారు కాస్తా నేడు భూమిలేని దినసరి కూలీలయిపోయారు.

ఇప్పటి కళింగనగర్ కూడా రెవెన్యూ రికార్డుల్లో చూపబడిన స్థలం కాదు. ఒరిస్సా పారిశ్రామిక అభివృద్ధి సంస్థ (ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ - ఇడ్కో) అభివృద్ధి(?) పరచిన పారిశ్రామిక కాంప్లెక్సు మాత్రమే. వేలాది ఎకరాలు కారు చౌకగా ఆదివాసీల నుంచి స్వాధీనం చేసుకున్నారు. ప్రభుత్వ, కంపెనీ అధికార - యాజమాన్యాలకు, స్థానిక ఆదివాసీలకు మధ్య ఇప్పటికీ అనేక న్యాయమైన సమస్యలు అపరిష్కృతంగానే ఉన్నాయి. ఇడ్కో సహకారంతో భూషన్ స్టీల్, జిందాల్, మెస్కో, నిలాచల్ ఇస్పాత్ నిగమ్ లిమిటెడ్, టాటా స్టీల్, మహారాష్ట్ర సీమ్‌లెస్ ఈ విధంగా దాదాపు 13 భారీ సంస్థలు తమ ప్రయోజనాలు నెరవేర్చుకుంటున్నాయి. ఈ పారిశ్రామిక ప్రాంతంలోనే వందకు పైగా క్రోమ్ శుద్ధి చేసే ఫ్యాక్టరీలు ఉన్నాయి.

ఈ ప్రాజెక్టు బాధిత ప్రజలలో (ప్రాజెక్ట్ ఎఫెక్టెడ్ పీపుల్) ముండా తెగకు చెందిన ఆదివాసీలే ఎక్కువ మంది ఉన్నారు. అయితే ఈ గ్రామాలు దైతరి - పారాదీప్ హైవే నెం. 200పై ఉండడం మూలాన ఇక్కడ ఆదివాసీలు కాస్త చదువుకున్నారు. ఇక్కడ భూములను ఏళ్ల తరబడి కష్టించి సాగుయోగ్యంగా చేసుకున్నారు. అయితే ఈ భూములను కారుచౌకగా కంపెనీలు-ప్రభుత్వం మిలాఖత్ అయి ఆక్రమించుకోవాలని చూస్తున్నాయి. అందువల్లే గత అనుభవాల నుంచి నేడు ఆదివాసీలు ఈ ప్రాజెక్టులను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు.

శాంతియుతంగాను, బలంగాను టాటా ఉక్కు పరిశ్రమనే కాక మొత్తంగా ఇడ్కో తెస్తున్న పారిశ్రామికీకరణను వ్యతిరేకిస్తున్నారు. అయితే భయభ్రాంతులకు గురిచేసి పబ్బం గడుపుకోవాలనుకున్న టాటా స్టీల్‌కు, ప్రభుత్వానికి బలంగా తమ నిరసన తెలిపే క్రమంలో పన్నెండు మంది జనవరి 2, 2006న తమ ప్రాణాలు బలిపెట్టాల్సి వచ్చింది.

కొన్ని మౌలిక ప్రశ్నలు:

1. మాకు - ప్రభుత్వం, టాటా కంపెనీలకు మధ్య ఇంకా చర్చలు జరుగుతూనే ఉన్నాయి... మరి హఠాత్తుగా కొత్త సంవత్సర వేకువన ఎందుకు పనులు మొదలుపెట్టారు? ఎవరు నిర్ణయించారు? ఎలా నిర్ణయించారు?
2. పోలీసులు ఆరోపిస్తున్నట్లు మేము మా బాణాలు, విల్లంబులతో దాడి చేసినట్లయితే పోలీసులు చాలా మంది చనిపోయేవారు. కాని వాస్తవం అదికాదు. వారు మమ్మల్ని అణిచేయడానికి, భయభ్రాంతులను చేయడానికి నిర్విచక్షణంగా కాల్పులు జరిపారు. వారు కాల్పులు జరిపాకే కోపంతో రాళ్లు విసరడం జరిగింది. గొడ్డళ్లు చేపట్టడం జరిగింది. అంతిమంగా ఒక్క పోలీసు చనిపోయాడు.
3. ఇదంతా ఉద్దేశపూర్వకంగా చేపట్టిన చర్య. పెద్దఎత్తున పోలీసు బలగాలతో పని మొదలు పెట్టాలనుకున్నారు. వ్యతిరేకిస్తే... కాల్పులకు పాల్పడి... న్యాయ విచారణకు ఆదేశించి... అవసరమయితే నష్టపరిహారం చెల్లించి అయినా పనులు చేపట్టాలనుకున్నారు.

అంతమంది ప్రజలు వ్యతిరేకిస్తున్నపుడు పోలీసులు వెనక్కి తగ్గొచ్చు. కానీ వారికా ఉద్దేశం లేదు. గుంపును చెదరగొట్టే ఉద్దేశంతో కాల్పులు జరిపినా కాళ్లమీద, నడుం కింది భాగంలోను కాలుస్తారు. కాని చనిపోయిన వారందరిని అతి సమీపం నుంచి అదీను తలలోకి, గుండెల్లోకి, నడుము భాగంలోకి కాల్పులు జరపడం వల్ల చనిపోయారు. నష్టపరిహారంగా ఒక్కొక్క ప్రాణానికి ఒక లక్ష రూపాయలు చొప్పున ప్రకటిస్తే అక్కడ ప్రజలు బహాటంగానే తిరస్కరించారు. అదే నియోజక వర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్, కేబినెట్ మంత్రి ప్రఫుల్ల గాఢేయ్‌ల తలకాయలను తీసుకువస్తే మేమే ఎదురు 2 లక్షల చొప్పున ఇస్తాం అని సవాల్ చేసారు.

వారు స్పష్టంగా కోరుతున్నది... తరతరాలుగా జీవిస్తున్న తమ నేల నుండి దురం చేయవద్దని, కాల్పులు జరిపిన పోలీసు అధికారులపై హత్యానేరం కింద కేసులు నమోదు చేయాలని, ఆందోళన చేస్తున్న తమ వారిపై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలని, కళింగనగర ప్రాంతం నుంచి తరలించబడ్డ వారికి 5 ఎకరాల చొప్పున భూమి ఇవ్వాలని... ఇలాగె ఇంకా చాలా న్యాయమైన డిమాండ్లతో పోరాడుతున్నారు. ఆదివాసీలంతా, ప్రజాస్వామికవాదులతో సహా రాష్ట్ర వ్యాప్తంగా ఒకేలా స్పందిస్తున్నారు.

ఈ విషయాలు మనకి అక్కడికి పోయిన ఏడుగురు సభ్యుల మేధావి బృందం వల్ల, దమన్ ప్రతిరోధ్ మంచ్ - ఒరిస్సా, సామ్రాజ్యవాద విరోధి మంచ్ - ఒరిస్సా, ప్రాకృతిక సంపద సురక్షా పరిషత్ అనే సంస్థల పరిశీలన ద్వారా తెలుస్తున్నాయి. ❑

ప్రాచీన భాషగా, రెండవ జాతీయ అధికార భాషగా తెలుగు

పి.రుక్మిణి

జనవరి 7వ తేదీ రోజు తెలుగు విశ్వవిద్యాలయంలో వైస్ చాన్సలర్ అధ్యక్షతన తెలుగును ప్రాచీన భాషగా గుర్తించడమే కాదు, దేశంలో 'రెండవ జాతీయ అధికార భాష' ప్రతిపత్తి ఇచ్చి కూడ గౌరవించాలని తీర్మానిస్తూ ఒక సభ జరిగింది. ఈ సభలో కేంద్ర ప్రభుత్వ, రాష్ట్ర ప్రభుత్వ మంత్రులు, ఎంపిలు, రాష్ట్రంలో ప్రతిపక్ష పార్టీల నాయకులు, అధికార భాషా సంఘం అధ్యక్షులు, అఖిల భారత వర్కింగ్ జర్నలిస్టుల సంఘం అధ్యక్షుడు, ఒక ప్రవాసాంధ్రుడు కూడ పాల్గొన్నారు. ఒక విధంగా అన్ని రాజకీయ భావాలకు భాషా, సాహిత్య, సాంస్కృతిక రంగాలకు ప్రాతినిధ్యం వహించే వాళ్లు అక్కడ ఉద్దేశపూర్వకంగానే సమావేశమై ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వం మీద తెలుగు వాళ్లందరి తరపున ఒత్తిడి తెచ్చే కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు ఊహించవచ్చు. ఇటువంటి ప్రయత్నం తెలుగును అన్ని స్థాయిల్లో అధికార భాషగా గుర్తించాలనే విషయంలో ఒక ఉద్యమంగా పదేళ్ల కింద ప్రారంభమై ఎబికె ప్రసాద్ గారు అధికార భాషా సంఘం అధ్యక్షులు అయ్యాక ఒక నిత్య పోరాటంగా మారి ఆంధ్రప్రదేశ్ స్వర్ణోత్సవాల సందర్భంగా ఊపందుకుంది.

దీనికి అదనంగా ఈ సంవత్సరం తమిళం వలెనే తెలుగును ప్రాచీన భాష (క్లాసికల్ లాంగ్వేజ్)గా గుర్తించాలనే డిమాండు చేరింది. నిన్నటి సభలో మరొక కొత్త డిమాండు తెలుగును దేశ స్థాయిలో 'రెండవ జాతీయ భాష'గా గుర్తించాలనేది వచ్చి చేరింది.

ఒక భాషను ప్రాచీన భాషగా గుర్తించడానికి కేంద్ర ప్రభుత్వం కొన్ని ప్రమాణాలను పెట్టుకుంది. ఆ ప్రమాణాలు బహుశా భాషా వేత్తలు రూపొందించినవే కావచ్చు. అవి శిలాశాసనాలు కానక్కర్లేదు. ఉదాహరణకు వాళ్ల దృష్టిలో లేదా కేంద్ర ప్రభుత్వం దృష్టిలో సంస్కృతం అత్యంత ప్రాచీనమైన భాష. గౌరవించదగిన భాష. అప్రకటిత అధికార భాష. అందుకే ఈ దేశంలోనే కాదు, కాశ్మీరులో కూడ (కాశ్మీరు ప్రస్తావన ఎందుకంటే కాశ్మీరు పండిట్లు మాత్రమే కొందరు అది తమ మాతృభాష అని జనాభా లెక్కలపుడు రాయించారు.) ఎన్నడూ ఎవ్వరికీ మాతృభాష గానీ సంస్కృతంలో ఆకాశవాణి వార్తలు వస్తాయి. సంస్కృతం ప్రపంచంలోనే పటిష్ఠమైన నిర్మాణమున్న క్లాసికల్ భాష. గ్రీకు, ల్యాటిన్, అరబిక్, పర్షియన్, జర్మన్ భాషల వలె బహుశా వాటికన్నా ప్రాచీనమైందే కావచ్చు. కాని మన దేశానికి సంబంధించినంతవరకే చూసినా అంతకన్నా ముందున్న ప్రజల భాష పాళీ. బుద్ధుడు తన సందేశాన్నంతా ప్రజలదయిన పాళీ భాషలోనే చేసాడు. ఆ తర్వాత బ్రాహ్మణ, క్షత్రియేతరులైన పురుషులు, అన్ని వర్ణాల స్త్రీలు మాట్లాడిన భాష ప్రాకృతం. పైశాచీ భాష కూడ ఉందని అంటారు. అటువంటి సంస్కృత పూర్వ భాషలనుంచి రూపొందిన భాష సంస్కృతం. దానికి పాణిని బి.సి. ఎనిమిదవ శతాబ్దంలో 'అష్టాధ్యాయి' రాసి ఒక సమగ్రమైన, పటిష్ఠమైన నిర్మాణాన్ని ఇచ్చాడు.

అట్లా చూసినప్పుడు ఊహాజన్యమైన ద్రవిడ భాష నుంచి రూపొందిన తొలి భాష తమిళం దేశంలోనే అత్యంత ప్రాచీనమైన భాష. తమిళానికి అగస్త్యుడు వ్యాకరణం రాసాడన్న విషయం ఎలా ఉన్నా శిలప్పాదికారం, నక్కరుని కథ మొదలైన బిసి నాటి తమిళ కావ్యాలు చూస్తే అంత ప్రాచీనమైతేనే ప్రాచీన భాష అనాలి అని పెట్టుక కూర్చుంటే మాత్రం తెలుగు ప్రాచీన భాష కాదు. కాని ఊహాజన్యమైన ద్రవిడ భాష నుంచి విడివడిన రెండవ భాషగా, తెలుగు సాహిత్యంగా వెయ్యి సంవత్సరాల నుంచి (ఏడవ శతాబ్దంలో బెజవాడలో యుద్ధమల్లుని శాసనంలోని ఏడు కంద పద్యాలను లెక్కలోకి తీసుకుంటే పద్నాలుగు వందల ఏళ్లుగా) భాషగా రెండు వేల సంవత్సరాలకు పైగానే ఉన్నా తెలుగును ప్రాచీన భాషగా గుర్తించడానికి నియమాలు సడలించవచ్చుననడానికి పెద్ద వాగ్వివాదాలు అక్కర్లేదు. ముఖ్యంగా స్థూలమైన ఆచరణలో సాధ్యమయ్యే ప్రజాస్వామ్య పరిగణనకు సంఖ్య ఒక తిరుగులేని ఆధారమైతే దేశానికే పరిమితమైతే దేశంలో తెలుగు మాట్లాడే సంఖ్య అన్ని భాషా భాషేయులకన్నా ఎక్కువే. జనవరి 7 సభలో వక్తలు అభిప్రాయపడినట్లుగా, దక్షిణ దేశంలో భ్రమపడుతున్నట్లుగా దేశంలో హిందీ మాట్లాడే వారి సంఖ్య అందరికన్నా ఎక్కువ కాదు. ఎందరికన్నో తక్కువ. అలహాబాదులోను, కాశీలోను తప్ప హిందీ మాట్లాడే వాళ్లు ఎక్కడా లేరు. హిందుస్థానీ మాట్లాడే వాళ్లు కాస్త వాళ్ల కన్న ఎక్కువే ఉండవచ్చు. మనం చెప్పుకుంటున్న హిందీ రాష్ట్రాల్లో రాజస్థానీ, మార్వాడీ, మాల్వా, హర్యాన్వీ, భోజ్‌పూర్, మాగధ్, మైథిలీ మొదలైన భాషలు మాట్లాడే వాళ్లు ఎందరో. వీటిలో సాహిత్య అకాడమీ కూడ గుర్తించిన భోజ్‌పూర్, మైథిలీ, రాజస్థానీ వంటి భాషలు హిందీ భాష అనుకోవడానికి మనకు తెలియకపోవడం వల్ల మనకు అభ్యంతరం ఉండదేమో కానీ ఆయా మాతృభాషలు (నేను మాండలికాలు అనదలుచుకోలేదు.) మాట్లాడే వారికి తప్పకుండా అభ్యంతరమే. తెలుగులోను తెలంగాణ, రాయలసీమ, ఉత్తరాంధ్ర, పలనాడు, కోస్తా భాషా భేదాలు ఉండవచ్చు, వాటిల్లోనూ 'మాండలికాలు' ఉండవచ్చు గానీ పైన పేర్కొన్న భాషల్లో ఉన్నంత స్వతంత్ర ప్రతిపత్తి వీటికి లేదు. 1960లలో చూసిన సినిమాలు మొదలు 'తాల్' సినిమా వరకు (హిమాచల్ మాండలికం) ఒకసారి

హిందీ సినిమాలను గుర్చు తెచ్చుకున్న వాళ్లకు ఈ తేడా తెలుస్తుంది.

హిందీ ప్రస్తావన ఎట్లాగూ వచ్చింది గనుక జనవరి 7 తెలుగు విశ్వవిద్యాలయం తీర్మానంలో ఆ అంశాన్ని ముందు మాట్లాడి అధికార భాష అంశానికి తర్వాత వెళ్తాను. వాళ్లందరూ చాల పెద్దలే కానీ రాజ్యాంగపరంగా చూసినా వాళ్ల అవగాహనలో రెండు లోపాలున్నాయి. ఒకటి - జాతీయ భాష అంటే భారత దేశానికంతా వర్తించే భాష అని అర్థం కాదు. జాతీయ భాష అంటే మనం మామూలుగా చెప్పుకునే ప్రాంతీయ భాషలు, రాజ్యాంగంలో మొదట 17 భాషలుగా గుర్తింపు పొంది, ఆ జాబితాకు చేరుతున్న ప్రతి భాషా భాషీయుల భాష జాతీయ భాషనే. రాజ్యాంగమే గుర్తించిన జాతీయ భాషల్లో హిందీ వలెనే తెలుగు, తమిళం, కన్నడం, మలయాళం వగయిరా ఎన్ని భాషా రాష్ట్రాలున్నాయో అన్ని జాతీయ భాషలున్నాయి. ఈ భాషా రాష్ట్రాల సమాఖ్యకు అన్నీ అధికార భాషలుగా గుర్తించబడిన జాతీయ భాషలున్నాయి. ఈ జాతీయ భాషలకు ఒక అనుసంధాన భాష ఉండాలని, అది హిందీ కావాలని గాంధీజీ భావించాడు. అయితే ఆయన కూడ అది హిందీగా కాకుండా ఖడీబోలీగా లేదా హిందుస్థానీగా ఉండాలన్నాడు. తమిళులు మాత్రం అటువంటి అవసరమే వస్తే ఇంగ్లీషు అనుసంధాన భాషగా ఉండాలంటున్నారు. (ఇప్పటి వరకు వచ్చిన మన రాజకీయ నాయకుల్లో మాతృభాషలే అధికార భాషలుగా ఉండాలి అని, ఇంగ్లీషుకు ఈ దేశంలో ఉండవలసిన స్థానం ఏమిటనే విషయంలో శాస్త్రీయంగా మాట్లాడిన వాడు రాజాజీ ఒక్కడే. ఆయన ఇంగ్లీషు మాధ్యమంలో విద్యాబోధన గురించి - సామాన్యంగా మనుషులు భాష ద్వారా విషయాన్ని తెలుసుకుంటారు. నేర్చుకుంటారు. మనం మాత్రం విషయం ద్వారా భాషను నేర్చుకునే ప్రయత్నం చేస్తున్నాం. ఈ తలకిందుల ప్రయత్నం వల్ల భాష ఎలాగూ రాదు సరి కదా నేర్చుకోవాల్సిన అసలు విషయం మనసుకెక్కక అజ్ఞానులుగానే మిగిలి పోతాం అన్నాడు.) అ మాట తమిళులు ఇంగ్లీషు మీద ప్రేమతో చెప్పలేదు - అదొక్కటే అందరికీ సమానంగా పరాయి భాష కనుక ఏ భారతీయ భాష, ముఖ్యంగా హిందీ పెత్తనం చేయకుండా బ్యాలెన్స్ అవుతుందని.

ఇంతవరకూ రాజ్యాంగ నిర్మాతలు గానీ, కేంద్ర ప్రభుత్వం గానీ (కేంద్ర ప్రభుత్వంలో అత్యధిక కాలం అలహాబాదు వాళ్లే అధికారంలో ఉన్నప్పటికీ) స్పష్టంగా, నిర్దిష్టంగా హిందీ అనుసంధాన భాష అని ప్రకటించలేదు. 1965లో ఒకసారి ప్రధానిగా లాల్‌బహదూర్‌శాస్త్రి ఆ ప్రయత్నం చేసాడు. దానితో తమిళనాడులో అగ్నికీలలు రగిలినవి. ఎందరో కిరోసిన్ పోసుకొని ఆత్మహుతికి తలపడ్డారు. అప్పుడు పార్లమెంటులో 'ఇంగ్లీషు కూడ కొనసాగుతుంది' అని ప్రధాని ఒక శ్వేత పత్రం ఇవ్వాల్సి వచ్చింది. ఇప్పటికీ తమిళనాడులో ప్రతి సంవత్సరం ఆ ఉద్యమాన్ని స్మరిస్తూ హిందీ వ్యతిరేకోద్యమంలో అమరులైన తమిళుల సంస్మరణను హిందీ వ్యతిరేక దినంగా జరుపుకుంటారు - ఇపుడయితే తప్పకుండా చెన్నైలోని వళ్లువార్‌కొట్టం (అత్యంత ప్రాచీన బహుశా మొదటి తమిళ భాషా, సాహిత్య, సాంస్కృతిక ప్రవక్త - వైదిక సంప్రదాయంలో వేదాలకు, ఉపనిషత్తులకు ప్రతీకగా వ్యాసునికి ఉన్నంత ప్రాధాన్యం తమిళంలో కలిగిన 'రుషి'.)లోనే ఈ హిందీ వ్యతిరేక వారోత్సవాలు జరుగుతాయి. (ఇపుడు కేంద్రంలో యుపిఎ ప్రభుత్వాన్ని బలపరస్తున్న డిఎంకె, పిఎంకెలు ఈ ఉత్సవాలను ఘనంగా జరుపుతాయి.

ఇంత వివరణ ఎందుకంటే ఒక ఊహాజనితమైన అత్యాశను ముందుకు తెచ్చి ఇప్పటికి అధికారికంగా, వివాదరహితంగా ఆమోదం పొందని 'మొదటి జాతీయ భాష'గా హిందీకి మనం పట్టం కట్టి తెలుగుకు రెండో స్థానం కోసం కొత్త వివాదంలోకి వెళ్లనక్కర్లేదు. అటువంటి వివాదాస్పదమైన హిందీ తర్వాత స్థానాన్ని తెలుగుకు కోరనక్కర్లేదు. అసలు జాతుల సమాఖ్య అయిన ఈ దేశంలో ఒకే ఒక్క అధికార భాష ఉండాలనుకోవడం అప్రజాస్వామికం. (ఐక్యరాజ్యసమితిలో తెలుగు ప్రపంచభాషగా గుర్తింపు పొంది మాట్లాడుతున్నారని శ్రీశ్రీ 1+1=1 రేడియో నాటిక రాసిన కాలానికీ ఇవ్వాళ్టికీ మనం భాష విషయంలో సెంటిమెంటు స్థాయి దాటకపోతే ఎట్లా? ఐక్యరాజ్యసమితిలో జనాభా ఆధారంగా ఇంగ్లీషు, స్పానిషు, చైనీస్ మొదలైన ఆమోదిత భాషలు మాట్లాడవచ్చు. ఆఫ్రికా ఖండంలో అత్యంత ఎక్కువ సంఖ్య తెగలు మాట్లాడే స్వాహ్లీ భాషకు అటువంటి గుర్తింపు రావాలనే ఉద్యమం ఒకటి ఆఫ్రికాలో నిర్వహిస్తున్నారు.) ఎంత అభివృద్ధి చెందిన జాతీయ / ప్రాంతీయ భాష అయినా ఈ దేశంలో ఎక్కువలో ఎక్కువ అనుసంధాన (లింక్) భాష అయ్యే అర్హతను పొందవచ్చు తప్ప అధికార భాష - అది తెలుగయినా సరే కావాలనుకోవడం అప్రజాస్వామికం.

మనం ముందు ఇంకెవరినో కాదు స్వర్ణోత్సవాలు కూడ చేసుకున్న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాన్ని డిమాండు చేయవలసింది ఏమిటంటే తెలుగులో మాట్లాడమని - తెలుగు రాయమని. తెలుగులో పాలించమని. తెలుగులో శాసనం చేయమని, తెలుగులో న్యాయం చేయమని. తెలుగులో చదువు చెప్పమని. అన్ని దశల్లో, అన్ని స్థాయిల్లో.

అట్లాగే మనం డిమాండు చేయవలసింది కేంద్రాన్ని తెలుగులో రెండవ అధికార భాషగా జాతీయ స్థాయిలో గుర్తించమని కాదు - అది ఎంత అప్రజాస్వామికమో ఈ రాష్ట్రంలో ఉర్దూను రెండవ అధికార భాషగా అన్ని రంగాల్లో, అన్ని స్థాయిల్లో, అన్ని దశల్లో గుర్తించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండు చేయకపోవడం కూడ అంత అప్రజాస్వామికం. జనవరి 9వ తేదీన ఎంఐఎం శాసనసభ్యుడు అక్బరుద్దీన్ ఒవైసీ అదే విషయం గుర్తు చేసాడు. ఉర్దూను ముస్లింల మాతృభాష అని మాత్రమే కాదు ఒక మతపరమైన భాషగా చూసే అజ్ఞానం నుంచి మనకు భాషకు సంబంధించిన చారిత్రక, శాస్త్రీయ అవగాహన ఎన్నడు కలిగేను!

ఈ రాష్ట్రంలో తెలుగు, ఉర్దూలను మొదటి, రెండవ

అధికార భాషలుగా ప్రాథమిక విద్య స్థాయి నుంచి, విశ్వవిద్యాలయాల వరకు, మండల స్థాయి న్యాయస్థానం నుంచి ఉన్నత న్యాయస్థానం (హైకోర్టు) వరకు, గ్రామస్థాయి నుంచి సచివాలయం వరకు గుర్తించి, అమలు చేయాలి. గుర్తించడం ఎన్నడో జరిగింది. అమలుకు ఖచ్చితమైన శాసనం చేయాలి. సాంస్కృతిక ఆచరణలో తెలుగు వాడయిన (అందులోను పాళెగాడయిన) ముఖ్యమంత్రి కనీసం ఆంధ్రప్రదేశ్ స్వర్ణోత్సవ సభల్లో, ప్రవాసాంధ్రుల సభల్లో, తెలుగు మాత్రమే వచ్చిన పల్లెసీమలో ఏ ఒక్కరినో సంతోష పెట్టడానికి ఇంగ్లీషు మాట్లాడనక్కర్లేదు. వచ్చిన తెలుగే మాట్లాడితే తప్పు కాదు.

అయితే ఒకటి మనం హిందీ రాష్ట్రాలుగా చెప్పుకుంటున్న రాష్ట్రాల్లో హిందీ విషయంలో, తమిళనాడు, కర్నాటకలలో తమిళం, కన్నడం విషయంలో జరుగుతున్నంత అభినివేశంతో చట్టరీత్యా, శాసనరీత్యా, ప్రభుత్వ శ్రద్ధతో అమలు జరగాలి. చిత్తశుద్ధి ఉంటే అది అసాధ్యం కాదు. అది మాత్రమే చాలదు. చట్టాలు, శాసనాలే ఒక భాషను అధికార భాషను చేయజాలవు.

యునెస్కో తన పరిశీలనలో ప్రపంచంలో ఉన్న ఆరు వేల భాషల్లో మాట్లాడే వారి సంఖ్య తగ్గి మూడువేల భాషలు అంతరించిపోయాయని, ఒక భాష మాట్లాడే వారి సంఖ్య ముప్పై శాతానికి తగ్గిపోతే అది క్రమంగా అంతరించి పోయే ప్రమాదం ఉందని, అటువంటి ప్రమాదాన్ని తెలుగు భాష ఎదుర్కోబోతున్నదని చెప్పిందట. అధికార భాషా సంఘం సభ్యుడైన కాలువ మల్లయ్య గారు 09.01.06 ఆంధ్రభూమిలో తెలుగు భాషగా అంతరించి తెలుగు జాతికి, సంస్కృతికి ఎంత గ్లాని జరుగనున్న దో చాల ఆవేదన పడుతూ రాసారు.

ఈ స్థితి కేవలం అన్ని స్థాయిల్లో తెలుగును అధికార భాషగా అమలు చేయక పోవడం వల్లనే వచ్చిందా? అంత మాత్రమే కాదు. బోధనా స్థాయిలో ప్రాథమిక స్థాయి నుంచి విశ్వవిద్యాలయ స్థాయి వరకు మాతృభాషను మాత్రమే మాధ్యమంగా అమలు చేయాలనే నియంత్రణ లేకపోవడం వల్ల వచ్చింది. కాన్వెంటు చదువుల వల్ల, ప్రైవేటు రంగంలో విద్యను వ్యాపారంగా ప్రోత్సహిస్తూ ఇంగ్లీషు మాధ్యమాన్ని అనుమతించడం వల్ల వచ్చింది. ప్రభుత్వరంగంలోనైనా మొక్కుబడిగాను, లాంఛనంగానూ, మాతృభాషలను తప్పనిసరి అని అంటూనే ఆ పాఠశాలలను, కళాశాలలను క్రమంగా మూసి వేసే స్థితి రావడం వల్ల వచ్చింది. ఒక్కమాటలో కాన్వెంటు స్థాయి నుంచి కళాశాల స్థాయి వరకు విద్య ప్రైవేటు కార్పొరేటు వ్యాపారం అయిపోయినందు వల్ల వచ్చింది. ఒకటి రెండు తరాలు ఇప్పటికే తెలుగు మాతృభాషగా కలిగిన కుటుంబాల్లో పుట్టినా వాళ్లకు బడిలో తెలుగు లేదు. ఉన్నత మధ్య తరగతి కుటుంబాల్లోనయితే ఇంట్లో కూడ తెలుగు లేదు. ఉర్దూ మాతృభాషగా కలవారి కుటుంబాల్లో ఎనభై శాతం అట్టడుగు దారిద్ర్యం లేకపోతే వాళ్ల స్థితి కూడ ఇలాగే ఉండేది.

ఈ స్థితి మారడానికి ప్రపంచీకరణ పట్ల, సామ్రాజ్యవాద మార్కెట్ పట్ల, ముఖ్యంగా అమెరికా పట్ల సమాజంలో మోజు తగ్గితే తప్ప, ప్రభుత్వం కన్నా తలిదండ్రుల్లో, పేరాశ తగ్గితే తప్ప అవకాశం లేదు. ఆ మోజు, పేరాశలు తగ్గే భవిష్యత్తు కనిపించడం లేదు.

ఉపాధ్యాయ సంఘాలు కొన్ని ఏక పాఠశాల విధానం (సింగిల్ స్కూల్ సిస్టమ్) కావాలని సూత్రప్రాయంగా అంటున్నాయి తప్ప దానికోసం ఉద్యమం లేదు. ఆ సంఘాల్లోని ఉపాధ్యాయులే స్వయంగా ఇంగ్లీషు మాధ్యమం ప్రైవేటు సంస్థలను నడుపుతూ, అందరికందరు తమ పిల్లలను ఇంగ్లీషు మాధ్యమం గల ప్రైవేటు విద్యా సంస్థలకు పంపుతున్న చోట సమాజంలో ఈ డిమాండుకు అసలు ఆదరణ అయినా లభిస్తుందనేది అత్యాశే.

ఇక మిగిలిందల్లా ప్రభుత్వం తన చేతిలో గల అధికారాన్ని అత్యున్నతస్థాయి వరకు మాతృభాషను అధికార భాష చేయడానికి తీసుకునే చట్టపరమైన చర్యలు, విద్యా ఉపాధి రంగాల్లో, పరిపాలనా, న్యాయ వ్యవస్థల్లో మాతృభాషలకు (జనాభా ప్రాతిపదికపై తెలుగు, ఉర్దూలకు) మాత్రమే విధిగా అర్హతలుగా గుర్తించి అవకాశాలు కల్పించడం.

ఈ విషయంలో ఎబికె ప్రసాద్ గారు అధికార భాషా సంఘం అధ్యక్షులయ్యాక చేస్తున్న కృషి - ఆ సంఘానికున్న వనర్లు, అధికారాలు ఎంతో తెలియదు గనుక - మెచ్చతగిందే.

తెలుగు భాషను కాపాడుకోవాలని, తెలుగును అన్ని స్థాయిల్లో అధికార భాషను చేయాలనే ఆకాంక్షలో తెలంగాణ ప్రజలకు అపోహలు కలుగుతున్న ఒక అంశాన్ని ప్రస్తావించడానికే అసలు నేనీ వ్యాసం ప్రారంభించాను. ఆ అపోహ తొలగించవలసిన బాధ్యత తెలుగును కాపాడుకోవాలని ఉద్యమిస్తున్న ప్రతి ఒక్కరిపై ఉంది. అదేమంటే మొదటే ప్రస్తావించినట్లు ఒక దశాబ్దంగా తెలుగును కాపాడుకోవాలనే ఉద్యమాలు ఊపందుకుంటున్నాయి. ముఖ్యంగా చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి అయి ప్రపంచ బ్యాంకు అభివృద్ధి నమూనాకు తెలంగాణను ఒక ప్రయోగశాలగా చేయడం ఆరంభించిన కాలంలోనే ప్రత్యామ్నాయ అభివృద్ధి నమూనా కూడ ముందుకు వచ్చింది. పైకి ఆశ్చర్యంగా కనిపించినా, అసమ అభివృద్ధి సామ్రాజ్యవాద స్వభావమని సారంలో గ్రహించిన ప్రత్యామ్నాయ రాజకీయాలు మళ్లీ ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం గురించి మాట్లాడడం ప్రారంభమైంది. 1997 నుంచి ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం ఒక ప్రజాస్వామిక ఉద్యమం ప్రారంభమైంది.

ఇంచుమించు అదే కాలం నుంచి సి. ధర్మారావు గారి నాయకత్వంలో, జనసాహితీ సాంస్కృతిక సమితి నాయకత్వంలో తెలుగు భాష పరిరక్షణ ప్రచారం ప్రారంభమైంది.

తెలుగును కాపాడుకోవడాన్ని వీళ్లు సమైక్య ఆంధ్రప్రదేశ్‌ను కాపాడుకోవడంలో భాగంగా చూస్తున్నారు. ఈ అందరికీ ఒక సాంప్రదాయకమైన జాతి, భాషా భావాలే ఉన్నాయి తప్ప భాష కుండే రెండు స్వభావాల గురించిన అవగాహన చైతన్యపూర్వకంగా

లేదు. దాదాపుగా ఈ అందరూ మార్క్సిజంతో పరిచయం ఉన్నవాళ్లే. భాష, జాతి పట్ల మార్క్సిస్టు దృక్పథం తెలిసిన వాళ్లే. (నేనిక్కడ స్వప్రయోజన పరులై ఉండి సమైక్య ఆంధ్రప్రదేశ్ కోరుకున్న వాళ్లను మినహాయించి మాట్లాడుతున్నాను.) స్టాలిన్ మొదలు చామ్స్కీ వరకు భాష గురించి వెలిబుచ్చిన అభిప్రాయాలతో ఏకీభావం ఉన్నవాళ్లే.

అయితే ఆఫ్రికా, లాటిన్ అమెరికా జాతి విముక్తి పోరాటాల్లో, సామ్రాజ్యవాద (వాళ్లు నయావలస అంటారు) వ్యతిరేక పోరాటాల్లో ముందుకు వచ్చిన భాషా సిద్ధాంతాలను (బ్రెఖ్ట్ ప్రిసినియమ్ దగ్గర ఆగిపోయిన నాటకరంగానికి సంబంధించిన అవగాహనను ఆఫ్రికా ప్రజా రంగస్థల అవగాహన దాకా కూడ అధ్యయనం చేసి) అధ్యయనం చేయవలసిన అవసరం ఉన్నది. కె. రవిబాబు వంటి వాళ్లు ఈ అధ్యయనం చేసారు కానీ పాఠకుల ప్రయోజనం కొరకు భాష విషయంలో గూగీ చేసిన ప్రతిపాదనను ప్రస్తావిస్తాను. వాస్తవానికి ఆఫ్రికా తెగలు వలస పాలనలో మన కన్నా ఎంతో ఎక్కువగా క్రైస్తవమత ప్రభావంలోకి వెళ్లాయి. ఎన్నో చోట్ల చెప్పుకున్నట్లు ఇంగ్లీషు వాడు అక్కడికి ఒక చేత కత్తి, ఒక చేత బైబిల్ పట్టుకొని వెళ్లాడు. ఆ ప్రభావం వల్ల ఆఫ్రికా తెగలు విపరీతమైన పాశ్చాత్య నాగరికతా, సంస్కృతులకు బానిసలై (విద్యావంతులు) క్రైస్తవులై ఇంగ్లీషు చదువులే చదివారు. ఇంగ్లాండులో ఉన్నత విద్య అభ్యసించి జ్ఞానోదయమయ్యేదాకా గూగీవా థియోంగో జేమ్స్ అనే క్రైస్తవ నామంతో రాసినవాడు, ఉన్నత విద్యలు పూర్తి చేసి కెన్యా రాజధాని నైరోబీకి తిరిగి వచ్చి ఇంగ్లీషు శాఖ అధిపతి అయ్యాక ఆయన చేసిన మొదటి పని విశ్వవిద్యాలయ అధికారులకు ఇంగ్లీషు శాఖను రద్దు చేయాలని చేసిన ప్రతిపాదన. ఆ స్థానంలో తులనాత్మక భాషా సాహిత్యాల అధ్యయన సంస్థను పెట్టమన్నాడు. ఆ వివరాలు అలా ఉంచి భాషకు ఆయన రెండు పనులు (ఫంక్షన్స్) ఉంటాయన్నాడు వర్గ సమాజంలో. వర్గరహిత సమాజంలోనైతే భాషకు కేవలం భావ వినిమయ కర్తవ్యమే ఉంటుంది. కాని వర్గ సమాజంలో భాషకు ఆధిపత్య స్వభావం కూడ అబ్బుతుంది. ఇంగ్లీషు ప్రపంచాన్ని కొన్ని వందల ఏళ్లు పరిపాలించినందున విజ్ఞానానికి ఒక కిటికీగా మారింది కనుక దానికున్న భావ వినిమయ సౌలభ్యాన్ని, వనరును గుర్తిస్తూనే దానికున్న ఆధిపత్య స్వభావం వల్ల దానిని అధికార భాషగా రద్దు చేయాలన్నది ఆయన ప్రతిపాదన. స్వతంత్రమైన దేశాలున్న ప్రపంచంలో అదే పని చేసాయి, తెలుగు విముక్తం కావాలన్నా ఆపనే ముందు జరగాలి.

తెలుగు భాషా పరిరక్షణకు పూనుకున్న సంస్థలకు సంబంధించి ఇద్దరు గౌరవనీయులైన వ్యక్తుల పేర్లు ప్రస్తావించినప్పుడు ఆ రెండు సంస్థలకూ, ఆ ఇద్దరికీ కేవలం శుద్ధ భాషా పరిరక్షణ ప్రయోజనమే కాకుండా సమైక్య ఆంధ్రప్రదేశ్ - తెలంగాణలో తెలుగు మాట్లాడేవాళ్ల దృష్టిలో చెప్పాలంటే ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర వ్యతిరేక ప్రచార ప్రయోజనమున్నది. నిర్దిష్ట రాజకీయ దృక్పథాలు ఉన్నాయి.

సి. ధర్మారావు గారు సచివాలయంలో సంయుక్త కార్యదర్శిగా పదవీ విరమణ చేసిన నిజాయితీగల భాషా సాహిత్యవేత్త రాడికల్ హ్యూమనిస్టు కావడం వల్ల, తెలుగు నేలమీద కమ్యూనిజం కాస్త బలంగా ఉండడం వల్ల కొంత కమ్యూనిస్టు వ్యతిరేకత ఉండడం కూడ కద్దు. అందువల్ల గాంధేయులమని చెప్పుకునేవాళ్లను సులభంగా నమ్ముతారు. అది అలా ఉంచి పులిచింతల ప్రాజెక్టుకు ముఖ్యమంత్రి శంఖుస్థాపన చేసిన శిలాఫలకాన్ని ఎవరో మర్నాటికి పగులగొట్టారు. పులిచింతల ప్రాజెక్టును కట్టనివ్వమని సిపిఐ మావోయిస్టు ప్రకటించింది గనుక అది ఆ పార్టీ పనేనని పోలీసులు ప్రకటించారు. (ప్రభుత్వానికి నక్సలైట్లకు చర్చలు ప్రారంభమైన రోజే ముఖ్యమంత్రి పులిచింతల ప్రాజెక్టుకు శంఖుస్థాపన చేసాడు). ఆ వార్త, ఫోటోల వల్ల సి. ధర్మారావు గారికి శిలాఫలకం ఇంగ్లీషులో ఉందని తెలిసి వచ్చింది. శుద్ధ భాషావాది అయితే దానికి మాత్రమే అభ్యంతరం చెప్పేవాడు. కాని పులిచింతల ప్రాజెక్టును వ్యతిరేకిస్తున్నందుకు, శిలాఫలకాన్ని ధ్వంసం చేయడం వంటి విధ్వంస కార్యక్రమానికి పూనుకున్నందుకు ఆయన మావోయిస్టు పార్టీ దృక్పథాన్ని కూడ తప్పు పట్టాడు. ఇంతకు శిలాఫలకాన్ని తాము పగులగొట్ట లేదని, తమను బదనామీ చేయడానికి, చర్చలు కూడ ఇష్టంలేని పోలీసులే ఆ పని చేసారని స్థానిక పార్టీ ప్రకటన ఇచ్చింది. అప్పుడయినా సి. ధర్మారావు గారు భాషా పరిరక్షణ పరిమితి దాటి తాను మాట్లాడింది దిద్దుకోలేదు.

ముస్లింవాద కవిత్వం పై ఆంధ్రజ్యోతిలో జరిగిన చర్చలో కూడ ఆయన భాషాతీతమైన ఇష్టానిష్టాలు బయటపడ్డాయి. ఈ మాట తప్పొప్పుల ప్రస్తావనకు కాదు. భాష, రూప పరిరక్షణలనేవి దృక్పథాలకు అతీతంగా ఉండవని చెప్పడానికే. చేరాతల్లో రూపచర్చ చేయడానికే ఎంతో జాగ్రత్తపడిన చేరా, స్త్రీ వాద కవిత్వం విషయంలోకి వచ్చే వరకు వాద సమర్థన చేయకుండా ఉండలేకపోయేవాడు.

అట్లాగే జనసాహితి, దాని కార్యదర్శి రవిబాబు, కె. రవిబాబు గూగీని క్షుణ్ణంగానే చదివి వుంటాడు. కాని ఒక పరిమిత ప్రాంత భాష ఆధిపత్య స్వభావాన్ని సంతరించుకున్నది గనుక ప్రత్యేక తెలంగాణ రాష్ట్రవాదులు రెండు తెలుగులు ఒకటి కాదన్నంత దూరం పోయారని అంగీకరించలేడు. ఒక పరిమిత ప్రాంత భాష ఆధిపత్య స్వభావాన్ని పసిగట్టినా అంత మాత్రాననే విడిపోవాలా అని అభ్యంతర పెట్టగలడు. అందులో ఇంగ్లీషు-ఆఫ్రికా భాషల మధ్యన ఉన్నంతటి అఖాతాన్ని పోల్చుకోలేడు.

సాహితీ స్రవంతి కానీ, దాని బాధ్యుడు తెలకపల్లి రవి గానీ తెలుగు భాష పరిరక్షణ అంటే ఆంధ్రప్రదేశ్ పరిరక్షణ అని, టెర్రరిజం అంటే మావోయిస్టు పార్టీ విప్లవాహగాహన (లేదా ఆచరణ) అని భావిస్తున్నారని ఇప్పటికే తెలంగాణావాదులు, విప్లవాభిమానులు (కనీసం మావోయిస్టు పార్టీ అభిమానులు) అనుమానిస్తూనే ఉన్నారు.

ప్రతి అంశానికీ ఒక సార్వజనీన లక్షణమున్నట్లుగానే ఒక

ప్రత్యేకమైన లక్షణం కూడ ఉంటుంది. ఆధిపత్య భావజాలం ఉన్న సమాజంలో భాష మీద కులం, మతం, జెండర్, ప్రాంతం ప్రభావాలు అందువల్ల ఏర్పడే అసమానతలు పని చేస్తాయి.

ఆంధ్రప్రదేశ్ ఏర్పడిన తర్వాత ఈ ఏభై ఏళ్లలో కోస్తాకు చెందిన రెండున్నర జిల్లాల రెండున్నర కులాల సంపన్న వర్గం పెత్తనం సాగుతున్నది అనేది ఒక సాధారణ నినాదంలో ఇమిడి ఉన్న అంశం భాషకే అన్వయించుకుంటే, ఆ వర్గాలు ఆంధ్రప్రదేశ్ ఏర్పడక పూర్వం నుంచే పత్రికల ద్వారా రూపొందించిన భాష ఇవ్వాళ ఆంధ్రప్రదేశ్‌కు అంతే ప్రామాణికమైన వ్యవహారిక భాష అయింది.

అందుకే తెలుగు భాషా పరిరక్షణను వీళ్లు సమైక్య ఆంధ్రప్రదేశ్‌లో భాగంగా చూస్తున్నారు. తెలంగాణ ఏర్పడితే తమిళనాడు, పాండిచ్చేరిలలో తమిళం వలె ఆంధ్ర, తెలంగాణ రెండు రాష్ట్రాలలో తెలుగు అధికార భాషగా ఉండవచ్చుకదా, కాకపోతే తెలంగాణ వాళ్లు ఒక పర్వతసాదృశ్యమైన (అప్‌హిల్‌టాస్క్) ప్రయత్నం చేస్తే తప్ప తెలంగాణ రాష్ట్రంలో తెలంగాణ తెలుగును అధికార భాషగా చేసుకోలేరు. ఉదాహరణకు - నేనిప్పటి దాకా రాసిన వ్యాసాన్ని చదివిన వాళ్లు గమనించే ఉంటారు. నా వాక్యం తెలంగాణ వాక్యం కాదు, తెలంగాణ భాష అనేది కేవలం మాండలికంతో నిర్ణయమయ్యేది కాదు. తెలంగాణ రచయితల వేదిక ఏర్పడిన తర్వాత నలగొండ వంటి జిల్లాల్లో ప్రయత్న పూర్వకంగా కొందరు రచయితలు చేస్తున్న ప్రయత్నంలో తప్ప తెలంగాణ రచయితల రచనల్లో క్రియ పత్రికలు అందించిన కోస్తా భాషీయుల క్రియనే. చేసారు అని రాసానే తప్ప చేసిను అని రాయలేదు గదా. ఎందుకంటే తెలంగాణ భాషీయులు క్రియలు చేసేవాళ్లుగానే ఉన్నారు. చేయించేవాళ్లుగా లేరు. వార్తా పత్రికల క్రియనే పాఠకులుగా మనమంతా రాస్తున్నాం. అర్థం కావడం గురించి జరిగే చర్చంతా మాండలికాలు రాయడం గురించి లేదా దళిత, స్త్రీ వాద, ముస్లిం మైనారిటీ వాద రచనల్లో తమ తమ కుల (అందులోను వర్గీకృతమైన కులాలు), జెండర్, మత భాష వాడితే అర్థం కావడమన్న చర్చ జరుగుతున్నదే గానీ వాక్య రచన ఆయా భాషీయుల, ప్రాంతీయుల వ్యవహార శైలికి సంబంధించింది కాదన్న చర్చ జరగడం లేదు. వేళ్లమీద లెక్కపెట్టదగినంత మంది తెలంగాణ రచయితలు మాత్రమే తెలంగాణ (క్రియ వాడి) వాక్యం రాస్తున్నారు. కాళోజీ కూడ సంభాషణ, ప్రసంగంలో తప్ప రచనలో తెలంగాణ వాక్యం రాయలేక పోయాడు. అంతటిదే సామాజిక, ఆర్థిక రాజకీయ ప్రాబల్యం గల పాలకుల ప్రభావం భాషా, సాహిత్య, సంస్కృతుల మీద.

ఇది ఎవరి మీదనో ఆరోపణ చేయడానికి కాదు, ఒక సామాజిక ఆర్థిక రాజకీయ పాలన అనివార్యంగానే భాషలో తెచ్చే పాలక, పాలిత సంబంధం. భాషను ఒక శుద్ధ పదార్థంగా చూసి, చూపి కాపాడుకోవాలనుకోవడం అమాయకత్వమో, ధూర్తత్వమో అవుతుంది.

కనుక తెలుగును కాపాడుకోవాలని ఉద్యమించే వాళ్లు అన్ని ప్రాంతాల, కులాల, మతాల, జెండర్ల (ముఖ్యంగా అణగారిన వర్గాల) సజీవ భాషను కాపాడే వెసలుబాటును, ప్రజాస్వామ్యాన్ని పాటించాలి. తెలంగాణకు సంబంధించినంత వరకే ప్రస్తుతం ప్రస్తావిస్తే తెలుగును కాపాడుకోవడం - సమైక్య ఆంధ్రప్రదేశ్‌తో ముడిపడి ఉన్న అంశం ఎట్లా అవుతుంది? రేపు తెలంగాణ ఏర్పడితే, లేదా పోటీగా రాయలసీమ, ఉత్తరాంధ్రలు, ఏర్పడితే, ఇంక గత్యంతరం లేక పలనాడు కూడ ఏర్పడితే అక్కడ అధికార భాష తెలుగు కాదా? కాకపోతే ఆయా ప్రాంతాల భాషా భాషీయుల తెలుగు అవుతుంది.

ఈ వాస్తవాన్ని విశాల హృదయంతో తెలుగు విశ్వవిద్యాలయం, తెలుగు అకాడమీ అధికార భాషా సంఘం బాధ్యతగా గుర్తించి తెలుగు భాషా పరిరక్షణ అనేది ప్రజాస్వామికంగా జరగడానికి కృషి చేయాలి. అట్లా ఏర్పడే అధికార భాషలో ఈ పాలిత భాషలన్నింటికీ భాగస్వామ్యం ఉండాలి. కోస్తా - కోస్తేతర భాషల మధ్యన పాలక, పాలిత సంబంధాలు రద్దుకావాలి. అది తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే తప్ప సాధ్యంకాని అసమ అభివృద్ధి అయితే, తెలంగాణ రాష్ట్రం ఏర్పడి అప్పుడు రెండు రాష్ట్రాలుగా గోదావరి, కృష్ణా జలాల విషయంలో సమానంగా వ్యవహరించగల అధికారాన్ని తెచ్చుకునేట్లుగానే తెలుగును అధికార భాషగా రెండు రాష్ట్రాల్లోనూ అమలు చేసే విషయంలో కూడ అధికారాన్ని అమలు చేస్తారు.

ఇవ్వాళ మళ్లీ అకాడమీలన్నీ పునరుద్ధరించాలనే ప్రయత్నాలు కూడ సమైక్య ఆంధ్రప్రదేశ్‌ను నిలపాలనే తహతహతోనే జరుగుతున్నాయి. ఆంధ్ర మహాసభ కాలం నుంచి తెలంగాణ రచయితల సంఘాన్ని అఖిలాంధ్ర రచయితల సంఘంగా అలంపురంలో ప్రకటించే దాకా తెలంగాణ రచయితలు తెలుగు భాష, సాహిత్యం, సంస్కృతుల అభివృద్ధి గురించి ఆలోచించి విశాలాంధ్ర ఆకాంక్షతోనే నిర్మాణాలు చేసారు. అంత స్వచ్ఛమైన, భావోద్వేగ పూరితమైన వైషమ్యరహితమైన భావంతోనే - అంటే తెలంగాణ వేరే రాష్ట్రం ఏర్పడినా రెండు రాష్ట్రాల్లోనూ తెలుగు భాషా సాహిత్య సాంస్కృతిక వికాసం కలగాలనే దూరదృష్టితోనే అకాడెమీలు ఏర్పడాలి తప్ప, తెలుగు విశ్వవిద్యాలయం, తెలుగు అకాడమీ, అధికార భాషా సంఘం అందుకు కృషి చేయాలి తప్ప, పాలకవర్గం ఈ అన్నింటినీ తెలంగాణ రాష్ట్ర డిమాండును నీరుగార్చే పనిముట్లుగా వాడుకో చూసే కుటిలయత్నానికి లోబడకూడదు. సమైక్య ఆంధ్రప్రదేశ్‌లో పాలకులు కాపాడబోయేది తెలుగును కాదు కేవలం తమ సామ్రాజ్యవాద గులాంగిరీని మాత్రమే. ❑

పోలవరం ప్రాజెక్టు - ఆదివాసులు

| గుంటి రవి |

రాష్ట్ర ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డి జలయజ్ఞం పేరుతో 276 ఏజన్సీ గ్రామాలను జలసమాధి చేసే ఇందిరాసాగర్ (పోలవరం) ప్రాజెక్టు పనులను ప్రభుత్వం విరమించుకోవాలని మునిగిపోనున్న ప్రాంతాల ప్రజలు కోరుతున్నారు. నిండు జీవితాలు నీటిపాలు చేసే పోలవరం ప్రాజెక్టు శంకుస్థాపన పట్ల నిరసన ప్రకటించడానికి తరలి వచ్చిన వేలాది మందిని 144 సెక్షన్ విధించి, దొరికిన వారిని దొరికినట్లు అరెస్టు చేసి జైల్లో పెట్టారు. ప్రాజెక్టు కింద ఏజన్సీ ప్రాంతంలోని తొమ్మిది మండలాలలో ఖమ్మం జిల్లాలోని వరరామచంద్రపురం మండలంలో 45 గ్రామాలు, కూనవరం మండలంలో 48 గ్రామాలు, చింతూర్ మండలంలో 17 గ్రామాలు, కుకునూర్ మండలంలో 27 గ్రామాలు, బూర్గంపాడు మండలంలో 9 గ్రామాలు, పశ్చిమ గోదావరి జిల్లా పోలవరం మండలంలో 29 గ్రామాలు, తూర్పుగోదావరి జిల్లా దేవిపట్నం మండలంలో 42 గ్రామాలు మొత్తంగా 276 ఏజన్సీ గిరిజన గ్రామాలు పూర్తిగా మునిగిపోనున్నాయి. 1996వ సంవత్సరం అంచనా ప్రకారం 27,798 కుటుంబాలు దాదాపు లక్షా పదిహేను వేలకు పైగా గిరిజనులు (ప్రస్తుత జనాభా ప్రకారం సుమారు 2 లక్షల గిరిజనులు) పోలవరం ప్రాజెక్టు వల్ల పూర్తిగా నిర్వాసితులైపోతారు. నిర్వాసితులు అత్యధికశాతం 65.78 గిరిజనులు, దళితులు. ఇందులో గిరిజనులు 53.17 శాతం. దాదాపు 8 వేల కోట్ల రూపాయలకు పైగా ఖర్చుపెట్టి 276 ఏజన్సీ గిరిజన గ్రామాలను జలసమాధి చేయడానికి ప్రభుత్వ ప్రాజెక్టు అనుమతికై సంబంధించిన నియమ నిబంధనలను గోదావరిలో కలిపి కాలువల తవ్వకాలు చేస్తోంది.

నిర్వాసితుల పునరావాసం పునర్నిర్మాణాల పథకాల రూపకల్పన అమలు విషయంలో షెడ్యూల్డ్ ఏరియాలోని 1/70 చట్టాన్ని కాదని, పంచాయతీరాజ్ చట్టం నియమాలను ఉల్లంఘించి భూసేకరణ చర్యలను, ప్రాజెక్టు పనులను ప్రభుత్వం ప్రారంభించింది. షెడ్యూల్డ్ ప్రాంతంలో పంచాయతీరాజ్ చట్టం 1998 ప్రకారం భూసేకరణ చేయడానికి ముందుగా ఆయా గ్రామ పంచాయతీలు, గ్రామ సభల లిఖిత పూర్వక అనుమతి తీసుకోవాలి. రాజు తల్చుకుంటే దెబ్బలకు కొదవా అన్నట్లు రాజశేఖరరెడ్డి తల్చుకుంటే ఎంత! నోరు తెరచి గ్రామసభల, పంచాయతీల అనుమతి తీసుకోలేదన్న వాళ్లపై కేసులు పెట్టడం, అరెస్టు చేయడం వంటి నిర్బంధ చర్యలకు ప్రభుత్వం పాల్పడుతోంది. ఇటీవల భారీ నీటి పారుదల శాఖామాత్యులు పొన్నాల లక్ష్మయ్య ఇంకో అడుగు ముందుకేసి అసలు గ్రామసభల అనుమతే అవసరం లేదని చట్టాలనే గాక రాజ్యాంగాన్నే కాలరాస్తున్నాడు. చివరికి కేంద్ర జలవనరుల శాఖ, పర్యావరణశాఖ అడిగిన వివరాలను కూడా అందచేయలేదని అందువల్ల ప్రాజెక్టు అనుమతి మంజూరు చేయలేదని హైకోర్టుకు కేంద్ర జలవనరుల సంఘం వివరణ ఇచ్చింది. ప్రాజెక్టు విషయంలో కోర్టు మందలింపును కూడా లెక్కచేయకుండా తవ్వకాలు చేపట్టింది. ఛత్తీస్‌ఘడ్, ఒరిస్సా రాష్ట్రాల ఆదివాసీ ఆవాసాలు కూడా ముంపుకు గురైతున్నందున ఆయా రాష్ట్రాలతో వివాదాలను పరిష్కరించుకోకపోవడమే కాకుండా అంతర్ రాష్ట్ర నీటి వివాదాల పరిష్కార చట్టం కింద ఇచ్చిన బచావత్ అవార్డు ఉల్లంఘనకు ప్రభుత్వం పాల్పడుతోంది. బచావత్ అవార్డు ప్రకారం కేంద్ర జలవనరుల సంఘానికి మాత్రమే ప్రాజెక్టు రూపకల్పన చేసే అధికారం ఉండగా రాష్ట్ర ప్రభుత్వం ఏకపక్షంగా ప్రాజెక్టు డిజైన్ చేసి నిర్మాణం చేపడుతోంది.

సమాచార హక్కు చట్టానికి లోబడైనా సమాచారాన్ని అందించాలనే కనీస ప్రజాస్వామ్య సూత్రాన్ని కూడా తుంగలో తొక్కిందీ ప్రభుత్వం. పారదర్శకత, జవాబుదారితనం గురించి బాకాలూదే రాజశేఖరరెడ్డి ప్రభుత్వం ఎందరు నిలదీసినా ఇంతవరకు ప్రాజెక్టు డిజైన్ రిపోర్టు బయట పెట్టడం లేదు. ముంపుకు గురయ్యేది 276 గ్రామాలే కాదు 7,964 ఎకరాల సహజ అడవి కూడా ధ్వంసమవుతుంది. గ్రామాలు అడవులు అంతా కలిపి పోలవరం ప్రాజెక్టు 1,10,567 ఎకరాలనీ జలసమాధి చేస్తుంది. ఇంతాచేసి అదనంగా సాగునీటి సౌకర్యం లభించే భూమి 2.95 లక్ష ఎకరాలకు మించదని నిపుణుల అంచనా. ఇంతకంటె రెట్టింపు అంటే 4.25 లక్షల ఎకరాలకు తాటిపూడి, చాగల్నాడు ఎత్తిపోతల పథకాల ద్వారా సాగునీటి వసతి ఒనగూరుతుంది.

నిజానికి పోలవరం ఉపరితల రవాణా కోసమేననే ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమన్న రహస్యం రాజశేఖరరెడ్డి గారికి తెలియదనుకోలేం కదా? ఈ బహుళార్థక సాధక ప్రాజెక్టు బహుళజాతి కంపెనీల ప్రయోజనాలకే ప్రాధాన్యం అన్న విషయం దాచినా దాగని సత్యం కాదా. ఈ ప్రాజెక్టు కింద ముంపుకు గురౌతున్న 1.10,567 ఎకరాల భూమి మాత్రమే కాదు, పర్యావరణ సమతుల్యాన్ని ధ్వంసం చేసి ప్రకృతి బీభత్సానికి, జీవావరణాన్ని బలిపెట్ట పూనుకుంటున్న ఈ పాలకులు భావితరాలకు ఏ పరిహారం చెల్లిస్తారో చెప్పగలరా? కుందేళ్లు పట్టారని, పాముల్ని తిన్నారని గిరిజనులకు జైలు శిక్షలు వేస్తున్న చట్టం ఎనలేని వన్యప్రాణి సంబంధాన్ని, ఔషధ వనసంపదనీ జలసమాధి చేస్తున్న ప్రభుత్వానికి ఏ శిక్ష విధిస్తుందీ చట్టం.

ఇక పునరావాస ప్రహసనం గురించి - ఇప్పటి వరకు వివిధ ప్రాజెక్టుల కింద నిర్వాసితులైన ప్రజల్లో 40 శాతం గిరిజనులు. ఈ

ప్రాజెక్టుల వల్ల నిర్వాసితుల్లో కేవలం 27.69 శాతం ప్రజలకు మాత్రమే ఎంతో కొంత పునరావాసం అందింది. మిగతా కుటుంబాలు ప్రాజెక్టుల పునాదుల కింద సమాధి అయ్యారు. ఇంతగా జీవన, పర్యావరణ విధ్వంసానికి దారితీసే పోలవరం ప్రాజెక్టు వద్దేవద్దు. పరీవాహక ప్రాంత ప్రజల తాగునీటి, సాగునీటి సౌకర్యం కోసం పరివాహక ప్రాంతం పొడవునా ఎత్తిపోతల పథకాలు, చిన్నచిన్న రిజర్వాయర్లు, కొండప్రాంతాల వాగులు - వంకలకు చెక్‌డ్యాంలు, ఎక్కడికక్కడ చెరువుకుంటలు నిర్మించి ప్రకృతి సహజవనరుల పరిరక్షణ వినియోగ ప్రత్యామ్నాయ పథకాలను చేపట్టి అభివృద్ధి పర్చాలి.

కృష్ణా బేసిన్‌కు 80 టిఎంసిల నీటిని, కుడికాలువ ద్వారా కృష్ణాబేసిన్ స్థిరీకరణకు పోలవరం నీటిని అందిస్తామని ప్రభుత్వం చెప్తున్నది. నదీ బేసిన్ అవసరాలు తీర్చకుండా బేసిన్ బయటి ప్రాంతాలకు ఆ నదీ జలాలను మళ్లించడం జాతీయ-అంతర్జాతీయ జల విధానాలకు విరుద్ధమే కాకుండా అభివృద్ధి చెందిన ప్రాంతాలను మరింత అభివృద్ధి చేయడం, వెనుకబడిన ప్రాంతాలను మరింత వెనుకబాటుకు గురిచేయడం అప్రజాస్వామికం. సాగునీటిపైన సమానహక్కు ఒక ప్రజాతంత్ర విలువగా పౌరహక్కుల సంఘం భావిస్తుంది.

పోలవరం ప్రాజెక్టు నిర్మాణం ద్వారా తరతరాలుగా ఉన్న ఆదివాసి సంస్కృతి, ఆర్థిక, సామాజిక-సాంఘిక జీవన విధానాన్ని ఛిద్రం చేస్తుంది. ఆదివాసుల జీవించే హక్కుకు వారి మనుగడకు తీవ్ర విఘాతం ఏర్పడుతుంది. 1/70 చట్టాన్ని, రాజ్యాంగాన్ని, ప్రజాస్వామిక విలువల్ని కాలరాస్తున్నదీ ప్రభుత్వం. అందుకే పోలవరం ప్రాజెక్టు నిర్మాణాన్ని వద్దంటున్నాం. ఇప్పటికే ప్రాజెక్టును ఆపడానికి ఉద్యమిస్తున్న ఆదివాసులతో గొంతు కలిపి ప్రజలు, ప్రజాస్వామిక వాదులు ఉద్యమించాలి. ❑

(25 వ పేజీ తరువాయి)

సాగుచేసుకోవటానికి గానీ నీరులేక సంవత్సరానికి ఆరు నెలలకు పైగా ఉపాధి కోసం సుదూర ప్రాంతాలకు వలస వెళుతున్నారు. అత్యవసర పరిస్థితిలో వైద్యం కోసం గర్భిణీ స్త్రీనైనా, మరెవరినైనా సరే నలుగురు మనుషులు రోగిని నులక మంచం మీద పడుకోబెట్టి ఏడెనిమిది కిలోమీటర్లు మోసుకుంటూ, రాళ్లు రప్పలతో నిండివున్న కొండల్ని పరిగెత్తుతూ ఎక్కుతూ దిగుతూ ప్రయాణం చేస్తే తప్ప తారు రోడ్డుకి చేరలేరు. అక్కడ్నుంచి అతి దగ్గర్లో ఉండే ప్రాథమిక వైద్య కేంద్రానికి చేరాలంటే దాదాపు 20-25 కిలోమీటర్లు ఏదైనా బస్సో, జీపో, లేదా ఆటోనో పట్టుకుని ప్రయాణం చేసి ఆస్పత్రికి చేరే వరకూ కనీసం 6-8 గంటలయినా పడుతుంది. వాళ్ల భాషలోనే చెప్పాలంటే భూమ్మీద నూకలుండి, అదృష్టం బావుంటే రోగి ప్రాణాలతో బయట పడటం లేదంటే అంతే సంగతులు. ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నో అంశాలు. మరి ఇంతకాలంగా ప్రభుత్వం వాళ్లకేమిచ్చింది? ఈ ఆధునిక శాస్త్ర విజ్ఞానమంతా ఎవరికుపయోగపడుతోంది?

ఈ ఏడాది జనవరి 3 నుంచి 7వ తారీఖు వరకూ హైదరాబాద్‌లో అఖిలభారత 93వ సైన్స్ కాంగ్రెస్ సభలు జరిగాయి. పల్లెల అభివృద్ధి కోసం సైన్స్ - సమగ్ర గ్రామీణాభివృద్ధికి శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం' అనే అంశంపై జాతీయ స్థాయిలో శాస్త్రజ్ఞులందరూ తరలి వచ్చారు. అతిథులుగా అంతర్జాతీయ శాస్త్రజ్ఞులు కూడా వచ్చారు. సరైన రవాణా, భోజన, నీటి వసతులు లేనందుకు ఈ గొప్ప గొప్ప శాస్త్రజ్ఞులంతా సభా ప్రాంగణానికి వెళ్లే దారిని మూసివేసి నినాదాలు చేశారట! ధర్నాలూ చేశారట!? ఇవన్నీ మనకు మీడియా ద్వారా తెలిశాయి. యుద్ధప్రాతిపదికన ప్రతిష్టాత్మకమైన ఈ సైన్స్ కాంగ్రెస్ కోసం ప్రభుత్వ యంత్రాంగం అంతా కలిసి బోలెడు ప్రజాధనాన్ని వెచ్చించి చేసిన ఏర్పాట్లే అరకొరగా ఉన్నాయని ధర్నాకు దిగారే!? మరి మన నంబాపూరు, ఎదగట్టు గిరిజన తండాల గ్రామస్థులు తమ నిరసనను ఏ రకంగా తెలిపితే ప్రభుత్వాలకు అర్థమవుతుంది? ఒక పూట అసౌకర్యానికే ఇంత హంగామా చేసిన ఈ శాస్త్రజ్ఞులు తరతరాలుగా నిర్లక్ష్యానికి గురవుతున్న ఈ గ్రామస్థుల సమస్యలకి ఏ రకంగా స్పందిస్తారు? రాజకీయ నాయకులకు ఇవన్నీ కనిపిస్తాయా? ఎలా చెప్తే వినిపిస్తాయి? ఈ సైన్స్ కాంగ్రెస్‌లు, శాస్త్ర విజ్ఞానం కనీస అవసరాలు తీరుస్తాయా? లేకపోతే ఆకర్షణీయమైన నినాదాలు గానే మిగులు తాయా? శాస్త్ర విజ్ఞానమంటే ప్రజల జీవితాలను ఛిన్నాభిన్నం చేయటానికి కాదు. అయ్యా! గౌరవనీయ రాష్ట్ర ముఖ్యమంత్రి వై. యస్.రాజశేఖరరెడ్డి గారూ, వినిపిస్తోందా? మూడేళ్ల క్రితం ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఈ యురేనియం ప్రాజెక్టుని మీరెలా వ్యతిరేకించారో, ఎలాంటి ప్రశ్నలు వేశారో గుర్తుకొస్తున్నాయా?

❑

అమెరికా 'పెరట్లో' ఎగసిన అరుణ పతాకం

కొణతం దిలీప్


విప్లవత్రయం: చావెజ్, కాస్ట్రో, మొరాలెస్

సోవియెట్ యూనియన్ పతనం తరువాత ప్రపంచ వ్యాప్తంగా సోషలిస్టు భావనలకు కాలం చెల్లిందనే వాదన మొదలైంది. ఇప్పుడిక పెట్టుబడిదారీ విధానమే శరణ్యమనే తాటాకు చప్పుళ్లు బలంగానే వినిపించసాగాయి. అయితే గత కొంత కాలంగా లాటిన్ అమెరికా నుంచి వెలువడుతున్న వార్తలు - ప్రజా రాజకీయాలలో మమేకమై ఉన్న వారికి ఎనలేని ఆనందాన్ని కలుగజేస్తున్నాయి.

అమెరికా సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా యాభై ఏళ్లుగా అవిశ్రాంత పోరాటం చేస్తున్న క్యూబా దేశాధ్యక్షుడు ఫిడెల్ కాస్ట్రో కలలు గన్న సోషలిస్టు లాటిన్ అమెరికా సాకారమవుతున్నట్టే ఉంది. 36 కోట్ల జనాభా కలిగిన లాటిన్ అమెరికాలో ఇప్పుడు దాదాపు 30 కోట్ల జనాభా వామపక్ష నాయకత్వం కింద ఉన్నారు. అర్జెంటీనా, బ్రెజిల్, చిలీ, ఉరుగ్వే, వెనిజులా, బొలీవియా, క్యూబాలలో అరుణ పతాకం రెపరెపలాడుతుండగా త్వరలోనే ఎన్నికలు జరగనున్న మెక్సికో, ఈక్వెడార్, నికరాగువాలలో కూడా వామపక్ష అభ్యర్థులే ముందంజలో ఉన్నారు.

వందల ఏళ్ల లాటిన్ అమెరికా సంక్షుభిత చరిత్రే ఇప్పటి ప్రజారాజకీయాల వెల్లువకు కారణం. శతాబ్దాలుగా సాగిన దోపిడీ, పీడన ప్రజల్లో ప్రజాస్వామ్య స్ఫూర్తిని రగిలించాయి. మొదట స్పానిష్ వలస పాలన, అటుపై అగ్రరాజ్యం, ఐఎంఎఫ్, బహుళజాతి కంపెనీల దోపిడీ పాలన ఈ ప్రాంత ప్రజలలో స్వేచ్ఛా కాంక్షను ఇనుమడింపజేసింది.

1823లో అప్పుడప్పుడే స్వేచ్ఛ వాయువులు పీలుస్తున్న లాటిన్ అమెరికాపై తనకు సర్వహక్కులు ఉన్నాయని అమెరికా అధ్యక్షుడు మన్రో తన 'మన్రో పత్రం' ద్వారా ప్రకటించుకున్నాడు. ఉత్తర గోళంలోని అన్ని దేశాలపై తమకు హక్కులు ఉన్నాయని, ఆ హక్కులు దైవ నిర్ణయమనీ చెప్పే ఈ దుర్మార్గమైన మన్రో పత్రాన్ని ఆధారంగా చేసుకుని అమెరికా అనేక సార్లు లాటిన్ అమెరికన్ దేశాలపై దౌర్జన్యకాండకు దిగింది. గత రెండొందల ఏళ్లుగా లాటిన్ అమెరికాను తన 'పెరడు' అని అహంకారంతో పిలుచుకోవడం అమెరికాకే చెల్లింది. ఇక్కడి అపార సహజ వనరులపై కన్నేసిన అగ్రరాజ్యం తన కీలు బొమ్మ ప్రభుత్వాలే అధికారంలో ఉండాలని కోరుకునేది. ప్రజల ఆకాంక్షలను నెరవేర్చే నాయకుడు ఎవరయినా గద్దెనెక్కితే ఏదో విధంగా వారిని తప్పించేది. సిఐఏ, అమెరికన్ సేనలు కలిసి ఈ అందాల ఖండాన్ని నిత్య స్మశానంలా మార్చేశాయి. సైనిక కుట్రలు, ప్రతిపక్షాల ఊచకోతలతో గడచిన అరవై సంవత్సరాలుగా రక్తమోడుతున్నదీ ప్రాంతం.

ప్రజల ఆకాంక్షలను నెరవేర్చే సదుద్దేశ్యాలు పాలకులు కనబరచిన ఉదంతాలు లాటిన్ అమెరికా చరిత్రలో ఎన్నో కనబడ్డాయి (బాక్స్ ఐటమ్: స్వాతంత్రమే నా జన్మ హక్కు చూడండి). కానీ అలా ప్రజాస్వామ్య కాంక్ష ఎగసిన ప్రతీసారి ఇది సోవియెట్ కుట్ర అనే సాకుతో అమెరికా దారుణ నిర్బంధకాండ ప్రయోగించేది.

ఈసారి మాత్రం లాటిన్ అమెరికాలో ప్రజారాజకీయాల వెల్లువ మున్నెన్నడూ లేనంత ఉధృతంగా కనబడుతోంది. ప్రపంచబ్యాంకు మొదటిసారిగా అత్యంత దుర్మార్గమైన నీటి ప్రైవేటీకరణ చేపట్టిన బొలీవియాలో స్థానిక ఐమారన్ తెగకు చెందిన ఇవో మొరాలెస్ దేశాధ్యక్షుడిగా ఎన్నికయ్యాడు. ఆ దేశ చరిత్రలో స్థానిక తెగలకు చెందిన వ్యక్తి అధ్యక్షుడు కావడం ఇదే మొదటిసారి. కోకో పంటను పండించే రైతుల యూనియన్ నాయకుడైన మొరాలెస్ ఆది నుండీ సామ్రాజ్యవాద వ్యతిరేకి. అటు ఫిడెల్ కాస్ట్రోతోను ఇటు హ్యూగో చావెజ్ తోను సన్నిహితంగా మెలుగుతున్న మొరాలెస్‌పై బొలీవియా పేదల్లో అనేక ఆశలు ఉన్నాయి.

ఇక ఇటీవలే చిలీ దేశానికి తొలి మహిళా అధ్యక్షురాలైన మిషెల్లి బేష్‌లెట్‌ది కూడా వామపక్ష నేపథ్యమే. ఒకప్పటి చిలీ ప్రజానేత సాల్వడార్ అలెండీ హయాంలో బేష్‌లెట్ తండ్రి వైమానిక దళ జనరల్‌గా పనిచేసేవాడు. అలెండీని కుట్ర ద్వారా తప్పించి పినోషె అధ్యక్షుడయ్యాక బేష్‌లెట్ కుటుంబం మొత్తాన్నీ జైలులో నిర్బంధించారు. బేష్‌లెట్ తండ్రి ఆ చిత్రహింసలు తట్టుకోలేక జైలులోనే కన్నుమూసాడు. కొన్నాళ్లకు జైలు నుండి

స్వాతంత్ర్యం మా జన్మహక్కు!

"ఈ చారిత్రక సన్నివేశంలో నా ప్రజలు నా పట్ల చూపిన విశ్వాసానికి నా ప్రాణంతో బదులు తీర్చుకుంటున్నాను.
చరిత్ర మనదే. ప్రజలే చరిత్ర నిర్మాతలు .....
నా గొంతు త్వరలోనే మూగపోతుంది. కానీ మీకు నా స్వరం మాత్రం వినిపిస్తూనే ఉంటుంది.
నేనెప్పటికీ మీ మధ్యే ఉంటాను.
దేశం పట్ల నమ్మకం కలిగిన నిజాయితీ గల వ్యక్తిగా నన్ను గుర్తుంచుకుంటారు మీరు....
నేడో రేపో మెరుగైన సమాజం నిర్మించేందుకు స్వేచ్ఛా పిపాసులు పయనించే మార్గాలను ఆవిష్కరిస్తాం మనం...
"



సైమన్ బొలీవర్



చే గువేరా

11 సెప్టెంబర్, 1973 నాడు సిఐఏ మద్ధతుతో జరిగిన సైనిక కుట్రలో పదవీచ్యుతుడై, కుట్రదారులు చుట్టుముట్టిన వేళ మోనెడా రాజప్రాసాదం నుండి దేశ ప్రజలనుద్దేశించి అప్పటి చిలీ దేశాధ్యక్షుడు సాల్వడార్ అలెండీ చేసిన ఉపన్యాసంలోని మాటలు అవి. ఉపన్యాసం ముగించి తనని తాను తుపాకీతో కాల్చుకుని ఆత్మహత్య చేసుకున్నాడు అలెండీ.

లాటిన్ అమెరికన్ దేశాలలో స్వాతంత్ర్యం కోసం, సార్వభౌమత్వం కోసం, ప్రజల ఆకాంక్షలు నెరవేర్చడం కోసం ఎగసిన విప్లవ యోధులలో అలెండీ మొదటి వాడూ కాదు చివరి వాడూ కాదు. సైమన్ బోలీవర్ మొదలుకుని ఇటీవలే చిలీ దేశాధ్యక్షురాలైన మిషెల్లె బేష్‌లె వరకూ ఆద్యంతం ఈ దక్షిణ ఖండానిది ధిక్కార స్వరమే - ప్రజా పక్షపాతమే.

నాలుగు వందల ఏళ్ల పాటు స్పానిష్ పాలనలో దోపిడీకి గురైన లాటిన్ అమెరికా, సైమన్ బొలీవర్ అనే విప్లవకారుని పోరాట ఫలితంగా స్వాతంత్ర్యం పొందింది. స్వయంగా రాజవంశానికే చెందినవాడైనా, స్పానిష్ వారు కొల్లగొడుతున్న సహజ సంపదలు, వారి చేతిలో ప్రజల దాస్యం చూసి విచలితుడైన బొలీవర్ పోరుబాట పట్టాడు. 1813లో అతని పేరు మీద రిపబ్లిక్ ఆఫ్ బొలీవియా అనేదేశం ఏర్పడేదాకా వలసవాదం అప్రతిహతంగా కొనసాగింది. ఇప్పటి వెనిజులా, కొలంబియా, ఈక్వెడార్, పనామా, దేశాలన్నీ సైమన్ బొలీవర్ పోరాట ఫలితమే. అందుకే అతను లాటిన్ అమెరికా ప్రజలకు ఆరాధ్య దైవం అయ్యాడు.

ప్రజా కంటకుడిగా మారిన బటిస్టాను ఆరేళ్లు నిర్విరామ పోరాటం సలిపి 1959లో పదవీచ్యుతుణ్ని చేసి క్యూబా గడ్డపై అరుణ పతాకాన్ని ఎగురవేసిన వాడు ఫిడెల్ కాస్ట్రో. అయిదు దశాబ్దాలుగా అగ్రరాజ్యం ముప్పేట దాడి చేస్తున్నా తట్టుకుని అసలైన సార్వభౌమత్వం అంటే ఏమిటో ప్రపంచ ప్రజలకు చూపిస్తున్నాడు కాస్ట్రో. 1991 వరకూ





సాల్వడార్ అలెండీ



జైమెరోల్డోస్



జాకొబొ అర్బెంజ్

క్యూబాకు సోవియెట్ రష్యా ప్రాపకం బాగా ఉండేది. సోవియెట్ పతనాంతరం కూడా క్యూబా తన కాళ్లపై తను నిలబడేందుకు - ఇతర లాటిన్ అమెరికన్ దేశాలకు దిశా నిర్దేశం చేసేందుకు కాస్ట్రో అహరహరం శ్రమించాడు. కొన్ని వందలసార్లు సిఐఏ అతణ్ని హత్య చేసేందుకు పన్నాగాలు పన్నినా ప్రతీసారీ మృత్యుంజయుడుగా బైట పడ్డాడు. నిస్సందేహంగా ఫిడెల్ కాస్ట్రో వామపక్షవాదులకు ఓ వేగుచుక్క.

ఇక కాస్ట్రో నమ్మినబంటుగా ఉండి అనేక దేశాల ప్రజల మనస్సుల్లో చెరగని ముద్ర వేసినవాడు చే గువేరా. అతని చిత్రం కోట్లాది మంది ప్రపంచ ప్రజల మనోఫలకంపై చెరగని ముద్ర వేసింది.

అర్జెంటినాలో పుట్టిన చే క్యూబన్ విప్లవ కాలంలో ఫిడెల్ కాస్ట్రోకు కుడిభుజంగా పనిచేసి అక్కడి నుండి కాంగో వెళ్లాడు. డెమొక్రాటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగోగా పేరు పొందిన ఆ దేశంలో విప్లవం లెవదీయడానికి కృషి చేశాడు. చే గువేరా ప్రస్థానంలో తరువాతి మెట్టు బొలీవియా. అయితే బొలీవియాలో ఉండగా అతణ్ని సిఐఏ సాయంతో బొలీవియా సైన్యం నిర్బంధించి, వెనువెంటనే హతమార్చింది.

1950లో గ్వాటెమాల దేశంలో జరిగిన సార్వత్రిక ఎన్నికలలో జాకొబొ అర్బెంజ్ అనే సోషలిస్టు నాయకుడు ఎన్నికయ్యాడు. ఆ రోజుల్లో దేశంలోని మూడు శాతం భూస్వాముల చేతిలో డెబ్బై శాతం భూములు కేంద్రీకృతమై ఉండేవి. ఈ పరిస్థితిని మార్చేందుకు సమగ్ర భూసంస్కరణలకు శ్రీకారం చుట్టాడు అర్బెంజ్. అయితే ఈ సంస్కరణలు తమకు నష్టదాయకమని గ్రహించిన అమెరికన్ బహుళజాతి కంపెనీ యునైటెడ్ ఫ్రూట్ వెంటనే పావులు కదిపింది. ఇంకేముంది అర్బెంజ్ సోవియెట్ల నేస్తమని తప్పుడు ప్రచారం మొదలు పెట్టింది అమెరికా. సిఐఏ నేతృత్వంలో, అమెరికన్ వైమానిక దళ మద్దతుతో సైనిక కుట్ర జరిగింది. అర్బెంజ్‌ను తొలగించి కీలుబొమ్మ కార్లోస్‌ను గ్వాటెమాల దేశాధ్యక్షుడిగా నియమించింది అగ్రరాజ్యం.

1968లో పనామాను ఏలుతున్న అర్నులఫో ఏరియాస్ ప్రభుత్వాన్ని కూలదోసి అధ్యక్షుడైన ఒమర్ టోరిజోస్‌ది మరో సాహసగాథ. తమ జన్మహక్కు అయిన పనామా కాలవపై అగ్రరాజ్యం పెత్తనాన్ని ప్రశ్నించిన ధీరోదాత్త వీరుడు ఇతడు. జిమ్మీ కార్టర్‌తో చర్చలు జరిపి పాక్షికంగానయినా పనామా కాలువపై తన దేశానికి హక్కులు సాధించగలిగాడు ఒమర్. పేదల పట్ల అన్నార్తుల పట్ల ఒమర్ టోరిజోస్ చూపిన ఆదరణ ఖండాంతరాల్లో శ్లాఘించబడింది. ఇంత చిన్ని దేశపు నేత తమను ముక్కుపట్టి ఆడించడం నచ్చని అమెరికా 1981లో ఒమర్ ప్రయాణిస్తున్న విమానంలో బాంబు పెట్టి అతణ్ని తుదముట్టించింది.

1979లో ఈక్వెడార్ దేశాధ్యక్షుడిగా ఎన్నుకోబడ్డ జైమెరోల్డోస్‌ది కూడా విషాదాంతమే. తన దేశం నుండి చమురు పిండుకుంటున్న బహుళజాతి చమురు కంపెనీలపై పెద్ద యుద్ధమే చేసాడు రోల్డోస్. చమురు నుండి వచ్చే ఆదాయం పేదవాడి బాగు కొరకు ఖర్చు చేయాలని సంకల్పించాడు రోల్డోస్.

ఈ దిశగా మొదటి అడుగుగా హైడ్రోకార్బన్స్ చట్టం ఒకదాన్ని రూపొందించి దాన్ని అమల్లోకి తెచ్చాడు. ఇంకేముంది బహుళజాతి చమురు కంపెనీలు గగ్గోలు పెట్టాయి. ఈ గందరగోళంలోనే 1981 మే 24నాడు హెలికాప్టర్ కూలి మరణించాడు రోల్డోస్. ఇది కచ్చితంగా సిఐఏ కుట్ర అని చాలా మంది నమ్ముతారు.

బేష్‌లె ఆస్ట్రేలియాకు వలస వెళ్లింది. 1979లో పిల్లల డాక్టరుగా చిలీలో తిరిగి అడుగుపెట్టింది. రికార్డో లాగోస్ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు మొదట ఆరోగ్యశాఖ మంత్రిగా అటు తర్వాత రక్షణశాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వర్తించింది. ప్రస్తుత ఎన్నికల్లో సెబాస్టియన్ అనే కోటీశ్వరుడిని అలవోకగా ఓడించింది సోషలిస్టు పార్టీ తరపున పోటీ చేసిన మిషెల్లి బేష్‌లె. అనేక ఏళ్లు అంతర్యుద్ధంతో అగ్నిగుండంగా మారిన నికరాగువాలో వామపక్ష సాండినిస్టా నేత, మాజీ దేశాధ్యక్షుడు డానియెల్ ఓర్టెగా మళ్లీ ఎన్నికయ్యే అవకాశాలు కనపడుతున్నాయి.

జూలై, 2006లో ఎన్నికలు జరగనున్న మెక్సికోలోనూ వామపక్ష డెమొక్రటిక్ రివల్యూషనరీ పార్టీ నేత ఆండ్రిస్ లోపెజ్ ఓబ్రడార్ రేసులో ముందున్నాడు.



మిషెల్లి బేష్‌లె

అక్టోబర్ 2006లో ఎన్నికలకు వెళ్లనున్న ఈక్వెడార్‌లోనూ ఇదే తంతు. సోషలిస్టు నేత లియోన్ రోల్డోస్ అగ్యులెరాకే మిగతా అభ్యర్థుల కంటే ఎక్కువ గెలుపు అవకాశాలు కనపడుతున్నాయి.

ఇప్పుడు వీస్తున్న ఈ స్వేచ్ఛా వాయువులు అనేక మంది గతించిన వీరయోధుల త్యాగఫలితం. ఆరు దశాబ్దాలుగా అగ్రరాజ్యాన్ని ఎదిరించి ఒంటరిగా నిలబడ్డ ఫిడెల్ కాస్ట్రో, ఏడేళ్లుగా పెద్దాయనకు నేనున్నానంటూ బాసటగా నిలుస్తున్న హ్యూగో చావెజ్ ఇప్పుడు లాటిన్ అమెరికాకు దిశానిర్దేశం చేస్తున్న వేగుచుక్కలు. ❑

కదంబం

తరలి వస్తున్న కాలుష్య భూతం



ధనిక దేశాలు అభివృద్ధి చెందుతున్న దేశాలను చెత్తకుండీల్లా వాడుకుంటాయనే నమ్మకాన్ని నిజం చేస్తుంది ఫ్రెంచి యుద్ధ నౌక క్లెమెన్సూ వివాదం. గుజరాత్‌లోని అలంగ్ షిప్ బ్రేకింగ్ యార్డ్ కు తరలి వస్తున్న ఈ నౌక పట్ల సర్వత్రా భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి. కాలకూట విషం గర్భంలో దాచుకుని క్లెమెన్సూ వడివడిగా భారత్ వేపు అడుగులేస్తుంటే యధావిధిగా భారత ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తోంది. పౌరల పట్ల, వారి బాగోగుల పట్ల మన ప్రభుత్వాలకు గల శ్రద్ధకు ఈ ఉదంతం చక్కని ఉదాహరణ.

1977లో రిటైరై ఇప్పటి వరకూ ఎవరూ పట్టించుకోకుండా పడి వుందీ కాలుష్య భూతం. 27 వేల టన్నుల బరువు గల ఈ విమానవాహక నౌకలో కొన్ని వందల టన్నుల ఆస్బెస్టాస్ ఉంటుందని నిపుణుల అంచనా. ఆస్బెస్టాస్ అనేక అనారోగ్యాలను కలుగజేసే కాలుష్యకారక పదార్థంగా ఇప్పటికే అందరికీ తెలుసు. ఈ కాలుష్యానికి జడిసే ఇప్పటి వరకూ అందరూ క్లెమెన్సూను తాకడానికి కూడా భయపడింది. ఫ్రెంచి ప్రభుత్వం ఈ నౌకను ఏదోలా వదిలించుకోవడానికి శతవిధాలా ప్రయత్నించింది. ఇదివరకు గ్రీస్‌కు, టర్కీకు దీన్ని పంపడానికి విఫల ప్రయత్నాలు జరిగాయి.

పాత ఓడలను విప్పదీసి తుక్కు అమ్ముకునే వ్యాపారం అనేక సంవత్సరాలుగా భారత్, పాకిస్తాన్, బంగ్లాదేశ్‌లలో సాగుతోంది. ధనిక దేశాలు చాలా తెలివిగా కాలుష్యపూరిత విష రసాయనాలతో కూడిన ఈ ఓడలను వదిలించుకుంటుండగా కాసిని కాసుల కోసం కక్కుర్తి పడే తుక్కు వ్యాపారులు ఈ కళేబరాలను తక్కువ ధరకు కొనుక్కొచ్చి మన సముద్ర తీరాన్ని, మన పౌరుల ఆరోగ్యాలను పాడు చేస్తున్నారు. గుజరాత్‌లోని అలంగ్‌లో, ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నం, కాకినాడలలో కూడా ఇటువంటి షిప్ బ్రేకింగ్ యార్డ్‌లు ఉన్నాయి.

ప్రమాదకరమైన వ్యర్థాల సీమాంతర తరలింపుపై బేసెల్ ఒప్పందం నిషేధం ఉన్నా ధనిక దేశాలు నిస్సిగ్గుగా ఇటువంటి పనులకు పాల్పడుతున్నాయి. అంతర్జాతీయ చట్టాలు, ఒప్పందాలు అన్నీ పేద దేశాలకే కానీ తమకు కావు అన్నట్టు అవి ప్రయత్నించడం అనైతికం.

మళ్ళీ అదే కథ

మోసగించడం తప్పా? మోసపోవడం తప్పా అనేది చాలా గంభీరమైన ప్రశ్నే. కానీ ఆలోచిస్తే జవాబు చెప్పడం కూడా కష్టమే. ఏదో ఒకటీ అరా సార్లు మోసపోతే పోన్లే అనుకోవచ్చు. ఘనత వహించిన మన ప్రభుత్వాలను ఎన్నిసార్లు బురిటీ కొట్టించినా మన వాళ్లు మళ్లీ మళ్లీ ఆ ప్రపంచబ్యాంక్ కాబూలావాలా చేతిలో 'అమాయకంగా' మోసపోతూనే ఉంటారు.

ఒకానొక శుభ ముహూర్తాన ఢిల్లీలో నీటి సరఫరా చేసే ప్రభుత్వరంగ సంస్థ ఢిల్లీ జల్ బోర్డుపై బహుళజాతి కంపెనీల పాపిష్టి కళ్లు పడ్డాయి. ఇంకేముంది అప్పులిస్తాం, అభివృద్ధి చేస్తాం అంటూ గారడీ పాట అందుకుంది ప్రపంచబ్యాంక్. ముందు అసలు నగర నీటి సరఫరా వ్యవస్థను ఎందుకు, ఎలా, ఎపుడు ప్రైవేటీకరించాలో పరిశోధించేందుకు బ్యాంక్ వారో కన్సల్‌టెంట్‌ను నియమించమన్నారు. ఢిల్లీ ప్రభుత్వం జీ హుజూర్ అంది. వెంటనే సదరు కన్సల్‌టెంట్‌కు ఇవ్వడానికి మొదటి దఫా అప్పు అక్షరాలా ఏడు కోట్ల రూపాయలు విడుదల చేసింది ప్రపంచబ్యాంక్.

ఎంతో పరిశోధన చేసిన సదరు కన్సల్‌టెంట్ ఢిల్లీ జల్‌బోర్డును ఎలా ఉద్ధరించాలో సవివరమైన ప్రణాళిక తయారు చేసింది. ఆ ప్రణాళిక ప్రకారమే శరవేగంగా ఢిల్లీ జల్ బోర్డు ప్రైవేటీకరణ మొదలైంది. అయితే ఖర్మకాలి ఇటీవలే వచ్చిన సమాచార హక్కు చట్టం కింద పరివర్తన్ అనే స్వచ్ఛంద సంస్థ ఈ ప్రైవేటీకరణ ఒప్పంద పత్రాలను బైటపెట్టాలని అడగడంతో ప్రపంచబ్యాంక్ నాటకం కాస్తా అడ్డం తిరిగింది.

- ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్యం అని ముద్దుగా పిలుచుకునే ఈ ఒప్పందంలో నీటి సరఫరా వ్యవస్థను నడపడానికయ్యే వ్యయాలు – అంటే నీటిని వెలికితీసి, శుద్ధి చేసి నగరంలోకి తెచ్చేవరకు అయ్యే ఖర్చులన్నీ ప్రభుత్వం భరించాలి. నీటిని 'న్యాయమైన పంపిణీ' చేసే బాధ్యత, చార్జీలు వసూలు చేసే బాధ్యత మాత్రం ప్రైవేటు కంపెనీలది.
- ఈ ఒప్పందం కింద ప్రపంచబ్యాంక్ ఇచ్చే రుణం ఏడాదికి 120 కోట్ల రూపాయలు (ఆరేళ్లపాటు). ఇందులోంచి ప్రైవేటు కంపెనీకి ఫీజు రూపంలో చెల్లించాల్సిన మొత్తం ఏడాదికి 105 కోట్లు!
- ఒప్పందం అమల్లోకి వచ్చాక ఏడాది లోపల నీటి లీకేజిలను 34 శాతానికి తగ్గించాలని సదరు ఒప్పందంలో గట్టిగా రాసుకున్నారు. సంతోషం. అయితే ఇప్పుడు ఢిల్లీ జల్ బోర్డ్‌లో లీకేజీ ఎంతుందనుకున్నారు? 24 శాతమే! మరి దీన్ని 34 శాతానికి 'తగ్గించటమెలా' చెప్మా?
- ఢిల్లీ జల్ బోర్డు లోని 21 జోన్లను నిర్వహించడానికి 2003-04లో రు. 163 కోట్లు ఖర్చు కాగా, కొత్త ఒప్పందం అమల్లోకి వస్తే రు. 525 కోట్లు మాత్రమే ఖర్చు అవుతుందట.

ఈ నిజాలు చూసి గుండెలు రగిలిన కొందరు పోరుబాట పట్టడంతో ప్రస్తుతానికి ఈ ఒప్పందం అటకెక్కింది.

❑

రెండు రెళ్లు ఆరు

మనదేశానికి సంబంధించి కొన్ని తెలుసుకోవాల్సిన నిజాలు

- మనదేశ జనాభాలో 35 ఏళ్ల లోపు వారు 71% ఉన్నారు. (74.2 కోట్లు)
- ఏటా 2.9 కోట్ల మంది పిల్లలు పుడుతున్నారు.
- ప్రాథమిక విద్య, ఇంటర్మీడియట్ విద్యకు మధ్య 94% మంది చదువును విడిచి పెడుతున్నారు.
- ప్రపంచ వ్యాప్తంగా 95%గా ఉన్న యువత అంటే 15-35 ఏళ్ల లోపు వారు 3000కు పైగా వృత్తి విద్య, వృత్తి సంబంధ నైపుణ్యం, వ్యాపారాలు నేర్చుకుంటున్నారు. కాని మన దేశంలో అటువంటి వృత్తి విద్యా కోర్సులు కేవలం 171 మాత్రమే ఉన్నాయి. అందులో కేవలం జనాభాలో 2% మంది మాత్రమే లబ్దిపొందుతున్నారు.
- మనకున్న అంచనాల ప్రకారం దేశవ్యాప్తంగా 30 కోట్లుగా ఉన్న నిరుద్యోగ యువతలో కేవలం 4.5 కోట్ల మంది ఎంప్లాయిమెంట్ కార్యాలయంలో నమోదు చేసుకున్నారు.
- కొత్తగా కల్పించిన ఉద్యోగాల్లో ప్రభుత్వరంగ ఉద్యోగాల వాటా 1%, సంఘటిత రంగ ఉద్యోగాల వాటా 2%, మిగిలిన 97% ఉద్యోగాలు అసంఘటిత రంగంలో ఉన్నాయి.
- 40.9 కోట్ల కార్మిక శక్తిలో 93.5% మంది అసంఘటిత రంగంలోనూ, 6.5% మంది సంఘటిత రంగంలోనూ పనిచేస్తున్నారు.
- మన దేశంలో అక్షరాస్యతకు నిర్వచనం పేరు రాయగలగడమే.
- మొత్తం జనాభాలో 1.7% మంది అంటే 1.8 కోట్ల మంది కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో పనిచేస్తున్నారు. 90 లక్షల మంది ప్రైవేటు ఉద్యోగాల్లో పని చేస్తున్నారు. ఈ మొత్తం జనాభాలో 2.6% మాత్రమే.
- ప్రపంచ బ్యాంకు పాత నిర్వచనం ప్రకారం పేదరికం అంటే ఒక వ్యక్తి రోజుకు ఒక డాలర్ (రు. 50 రూపాయలు) కన్న తక్కువ సంపాదించడం. వారి సంఖ్య మన దేశంలో 45 కోట్లు. ఇప్పటి కొత్త నిర్వచనం ప్రకారం ఒక వ్యక్తి రోజుకు 2 డాలర్లు (రు. 100) కన్న తక్కువ సంపాదించడం. అలా ప్రస్తుత పేదవారి సంఖ్య 70 కోట్లు.
- మన ప్రభుత్వ పేదరిక నిర్వచనం ప్రకారం ఒక వ్యక్తి రోజుకు రు. 10 చొప్పున సంపాదించే పేదవారి సంఖ్య 30 కోట్లు.
- మన దేశం ప్రపంచ జి.డి.పిలో 1.35%, జనాభాలో 17% వాటా కలిగి ఉంది. మన దేశీయ మార్కెట్ కన్నా విదేశీయ మార్కెట్ 75 రెట్లు పెద్దది. విదేశీ మార్కెట్‌లో ప్రస్తుతం మన వాటా 0.8%. వెయ్యేళ్ల క్రితం 33% వాటా కలిగి ఉండేవాళ్లం. బ్రిటీషు వారి కాలంలో 27% మార్కెట్ వాటా కలిగి ఉండేవాళ్లం. స్వాతంత్ర్యం వచ్చే నాటికి అంటే 1947లో కూడా విదేశీ మార్కెట్‌లో మనవాటా 3% ఉండేది.
- మన దేశ జనాభాలో కేవలం 5% మందికి ఇంగ్లీషు భాష వచ్చు. అయినప్పటికీ ప్రభుత్వ కార్యాలయాల్లో, రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజా సంస్థలలో ఇంగ్లీషు భాషే వాడుకలో ఉంది. కంప్యూటర్ వెబ్‌సైట్స్ అన్నీ ఇంగ్లీషులోనే ఉన్నాయి.

ఆంధ్రప్రదేశ్ : నాడు - నేడు

పంటల ఉత్పత్తి సరళి

పంట	1955-56 సాగయ్యే భూమి ల. హెక్టార్లు	1955-56 దిగుబడి కేజీలు/హె.	1955-56 ఉత్పత్తి ల. ట	2003-2004 సాగుభూమి ల. హె.	2003-2004 దిగుబడి కేజీలు/హె.	2003-2004 ఉత్పత్తి ల. ట.
వరి	27.23	1137	30.99	29.75	3011	89.53
గోధుమ	0.24	277	0.07	0.12	565	0.07
జొన్నలు	25.55	450	11.49	6.48	1145	7.42
సజ్జలు	6.52	482	3.14	1.38	1072	1.48
మొక్కజొన్న	1.89	600	1.14	7.21	3437	24.77
రాగులు	3.19	702	2.24	0.78	1290	1.01
తృణ ధాన్యాలు	11.41	-	4.38	0.51	-	0.3
మొత్తం ధాన్యాలు (ఎ)	**76.03**	**-**	**53.45**	**(46.23)**	**-**	**(124.5)**
పెసలు	3.85	188	0.72	6.81	459	3.12
మినుములు	1.02	242	0.25	4.39	456	2.0
కందులు	1.62	272	0.45	5.21	418	2.18
శనగలు	1.31	324	0.43	4.22	1081	4.57
ఉలవలు	4.53	178	0.8	0.8	490	0.39
ఇతర పప్పు దినుసులు	0.85	-	0.14	0.13	-	0.03
మొత్తం పప్పు దినుసులు (బి)	**13.18**	**-**	**2.79**	**(21.85)**	**-**	**(12.39)**
మొత్తం (ఎ+బి)	**89.21**	**-**	**56.24**	**68.08**	**-**	**136.89**
వేరుశనగ	12.4	875	10.87	14.93	660	9.86
ఆముదాలు	3.46	183	0.63	2.91	453	1.32
నువ్వులు	2.7	195	0.53	1.61	265	0.43
నూనె గింజలు	19.94	-	-	-	-	-
పత్తి	4.07	57	1.36	8.37	384	18.9
పొగాకు	1.6	833	1.34	1.33	1475	1.96
చెరకు	0.71	7420	5.26	2.09	7198	15.04
మిర్చి	1.76	633	1.17	2.5	-	7.97

ల.హె - లక్షల హెక్టార్లు ల. ట - లక్షల టన్నులు

ఆరోగ్యసేవల తీరు

	1955-56	31.03.2004 నాటికి
1. ఆసుపత్రులు	296	2064
2. పడకలు	12,340	34,968
3. డాక్టర్లు	764	8,660
4. జనాభా	3.59	7.62

పశుసంపద

	1956	2003
ఎడ్లు	48,42,417	39,52,411
ఆవులు	37,62,170	27,57,897
దున్నపోతులు	11,01,718	5,09,215
గేదెలు	28,75,815	
58,46,633		
గొర్రెలు	7,84,625	2,13,75,620
మేకలు	36,93,412	62,76,928
గుర్రాలు	31,514	9,334
పందులు	6,20,845	5,70,315
కుక్కలు	---	13,63,304
కోళ్లు	1,47,37,292	10,22,77,712

ATTENTION

ULTRA-SOUND SCAN CENTERS, GENETIC CLINICS, LABORATORIES, COUNSELING CENTERS, OBSTETRICIANS & RADIOLOGISTS

It is legally mandatory for the above to scrupulously follow the provisions of the Pre-Conception & Pre-Natal Diagnostic Techniques (Prohibition of Sex Selection) Act 1994 & the Rules there under.

Sex-selection before conception, Determination & Revealing of sex of the foetus during pregnancy is a Criminal Offence

IMPORTANT PROVISIONS under the PC & PNDT Act, 1994 include:

i) Compulsory Registration of any Clinic or Diagnostic Center with Ultra-Sonic Scanning Machine or Imaging Machine; OR any Genetic Counseling Center / Genetic Laboratory / Genetic Clinic / or any other Clinic (Sec. 18 of the Act). **Registration Not-Transferable.**

ii) Compulsory Display of Certification of Registration

iii) Change of Location / Specialists to be informed to the Authority (Sec 13)

iv) Maintenance of Full Record of Patients using the Services of Ultra-Sound Scan, Genetic Counseling, etc. (Rule 10 Form G)

v) Written Consent from the Patients before Every Scan or Procedure (Rule 10; Form D, E and F)

vi) No test to be done without a referral

vii) ABSOLUTE PROHIBITION ON DETECTION & DISCLOSURE OF THE SEX OF THE FOETUS (Rule 10 (1A)

viii) Submission of monthly Reports to District Authority.

ix) For any Violation of the Act or Rules, **Equipment liable for Seizure;** Also, upto **3 years Imprisonment for First Violation & 5 years for subsequent Violations.**

PLEASE NOTE: IGNORANCE OF LAW IS NO EXCUSE


STATE APPROPRIATE AUTHORITY
PC & PNDT (PROHIBITION OF SEX SELECTION) ACT 1994,
ANDHRA PRADESH

Commissioner of Family Welfare,
Government of Andhra Pradesh
DMHS Campus, Sultan Bazar, Hyderabad

R.C. No. 1708/FWP/MEM/M1/2006

RNI Regn. No. APTEL/2003/11482

PRINTED BOOK
Postal Regn. No. LII/RNP/H-HD-1029/2004-06



R.O.No. 465/Sou/Advt.I/2005

Owned, Printed and Published by V. Hanumantha Rao at 301, Mythri Residency, 3-6-394, Road No. 3, Himayat Nagar, Hyderabad - 500 029. Ph : 55843495. Printed at Charita Impressions, Azamabad, Hyderabad. For Nutan Art Printers, Hyderabad. Editor : N. Venugopal

VEEKSHANAM
301, Mythri Residency,
3-6-394, Road No. 3, Himayatnagar, Hyderabad - 500 029.